A-PDF Merger DEMO : Purchase from www.A-PDF.com to remove the

మాదిరెడ్డి సులోచనారాణి గారి

# శిక్ష



మీ ప్రియతమ నవలా రచయిత్రి

# మాదిరెడ్డి సులోచన

## రచనలు

| | | | |
|---|---|---|---|
| జీవనయాత్ర | 8-00 | సంసార నౌక | 6-00 |
| పూలమనసులు | 7-50 | భిన్నధృవాలు | 6-00 |
| న్యాయం నిదురబోయింది | 7-50 | సంధ్య | 6-00 |
| దేవుడిచ్చిన వరాలు | 7-50 | పంతులమ్మ | 6-00 |
| అధికారులు-ఆశ్రితజనులు | 7-50 | అంతం చూసిన అసూయ | 6-00 |
| ప్రేమలూ-పెళ్ళిళ్ళూ | 6-00 | గడ్డితినే మనుషులు | 6-00 |
| శ్రీనిలయం | 6-00 | తరం మారింది | 6-00 |
| అద్దాల మేడ | 6-00 | జననీ జన్మభూమి | 6-00 |
| అభినేత్రి | 6-00 | శృతి తప్పిన యుగళగీతి | 6-00 |
| ఆశయాల ఆఖరి మెట్టు | 6-00 | అగ్ని పరీక్ష | 6-00 |
| నిరీక్షణ | 6-00 | నాతోపాటు నల్గురం | 6-00 |
| అక్కయ్య చెప్పిన కథలు | 6-00 | మనిషి-మతము | 6-00 |
| నాగమల్లికలు | 6-00 | పిడని సీడ | 6-00 |
| భాగ్యలక్ష్మి | 6-00 | గెలుపు నాదే ! | 6-00 |
| మిష్టర్ సంపత్ M. A. | 10-00 | స్నేహప్రియ | 6-00 |
| ఋతుచక్రం | 10-00 | పుణ్య పురుషులు | 7-50 |
| వారసులు | 7-50 | ఇది నా దేశం ! | 6-00 |
| అపరంజి | 7-50 | సంధ్యారాగం | 7-50 |
| మరో ప్రేమకథ | 8-00 | మోహనరూప | 10-00 |
| గాజుబొమ్మలు | 7-50 | నెరజాణలు-మగధీరులు | 6-00 |
| అమృతకలశం | 10-00 | లాహిరి | 10-00 |
| శిక్ష | 10-00 | రాలినరేకులు | 8-00 |
| వంశాంకురం | 8-00 | మామూలు మనిషి | 10-00 |
| అమ్మకానికో అబ్బాయి - కొనటానికో కోమలి ! | | .... | 6-00 |

తప్పక చదవండి!

# శిక్ష

చీకటి ఇంకా చిక్కగానే ఉన్నది.

పక్షుల కిలకిలా రావములు మందముగా వినిపిస్తున్నాయి. నిద్రాదేవి జోకొడుతున్నా, బద్ధకాన్ని దూరంనెట్టి. లేచి తన దినచర్యలలో లీన మయింది సుశీల. పట్నవాసమే అయినా చవక ధరకు స్థలం కొని ఊరు చివర ఇల్లు కట్టాడు ఉమాపతి. పెరడు పెద్దది. మొక్కలతో చీకట్లో మరీ నల్లగా కనిపిస్తుంది. అలవాటుపడిన సుశీల నిర్భయంగా తలుపులుతీసి లోపలకెళ్ళింది. దూరాన వున్న నీళ్ళగదిలో నిప్పుచేసి బాయిలర్‌లో వేసింది. వంటింటి తాళం తీసి అంట్లన్నీ పంపుదగ్గర పడవేసుకుంది. సగం అంట్లు తోమినాక గుర్తుకొచ్చింది తల వాకిలి చిమ్మాలని—కొంచెము వెలుతురు వచ్చింది. తనకున్నది తద్దినము, చేతులు కడుక్కొని చీపురు పట్టుకుని బయటికి వచ్చింది. పక్కఇంట్లో వుంటున్న పోలీస్ ఇనస్పెక్టర్ దాసి అప్పుడే వచ్చి తలుపులు తడుతోంది.

"ఎవరూ? నర్సమ్మా?" సుశీల చీకటిని చీల్చుకొని చూడటానికి ప్రయత్నించినది.

"అమ్మా? అప్పుడే లేచినారు? ఎంత ప్రొద్దుట లేచి పనిచేసుకొని పోదామన్నా మెలకువ రాదు."

"ఇప్పుడు తెల్లారి పోయినట్లు బాధ పడతావేమిటి? గంట నాలుగున్నరే అయింది."

"గంతేనా? అప్పుడేలేచి ఏం జేస్తవు మీఅత్త పందిరిగుంజకు పని జెప్తదిలే రాత్రంతా జేసినా తరగదు పని" చీకటిలోనే మూతి తిప్పుతుంది నరసమ్మ.

తీర్చుకుంటావని మురిసి పోయాను. నా మురిపెము ముక్కలుగాను. యెక్కడి నుండి వచ్చిందో, యినుప గజ్జెల తల్లి ప్రేమట. పెళ్ళట...." తను యెదురుగా వుంటే గంటలు గంటలు ఉపన్యాసం సాగిపోయే ప్రమాదముందని అటునుండి వెళ్ళిపోయింది సుశీల.

"చూశారా దాని పొగరు! కాఫీ అయింది అన్నది. నేను ముఖం. కడుగలేదని తెలుసుగదా? బ్రష్షు, పేస్టు తెచ్చిందేమో చూడండి. దేవుడో! ఈపని, ఈ మనుషులతో వేగలేను. నాకీ చెరయెప్పుడు తప్పిస్తావో వెంకటరమణమూర్తి...." రెండు చేతులు జోడిస్తూ భర్త వంక చూచింది. అతడు నవ్వుతున్నాడు. అతని వంక చుర చుర చూచింది. "యెందుకా నవ్వు."

"కనకం! అంటే కోపంగానీ, నువ్వెప్పుడయినా పని చేశావుటే? నీ అదృష్టం బాగుండి నువ్వు కాపరానికి రావటం. తలచెడి మాఅక్కయిల్లు చేరటం రెండు ఒకేసారి జరిగాయి. ఆమె ఉన్నన్ని రోజులు ఇటు పుడక అటు పెటనిచ్చిందా? ఆమెను ఆసుపత్రిలో చేర్చగానే మీమరదలు వచ్చింది దార్జి పుచ్చుంది. మరదలు పోగానే మాపిన్ని మూటతో వచ్చి చేరి. అంతా మనకే యిచ్చింది. ఆమె మరణించక ముందే సుశీల అంది వచ్చెను ఇక నువ్వు పని చెయ్యవల్సిన రోజులు ముందున్నాయే. సుశీల పెళ్ళయి పోతే...." ఆమె విసురుగా లేచి పెరటి వైపుకు వెళ్ళింది.

ఉమాపతి కనకదుర్గమ్మ యెడముఖంగా పెడముఖంగా ఫలహారం పూర్తి చేశారు. అప్పుడే ఇంట్లోని జనము ఒక్కొక్కరే లేవటం ప్రారంభించారు.

"సుశీలా! నా బ్రష్షు కనిపించటంలేదు. కాస్త వెతికి పెడుదూ!" ఒకరి పిలుపు.

"సుశీలా! నా ముఖం కడగటం అయింది. కాస్త వేడి వేడి ఫాస్ యుం పట్రా" ఇంకొకరి ఆజ్ఞ.

"ఏయ్! యెక్కడ చచ్చావు? వన్నీరోజూ ఆరుగంటలకే లేపమని చెప్పలేదూ?" జ్యేష్టపుత్రిక హూంకరింపు.

"రాత్రి నా ఓణీకి ఇస్త్రిరి పెట్టమన్నాను పెట్టావా?" రెండోకూతురి ఆరా.

సుశీలక్కా! పండ్లపొడిసీసా అందివ్వవూ?" చిన్నవాడి అర్థింపు.

"నాకు పాలు మొదట్లో ఇవ్వవా...." అందరికంటే చిన్నదాని గునుపు. ఇవేమి వినిపించకుండా ఉండాలని గదిలో తలుపులు వేసుకొని కొప్పువిప్పుకొని కూర్చుంది కనకదుర్గమ్మ. ఉమాపతిని హాల్లో చూచి చిన్న పిల్లలు కాస్త తగ్గారు.

"మీ రెప్పుడొచ్చారు డాడీ?" పెద్దమ్మాయి ప్రసన్న అడిగింది! పేరు ప్రసన్న అయినా, యెప్పుడూ అప్రసన్నంగానే వుంటుంది.

"రాత్రి వచ్చాను! ప్రొద్దుటే యెవర్ని దావగొడుతున్నావమ్మా?" ఉమాపతి నెమ్మదిగా అడిగాడు.

"మరే డాడీ! ఈసుశీలకు బొత్తిగా భయంలేదు. ప్రొద్దుటే చంద్రం వాళ్ళ బావను రిసీవ్ చేసుకోవడానికి స్టేషన్‌కి వెళ్ళాల్సింది. లేపమంటే లేపనేలేదు చూడు" ముద్దుగా పలకబోయి మొద్దుగా పలికింది ప్రసన్న.

"చూడు ప్రసన్నా! సుశీల నీలాంటి పిల్లేగా! రాత్రి పడుకునేవరకు చాకిరి చేసిందా? అలా మేను వాల్చిందో లేదో నేను పిలిచాను. లేచి తలుపు తీసి పాలు వెచ్చబెట్టి యిచ్చింది. ఈ గొడవలో మరిచిపోయి వుంటుంది. పెద్దదానవవుతున్నావు అణకువ నేర్చుకోకపోతేయెలాగమ్మా!"

"పో డాడీ! యెప్పుడూ అపిల్లను సమర్థిస్తారు" మూతితిప్పుకుంది.

"ఊం. నేను చెప్పితే నీ కర్థంకాదు. కాఫీత్రాగి నా గదిలోకి రా మాట్లాడాలి" ఉమాపతి నిట్టూర్చి తన గదిలోకి వెళ్ళి పోయాడు అరగంట గడిచాక ప్రసన్న. కనకదుర్గమ్మ యిద్దరువచ్చారు గదిలోకి

ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. ఉమాపతి కూడా లేచి వారి కెదురుగా కూర్చున్నాడు.

"ప్రసన్నా! ఈ సంవత్సరము నీవివాహం చెయ్యాలని వుందమ్మా. దారిలో పాత స్నేహితుడు కలిశాడు. అతనిద్వారా ఓ సంబంధము చూచి వచ్చాము. మీతో చెప్పి పెళ్ళి చూపులకు రమ్మని రాస్తాను."

"ఏమిటేమిటీ? నాతో ఒక్కమాట అనలేదేం? అంత దాపరికం ఏమొచ్చిందీ?"

"కనకం!- ఇప్పుడేమయింది? నువ్వు లేస్తూనే ఏదో గొడవతో లేస్తావు. చెప్పే అవకాశమేదీ?"

"మీరు ఈ ముక్క మొదట చెప్పితే యేగొడవా వుండకపోను. అబ్బాయి ఏం చదివాడు? పొడుగ్గా వుంటాడా? ఉన్నవారేనా!" ఆమె ముఖంలో ఆదుర్దా చెప్పనలవికాదు.

"అబ్బాయి అందంగానే వున్నాడు. బి. కాం. పాసై వ్యాపారం చేస్తున్నాడు. అతనిది చాలా సరళ స్వభావంలాగే కనిపించింది. అమ్మాయి నచ్చితే కట్నం పట్టింపు అంతగా లేదుట."

"మరింకేం రాసెయ్యండి. కట్నం పట్టింపు లేనివాళ్ళు దొరకడం మాటలా?"

"అమ్మా! ఇప్పుడేం తొందర. నా బి. ఏ. పూర్తి అవనీ...." నసిగింది ప్రసన్న.

"బి. ఏ. చేద్దువుగానిలే. అప్పుడే ఇరవై రెండు దాటాయా? నీవెన కాలే శని తయారవుతుంది" కూతురి మాటలను మధ్యలోనే త్రుంచివేసిందామె. బొటనవేలుతో నేలనురాస్తూ కూర్చుంది ప్రసన్న. ఉమాపతి రెండు నిమిషాలు కూతుర్ని తేరి పారజూచారు. "చూడు ప్రసన్నా! బలవంతము లేదు. ఇది వివాహవిషయము. ఆలోచించి చెయ్యవల్సిన పని నీమనసులో మాట చెప్పు."



"అది కాదు డాడీ ..." చెప్పలేక సిగ్గుతో తల వంచుకుంది.

"సంశయము వద్దు. నీ యభిప్రాయము నిర్భయంగా చెప్పు...." ప్రోత్సహించాడు ఉమాపతి.

"నా ఫ్రెండ్సు.... నేను కలిసి ఓ ఒప్పందము చేసుకున్నాము. డాక్టరు....గాని....ఇంజనీరుగాని....కలెక్టరుగాని అయితేనే పెళ్ళికి ఒప్పుకోవాలని... మరివాళ్ళంతా హేళన చేస్తారేమోడాడీ.... ఉమాపతి ఫక్కున నవ్వాడు. "ఈ అడ్డు మరీ బావుంది. పిచ్చిదానివి. పదవులు హోదాలు శాశ్వతం కాదమ్మా ఇవాళ, రేపు వెయ్యిరూపాయల జీతగాడు కూడా నెలాఖరున కట కటాలాడిపోతాడు, మన వ్యాపారస్తుల పనిచూడు. నెలకు ముప్పైరోజులూ ఫస్టుతారీఖే మీ అమ్మచీరలు కొనడానికి యెప్పుడయినా వెనుకాడిందేమో అడుగు." నవ్వుతూ భార్య వంక చూచాడు.

"నన్నేదో అనందే మీకు తోచదు. మీ స్వంత డబ్బు ఖర్చు పెట్టినట్టు మాట్లాడుతారు.

"డబ్బు నీదయినా, శ్రమ నాది కదా? ఆలోచించి ఓ నిర్ణయము చెప్పమ్మా అబ్బాయి మాత్రం బహు యోగ్యుడు. సాంప్రదాయము మంచిది" అని అటునుండి లేచి వెళ్ళిపోయాడు. తల్లి, కూతుళ్ళు కాసేపు మౌనంగా గడిపి, వారూ లేచివెళ్ళారు.

## 2

సాయంత్రము వంటపని ముగించి తులసి కోటవద్ద దీపం ముట్టించాలని వచ్చింది సుశీల. ప్రక్కింటి మేడమీది నుండి అనసూయ పిలిచింది. "సుశీ! సుశీ!" సుశీల తలెత్తి చూచింది. ప్రసన్నంగా నవ్వింది సుశీల. "పని అయిందా పిన్నీ!" కాస్త గట్టిగా అడిగింది.

"నా పని యెప్పుడో అయింది. నీకే తెమలని పని ఉన్నట్టు కనిపిస్తుంది. ఒక్కసారి వచ్చిపో."

"అలాగే పిన్నీ" ఇంట్లోకివచ్చి షాప్‌దగ్గరనుండి వచ్చిన ఉషో మను ఇంట్లో ఉండమని, పిల్లలకు లెక్కలుఇచ్చి, ప్రక్క ఇంట్లోకి వెళ్ళింది. అనసూయ యెదురువచ్చి భుజాలమీద చేతులు వేసింది. ఆమె ఆప్యాయతకు కరిగిపోయింది. "ఎందుకు పిన్ని ఈదిక్కు లేనిదంటే ఇంత అభిమానము?"

"సుశీ! దిక్కులేనివారెవరూ లేరమ్మా. ఈ ప్రపంచములో అందరికీ దిక్కైక్క ఆ సర్వేశ్వరుడున్నాడు."

"అన్నీ గమ్మత్తుగా అన్వయించుతావు. బాబాయి లేరా?" అనసూయకు దూరం జరుగుతూ.

"మీ బాబాయి ఉంటే నీకు పోటీ రారులే. యెందుకంత దూరం జరుగుతావు! మీ అత్త సకుటుంబ సపరివారంగా వెళ్ళింది యెక్కడికే?"

"రేపు ప్రసన్న వదినను చూడటానికి వరుడు వస్తున్నాడు. వదినకు చీరలు—యింకేం కొంటారో?"

"వరుడు వారం రోజులుంటాడా?" వచ్చే నవ్వును బిగబట్టి అడిగింది అనసూయ.

"అదేమిటి పిన్నీ! అప్పుడే పదిహేనురోజు లెందుకుంటాడు?" అమాయకంగా అడిగింది.

"మరి లేకుంటే మీ వదినకు చీరలే లేవుటే?"

"ఓ అదా? డబ్బున్నవారు. ఏదో ఫాషను కొత్త దుస్తులు కావాలికదా."

"డబ్బున్న వారట డబ్బు! నోయనివారి బూరెలు నోచినవారు తినరన్న సామెతుంది. మీ నాన్న అహోరాత్రాలు కష్టపడి వ్యాపారం వృద్ధిలోకి తెచ్చి ఫలితం అనుభవించకనే చనిపోయాడు. ఆ అభిమానమన్నా వుందేమిటే మీ అత్తకు? విన్నోవంటలక్కను చేసింది. దానిది గుండె కాదే గుండ్రాయి."



"మన రాత బాగాలేనప్పుడు యెవర్ని అని ఏం లాభం పిన్నీ? యింతకీ ఎందుకు పిలిచావు?"

"ఆలు బోండా చేశానే. ఒక్కదానికి తినబుద్ధి కాలేదు. రా, రెండు తిందువు గాని." అల మరలోంచి ఆలుబోండాలు పళ్ళెంలోకి పెట్టింది. డబ్బాతీసి కోవాబిళ్ళలు కూడా పెట్టింది. ఇద్దరూ ఫలహారం చేశారు. సుశీల లేచింది. "వెళతాను పిన్నీ" అనసూయ చేయిపట్టి లాగి కూర్చో పెట్టింది.

"బజారుకు వెళ్ళిందంటే బజారంతా కొనవిదే ఇల్లు చేరుతుందంటే మీ అత్త కూర్చో."

"అది కాదు పిన్నీ! ఇవాళ రేపు ప్రేమను వేణువు కాపలా పెట్టింది. పూలు తెస్తానని చెప్పి వచ్చాను." భయంగా చూచింది. అనసూయ బయటికి వచ్చి కుండీలలోంచి గులాబీలు త్రుంచి యిచ్చింది. బాగా విచ్చిన పెద్ద పసుపు గులాబి తెంపి సుశీల జడలో తురిమింది. సుశీల పూలు తీసుకుని లేడిపిల్లలా పరుగెత్తింది. అనసూయ ఒక్కసారి సుశీల తల్లి దండ్రులను తలచుకుంది.

కనకదుర్గ రఘు, స్వయాన అక్కా,తమ్ముడు....ఒక తల్లికడుపున పుటినవారు. రఘు తండ్రి కూతురి వివాహం చేస్తూనే గుండె ఆగి మరణించాడు. అల్లుడి పాద మహిమ అన్నారు అందరూ. ఉమాపతి చేసే చిన్నపాటి ఉద్యోగం వదిలి, మామచేసే కలపవ్యాపారం చేపట్టాడు రఘు రక్షకుడయినాడుకూడా తల్లి నీడలో, బావగారి సహాయంతో రఘు బి. ఏ. పూర్తిచేసి వ్యాపారంలో ప్రవేశించాడు. కలప వ్యాపారంలో భాగస్థుడయిన కేశవయ్యకు ఒకే ఒక్క కూతురున్నది. ఆమెపైనే కనకదుర్గమ్మ కళ్ళున్నాయి. రఘు వివాహం చూడకనే తల్లి కండ్లు మూసింది. కనకదుర్గమ్మ నిరంకుశంగా గృహరాజ్యాన్ని పాలించడం మొదలుపెట్టింది. రఘు అహోరాత్రులు కష్టపడి వ్యాపారాన్ని పదింతలుచేశాడు. ఉమాపతి సలహా

దారుడుగా ఉండిపోయాడు. కనకదుర్గ ఆకాశానికి నిచ్చెనలు వేస్తుంటే, ఒక రోజు ఓ బీద అమ్మాయిని వెంటబెట్టుకుని వచ్చి "నా భార్య అక్కా, ఆశీర్వదించు" అన్నాడు రఘు. కనకదుర్గమ్మ కోపం తారాపధం అంటినది. తిట్టింది, శాపనార్థాలు పెట్టింది, నానా గల్లంతు చేసింది. ఉమాపతి ఉపాయంగా శాంత పరిచాడు. "వ్యాపారమంతా రఘు చేతుల్లో ఉంది. నా ఇష్టం మీరు పొండి" అంటే మనము వీధిలో నిలబడాలి. నల్గురు పిల్లలుకూడా ఉన్నారు. అతను యెవరని చేసుకుంటే నీకేం?" అని యెంతో నచ్చ చెప్పాక తన కోపాన్ని దిగ మ్రింగుకుంది. అమాయకురాలయిన రఘు భార్యమీద ఆడబడుచు అధారిటీ చెలాయించడం మొదలుపెట్టింది. రఘు భార్య జానకి సాధుస్వభావురాలు. ఆడబడుచు ఆగడాలు భర్తకు యేనాడు చెప్పలేదు. మారుటి తల్లి బాధలు పెడుతుందంటే భరించలేక ఆత్మహత్య పూనుకుంటే రఘు రక్షించి. రిజిష్టరాఫీసులో వివాహం చేసుకుని తీసుకొచ్చాడు. కష్టాలు భరించిన జానకికి ఆడబడుచు ఆరళ్ళు అంత కష్టతరంగా అనిపించలేదు. భర్త లాలనలో సర్వం మరిచిపోయేది. మరో సంవత్సరానికి సుశీల పుట్టింది. జానకి కోరిన కోరికల్లా ఒకటే. తన తల్లి పేరు కూతురుకు పెట్టుకుంటానంది. సహృదయుడైన రఘు అంగీకరించాడు. తమ తల్లి పేరు పెట్టాలని కనకదుర్గమ్మ పేచీ పెట్టింది. తన మాటకు విలువనివ్వని తమ్ముడంటే కక్ష పెంచుకుంది. తన కోపం క్రక్కలేక మ్రింగలేక అవస్తపడేది. అప్పుడే కొత్తగా కాపురానికివచ్చిన ప్రక్కింటి ఇనస్పెక్టరుగారి భార్య అనసూయకు సుశీలంటే ప్రాణం. జానకి అంటే గౌరవము. రఘు అంటే భక్తి. ఒక్కగానొక్క పిల్లని సుశీలను అల్లారుముద్దుగా పెంచారా దంపతులు. సుశీలకు పదేళ్ళు నిండక మునుపే ఇద్దరూ ఒకరి తరువాత ఒకరు మరణించారు. తమ్ముడిపైనా మరదలిపైనా పెంచుకున్న కసి సుశీలమీద తీర్చుకోసాగింది కనకదుర్గమ్మ. లోకం ఏమంటుందోనని సుశీలను బడికి పంపేది. ఇంటి పనులతో అత్త



దీవెనలతో అలసిపోయిన అమ్మాయి పాఠాలు ఏం చదువుతుంది. మెట్రిక్కులో తప్పింది. అదే మంచి అదను అని చదువు మాన్పించి వంట ఇల్లు అప్పగించింది. వ్యాపారమంతా రఘు పేరు నుండేది. సుశీల తరపున అడిగేవారు లేరు. మెల్లగా అంతా ఉమాపతి పరం అయింది. స్వతహాగా ఉమాపతి అంత చెడ్డవాడు కాడు. కాని వ్యక్తిగా కొన్ని బలహీనతలున్నాయి! అతని బలహీనతను కనిపెట్టి దెబ్బతీస్తుంది కనకదుర్గమ్మ. వెంటనే లొంగిపోయాడు ఉమాపతి. సుశీలను తమ పెద్దకొడుకు వెంకట్‌కు చేసుకుంటే రఘుకు అన్యాయం జరుగదు. అతని ఆత్మ తృప్తి చెందుతుందని ఉమాపతి ఉద్దేశం. భార్య పడనిస్తుందా అన్నదే సమస్య.

ప్రసన్న అలంకారము ముగించి అద్దంలో తన ప్రతిబింబము చూచుకుని తృప్తిగా నిట్టూర్చింది, అంతకు ముందురోజు కొన్న ధర్మవరం జరీ బుటాలున్న ముదురు గులాబిరంగు పట్టుచీర. అదేరంగులో సాదాపట్టు బ్లవుజ్ వేసుకుంది. మెడలో కెంపులనెక్లెసు. చెవులకు కెంపులు ముత్యాలు కలిపిచేసిన జూకాలు, ఒకచేతికి వాటికి మ్యాచ్ అయ్యే గాజు, రెండో చేతికి రిస్టువాచి పెట్టుకుంది. పెదవులకు కనిపించీ కనిపించనట్టు రంగు అద్దుకుంది. కనకాంబరాలు మరువము కలిపిన మాల తీసుకువచ్చింది సుశీల. మాలను తలలో తురుముకోబోయే అంతలో. ప్రసన్న స్నేహితురాలు వచ్చింది. "ప్రసూ! యెంత అందంగా ఉన్నావో తెలుసా? అందంలో ఆ అపశ్రుతి యేమిటి? వద్దు ఆ కనకాంబరపు మాల పెట్టుకోవద్దు" వారించింది ప్రసన్న. సుశీల ఇద్దరు తెల్లబోయి చూశారు. "నీ చీరకు మ్యాచ్ అయ్యే పువ్వులు పెట్టుకోవాలి. యెరుపు గులాబీలు లేవా?"

"అలా నిలబడతావేమే! వెళ్ళి అనసూయమ్మ నడిగి కోసుకురా" ప్రసన్న ఒక్కసారి ఉరిమిచూసింది సుశీలను. సుశీల వెళ్ళి పదినిమిషాల్లో గులాబిపువ్వులతో తిరిగి వచ్చింది. ఇంట్లో అందరూ నీటుగా ముస్తాబయ్యారు ఇల్లంతా శుభ్రంగా సర్ది పెట్టింది సుశీల. రకరకాల ఫలహారాలు

చేశారు. వెంకట్, వేణు కారు తీసుకుని మెయిన్‌రోడ్డుమీదికి యెదుర వెళ్ళారు. అనుకున్న సమయానికి పెళ్ళికుమారుడు, అతని తల్లి, మధ్యవర్తి వచ్చారు. బంగారపు వడ్డాణం సరిచేసుకుంటూ యెదురేగింది కనకదుర్గమ్మ! వియ్యపురాలని చూచి నీరుగారిపోయింది. సాదా తెల్లమల్లుచీర చేతులకు బంగారపుకడియాలు తప్ప మరేవీలేవు. పెళ్ళికొడుకు అందరికి నమస్కరించాడు. అతన్ని చూచి అందరు తృప్తిగా నిట్టూర్చారు. పచ్చని పసిమిఛాయలో ఆరడుగుల యెత్తు విగ్రహము. నొక్కులజుట్టు అతని మాట వినని యెగిరెగిరి పడుతున్నది. బూడిదరంగు సూటు ధరించి హుందాగా ఉన్నాడు. అందరూ సోఫాలలో కూర్చున్నారు. ఉమాపతి భార్యవంక చూశాడు. అతని భావము గ్రహించి, ముసుగు సవరించుకుంటూ వంట ఇంటివైపు వెళ్ళింది. సుశీల ఫలహారాలు పళ్ళాలలో అమరుస్తుంది.

"ఏమే అయిందా?"

"అయినది. మీరు తెమ్మన్నప్పుడు తెస్తాను." ప్లేట్లు పెద్ద పళ్ళంలోకి పెడుతూ.

"తెమ్మనే అంటున్నాను, అవతలవాళ్ళు వచ్చారు. ఆ వెలిసిపోయిన చీరె తగులబడినదా?"

"ఇదే చిరుగులు లేక గట్టిగా ఉంది." తన అసహాయతను వెళ్ళడించింది.

"నా రాత! నీతో పని. కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్టు ఉంది. ఆ కొయ్యకున్న పుల్‌వాయిల్ చీరకట్టుకో. త్వరగా తెచ్చి ఫలహారాలు పట్టుకురా. ఆ ఇమామ్ చెవిటివాడు. కాస్త గిన్నెపట్టుకు రమ్మను" ఆజ్ఞాపించి వెళ్ళిపోయింది కనకదుర్గమ్మ. అప్పటికే ప్రసన్న ఆమె స్నేహితురాలు వచ్చి కూర్చున్నారు. పరస్పర పరిచయం గావించాడు ఉమాపతి. ప్రసన్న సుతారంగా చేతులు జోడించి నమస్కరించింది. పెళ్ళికుమారుడు చిన్నగా నవ్వి తల పంకించాడు.



"ఇద్దరూ విద్యావంతులే. స్వతంత్రముగా మాట్లాడుకోవచ్చు." మధ్యవర్తి ఛలోక్తి విసిరానని తలిచాడు.

"ఏం చదువుతున్నావమ్మా?" పెళ్ళికూతురుని తల్లి అడిగింది.

"బి. ఏ. రెండో సంవత్సరము" ముక్తసరిగా జవాబు చెప్పింది.

"ఒకయేడు వెనకబడింది ఒదినగారూ! పరీక్షలప్పుడే జ్వరం పట్టుకుంది. పూర్తి చేస్తుంది. మొన్ననేగా పద్దెనిమిదోయేడు వచ్చింది" కనకదుర్గమ్మ చెప్పింది. పెళ్ళికొడుకు తనలో తాను నవ్వుకున్నాడు. మొన్న ఉమాపతి యిరవై రెండేళ్ళని చెప్పేడు. భారత స్త్రీలకు వయస్సు విషయంలో నిజం చెప్పే అలవాటు యెప్పుడొస్తుందో అనుకున్నాడు.

"ఏమయ్యా పెళ్ళికొడకా అంత మౌనము వేస్తున్నావు?" మధ్యవర్తి ప్రశ్నించాడు.

"మీరు మాట్లాడుతున్నారుగా?" అని తలెత్తాడు. యెదురుగా బల్లపై పళ్ళాలు పెడుతోంది సుశీల నెమ్మదిగా అతి నెమ్మదిగా ప్రక్కవారికి అంతరాయం కలుగుతుందేమో అన్నంత నెమ్మదిగా పెడుతోంది. సన్నగా, పింగా, పొడుగ్గా వుంది. పొడుగాటి జడ భుజం మీదుగా ఒకప్రక్కకు జారి భూదేవిని ముట్టుకోవాలని ప్రయత్నిస్తూంది. వంగివుండటంచేత పచ్చని నుదురు సగం బొట్టుమాత్రం కనిపించాయి. అప్రయత్నంగా చేతిలోని రుమాలు జారవిడిచాడు. అది సుశీల పాదాలవద్ద పడింది. ఆమె కంగారుగా తలెత్తింది. అప్పుడే పెళ్ళికుమారుని కళ్ళు ఆమెను తరిచి చూస్తూన్నాయి. రెండు క్షణాలు ఆ చూపులతో చూపులు కలిపింది. విశాలమైన సోగకళ్ళలో ఏమాకర్షణ కనిపెట్టాడో గాని. ఆ యువకుడు తృప్తిగా నవ్వాడు. తన్ను తాను సంభాళించుకోవడానికి లోపలికి వెళ్ళిపోయింది.

"అందరికీ ఇవ్వవే," కనకదుర్గమ్మ గొంతు కర్కశంగా వినిపించింది.

"ఎవరండి ఆ అమ్మాయి?" కుతూహలంగా అడిగింది వరునితల్లి.

"ఎవరో దిక్కులేనిది దయదలచి పెంచాను...."

"అలా అంటారేమండి, కనకదుర్గమ్మా. మీ రఘు కూతురుకదూ?" మధ్యవర్తి ఆశ్చర్యంగా చూచాడు.

"అం....కూతురే, కులం తలం లేనిదాన్ని తెచ్చాడు. దానికో పిల్ల పుడితే రఘు కూతురయిందా? పిల్లలు గలదాన్ని యివన్నీ యెలా బయట పెట్టుకుంటాను?" ఆమె ముఖం మాడిపోయింది.

"ఇవ్వాళ రేపు యింకా కులాలేమిటి లెండి. మంచి, చెడు రెండే కులాలుగాని" వరుడు పలికాడు.

"అంతా మీలా అనుకుంటారా బాబూ! యెప్పుడూ గుండెలలో కుంపటి మోస్తూ తిరుగుతున్నాను. మా గొడవలకేం ఫలహారం తీసుకో బాబూ."

"ఇంతకు రఘు ఎవరండీ?" వరుని మేనమామ అడిగాడు.

"స్వయాన దుర్గమ్మగారి తమ్ముడు పాపం గుండె జబ్బుతో పోయాడు" మధ్యవర్తి జవాబు.

"అట్లాగా?" మేనమామ తల పంకించాడు. ఇంటివారికి సంభాషణ ఏం నచ్చలేదు. "ఫలహారం తీసుకోండి అందరూ" ఫలహారాలు స్వీకరించారు. వాతావరణం తేలిక చెయ్యడానికి మధ్యవర్తి అక్కడివి ఇక్కడివి పెళ్ళి కబుర్లు చెప్తున్నాడు. అందరూ వింటున్నారు మధ్య మధ్య ఉమాపతి మాట కలుపుతున్నాడు. వరుని కళ్ళు మాత్రం పదే పదే సుశీల కోసం చూస్తున్నాయి. అది గ్రహించినట్లు, సుశీల కాఫీలు ఇమామ్‌కిచ్చి పంపింది. "పంచదార" నెమ్మదిగా చెప్పేడు వరుడు. ఇమామ్ డ్రస్సింగ్ రూమ్‌లోకెళ్ళి చలువ చేసిన పంచ పట్టుకొచ్చి పెళ్ళి కుమారునికియ్యబోయాడు.

"ఏమిటిరా అది?" ఉమాపతి అడిగాడు గట్టిగా.

"అయ్యగారు పంచె తెమ్మన్నారు." నింపాదిగా వచ్చింది జవాబు.



"పంచె కాదురా చెవిటిలోకమా! పంచదార" వెంకట్ అరిచాడు చిన్న పిల్లలు గొల్లున నవ్వారు.

"సుశీలా! కాఫీతోపాటు పంచదార పెట్టాలని తెలియదూ." దుర్గమ్మ హూంకరించింది.

"పెట్టానత్తయ్యా" తీయగా, సన్నగా. మధురముగా వినిపించింది. వరుని చెవులకు. పళ్ళెంలో ఉన్న చిన్న వెండిగిన్నెపై మూత తీసింది వరుని తల్లి. "సారీ, నేను చూచుకోలేదు" అన్నాను వరుడు నవ్వుతూ. అతను ఆత్రంగా లోపలివైపు చూచాడు. సుశీల వస్తున్న జాడలేం కనిపించలేదు. అతని చూపుల భావం పసికట్టింది కనకదుర్గమ్మ. "వెంకట్ అబ్బాయికి మేడ చూపించు, నువ్వూ వెళ్ళవే ప్రసన్నా! యింకా పాతకాలపు పెళ్ళికూతురల్లే సిగ్గుపడతావేం?" నవ్వుతూ చెప్పింది. ముగ్గురూ వారి వెనకాల ప్రసన్న స్నేహితురాలు పైకి వెళ్ళారు. వెంకట్ కూడా తల్లిలా అతి తెలివి చూపించబోయాడు. "బావా! ఇది నా గది ఈ టేప్ రికార్డరు స్టేట్స్ నుండి తెప్పించాను. ట్రాన్సిస్టర్ లండన్‌నుండి నా స్నేహితుడు పంపించాడు. ఈ శిల్పమేమో మా ప్రొఫెసరు సిలోన్ నుండి తెచ్చి యిచ్చాడు."

"బావున్నాయి. ఆ పెయింటింగ్స్ మీరు వేశారా,"

"మనకంత ఓపిక లేదండోయ్ కలకత్తా వెళ్ళినప్పుడు శాంతినికేతన్ నుండి కొని తెచ్చాను."

"క్రికెట్టు! సినిమా గురించి మాట్లాడమనండి. గంటల తరబడి మాట్లాడుతాడు." ప్రసన్న కలుగజేసుకున్నది చిన్నగా నవ్వాడు వరుడు.

"రండి నా గది చూద్దురుగాని" అందరూ ప్రసన్నగదిలోకివెళ్ళారు ఫ్యాన్ ఆన్ చేసింది! బల్లపైన అన్ని రకాల ఇంగ్లీషు నవలలున్నాయి. అతను వాటివంక చూడగానే ప్రసన్నముఖం వికసించింది. "అన్నీ

ఇంగ్లీష్ నవలలేనండి. నా కవి అంటే ఇష్టం. మనవారు రాస్తారు ఏదుకు చెత్తబోర్" అన్నది.

"మన వారివి అంటే తెలుగువారివి యెవరివి చదివారు.

"యెవరివో లేద్దురూ! వాటిని చదవటమే బోర్ అంటే యేమదు జ్ఞాపకం పెట్టుకుంటాడు."

ఆ ఇంగ్లీష్ నవలలు కూడా చదివిందా అనే అనుమానమొచ్చింది అతనికి తమ భాషలో రుచిలేని వారికి ఇతర భాషలలో రుచి వుందంటే అంతగా నమ్మదగిన విషయము కాదు! ఒకవేళ వారు ఉత్సాహముచూపినా అది ఇతరుల కన్నా గప్పటానికి నటిస్తారు. తమను. తమ భాషను, తమ సాహిత్యాన్ని చులకన చేసుకోవడం ఆంధ్రుల అభిమాన విషయము. "ఏమిటి ఆలోచిస్తున్నారు."

"ఏం లేదు, మీ అదృష్టానికి అసూయ కలుగుతుంది. నాకు చదువాలని అభిలాష ఉన్నా. సమయము దొరకదు. యెప్పుడూ ఏవో పను లుంటాయి." లేచి కిటికీ దగ్గరకు నడిచాడు. అతని ముఖం వికసించింది! పంపు దగ్గర నిలబడి పళ్ళాలు తుడుస్తుంది సుశీల. ఈసారి ఆమెఆకారాన్ని పూర్తిగా తిలకించాడు. చిత్రకారుని చిత్రములా ఉంది. ఇమామ్ ఏదో చెప్పాడు. ఫక్కున నవ్వింది, ముత్యాల వరుసలా పలువరుస బయట పడింది. ముగ్ధుడై చూసాడు.

"ఏమిటి చూస్తున్నారు?" వెనుకనుండి ప్రసన్న అడిగింది.

"ఏం లేదు. మీ తోట చాలా బాగా పెంచారు."

మాలి ఉండగా ఇంకా బావుండేది. సుశీల చేతికి వచ్చింది సగం మొక్కలు పోయాయి"

"రండి బావగారూ! మా తోట చూద్దురుగాని" వెంకట్ వచ్చాడు.

"వద్దు సాయంత్రం ఒకచోటికి వెళ్ళాలి"త్వరగా మెట్లుదిగివచ్చాడు. అతని వెనుకాలే అందరూ వచ్చారు. హాల్లో కనకదుర్గమ్మ కంఠము



కంచులా మ్రోగుతుంది. "అదీ సంగతి వదినగారూ. ఓ డాక్టరు చదివే అబ్బాయి అయితే కానీ కట్నం వద్దు, అమ్మాయినిస్తే చాలు అన్నాడు. మాకు నచ్చలేదు. అబ్బాయి వల్లని నలుపు. ఇంకో ఇంజనీరు ఒకషేపోరు పెట్టాడు. పెళ్ళికాగానే యిద్దరము అమెరికా వెళ్తామని చెప్పారు. అమ్మాయికి అతడు నచ్చలేదు. ఈసారి అందరికి నచ్చాడు అబ్బాయి. మీ అభిప్రాయం కూడా చెప్పితే శుభం అనుకుందాము. కట్నంకానుకల విషయం కూడా సెలవిస్తే...."

"అంత తొందరపడితే యెలా కనకం? వారు యింటికెళ్ళి మంచిచెడు ఆలోచించవద్దూ."

"ఆలోచించే చెప్పమంటున్నాను లెండి" అన్నది భర్తను నిరసనగా చూస్తూ.

"మనము కలువాలని ఉంటే కలుస్తామా? అతని యిష్టమెలా ఉందో? రాసిపెట్టి ఉంటే తప్పించుకోలేము కదా? అబ్బాయితో మాట్లాడి ఉత్తరం రాస్తాములే. అన్నయ్యా అబ్బాయి యెక్కడికో వెళ్ళాలని అన్నాడు" అందరూ లేచారు. పరస్పరం నమస్కరించుకొని. సెలవుతీసు కున్నారు. వరుడు తనకు ప్రత్యేకంగా వెళ్ళి వస్తానని చెప్తాడేమోనని ప్రసన్న ఆశగా చూచింది. అతను అందరికి ఒకేసారి నమస్కరించి కారులో కూర్చున్నాడు. అందరూ యెక్కగానే కారుకదిలింది. "యెదురు చూస్తుంటాం వదినగారూ" అన్న మాటలు కారు రొదలో కలిసి పోయాయి.

"ఏం పిన్నిగారూ అంతా అయినట్టే మాట్లాడుతున్నారు? ప్రసన్న అభిప్రాయం అడిగారా?"

"అయ్యో తల్లీ! కుంటివాడికిస్తున్నామా గుడ్డివాడికా! దానికిమాత్రం యెందుకిష్టముండదూ?" కనకదుర్గమ్మ ప్రసన్నవంక చూచింది. ప్రసన్న

స్నేహితురాలివంక నవ్వుతూ చూచింది. "అల్లుడు కుంటి గుడ్డికాదవి కొ_స్త పొగరు మోతుతకంగా కనిపించాడు."

"అది సహజమేకదా. అందం చందం డబ్బు. దస్కాం ఉన్నాయి."

"అమ్మా! చందము మాకు కనిపించలేదు కదే? దస్కాం అంటే ఏమిటమ్మా?" వేణు అడిగాడు అమాయకంగా. కసరికొట్టింది తల్లి. పుస్తకాలు ఊపుకుంటూ శశి వచ్చింది. "రా శశి, కాబోయే బావగార్ని చూడనోచుకోలేదు" వెక్కిరించాడు వెంకట్. శశి అపనమ్మకంగా యింట్లోకి చూచి ముఖం కందగడ్డలా చేసుకుంది.

"అదేమిటమ్మా? అప్పుడే వెళ్ళిపోయారా? రాత్రికి భోజనాలకు ఉంచమంటా నన్నావుకదే?" అన్నది ఏడుపు ముఖంతో.

"అన్నానే తల్లి అడదానికి నా కెంత ఉత్సాహముంటే యెందుకు? మొగ మహారాజు మీనాన్న. వారిని ఉండమని ఒక్కమాట అనందే!" భర్తవంక రుస రుసా చూపులు విసిరింది.

"ఇప్పుడేముంది? నచ్చితే త్వరలోనే తెలుపుతారు. అందరం వెళ్ళి చూడొచ్చు." ఉమాపతి ఎగురగొట్టాడు మాటల్ని.

"నచ్చితే అవి దీర్ఘం తీస్తున్నారు.... నచ్చలేదని చెప్పారేమిటి?"

"నీకు నచ్చిందని ఎప్పుడు చెప్పారే?" ఆశ్చర్యం నటించాడు ఉమాపతి.

"వేరే చెప్పాలేమిటి? వారు మాట్లాడిన తీరు, ముఖలక్షణాలనుబట్టి ఆ మాత్రం గ్రహించలేమా? మన ప్రసు నచ్చలేదనటానికి అతనేం అవివేకి కాడు. మీరు లేనిపోని అనుమానాలు పెట్టుకోకండి."

"అందుకే పిల్ల పిల్లవానికి ఏకాంతము కలుగజేసి నేను, వెంకట్ బయటనే ఉండిపోయాము. బాగానే మాట్లాడినాడు మరేం మాట్లాడినాడో గాని...." ప్రసన్న స్నేహితురాలు తన తెలివితేటలు వెల్లడించుకుంది.



దుర్గమ్మ ముఖం చాటంత అయింది. దగ్గరగా వచ్చి కూతురితో గుస. గుస. లాడింది.

"ఏమన్నాడే? చాకులా ఉన్నాడు అబ్బాయి, నాదగ్గర దాపరికం దేనికే చెప్పవే?"

"ఏం లేదు. పుస్తకాలగురించి అడిగారమ్మా. నేను ఇంగ్లీష్ వే తప్ప చదువనన్నాను." సిగ్గుపడుతూ చెప్పింది ప్రసన్న.

"ఏమిటే అక్కా?" అంటూ శశి వచ్చింది. విశేషాలు రాత్రంతా మాటాడినా తరగలేదు. అందరూ సంతోషాలలో తేలియాడుతూ భోజనం కూడా సరిగ్గా చేయలేదు.

"మొదటి పెండ్లి ఘనంగా చేయాలండి. వాళ్ళ కట్నం యెక్కువ అడక్కపోతే అమ్మాయికో రవ్వల నెక్లెసు చేయించాలండి. అల్లాటప్పా అనుకునేరు."

"అమ్మా! ఒట్టి నెక్లెసు వద్దే. చేయిస్తే సెట్టు చేయించండి." ప్రసన్న ముద్దుగా గుణిసింది.

"సెట్టు అంటే మాటలే? చూద్దాములే. ఏమండోయ్! వాళ్ళ దగ్గర బెల్లం కొట్టిన రాయిలా కూర్చోకండి. అమ్మాయి దుస్తుల క్రింద మూడు వేలన్నా అడగాలి. వింటున్నారా? ఇదెక్కడి మనిషమ్మా కూర్చునే నిద్రపోతారు! ఈయనతో ఇదే చిక్కు. వెంకట్ నువ్వన్నా పెళ్ళి అయ్యే వరకు నామాట వినరా. శశీ నువ్వూ. చిన్నన్నయ్య శుభలేఖలు పంచిపట్టే పని తీసుకోండి. ఒసేయి సుశీలా! యెక్కడ చచ్చినావే? కావికి కొరగాని మనుషులమ్మా. అన్నం సరిగ్గా తినలేదు పాలుయివ్వాలని తెలియదుటే? వంటింటికి దీనికి సరిపోతుంది...." దుర్గమ్మ మాట పూర్తి అవకుండానే సుశీల పాలగ్లాసు తెచ్చి బల్లమీద పెట్టింది. సుశీల వంక యెగా, దిగా చూచింది. "చీరమార్చుకుంటే ఏంరోగమే. నీదమకున్నావా, నీ అమ్మదా? ఫుల్ వాయిల్ చీరలంటే ఏమనుకున్నావు? నలభై దాటాయి

మా కాలంలో పలభై పెడితే మాంచి బెనారసు చీర వచ్చేది. దిక్కులేని దవి దయదలిస్తే నా నెత్తిన యెక్కుతున్నావు. నీ మూలాన వాళ్ళ ముందు తల వంచుకోవాల్సి వచ్చింది. యెవరొచ్చినా ముందు టింగు రంగా అంటూ వస్తావు...."

"మీరే రమ్మన్నారు కదా అత్తయ్యా. నేను ఇమాస్‌తో వంపుతానని అనలేదూ?"

"అన్నావు లెద్దూ. ఒక్క నిమిషంలో చెవిటి వెధవ యెంత పని చేశాడు!" వాడిదివరకు చేసినవి. ఈరోజు చేసినవి, అవక తవకలు పనులు చెప్పుకుని ఒకటే నవ్వారు అందరు. వచ్చే కన్నీరు నాపుకుంటూ లోపలికి సుశీల వచ్చింది. "నా అన్న చీ కట్టే ఎంత ధీమాగా మాట్లాడుతుంది." అనుకుంది. ఆ రోజు దుర్గమ్మ కట్టినచీర రఘు కాంజీవరంనుండి తేవడం భార్య కివ్వడం బాగా గుర్తుంది సుశీలకి. అప్పుడు ఆమెకు తొమ్మిదేండ్లు. "విధి బలీయం అని దీన్నే అంటారు కాబోలు." అనుకుంది.

పదిరోజులు గడిచాయి. మరోసారి వెళ్ళిరమ్మని దుర్గమ్మ పోరుతున్నా ఉమాపతి జాప్యం చేస్తున్నాడు. పదకొండవ రోజునాడు మధ్యవర్తి నుండి ఉత్తరం వచ్చింది ఆత్రంగా విప్పి చదివాడు.

"ఏం రాశారండీ? ఒప్పుకున్నట్టేనా?" కనకదుర్గమ్మ ఆత్రంగా ప్రశ్నించింది.

"ఉహూఁ" నన్నాడు. అతని నాన్చుడు చూస్తే ఆమెకు పట్టరాని కోపం వస్తుంది. ఉత్తరం లాక్కుని అసహాయంగా చూచింది, అది ఇంగ్లీషులో వ్రాయబడి ఉంది. "ఉహూ అంటే అర్థం ఏమిటండీ?"

"ఏముంది! వారికి మన అమ్మాయి నచ్చలేదంటా, సుశీలను యిస్తే కట్నంతో పనిలేదట."

"ఏమిటీ? మతుందే రాశారా? అష్ట దరిద్రులు! నా బిడ్డ నచ్చ



లేదూ? కులం, గోత్రం లేక నా యింట కూటికి పడి ఉన్న దరిద్రురాలు నచ్చిందా?" చిందులు త్రొక్కసాగింది దుర్గమ్మ.

"గొడవ యెందుకు? యెన్నో సంబంధాలు అనుకుంటాము. అనుకున్నవన్నీ అవుతాయా? మన గొడవలతో పిల్లలు చిన్నబుచ్చుకుంటారు" ఉత్తరం లాక్కుని జేబులో పెట్టుకున్నాడు.

"మీరు యింత మెత్తనివారనే అందరు అలా చులకన చేస్తారు. అంత నచ్చని మొనగాడు మన అమ్మాయితో ఏకాంతముగా యెందుకు మాట్లాడాలి? వెళ్ళి నాలుగు దులిపిరాండి."

"కనకం! నీ ఆవేశం పిడేనా? నామాట వినవా? అతను ఏకాంతము కల్పించమని నిన్ను కోరినాడా? నీ కూతురి స్నేహితురాలు తనో గొప్ప నాగరికురాలననుకొని అతన్ని ఒంటరిగా వదిలేస్తే ఏంచేస్తాడు? ఆడపిల్లలకు లేని అణకువ మగవాడి కెందుకుంటుంది? సంబంధం కుదిరేవరకు హద్దుల్లో ఉండాలే అంటాను వింటావా? మన పిల్లలే పెద్ద చదువులు చదివినట్టు చేస్తావు" అతని మాటలు కటువుగా ఉన్నాయి. మరేం మాట్లాడలేదు. రాత్రి భోజనాలవద్ద వెంకట్ పెళ్ళివారి విషయం యెత్తాడు. ఉత్తరం సంగతులు చెప్పక, తమకిష్టం లేదన్నట్టు తేల్చింది దుర్గమ్మ. "ఎర్రగా బుర్రగా ఉన్నాడని మొజు పడ్డాముగానీ వారి సాంప్రదాయం నాకేం నచ్చలేదు. వాళ్ళు డబ్బుగలవారన్న విషయము సందేహమే. యెంత విధవయితే మాత్రం మెడలో ఒక్క గొలుసుండదా? యే డాక్టరో, ఇంజినీయరో అయితేనే ఒప్పుకుంటాను. ఏమండీ మీ చుట్టాలబ్బాయి యెవరో నాల్గో సంవత్సరము చదువుతున్నాడన్నారు కదా?"

"కనుక్కుంటాను వెంకట్! మేనేజరును అడిగి రెండువందలు తీసుకున్నావట యెందుకురా?" ఉమాపతి కొడుకు వంకకు తిరిగాడు!

పరీక్షఫీజు కడదామని అమ్మదగ్గర యాభై తీసుకుని వెళ్ళాను. బ్యాంక్ మూశారు. నా స్నేహితులుకూడా తమ రూపాయలు దాచమని

నాకే యిచ్చారు. ఇంటికి వస్తుంటే జేబుకొట్టారు నాన్నా. అందుకని...." తను చెప్పింది అందరూ నమ్మారా లేదా. అని అందరివంకా చూశాడు. అందరూ తలవంచుకున్నారు.

"చాల్లే నీ కుంటిసాకులు. నీకు వచ్చిన వయసు యెవరికి వచ్చిందిరా? ఇరవై ఆరేళ్ళు. ఇంకా బి. ఏ.లో ఉటికీలు కొడుతుంటివి. యెంతసేపు సినిమాలు, షికార్లు, షాపువైపు వెళ్ళాలని తెలియలేదూ! ఆ ఢిల్లీలో చదివే ఆయన తనంతట తానే ఓ జమీందారు ననుకుంటాడు. జర్నలిజం వద్దురా అంటే కావాలన్నాడు. వేలకు వేలు కావాలంటాడు. అందరి సంగతి ఆలోచిస్తే అయోమయంగా ఉంది."

సుశీ

"చిన్నపిల్లలు, తల్లితండ్రుల మున్నామని ఆ మాత్రం చనువుగా ఖర్చుపెడతారు."

"సరే, నేనెందుకు విసుగుపడాలి. నీడబ్బు. నీయిష్టం మనహద్దులు వున్నవారిముందు చులకన కాకుండా పెద్దతరహాగా మెదలమంటున్నాను." అతని మనసు బాగుండలేదు లేచి వెళ్ళిపోయాడు. ప్రసన్నకూడా తండ్రి వెనకాలే లేచి వెళ్ళిపోయింది. తల్లి ఒకేసారి ప్లేటు యెందుకు ఫిరాయించినదో యెంత ఆలోచించినా అర్థం కాలేదు. ఆ అందమైన యువకుడికి తన హృదయంలో స్థానం యిచ్చింది. తీయని ఊహాలలో తేలియాడింది. ఏం జరిగిందని అమ్మ వద్దంటున్నదో అర్థం కాలేదు. అడుగడానికి అభిమానము అడ్డువచ్చింది.

అందరూ నిద్రపోయినా దుర్గమ్మ నిద్రపోలేదు. ఆమె మానసం కుత కుత ఉడుకుతుంది. భర్తమీద కసిగా వుంది. సుశీలమీద మంటగా ఉంది. టేబుల్ లైటు వెలిగించి ఆ రోజు పత్రిక తీసింది. ఇంతలో తలుపు తోసుకుని ఉమాపతి వచ్చాడు. "ఇంకా నిద్రపోనట్టుంది?" అని మంచం మీద కూర్చున్నాడు ఆమె లేచి కాళ్ళు ముడుచుకుంది "[illegible]



కొన్ని ముఖ్య విషయాలు మాట్లాడాలని వచ్చాను. పిల్లలముందు మాట్లాడుకోవటంబాగుండదని అందరూ పడుకునేవరకు వేచి వున్నాను.

ఏమిటన్నట్టు చూసిందామె.

"మొదట మన పెద్దబ్బాయి సంగతి తీసుకుందాం. వాడు జేపదుసుగా తిరగటం ఏం బాపులేదు."

"ముఖ్య విషయమంటే ఏమిటో అనుకున్నాను. వాడిని అడుపోసుకోందెప్పుడు! వయస్సులో ఉన్నప్పుడు తిరగక ముసలాడయి తిరుగుతాడా?" అంది నిర్లక్ష్యంగా.

"సమంజసమయిన తిరుగుడయితే యెప్పుడు తిరిగినా ఫరవాలేదు. ఇందాక చిన్నవాళ్ళముందు చులకన చేయటం దేనికని ఊరుకున్నాను. వారం వారం వందలు ఖర్చుచేస్తుంటే ఈ ఆస్తి యెన్నాళ్ళు వుంటుంది? యెంతవరకు నిజమో తెలియదు. పెద్దగుమాస్తా చెప్పాడు పట్నంలో ఓ బజారు మనిషిని చేరదీశాడట. అందుకే ప్రసన్నకు వరుడు కుదిరితే వెంకట్ పెళ్ళికూడా చేయాలని...."

"పెళ్ళి అంటే వద్దంటానా? వయసులో తిరగంది ఎవరు? ఇంతకీ అమ్మాయిని వెతకాలి కదా."

"కనకం! నీవు యెంత స్వార్థపరురాలవు! అమ్మాయి ఇంట్లోనే ఉంది కదా! వెతకటం దేనికి?"

"ఇంకా నయం! ఆ దిక్కులేనిదాన్ని కులం, గోత్రం లేనిదాన్ని నా కోడలుగా అంగీకరిస్తానని యెలా అనుకున్నారు? నా తండ్రికేం? దర్జాగా పెళ్ళి చేస్తాను" అన్నది గర్వంగా తల యెగరేస్తూ.

"అది నిజమేనే! సుశీల తరఫున ఎవరన్నా వచ్చి కోర్టులో దావా వేస్తే మన పని గోవిందా!"

"యెవడండి వేసేది? అక్రమయిన దానికి పుట్టిన బిడ్డ వారసురాలా

యిందనా? నా తమ్ముని ఆస్తికి అసలయిన వారసురాలిని నేను. కోర్టు లెక్కతారట! కోర్టుకు యెవడో రానీ చూద్దాం."

"మరి నీ కొడుకు సంగతి తేల్చావు. సుశీల సంగతేమిటి? పెంచి నందుకు పెళ్ళి చేయాలి కదా!"

"ఇప్పుడేం తొందర? ప్రసన్న, శశి దానికన్నా పెద్దవారున్నారు. వారందరిని కానీయండి. తరువాత ఆలోచిద్దాం" అన్నది ఆవలిస్తూ,

"తరువాతే ఆలోచించాల్సింది. కాని మొన్న చూచి వెళ్ళారుకదా? వారంతట వారే కట్నం లేకుండా చేసుకుంటామంటున్నారు. పెళ్ళిచేసి మన బరువు తీర్చుకుంటే పోలా?"

"వీల్లేదు! నా బిడ్డకు వంక బెట్టినదాని ముఖం యెలా చూస్తాను!" కంయిన లేచింది.

"నోటి తొందరేతప్ప ఆలోచన అసలులేదు! ఇంట్లో కూర్చుంటావు నీకు అంత బాధ ఉండదు! బయట తిరిగేవాడిని నాకుంది బాధ. యెంత మంది యెన్ని రకాల మాటలంటారో! అందరికీ రఘు తెలుసు! అందరూ ఒకసారి ధైర్యంచేసి సుశీలచేత దావా వేయిస్తే? అలాంటి అవకాశము యెందుకు కలుగనివ్వాలి! పెంచి మంచి యింట్లోకి యిచ్చారు" అని నల్గురు అనుకోనీ! రఘు ఆస్తి అనుభవించినా అతని సంతానానికి అన్యాయం చెయ్యలేదన్న తృప్తి మిగులనియ్యి! నీకిష్టం లేకుంటే పెళ్ళివారితో మాట్లాడకు.... యే దేవాలయంలోనో నాల్గు అక్షింతలు వేసేస్తాను."

"చూద్దాము లెండి. నాకు నిదరొస్తుంది." అన్నది దిండుకు చేరబడుతూ అడ్డుపెట్టక ఒప్పుకున్నందుకు తేలికగా నిట్టూర్చాడు ఉమాపతి.

భర్తతో బొంకినదికాని నిద్రరావటంలేదు దుర్గమ్మకు. యెంత ఆలోచించినా తన కూతురులో ఉన్న లోపము, సుశీలలో గొప్పతనము ఆమెకు తట్టలేదు. సుశీలకంటే ప్రసన్నే అందముగా కనిపిస్తుంది.



మరి వాళ్ళు సుశీలను కోరడములో అంతర్యము? డబ్బులేదు ఆప్తులు లేరు. అందము అంటే మామూలే? కేవలం దయతో అంగీకరిస్తున్నారా— కాదు దీని వెనకాల యేదో కుట్ర వుంది. ఆమెకళ్ళ ముందు మధ్యవర్తిగా వచ్చిన వ్యక్తి మెదిలాడు. స్వయాన దుర్గమ్మ తమ్ముడు రఘు అన్న మాటలు పదే పదే ఆమె చెవుల్లో మారుమ్రోగాయి. అతనే యేదో కుట్ర పన్నుతున్నాడు. అతని గురించి అంతా తెలుసుకోవాలి. వెంటనేలేచి భర్త మంచం వద్దకు వెళ్ళింది. "ఏమండీ, ఒక్కమాట!" ఉమాపతి దుప్పటి ముసుగు తొలగించాడు. "అప్పుడే నిద్ర వస్తుందని అన్నావు కదే!" అన్నాడు.

"అన్నాను. ఒక్కమాట. ఆ మధ్యవర్తిగా వచ్చినాయన యెవరండీ?"

"నా స్నేహితుడు. రఘుకు కూడా స్నేహితుడే. మనింటికి వచ్చేవాడు. ఇప్పుడతను పొలం అదీ కొని అక్కడ వ్యవసాయం చేసుకుంటున్నాడు. అతనికి కొడుకులు లేరుసుమా!" నవ్వడానికి ప్రయత్నించాడు.

"మీరు మీ హాస్యమూనూ" విసుక్కుంది. "అతను మనమీద కుట్రపన్నుతున్నాడేమోనని అనుమానంగా ఉంది."

"కుట్ర పన్నితే అతనికేం లాభం? అతను సాదా సీదా మనిషి. తన పనేమో తనేమో ఆమాత్రం పెళ్ళి చూపులకు వచ్చాడంటే నామీది గౌరవముచేత? అతని గురించి యెలాంటి అనుమానమూ వద్దు" నచ్చజెప్ప చూచాడు. దుర్గమ్మ అనుమానము బలపడిందే కాని తగ్గలేదు.

"మీరు మంచివారు కాబట్టి అంతా మంచివారిలాగే కనిపిస్తారు. వాళ్ళకి సుశీలని పట్టువల యెందులకు? కారణ మూహించగలరా?"

"కొన్నింటికి కారణాలుండవు దుర్గా! మీ తమ్ముడు జానకిని యెందుకు పెళ్ళి చేసుకున్నాడు?"

"దానికి దీనికి పోలికేమిటి? అది ఒంటరిగా కలిసి వాడిని వలలో వేసుకుంది. వీళ్ళు చూడడానికి వచ్చి ఇలా ప్లేటు ఫిరాయించడంలో ఏదో అంతర్యముంది. రఘు కూతురు సుశీల. ఇప్పుడు కానీ కట్నం అక్కర లేదని పెళ్ళి చేసుకుంటాడు. మర్నాడే అల్లుడి హోదాలో ఆస్తికోసం దావా వేస్తాడు. అదే వారి కోరిక, కుట్ర" ఆవేశంగా అరిచింది దుర్గమ్మ.

"నువ్వు బట్టను చూచి పామని భయపడుతున్నావే. అలాంటివారు కారు."

"అయితే నేనే చెడ్డదాన్నా? మీ రెప్పుడూ యింతే. ఆస్తిపాస్తులు లేక అనాథలై వచ్చిన ఆడవారు భర్తను తన మాటమీద నడిపించుకుంటారు. అదేం దురదృష్టమో, లక్షల ఆస్తితో వచ్చినా నా మాట ఒక్కసారి వినరు, రఘు అంటే నాకు ప్రేమ లేదనా? యెంత అభిమానంగా పెంచుకున్నాను మీరు కూడా వాడినో యజమానిని చూచినట్టే చూచారు. పెళ్ళి విషయంలో ఒక్కమాట, ఒక్కమాట మీతో చెప్పాడా? మీరువద్దనే వారా? పెద్దవారన్న గౌరవము చూపాడా?" ఇరవై సంవత్సరాలనాడు జరిగిన విషయము ఇప్పుడు జరిగినట్టె బాధపడుతూ కన్నీరు కార్చింది. ఉమాపతి పొంగిపోయాడు. భార్యనోట మంచి అనిపించుకొంటే పొంగిపోని మొగాడెవడు? దుర్గమ్మ కన్నీరు వత్తాడు "ఊరుకోవే. నీ మాట కాదని ఏం చేశాను? నన్నేం చేయమంటావు చెప్పు?" అనునయంగా అడిగాడు. "మన పిల్లల భవిష్యత్ ఆలోచించమంటున్నాను ఆ పిల్లది మన రఘుకి పుట్టిందనే గ్యారంటీ ఏముంది? బజారు ఆడది. ఎంతమందితో తిరిగిందో, వాడు గుడ్డి వాడయితే మనమెలా అవుతాము? వెనకా ముందు ఆలోచించండి."

"నా స్నేహితునికి సుశీలంటే ఎందుకు ఇష్టముంటుంది? అది ఆలోచించాలి."

"నీతో వచ్చిన చిక్కే ఇది. కొందరికి వచ్చని కాపరాలు చూస్తే



ఓర్వలేనితనం బయలు దేరుతుంది, సుశీలను పెళ్ళిచేద్దాము పిల్లను మాత్రం వద్దు నా కేమో భయంగా ఉంది."

"అట్లాగేలే. సుశీలకు వేరే సంబంధము వుందని రాసేద్దాము. ఇక నీ భయం తీరినట్టేనా?"

"అప్పుడేనా? ఈ శనిని యింట్లోనుండి వెళ్ళగొట్ట చేస్తేగాని నాకు శాంతి వుండదు. మన పిల్లల భవిష్యత్‌కు అడ్డుగా నిల్చున్నది. రేపే వేరే సంబంధము వాకబు చేస్తాను. ఒక్కమాట మీరు వినాలి దాని విషయంలో జోక్యము గలుగజేసుకోనని మాట ఇవ్వండి." చేయి చాపింది దుర్గమ్మ. కొన్ని బలహీనమైన క్షణాలకు బానిస అవుతాడు వ్యక్తి. అలాగే జరిగింది ఉమాపతి విషయంలో. భార్య చేతిలో చేయి వేసి, అలాగే దగ్గరకు లాక్కున్నాడు.

సుశీలకు కొత్తరకమయిన సాధింపు ఏమిటో అర్థంకాలేదు. అత్త నోటికి తాళం లేదని తెలుసు. కాని మరీ యింత నీచంగా మాట్లాడుతుందని తెలియదు. ఇమామ్ కూరగాయలు తెచ్చాడు! నిమ్మకాయలు తేలేదేమిటిరా?" కూరగాయలు వేరే పెడుతూ అడిగింది సుశీల.

"ఏదేమిటి చిన్నమ్మా! కూరగాయలు ఈరోజువి తాజావి విన్నటి వంటారేమిటి"

"నీతో చావు వచ్చిందిరా బాబూ! నిమ్మకాయలు ఏవి?" అన్నాను.

"చామదుంపలు చచ్చినట్టున్నాయా? మాంచివియేరి తెస్తేను" ముఖం చిన్న జేసుకున్నాడు. అది పని గాదని సుశీల ఓ నిమ్మకాయ తెచ్చి చూపింది. అవి యేవి అన్నట్టు సైగచేసి అడిగింది ఇమామ్‌కు అర్థమైంది. తన తెలివితక్కువ తనానికి నవ్వుకున్నాడు. "మరిచిపోయానమ్మా" అన్నాడు. వాడి ముఖం చూస్తే సుశీలకు నవ్వాగలేదు? వేణు కూడా అక్కడే వుండి వాడి చేష్టలను అనుకరిస్తూ నవ్వాడు. యెప్పుడొచ్చిందో ఏమో కనకదుర్గమ్మ యెవరూ చూడలేదు. యెందుకే ఆ వికటబాటు?"

సుశీల తల పైన ఒక్క పోటు పొడిచింది. "సిగ్గు యెగ్గు అన్నీ వదిలి పెట్టావా? అడ్డమైన వెధవలతో పరిహాసాలా? అమ్మ బుద్ధులే వచ్చాయా పడితే గట్టివాడినే పట్టరాదే! పూటకి గతిలేని వెధవలు నీకేం కూడు పెడ తారు?" సుశీల నిర్ఘాంతపోయింది ఇమామ్‌కు తండ్రి వయసుంటుంది. ఇంత అన్యాయంగా మాట్లాడుతుందేం? "అత్తయ్యా! మీరేం మాట్లాడు తున్నారు?"

"కోపం కూడానా కులపావనకురాలా! వెళ్ళు మళ్ళీ ఆ ఇమామ్‌తో మాట్లాడు చెప్తాను."

ఇమామ్‌కు వినిపించక పోయినా సుశీల తనతో మాట్లాడినందుకే యజమానురాలు కోపగిస్తుందని తెలుసుకున్నాడు. సుశీల వంక జాలిగా చూసి వెళ్ళిపోయాడు ఆ రోజు సాయంత్రము వరకు తల దువ్వుకో లేదు. తన దురదృష్టానికి వగస్తూ అన్యమనస్కంగా గడిపింది. జుట్టు జడలో నుండి పూడి ముఖాన్ని చిరాకు పెట్టసాగింది. పనంతా అయ్యాక తల విప్పుకొని దువ్వు రాయడం మొదలు పెట్టింది దుర్గమ్మ మంచినీళ్ళు అడిగితే తీసుకెళ్ళి ఇచ్చింది.

"అసుర సంధ్య వేళ యిప్పుడు తల విరబోసుకున్నావేమిటే? అందుకే మొగవాడి కళ్ళల్లో నీమీదే వుంటాయి సంసారి వేషాలేనా! నీవు బజారు పాలవుతావే నా తమ్ముడు మంచివాడు కాబట్టి నీయమ్మ గుట్టు దాగినది.... గొంతు చించుకొని అరవసాగింది. సుశీలలోని సహనం హరించుకుపోయి నది, "అత్తయ్యా! యెదురుగా వున్నాను. నన్ను ఎన్ని మాటలయినా అనండి. చచ్చి స్వర్గాన అమ్మనెందుకంటారు? ఆమె మీకేం అపకారం చేసింది."

"అణిగి మణిగి పడివుండే అమాయకురాలు ఎదిరించి మాట్లాడే సరికి సహించలేక పోయింది దుర్గమ్మ. చేతిలోని గ్లాసు విసిరి సుశీల



కేసి కొట్టింది. జుట్టు పట్టి వంచి. యెంతో పెడా పొడినది నాల్గు రోజుల నుండి పేరుకున్న కసి కరిగి నీరయ్యే వరకు బాదినది. శశి అడ్డుకుంది.

"అమ్మా! వదులు. చచ్చిపోతుందే వదులమ్మా" తల్లిని దూరం తీసుకెళ్ళింది. దుర్గమ్మ ఆవేశం చల్లారింది. అసహాయంగా నేలకంటుకు పోయి రోదిస్తున్న అమాయకురాలిని చూస్తే శశికి జాలేసింది. చేయూత నిచ్చి లేవదీసినది. పెరట్లోకి తీసుకువచ్చి ముఖాన నీళ్ళుకొట్టి కొంగుతో వత్తింది. రక్తం తుడిచి పసుపు అద్దినది.

"అమ్మ కోపం తెలుసు. యెందుకు యెదురు చెప్పావు సుశీ?" ప్రేమగా అడిగింది.

"ఊరికేనే లేని నిందలు పెడుతేయెలా? ఇమామ్‌తో సరసాలు ఆడేంత నీచురాలినా శశీ!"

"అమ్మ కోపం వేరులే. మొన్న పదిహేనురోజుల క్రితం వచ్చిన పెండ్లి కొడుకు నిన్ను చేసుకుంటానని అన్నట్టున్నాడు. అది స్పష్టంగా చెప్పలేదు. అమ్మా నాన్నల మాటలనుబట్టి అర్థం చేసుకున్నాను. అందుకే కోపం. పద కాసింత కాఫీ త్రాగుదువుగానీ." ఉన్నట్టుండి శశికింత దయ కలిగిందేమిటా. అని ఆశ్చర్యపోయింది సుశీల. స్టౌ వెలిగించి రెండు గ్లాసులలో కాఫీ కాచి పోసింది. ఒకటి సుశీల కిచ్చి, రెండవది తను తీసు కుంది. చిందర వందరగా ఉన్న జుట్టును చక్కగా దువ్వి జడ అల్లింది. సుశీల హృదయము అపరిచితుడయిన యువకునిపట్ల కృతజ్ఞతతో నిండి పోయినది. "సుశీ! ఆ వరుడునిన్ను కోరటంలో తప్పులేదు. ఎంత అందముగా ఉన్నావో. నేను మొగపిల్లవాడి నయితేనా రాక్షస వివాహ మయినా చేసుకునేదాన్ని ...." సుశీల నుదుట అందముగా తిలకం దిద్దినది. నిరసంగా నవ్వింది సుశీల.

"పోనీలే శశీ! నీకయినా ఆ మాత్రము అభిమాన మున్నది." తులసికోట దగ్గరే కూర్చుంది.

రాత్రి భోజనాల దగ్గర శశి వడ్డించడం చూచి అందరూ ఆశ్చర్య పోయారు. సుశీలను కొట్టిన సంగతి యెవరికి తెలియదు "అది అప్పుడే చచ్చిపోయిందా? నువ్వు తెస్తున్నా వేమిటి?"

"నువ్వు అన్నింటికి రాద్ధాంతము చేస్తావేమిటమ్మా! చావగొట్టావు. అదీ మనిషే. ఒక్కపూట నేను చేస్తే అరిగిపోయానా! నేను ఆడపిల్లను కానా!" కూతురి వంక ఆశ్చర్యంగా చూచాడు ఉమాపతి. వెంకట్ చప్పట్లు కొట్టాడు.

"అయితే చెల్లాయి వంటకూడా తమరే చేశారేమిటి? తొమ్మిది దాటితే హోటల్కుండదు త్వరగా చెప్పు."

"నువ్వేం వెక్కిరించాల్సిన పనిలేదు వంటకూడా చేస్తాను చూడ...." సవాల్ చేసింది శశి.

అందరి భోజనాలు అయి యెవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. శశి రెండుపళ్లాలు బల్లమీద పెట్టి సుశీలచేత బలవంతముగా భోజనం చేయించింది. ఈ అపారమైన కరుణ యేమిటో అర్థంగాక తెల్లబోయింది సుశీల. లైట్లుఆర్పి సుశీల నులకమంచము మీద నడుము వాల్చింది. అర గంట గడిచాక సెంటువాసన గుప్పుమంది. అదిరిపడిలేచింది. అప్సరసలా తయారయి వచ్చింది శశి. వాకిట్లో సన్నగా ఈల వినిపించింది. "సుశీ ఓ స్నేహితురాలితో సినిమాకు వెడుతున్నాను. అమ్మకి చెప్పితే అనవస రంగా అనుమాన పడుతుంది. కాస్త మెలుకువగా ఉంటే తలుపు తీస్తావు కదూ? యెవ్వరితో చెప్పకు మా బంగారు...." సుశీల చేయి ముద్దుపెట్టు కుని వెళ్ళిపోయింది. తేరుకుని వాకిట్లోకి వచ్చేసరికి. సందు చివరనున్న స్కూటరు కదలిపోయింది. సుశీల హృదయం కంపించి పోయింది.



ప్రతకు దూరమై ఇంటివారి మనస్తత్వాలకు వగస్తూ దొర్లసాగింది. మిగిలిన రాత్రంతా. శశి నాల్గు దాటాక వచ్చి పడుకుంది.

దుర్గమ్మ ఆ రోజు పిల్లలతోపాటు తయారయి హైద్రాబాద్ బయలుదేరింది. యెందుకు వెడుతుందో యెక్కడికి వెళుతుందో యెవరికి చెప్పలేదు. రాత్రి యేడు గంటలకు ఉమాపతి ఇంటికి వచ్చేసరికి వేణును కూర్చోబెట్టుకుని లెక్కలు చెప్తూ సుశీల మాత్రం ఉంది.

"మీ అత్త ఇంకా రాలేదా అమ్మా?"

"లేదు మామయ్యా. మీరు భోజనం చేస్తారా కాఫీ తీసుకుంటారా?"

"కాఫీ తీసుకుంటాను. వెంకట్. ప్రసన్న వీళ్ళంతా ఏరమ్మా?"

"బావ పదిమైళ్ళ దూరాన ద్రాక్షతోట లున్నాయట చూచి వస్తా నన్నారు. ప్రసన్న వదిన స్నేహితురాలింటికి వెళ్ళింది. శశి స్నేహితు లతో సినిమా కెళతానంది. ప్రేమ అత్తయ్యతో వెళ్ళింది."

"ఊఁ" అలసటగా కుర్చీలో కూర్చున్నాడు. సుశీల కాఫీతెచ్చింది. రాత్రి తొమ్మిదయినా యెవరూ ఇల్లు చేరలేదు. ఉమాపతి అసహనంగా పచార్లు చెయ్యసాగేడు దుర్గమ్మ వచ్చింది మొదట తరువాత ఒకరొకరే ఇల్లు చేరారు. యెవరిని యే మాటగని భార్య ముందు నోరు చేసుకుం టుందని భయపడి. అన్నంతోపాటు కోపాన్నికూడా మింగారు ఉమాపతి.

రాత్రి పదకొండు దాటాక శశి మళ్ళీ బయలుదేరింది, "సుశీ జాగ్రత్తగా తలుపు తీయాలి."

"శశీ! నాకంటె పెద్దదానవు ఈ సంగతి పెద్దవాళ్ళకు తెలిస్తే...."

"నువ్వు చెప్పందే ఎవరికి తెలియదు. నీ సంగతి ఆలోచించు మసలుకో" హెచ్చరించినట్టే చెప్పి వెళ్ళిపోయింది. అదే సమయాన తను సాగించిన విషయం భర్తతో చెప్పింది దుర్గమ్మ.

"....ఎంత లేదన్నా అయిదారు లక్షల ఆస్తి రెండు కార్లున్నాయి ఇద్దరి పిల్లలకు ఇవ్వాల్సింది యిచ్చాడు అంతా రెడీ. అడిగే నాథుడు

లేదు. యెంతోమంది మళ్ళీ పెళ్ళిచేసుకోమని సలహా ఇచ్చినా వినిపించుకోలేదు. నేను యేదో బంధుత్వము పురస్కరించుకుని బ్రతిమాలితే విన్నాడు గానీ...."

"అంత గొప్పగా చెప్తున్నావు అతని వయసు యెంతుందే?"

"యెంతో యెక్కువ! మహా ఉంటే నలభై అయిదు ఉంటాయి. మేము చిన్న వాళ్ళముగా వుండగా పట్నం మామయ్య అంటే దేవుడొచ్చినట్టు సంబర పడిపోయేవారము. బుట్టలకొద్ది పళ్ళూ సంచిలనిండా పిప్పరమెంట్లు తెచ్చేవాడు. రఘు కూతురుఅంటే మామయ్య మరీ సంబరపడిపోయాడు."

"దుర్గా! భగవంతుడు నీకు పిల్లలనెలా యిచ్చాడో. నీచిన్నప్పుడంటావు నలభై అయిదేళ్ళంటావు. నీకే వయస్సు ముప్పయి అయితే అతనికి యాభై దాటి ఉంటాయి.

"దాటితే దాటాయి. దాని తల్లి, తండ్రి మీకు పెద్దరికము యిచ్చి గౌరవిస్తే ఇంకా దాన్ని పువ్వులలో పెట్టి పూజించేవారు. మీ పిల్లల బాగోగులు మీరు చూసుకోండి. దాని విషయము నాకు వదలండి. రక్త సంబంధం కల్పినవాడు. వినుగువచ్చి నప్పుడు నాల్గురోజులుండి రావచ్చు ఇంతోటి అమ్మాయి అయనకు దొరకదనేనా? మీకు చెప్పటం నాదే బుద్ధితక్కువ!" విసురుగా లైటు ఆర్పి పడుతుంది. భార్యా విధేయుడని అదిలోనే పేరుగాంచిన ఉమాపతి ఉస్సురని ఊరుకున్నాడు.

రోజులు గడుస్తున్నాయి. సుశీల వివాహము త్వరలో జరుగుతుందని అందరికీ చెప్పింది దుర్గ వరుని విశేషాలు వివరాలు మాత్రం చెప్పలేదు. కంసాలి అతనువచ్చి సుశీల నకుము కొలత గాజులకొలత తీసుకువెళ్ళాడు. ఓరోజు ఓకారులో యాభై చీరలు వచ్చాయి.

"ఒసేయి సుశీలా! వచ్చి నచ్చిన రంగులు యెంచుకోతల్లీ. రేపు నా మీద తప్పుమోపవద్దు." నెమ్మదిగానే పిలచింది. సుశీలకంతా అయోమయంగా ఉంది. వరుడెవరో, అతని మంచి చెడు ఏమీ తెలియదు. చీరలూ, నగలూ చూస్తే ఉన్నవారిలాగే కనిపిస్తున్నారు. ఆ రోజు వచ్చిన వారయితే కారుకదా? ఆమె ప్రశ్నకు వెంటనే జవాబు వచ్చింది.



"అమ్మా! ఆరోజు చూచి వెళ్ళినవారా" అని అడిగింది.

"వాళ్ళ ముఖం! వాళ్ళు తప్ప ప్రపంచంలో ధనవంతులే లేరా?.... అలా మొద్దులా నిలబడతావేమే? వచ్చి చూడు" ఈసారి ఉరిమినట్టు మాటాడింది.

"నెమ్మదిగా చెప్పరాదు? అదెప్పుడయినా దుస్తులు యెన్నిక చేసిందటే? నేను ఎన్నుకుంటాను."

"మొత్తం యెన్ని చీరలు?" కుతూహలంగా అడిగింది శశి.

"వది యెన్నుకో. యింకా యెక్కువ తీసినా అడిగేవారు లేరనుకో. కొత్తఫ్యాషన్లు వచ్చినప్పుడల్లా కొనవచ్చులే. త్వరగా తెమల్చండి. ఆ నారింజరంగు చీర నాకు నచ్చింది."

"అమ్మా, యింతకీ పెళ్ళికొడుకు గురించి చెప్పవేమే! ఏం పని చేస్తాడు?"

"పని చెయ్యవల్సిన ఖర్మ అతనికేంపట్టలేదు. నల్గురిచేత చేయించుకుంటాడు. మాటలు చాలుగాని త్వరగా తెముల్చు. నా కోరిక నెరవేరి నువ్వా అ యింటికోడలివి అయితే అడిగేదేముంది?" అన్నది సంబరంగా. తన పెళ్ళి సంగతి రాగానే గంభీరంగా మారిపోయి చీరలు చూడటం మొదలుపెట్టింది. సుసీల బుర్రనిండా ప్రశ్నలే! వాటికి సమాధానాలు యెవరు చెప్తారు? ఆమెకు ఒకే ఒక వ్యక్తి కనిపించాడు.

అందరూ నిద్రపోయాక దోసెపిండి రుబ్బింది. వంటింట్లో లైటు ఆర్పి బయటకొచ్చేసరికి శశి పిల్లిలా అడుగులేస్తూ వెళుతుంది. "శసీ" ఆశ్చర్యంగా చూచింది.

"ఉష్!" అంటూ ప్రక్కగదివైపు చూపింది. ఉమాపతి క్రింది గదిలో పడుకున్నాడు. అతని గదిలో లైటు వెలుగుతూంది. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి నెమ్మదిగా తలుపులు తీసుకుని వెళ్ళిపోయింది. ఇదిలా సాగితే యెలా? శశి గతి ఏమవుతుంది? యెలాగైనా ఆ విషయం పెద్దలకు తెలియజేయటం తన విధిగా భావించింది సుశీల. నెమ్మదిగా ఉమాపతి గదిలోకి వెళ్ళింది.

"మామయ్యా!"

"యెవరూ సుశీలా? ఏమ్మా?" లేచి కూర్చున్నాడు. తన పెళ్ళి వివరాలు అడుగటానికే వచ్చిందని తెలుసు. ఏం చెప్పాలా అని తికమక పడసాగేడు.

"మామయ్యా! ఒక్క విషయం మీతో చెప్తాను. మీరు నా పేరు బయట పెట్టకుండా పరిస్థితి చక్కబెట్టండి. చెప్పొద్దని ప్రయత్నించాను కాని ఒందు జీవితం నిలువునా కూలిపోతుంటే చూడలేక పోతున్నాను." ఆగింది ఊపిరి పీల్చుకోవటానికి.

"అసలు సంగతేమిటమ్మా! నీకేం భయంలేదు చెప్పు ఈ యింట్లో దేనికయినా భయపడే వాళ్ళమంటే మనిద్దరమే. మనము భయం విడిచి పెట్టాలి? లేకుంటే బ్రతుకలేం" భయపడుతూ మెల్లని స్వరాన శశి విషయం చెప్పింది "ఇప్పుడు వెళ్ళింది మామయ్యా. అతనెవరో వీధి చివర వుంటాడు. స్కూటరుంది! ఈ విషయము బయట పెడితే చంపేస్తానంది."

"యెంతకు తెగించారు! మొదటిరోజే చెప్పాల్సింది సుసీ! వాళ్ళను అని లాభం లేదమ్మా లోపము నాలోనే వుంది." రెండుచేతులతో నెత్తి పట్టుకున్నాడు ఉమాపతి? "మామయ్యా?"

"సుసీ! నువ్వేమడుగుతావో నాకు తెలుసమ్మా! ఆ విషయములో



నాక కూడా ఏం తెలియదు. వరుడు రెండో సంబంధం పెళ్ళి కుమారుడని తెలుసు వెళ్ళు" అన్నాడు బొంగురు గొంతుకతో.

"శశితో నేను చెప్పినట్లు చెప్పొద్దు మామయ్యా" దీనంగా చూచింది. ఉమాపతి ఆ పిల్ల చేతిని నిమిరి "అలాగేతల్లీ వెళ్ళిపడుకో!" కూతుర్ని యెలా మందలించాలా అని ఆలోచించసాగేడు. పరిస్థితులు తలుచుకుంటే సంసారంమీదే విరక్తి కలుగసాగినది.

దొర్లి దొర్లి యెప్పుడో నిద్రపోయాడు. బయట గుస గుసలు అతన్ని మేలుకొలిపాయి లైటువెయ్యకనే తలుపు వద్దకు వచ్చి ఆగాడు, హాల్లో మసకంగా వెలిగే లైటుకాంతిలో నలిగిన రోజాపుష్పంలా వుంది శశి. చేతికున్న రేడియం వాచి చూసాడు. మూడున్నర చూపుతుంది. అతని హృదయం మండిపోయింది. "యెవరదీ?" అని బయటకు వచ్చాడు. రెండు నిమిషాలు తెల్లబోయింది శశి. వెంటనే జవాబు చెప్పింది. "నేను నాన్నా! పరీక్షలు దగ్గరకొస్తున్నాయి కదూ! చదువుదామని లేచాను. ఇంకా గంట నాలుగు కాలేదు! "వస్తా!" త్వరగా మేడమీదికి వెళ్ళిపోయింది.

ఇమామ్ ఇంటికి వెళ్ళడానికి అనుమతి అడిగాడు. ఉమాపతి అతన్ని పిలిచి తన క్యాంప్ కాట్ వరండాలో వెయ్యమన్నాడు. ఇమామ్ రెండు నిమిషాల్లో ఆ పని పూర్తిజేశాడు.

"యెవరన్నా వ్యాపారానికి సంబంధించిన వారొస్తున్నారా?" బయటి ఊళ్ళో వుండి వచ్చినవారికి వరండాలో పక్క ఏర్పాటు చెయ్యటం పరిపాటి ఆ యింట్లో.

"ఏమిటి! అతిధులా లేరు. శివరాత్రి దాటక మునుపే ఉక్క మొదలయింది. బయట పడుకుందామని గదిలో నిద్రరావటం లేదు."

"డాడీ" శశి పిలిచింది. ఆ యింట్లో పిల్లలను "డాడీ" అని పిలవమని తల్లి బలవంతం చేసింది! పిల్లలు తండ్రిని లోబర్చుకోవలసినప్పుడు మాత్రమే డడీ అని ముద్దుగా పిలుస్తారు.

"మీరు బయటి వరండాలో పడుకుంటారా? లారీలు,కార్లు.... ఒకక్షణ మేడ పైన పడుకోండి.

"ఫరవాలేదమ్మా! వయసు మళ్ళుతూంది! పైకి, క్రిందికి తిరగటం చాతకావద్దూ." అతని పీకలదాకా వచ్చింది ఆవేశం. బలవంతాన అణచిపెట్టాడు.

రాత్రి పదకొండు దాటింది. ఆరోజే సుశీల వద్దాణం మోడల్ తయారయి వచ్చింది. ఆ విషయం భర్తతో చెబుదామని తను వరండాలోకివచ్చింది దుర్గమ్మ దుర్గమ్మ సంబరంగా చెప్పేకబుర్లు వినటంలేదు అతను వీధిలోకి చూస్తూ పడుకున్నాడు. వరండాలో దీపం లేనందున అతనుబయటివారికి కనిపించడు! ఓ స్కూటరు వచ్చింది వీధి చివర ఆగింది. ఓ యువకుడు దిగివచ్చి ఇంటికి కొంచెము దూరంలో ఆగి సన్నగా ఈలవేశాడు. కాసేపు నిల్చొని మళ్ళీ ఈలవేశాడు. వీధిలో ఆ చివరనుండి, ఈ చివరకు తిరిగాడు! అలా అరగంట కష్టపడ్డా. రావల్సినవారు బయటికి రాలేదు. ఈసారి అతను దుర్గమ్మ దృష్టిని ఆకర్షించాడు. "యెవరండీ రౌడీవెధవ మనింటిచుట్టూ పచార్లు చేస్తున్నాడేమిటి? లేచి అడగండి" అన్నది కాస్త బిగ్గరగానే. అతికికి ఏని అతను వెళ్ళి తన స్కూటర్ వద్ద కూర్చున్నాడు. ఆమె లేచి వెళ్ళి వీధిలోకి చూసింది. వీధి లైట్ వెలుగులో స్పష్టంగా కనిపిస్తున్నాడు అతను! "చూచారా! వాడెవడో మనింటి దిక్కే చూస్తున్నాడు!"

"చూస్తున్నాను" వెటకారం ధ్వనించింది అతని కంఠంలో!

"అంత నింపాదిగా అంటారేం? వెళ్ళి నిలదీసి అడగండి.... అప్పుడు అర్థం అవుతుంది! దానికి షోకులు యెక్కువ అవుతున్నాయి. అందరం పైన పడుకుంటామా? దాని యిష్టారాజ్యంగా ఉంది! దాన్ని పిలిచి నాలుగు అంటిస్తే నిజం చెప్తుంది" ఆమె ఆవేశంగా లేచింది.



"కనకం ఇంట్లో ఆ పిల్ల ఒక్కర్తే లేదుకదా! మన పిల్లలూ ఉన్నారు...."

"మన పిల్లలనే అనుమానించే స్థితికి వచ్చారా! నిజంగా అది మీకు మందో మాకో పెట్టింది. కనకదుర్గమ్మ కడుపున పుట్టిన బిడ్డలకు కశజాతి బుద్ధులు వస్తాయా?"

"ఇది యిల్లుకాదు వీధి! కాస్త నెమ్మదిగా మాట్లాడు, ఎవరయింది తెలుస్తుందిలే" ఆమె ఆలోచనలో పడింది. మౌనంగా అరగంటగడిచింది. లోపలి నుండి మాటలు, సన్నగా ఏడ్పు వినిపించాయి. వినమన్నట్లు సైగ చేశాడు భార్యకు..... "చెప్పు నువ్వు నాన్నకేం చెప్పావు?....మాట్లాడవేం"

"శశీ! నువ్వు నాకంటే పెద్దదానవు కొట్టినా గిల్లినా బాధ లేదు. నన్ను అపార్థం చేసుకుంటున్నావు."

"అబ్బో! దొంగ కబుర్లు. అందుకే నీలాంటి దానిపై జాలి చూపవద్దంటుంది అమ్మ. నిన్ను నమ్మడం నాది బుద్ధి తక్కువ. శంకర్ ఏమనుకున్నాడో" బాధగా వుంది శశి గొంతు.

"అంత దొంగచాటు వ్యవహారం దేనికి? నాన్నతో చెప్పి వివాహం చేసుకుంటే...." సుశీలదే కావచ్చు. చెంప చెళ్ళు మన్నది "డర్టీ క్రీచర్! నాకు నీతులు చెబుతుందట. అమ్మతో చెప్పి తాట వలిపించేస్తానుండు." మేడ మెట్లు ఎక్కిన చప్పుడు వినిపించినది. ప్రేమ గుడ్డిది అంటారు. ప్రేమ కాదు. కామము గుడ్డిది. ఆ గుడ్డితనంలో ఎటు పయనిస్తుందో తెలుసుకోలేరు మనుషులు.

"మన శశా! అది ఇంతకు తెగించినదా? ఏమండి మిమ్మల్నే!" భర్తను కుదుపసాగింది దుర్గమ్మ!

"మన శశే. చాలా నాళ్ళనుండి జరుగుతుందీ తతంగం. నోరు విప్పితే నీతో చిక్కు."

"బాగుంది. అన్నింటికి నన్నే అంటారేమిటి? అర్ధరాత్రి వరకు తిరిగి వస్తే ఈ దరిద్రపుది తలుపు తీసిందా? మొదట దీని అంతు తేల్చు స్వామి" ఆవేశంగా లేచింది.

"నువ్విలా ఒకరి తప్పు ఒకరి మీద రుద్దే యింతవరకు తెచ్చావు పరిస్థితులు. సుశీల ఈ ఇంట్లో పవిమనిషి. ఎవరేం చెప్పినా చెయ్యాల్సిందే నేను వరండాలో పడుకున్నానని నీ కూతురు కొట్టింది? కూతురు బయట తిరుగుతుందని నువ్వు కొట్టు! మధ్య ఆ పిల్ల చచ్చిపోతుంది."

"అయితే శశినే అడుగుతాను నాకీ చాటు, మాటు వ్యవహారాలు నాన్నుడు వేషాలు గిట్టవు." ఎక్కడలేని శక్తిని కూడదీసుకొని రెండేసి మెట్లు ఎక్కుతూ పైకి వెళ్ళింది. తలుపులు వేసి వెనుకాలే ఉమాపతి వెళ్ళాడు. దుర్గమ్మ కూతురిపైనుండి దుప్పటి తొలగించి, చెయ్యి పట్టి లాగింది. ఒక్క ఉదుటున లేచి కూర్చుంది శశి ఆ చెంపా, ఈ చెంపా వాయించింది. "ఏమే! ఎవడే వాడు చెప్పవే? నా కడుపున చెడబుట్టావేమే! పాపిష్టిదానా! చెప్పు ఎవడు వాడు? ఎన్నాళ్ళనుండి సాగుతుంది భాగవతం" హూంకరించింది.

"ఎవరమ్మా? నువ్వేం మాట్లాడుతున్నావు?" చెంపలు తడుము కుంటూ అమాయకత నటించబోయింది శశి. ఎవరి నెత్తినో రుద్దుదామని చూచిన తప్పు తన కూతురివంకే వుండి, తన గౌరవాన్ని సవాలు చేయటం సహించలేకపోయింది దుర్గమ్మ. జుట్టు పట్టుకు వంచి వీపుమీద నాలుగు గుద్దులు గుద్దింది. "ఎంత సంగనాచివే. చెప్పు అతనెవరే?" అపర కాళిలా విల్చింది. చదువుకున్నవారు. సంస్కారవంతులు అని మిమ్మల్ని స్వేచ్ఛగా తిరుగ నిచ్చాము అందుకు ఇదా ఫలితం? శశీ, అంతా నాకు తెలుసు అతనెవరో చెప్పు. కాళ్ళు పట్టుకుని కన్యాదానం చేస్తాము" ఉమాపతి అడిగాడు. శశి దాచి ప్రయోజనం లేదనుకుంది. కన్నీరు వత్తుకుని తన ప్రియుని వివరాలు చెప్పింది. "అన్నయ్య స్నేహితుడు. అతని పేరు శంకర్. ద్రాక్షతోట



ఉన్నాయి రెండు సంవత్సరాలు ఆగితే తనే వచ్చి మిమ్మల్ని అడిగి వివాహం చేసుకుంటానన్నాడు. అంతవరకూ మా స్నేహం బయట పెట్ట వద్దన్నాడు. చాలా ధనవంతుడు." అన్నది.

"రోజూ నువ్వు వెళ్ళేది అతని తోటకేనా?"

"అవును" అన్నది కళ్ళు దించుకుని. దుర్గమ్మ మళ్ళీ చెయ్యి యెత్తింది. ఉమాపతి అడ్డుకున్నాడు.

"అర్ధరాత్రి గొడవ దేనికి? రేపు ఆలోచించి అతన్ని కలుసు కుందాము. శశీ! వివాహము అయ్యేవరకు అతన్ని కలుసుకోవడానికి వీలు లేదు. అతను ఒప్పుకుంటే అక్కయ్యది కాకపోయినా నీ పెళ్ళి చేస్తాము. నేను చెప్పిన విషయం గుర్తుంచుకో," అజ్ఞాపించి భార్యను తీసుకుని బయ టికి వచ్చేశాడు దుర్గమ్మ ఏమో మాట్లాడబోయింది. "నీ అంతర్యం తెలుసు దుర్గా. అలా పిల్లలను నెత్తిన ఎత్తుకునే కొంపకు నిప్పు పెట్టడానికి సిద్ధం చేశావు. ఇప్పటికయినా కళ్ళు తెరువు." విసుదుగా చెప్పి తన గదిలోకి వెళ్ళాడు. దుర్గమ్మ మాట్లాడలేక, అక్కడే గోడకు జేరబడి కూర్చుంది.

ఉదయం ఫలహారం కాగానే వెంకట్ దుస్తులేసుకొని బయటికి వెళ్ళడానికి సిద్ధం అయ్యాడు. "వెంకన్నా, నాన్న పిలుస్తున్నారు." ప్రేమ వార్త మోసుకు వచ్చింది, వెంకట్ గుండెలు టక టక కొట్టుకోసాగాయి. నిన్న బ్యాంకిలో కట్టమన్న డబ్బు తను పేకాటలో పోగొట్టుకున్నాడు. ఈ రోజు పదిలో మొదలుపెట్టి పందలు గెలవాలని వుంది, బ్యాంక్ వాళ్ళిచ్చిన రశీదు అడుగడు కదా! అమ్మ క్రిందనే వుంటే బాగుండును అనుకుంటూ దిగాడు మేడ. భయపడుతూ తండ్రి గదిలో అడుగు పెట్టాడు "రా వెంకట్ కూర్చో" ప్రేమగా పిలిచాడు తండ్రి. కొడుకు హొంగి పోయాడు. వినయముగా తండ్రి కెదురుగా కూర్చున్నాడు! "వెంకట్

శంకర్ అని నీకు స్నేహితుడున్నాడా? అతనే కులస్తుడు? అతని పూర్తి వివరాలు కావాలి." వెంకట్ తనేం చెపుతున్నాడో మరిచిపోయి అంతా పూసగుచ్చినట్లు చెప్పేశాడు: "అతని కులం ఏమిటో తెలియదు నాన్నా. ద్రాక్షతోట యజమాని మురారిలాల్ వద్ద గుమస్తాగా వుంటున్నాడు: పేకాటలో అందె వేసిన చెయ్యి. వాడు రంగములో వున్నాడంటే అందరి జేబులూ ఖాళీ. చదివింది థర్డుఫారమే అయినా, ఇంగ్లీషు థలేగా మాట్లాడుతాడు ఎమ్.ఏ. లిటరేచరు వాళ్ళు చిత్తు కావల్సిందే."

"నీకు అతనితో పరిచయమెలా అయిందిరా?" ఈసారి ప్రశ్న కటువుగా వుంది.

"నాకా? నాకు అతను మామూలుగానే పరిచయమయ్యాడు. అంటే ఐ మీన్ ద్రాక్ష తోటలు చూచి అనుభవం సంపాదించాలని అప్పుడప్పుడు వెళతాను కదా: మన గూడెం పొలంలో మనమూ వేద్దాము. సంవత్సరానికి లక్షలు సంపాదించవచ్చు."

"సరే: నువ్వు వెళ్ళు" బ్రతుకు జీవుడా అని బయట పడ్డాడు వెంకట్: ఉమాపతి డ్రైవర్‌ని వద్దని తనే స్వయంగా కారు నడుపుతూ ద్రాక్ష తోటల వద్దకు వెళ్ళాడు. శంకర్ గురించి వాకబు చేశాడు. అక్కడ కావలి తాత వచ్చాడు. "అతని చంటిపిల్లకు జ్వరంగా వుందని కబురు వస్తే రాత్రి వెళ్ళిపోయాడు బాబూ: సాయంత్రం వరకూ రాకపోవచ్చు." ఉమాపతి బుర్ర తిరిగిపోయినది. "అతనికి పెళ్ళి అయిందా?" నూతిలోంచి మాట్లాడినట్టుంది.

"అదేమిటి బాబుగారూ? ముగ్గురు పిల్లలు కూడాను. ఇతనే చిల్లర తిరుగుడు తిరుగుతాడు. ఆ యమ్మ మంచిది." అతని వద్ద శంకర్ అడ్రసు తీసుకొని నీరసంగా కారులో కూలబడ్డాడు. ఆ చిన్న పల్లెలో శంకర్ అడ్రస్ తెలుసుకోవడం ఏమంత కష్టం కాలేదు. ఒక పెంకుటిల్లు ముందుకారాగినది. వెళ్ళి తలుపు తట్టాడు. ఓ ఇరవై సంవత్సరాల యువతి తలుపు తీసింది.



"యెవరు కావాలండి?" ప్రక్కకు తొలగి అడిగినది.

"శంకర్ ఉన్నాడా అమ్మా?" మాలి చెప్పినది నిజమే యింట్లో పిల్లలు ఆడుకుంటున్నారు.

"ఇప్పుడే వెళ్ళిపోయారండి. మీరెవరు రండి కూర్చోండి." వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. ఇల్లు శుభ్రంగా ఉన్నా లేమి తనాన్ని దాచలేకపోతోంది. "మా అబ్బాయి. శంకర్ స్నేహితులమ్మా"

"మీ అబ్బాయి వద్ద డబ్బేమయినా తెచ్చారండి? దొరక్క దొరక్క వీరి స్నేహమే దొరికిందా?"

"డబ్బు తేలేదమ్మా. మాకు తెలిసిన అమ్మాయిని వివాహము చేసుకుంటానని చెప్పారట. నేను వాకబు చేస్తే అతనికి వివాహమయినట్లు తెల్పిందమ్మా. నిజం తెనుక్కు పోదామని వచ్చాను" తన కూతురేనని చెప్పుకోడానికి నామోషి అనిపించింది ఉమాపతికి.

"అయ్యో: యెంతకు తెగించారు: ఒక పేకాట అప్పులు చేయటమే ననుకున్నాను. అమ్మాయిలను మోసం చెయ్యటం కూడా నేర్చారా? అయిదు సంవత్సరాల క్రితం వారి అందానికి అబద్దాలకు మోసపోయాను బాబుగారూ? ఇదిగో ముగ్గురు పిల్లలు. వారిని చంపలేక రాత్రి బడిలో పనిచేస్తున్నాను. చిన్న చిన్నమ్మాయి ప్రాణంమీదకి వచ్చిందని చెప్పి పంపితే వచ్చారు. ఇరవై రూపాయలు నాకిచ్చి వెళ్ళిపోయారు. ఆమెకంటి నుండి నీరు జలా జలా రాలింది. మనిషి కష్టాలు పరాకాష్ఠని అందుకుంటేనే పరాయివారిముందు వెల్లడి చేస్తారు: ఆమెను చూడగానే ఎంత దీన స్థితిలో ఉందో తెలుసుకున్నాడు "ధైర్యంగా నీపిల్లలను పెంచుకో తల్లీ" చెయ్యి జేబులో పెట్టి ఓ విజిటింగ్ కార్డు తీసి దానిమీద నాలుపంక్తులు రాసి ఆమెకిచ్చాడు. "ఇది డాక్టరుకు చూపించు పాపకు మందులు యిస్తాడు. డబ్బు విషయం బెంగ పెట్టుకోకు. అతను తీసుకో... వస్తానమ్మా?"

"కొంచెము నిమ్మరసం ఇస్తానుండండి బాబుగారూ" లోపలికి పోబోయింది.

"వద్దమ్మా ఇంకోసారి వస్తానుగా" త్వరగా బయటికి వచ్చి కార్లో కూర్చుని స్టార్టు చేశాడు.

ఉమాపతి చెప్పిన విషయాలు విని కనకదుర్గమ్మ నెత్తి బాదుకుంది. కాసేపటి మాటలేక కూర్చుండి పోయినది. "ఇకనైనా బుద్ధితెచ్చుకో [illegible] తొందరగా మేలుకున్నాము. యింకా కొన్నాళ్ళయితే ఎన్ని అఘాయిత్యాలు జరిగేవో. జాగ్రత్తగా చదువు" తండ్రిగా హితవు చెప్పాడు.

"ఇంత తెగించిన మొగవాళ్ళుంటారండి. అవ్వ? ముగ్గురు పిల్లలను కట్టుకుని పెళ్ళికాలేదని బొంకుతాడా? పోలీసులకు పట్టిస్తేరోగం కుదురుతుంది."

"యెవరిదే? మనదికుదురుతుంది. చెప్పేవాడు యెన్నో చెప్తాడు. [illegible] వినడానికి. నమ్మే అదవారి తెలివితేటలు ఏమయినాయి? ఇంగ్లీషు సినిమాలు చూచి హీరోయిన్లలాగే చేస్తామంటే యెలా? వారి సంస్కృతి వేరు. ఒకమ్మాయికి యెంతమంది మొగస్నేహితులుంటే అంత గొప్ప. ఒకరితో తిరిగి యింకొకడిని పెళ్ళి చేసుకున్నా వారిని యెవరు ఏమి అనరు. వారి సాంఘిక మర్యాదలు వేరు మనవి వేరు. ఇకగుటు [illegible] కాకుండా మసలుకోండి. ఈయేడు ప్రసన్నది. వచ్చేయేడు దీనిదీ చేస్తాను పెళ్ళి. ప్రయత్నిస్తాను యెక్కడయినా వరుడు కుదిరితే ఇద్దరికి ఒకేసారి చేస్తాను."

"ప్రసన్నకి చూడండి వాలు. ఇప్పుడు సుశీలనిచ్చే అతని కొడుకు యేదో పెద్ద చదువుతున్నాడట. నేను చెప్తే అతను కాదనడు. ఈవిడ యింట్లోనే యిద్దాము" భార్యవంక ఒక్కసారి చూచి గదిలోంచి వెళ్ళిపోయాడు ఉమాపతి.

# 3

సుశీల వివాహము వరుని ఇంట్లో చేసేటట్లు నిశ్చయించారు. శుభలేఖలు అచ్చు వేయించలేదు. అనసూయమ్మ వరుని వివరాలు తెలుసుకోడానికి యెంత ప్రయత్నించినా మాటలు దాటవేసింది. నేరుగా అడిగితే, దుర్గమ్మ కోపానికి అంతులేదు. "యెవరో ఒకరు. ఈ వీధిలో వారికేం పోయేకాలమో, మంది విషయాలే కావాలి. ఇలాంటి వీధిలనే పెళ్ళి కూడా యిక్కడ చెయ్యటంలేదు. యెవరిహద్దుల్లో వారుండాలి" అభిమానముగల వారికామాటలు చాలవా? అనసూయమ్మ చివాలున లేచి వెళ్ళిపోయింది. చేరవల్సిన సామాన్లు కారులో వరుని ఇల్లు చేర్చారు. ఇక వాళ్ళు పెట్టె బయలు దేరటమే తరువాయి. ఉమాపతి తన పెట్టె, బేడా సర్దుకోవటం మొదలు పెట్టాడు.

"యెక్కడికండి? పెళ్ళి రెండురోజులే ఉంది" ఆశ్చర్యంగా ప్రశ్నించింది దుర్గమ్మ.

"సుశీల పెళ్ళి విషయంలో కలుగ జేసుకోనని మాటిచ్చానుగాని పెళ్ళికుంటానని అనలేదుగా. ఆదిలాబాద్‌లో కలప చవకగా వస్తుందట. వెళ్తున్నాను." ఆమె వైపు చూడకనే జవాబు చెప్పాడు.

"యెవరిని సాధించాలని? ఇక్కడ కన్యాదానం యెవరు చేస్తారు?" కోపంతో [illegible] మండిపడింది. "మనము కన్యాదానం చేస్తే జరిగేదేమిలేదు వైదిక్ పద్ధతిని పెళ్ళిచెయ్యి." అతను కాదు కూడా వద్దని రిజిష్టరు [illegible] "మరే? ఈ సంబడమేమిటో? అయ్యగారు లేకుంటే పెళ్ళి అగుతుందట? ఆ పట్టుదల ఏమిటో నేను చూస్తాను" తల యెగరేసుకుంటూ వెళ్ళిపోయింది.

"సుశీ! వెళ్ళొస్తాను." ఉమాపతి అలా యెందుకు వెళ్ళిపోతున్నాడో అర్థం కాలేదు. వచ్చి అతని పాదాలకు నమస్కరించింది. "యెందుకమ్మా ఇంకా ఈ గౌరవం? భగవంతుడు తప్ప నీకు బంధువులు లేరు తల్లీ. అతడే నిన్ను రక్షించాలి" త్వరగా వెళ్ళి రిక్షాలో కూర్చున్నాడు. రిక్షా కదిలింది అతను కళ్ళు తుడుచుకోవటం కనిపించింది.

మొదటి ట్రిప్పులో ఆడపిల్లలు ఇమామ్ వెళ్ళారు. కార్లో రెండవ సారి దుర్గమ్మ. సుశీల వెంకట్, వేణు బయలు దేరినారు. బయలుదేరే ముందు ధైర్యంచేసి అనసూయమ్మకు చెప్పి రావటానికి వెళ్ళింది. "అక్కడ సమయము మించిపోతుంది. ఆరుగంటలకు పెళ్ళికూతుర్ని చెయ్యాలి." దుర్గమ్మ అరుస్తున్నా లెక్క చెయ్యలేదు.

"పిన్నీ" ఆమె హృదయంలో తల దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. అనసూయ కూడా కన్నీరు కార్చింది.

"సుశీ! నాకంతా అయోమయంగా ఉందమ్మా. మీ బాబాయి కూడా సమయానికి లేరు."

"అన్నింటికి సిద్ధమయ్యే వెళుతున్నాను పిన్నీ. ఇంతకంటే నరకం మరెక్కడా ఉండదులే."

"పరిస్థితులు అనుకూలంగా లేకపోతే యేదయినా అఘాయిత్యము చేసేవు! ఈ దేశంలో ఆడదిగా పుట్టటమే ఓ శాపం. అందునా తల్లి,తండ్రిని కోల్పోవటం అంత దారుణం మరోటిలేదు తల్లీ. ధైర్యంగా ఉండు" కన్నీరు వత్తి పీటమీద కూర్చో పెట్టి. సిల్కు చీర. రవికలగుడ్డ చేతిలో పెట్టింది. వంగి అనసూయకు నమస్కరించినది. "కలకాలం పిల్లాపాపలతో సుఖంగా ఉండు" లేవనెత్తి హృదయానికి హత్తుకుని పసిపిల్లలా విలపించింది. బయట కారు హార్న్ వినిపించినది. "పద" ఇద్దరూ బయటికి



వచ్చారు. విచ్చిన గులాబి తుంచి సుశీల తలలో పెట్టి కారువరకు వచ్చి సాగనంపినది. దుర్గమ్మ మూతి తిప్పుకుంది. "పోనియ్యరా వెంకట్" అన్నది. "అమ్మా! సుశీ! ఏ అఘాయిత్యం చెయ్యకు" కారు కదిలింది. "దానికేం పొయ్యేకాలం? పెళ్ళి చేసుకోడానికి వెళ్తుంటే అఘాయిత్యము చెయ్యకు" అంటుంది. ఓర్వలేనితనం, ఏళ్ళు రాగానే సరా?" కారు ఇల్లు చేరేవరకు సణుగుతూనే ఉంది.

వరుని గృహము పెద్దమేడ. మేడముందు రకరకాల మొక్కలు, పనివాళ్ళు తప్ప యితరులు యెవరూ కనిపించలేదు. ప్రసన్న, శశి, ప్రేమ యింటిని, యింటిలోని వస్తువులనూ చూస్తూ సంబరముగా తిరుగుతున్నారు. సుశీల శూన్యమయిన హృదయముతో తన సామాన్లు పెట్టిన గదిలో కూర్చున్నది. ఆరుగంటలకు బ్రాహ్మడు వచ్చాడు. సుశీలకు తలంటి పోసి కొత్తబట్టలు కట్టబెట్టింది దుర్గమ్మ. బ్రాహ్మడు మంత్రాలు చదువుతూ అక్షింతలు వేశాడు. కల్యాణతిలకం దిద్ది, నగలు పెట్టింది ప్రసన్న. "దుర్గమ్మగారూ! మళ్ళీ రేపు వచ్చేపని లేదుగా? యెల్లుండి ఆరుగంటలకు అందరూ సిద్ధంగా ఉండండి. చలపతిగారితో కూడా చెప్పాను"

"చూడండి సిద్ధాంతిగారూ! ఓ క్రొత్తబెడద వచ్చిపడినది మావారు తొందర పనిమీద ఊరువెళ్ళారు. వివాహము వైదీకుల పద్ధతిలో చేద్దాము" సిద్ధాంతిగారు క్షణం ఆలోచించాడు. "యెందుకమ్మా! లేనిపోని గొడవ! మాకు తెలిసిన దంపతులున్నారు. ఇద్దరికీ బట్టలు పెడితే చాలు కన్యాదానం చేస్తారు. పిలుద్దాము" గొంతు తగ్గించాడు. "మీ కూతురా ఏమన్నానా! యెవరో దిక్కులేని పిల్లాయే ఏమంటారు?" వెకిలిగా నవ్వాడు.

"ఏమంటాను? చాలా మంచిపని. రేపెళ్ళి బట్టలు తెస్తాను" సిద్ధాంతి గారు వెళ్ళిపోయారు. రాత్రి పిండివంటలతో భోజనం ముగిసింది. అందరు

పడుకుని నిద్రపోయాడు. అలవాటుప్రకారం నాల్గింటికే మెలుకువ వచ్చింది సుశీలకు. పనేమీలేక చీకటిని చూస్తూ కూర్చుంది. హాల్లో అలికిడి వినిపించగానే దుర్గమ్మ లేచి బయటికి వెళ్ళింది. సుశీల లేచి గుమ్మములో వచ్చి నిలబడింది. బేసిన్‌వద్ద పళ్ళు తీసి (కట్టుడివి) ముఖం కడుక్కుంటున్నప్పుడు కనిపించాడు. ఆ ప్రక్కనే పళ్ళు తోముతూ దుర్గమ్మ నిలబడింది. ఇద్దరూ దంతధావనము చాలించి వచ్చి హాల్లో మధ్య ఉన్న సోఫాలో కూర్చున్నారు. అతను పళ్ళగడ్డ యెక్కించుకున్నాడు. పనిమనిషి కాఫీ తెచ్చినది. ఇద్దరికి ఇచ్చింది. "ఏమిటోనే దుర్గా! నాకు పెళ్ళి పెళ్ళాంఅంటే పెద్ద ఇష్టంలేదు. మెడలు విరిచి ఒప్పించావు. ఈ విషయం పిల్లలకు రాగాను కోపం వచ్చినట్లుంది. ఈ వయసులో నాకేం సంబరం? ఈ పని వాళ్ళ చేతికూడు తిని జిహ్వ చచ్చిపోయింది."

"మీదేమంత పెద్ద వయసు? మీకంటే పెద్దవాళ్ళు పెళ్ళాడిహాయిగా సంసారాలు చేస్తున్నారు. వంటా, పనివచ్చిన పిల్ల హాయిగా తిని తిరగండి. ఒక్కమాట మామయ్యా!"

"నా దగ్గర సందేహమేముంటే? చెప్పు" అన్నాడు రంగువేసిన మీసాలు దువ్వుతూ.

"ఎంత పెంచినా పరాయిపిల్ల గదా! రేపు మీ పిల్లలు యెదురు తిరిగితే దానిగతి? నన్ను తిట్టుకుంటుంది. దానిపేర ఇంతో అంతో రాస్తే" నసిగింది అతను చిన్నగా నవ్వాడు.

"గట్టిదానవులే! మొదటే చెప్పాను కదా! ఈ మేడ, కారు, గోమారం వద్ద పొలం, మీ పిల్లలే. దానికి పిల్లలు పుడితే బ్యాంక్‌లో ఉన్న నగదు తనదే" సుశీల తల తిరిగిపోయింది. తాత వయస్సులో ఉన్న అతను ...రా? భగవాన్ ఏమిటీ పరీక్ష. నామీద దయలేదా తండ్రీ? ఏడుస్తూ పక్కపై పడింది. అరుగంటలకు లేపడానికి వచ్చింది దుర్గమ్మ.

"అత్తయ్యా! ఈ పెళ్ళి నాకొద్దు" ఆమె రెండుకాళ్ళు పట్టుకుని బావురుమంది సుశీల.

"ఏం దొబ్బుడాయే. లక్షాధికారిణివి చేస్తుంటే తిరస్కారమా? పెళ్ళొద్దు అక్కా అంటావు."

"నాకు లక్షలు వద్దు, బంగారం వద్దు. నన్నిట్లాగే ఉండనియ్యండి అత్తయ్యా. ఆ అరవై ఏళ్ళ ముసలాయనతో నేను ఏం సుఖపడతాను?" దుర్గమ్మ పాదాలు కన్నీటితో తడిసిపోయాయి.

"ఏదీవద్దు, మరిట్లాగే ఉంటే జీవితాంతము నిన్ను మేపేదెవరే? నేనుంటే దయతలిచి పెట్టాను."

"అక్కడే వంటపని చేస్తూ, నీ యింట్లోనే పడిఉంటాన త్తయ్యా. నీకెలా మనసు ఒప్పుతుంది! ప్రసు వదినను, శశిని యిలా యివ్వగలవా? నా గొంతు కొయ్యకు అత్తయ్యా!"

"ఏమిటే నీ తల పిరుసు. హాయిగా పెద్దయింటి యిల్లాలువు చేస్తుంటే గొంతు కోశానంటావా! నా పిల్లలకు, నీకు సాపత్యమేమిటే? వంటచేసి బ్రతుకుతుందట వంట. అదెట్లాగు రాసిపెట్టి ఉందిలే! ఆ ముసలాయన గుటుక్కుమనగానే నా యింటికే వచ్చి వంటచేద్దువు! సరదాగా ఉందట వంట చెయ్యాలని. పాడుబుద్ధులు, పాడు మనుషులు!" దుర్గమ్మ వాక్ ప్రవాహానికి ప్రసన్న అడ్డువచ్చింది. "అమ్మా బేసిన్ దగ్గర శశి కళ్ళు తిరిగి పడిపోయిందే!" దుర్గమ్మ అటు వెళ్ళింది. ప్రసన్న సహాయంతో ఆమెను మంచంమీదికి చేర్చింది. "అయ్యో! వెళ్ళవే! చలపతి తాతయ్యతో చెప్పు. డాక్టరును పిలిపించమనవే" దుర్గమ్మ అరుపులు విని చలపతే అటు వచ్చాడు.

కంగారుపడకే దుర్గా. నేను గుడికి వెళ్తున్నాను, డాక్టరును పంపుతాను. ఈ కాలపు పిల్లలు నాల్గు మెతుకులు తినలేరు నాజూకు. రెండు చుట్లు యింట్లో తిరిగేసరికి పడిపోతారు."

అతను వెళ్ళిపోయాడు. శశి కళ్ళు విప్పి అయోమయంగా చూసింది. "ఏమయిందమ్మా?

"పడిపోయావు తల్లీ. భయం లేదు. డాక్టరు వస్తాడ్లే" అదిరిపడి లేచింది శశి. "డాక్టరెందుకు?"

"ఎందుకంటావేమిటే! ఈ పెళ్ళిగొడవలో పడి సన్ను చూసుకోనేలేదు. ఎంత చిక్కిపోయావు."

"ఇంతదానికి డాక్టరెందుకమ్మా?" తల దిండులో దూర్చి కుమిలి కుమిలి ఏడవసాగింది శశి.

వాళ్ళ మాటల్లోనే డాక్టరు వచ్చాడు. కుర్చీ మంచం దగ్గరకు జరిపింది ప్రసన్న. అతను పరీక్షించబోతే, వెనుకాడింది శశి. "ఒట్టి వీక్‌నెస్ డాక్టర్? ఏమీలేదు" అన్నది.

"మీ చదువుకున్న వారితో ఇదే గొడవ. మాకంటే ముందే డయాగ్నస్ చేస్తారు. మరేం ఫరవాలేదు చూడనియ్యి." అతను పరీక్షలు చేశాడు. రెండు దాటినట్టుంది. అవునా? యింత మంచివార్త పెట్టుకొని అలా ముఖం మాడ్చినావేమిటి? అం .... ఏం లేదమ్మా! మొదటి గర్భం కాబట్టి బలహీనతగా ఫీలవుతుంది. ఈ మందులు తెప్పించండి" కాగితం మీద ఏదో రాశాడు. ప్రసన్న కిచ్చాడు. యాంత్రికంగా అందుకుంది. దుర్గమ్మ తలపై పిడుగు పడింది. డాక్టరు వెళ్తానని చెప్పినా పలుకలేదు. శశి దిక్కులు అదిరిపడేటట్టు ఏడుస్తుంది. "ఏమిటమ్మా ఇదంతా?" ప్రసన్న అర్థంకాక అడిగింది.

"మిమ్మల్ని గారాబం చేసినందుకు ఫలితమే. ఇప్పుడేం చేద్దాము? యెంత పని చేశావే శశీ నేనేం చేతు దేవుడో?" సన్నగా రాగాలు మొదలు పెట్టింది.

"బంగారు దేవతమ్మా! అతనెవరో కనుక్కో...."



"అంతా అయిందే! ఓ అష్ట దరిద్రుడు యిప్పటికే ముగ్గురు పిల్లలున్నారు." గదిలో నిశ్శబ్దం నాట్యం చేయసాగింది, గంటసేపు ఆలోచించినది "ప్రసూ! నేను దీన్ని తీసుకుని మనలేడీ డాక్టరు దగ్గరకు పోతాను. సుశీలను పెళ్ళికూతుర్ని చేయి ఎవరికి అనుమానము రానీయకు. ఏనాడు చేసిన పాపమో , ఇలా వెంటాడుతున్నది" కళ్ళు ఒత్తుకుని కూతుర్ని తీసుకుని వెళ్ళిపోయింది దుర్గమ్మ.

సూర్యుడు నడినెత్తిమీదకు వచ్చాడు. ఎండ నిప్పులు చెరుగుతోంది కూతురుని వెంటబెట్టుకుని, పీక్కుపోయిన ముఖంతో వచ్చింది దుర్గమ్మ. చిన్న పిల్లలు భోజనాలు చేసి పడుకున్నారు. వెంకట్ చలపతితో భోజనం చేసి, కాలక్షేపానికి పేకాడుతూ కూర్చున్నాడు. ప్రసన్న, సుశీల యిద్దరూ భోజనాలు చెయ్యక కూర్చున్నారు.

"ఏమయిందమ్మా?" తల్లి వెనకాలే గదిలోకి వెళ్ళి అడిగింది ప్రసన్న. పెద్ద కూతుర్ని కౌగలించుకుని భోరుమందామె. "ప్రాణాలు రక్షిస్తాంగాని తీస్తామా? గట్టిగా మాట్లాడితే పోలీసులకు చెప్తానంది. రెండువేల రూపాయలు ఆశ చూపినా లాభం లేకపోయిందే."

"ఆవిడ కాకుంటే మరో డాక్టరు. ఈ పెళ్ళి కాగానే వెళ్దాము."

"అదికాదే రెండవమాసం దాటిందట. పిచ్చి పనులు చేస్తే అసలు పెద్ద ప్రాణానికే ముప్పు రావచ్చు అంటున్నదే చూస్తూ చెట్టంత బిడ్డనెలా చంపుకోను?"

అందరూ అంటీ, అంటనట్లు అన్నం కెలికి వదిలారు. సుశీల సామాను గదిలో పడుకుంది. తల్లీ కూతుళ్ళు పక్క గదిలో కూర్చుని మంతనాలకు దిగినారు. ఎంత తల బద్దలు కొట్టుకున్నా పరిష్కారమార్గము కనిపించలేదు వారికి.

"అమ్మా! ఇంత ఆలోచన దేనికి? అతనికే ఇచ్చి చేయండి. యెంత మందిలేరు. యిద్దరు పెళ్ళాలున్నవాళ్ళు, నేను చదువు పూర్తిచేసి ఎక్కడో ఉద్యోగం చేసుకుంటాను."

శశి తన నిర్ణయము తెలిపింది.

"అయ్యో! ఉన్నదానికే కూడు పెట్టడం లేదటనే తల్లీ, చూసి చూసి అలాంటివాడికి ఎలా యిస్తానే" కుమిలి కుమిలి ఏడ్చింది.

"అమ్మా! చెల్లి చెప్పిందే బాగుంది. దీని అదృష్టం బాగుంది మా రోజు గదా? అతన్ని పిలిపించమ్మా!" ప్రసన్న చెప్పింది. సరిగ్గానే తోటి వెంకట్‌ను పిలిచి, వందరూపాయలు చేతిలో పెట్టి శంకర్‌తో అత్యవసరమైన పనివుంది పిలుచుకురమ్మని పంపినది. వందరూపాయల మహత్యము వల్ల మరో గంటకల్లా శంకర్‌ను వెంబడించుకు వచ్చాడు వెంకట్. వెంకట్‌ను, ప్రసన్నను పురోహితుడికి బట్టలు తెమ్మని బయటికి పంపింది దుర్గమ్మ. తలుపులు చేరవేసి కూతురి పరిస్థితి వివరంగా చెప్పి పరువు కాపాడమని వేడుకుంది.

అతను రెండు నిమిషాలు ఆలోచించి పెద్దమనిషి తరహాగానవ్వాడు.

"ఇది మరీ బాగుందండీ! దార్లో కనిపించి ఇంటి దగ్గర దిగబెట్టమంటే స్కూటర్ మీద ఎక్కించుకొచ్చినందుకు నీ..., నా నెత్తిన ... తుందా? అందమైన పువ్వును ఎంతోమంది వాసన చూస్తారు."

శశి ఇక వినలేక పోయింది.

"శంకర్" అన్నది బాధగా.

"ఉన్నమాటంటే ఉలుకెందుకు? ఈ రోజులలో ఒక భార్యను పోషించడమే కష్టం. ఇంకా నాకు పెళ్ళెందుకు? అందునా మీ అమ్మాయి వంటి విగ్రహము లేనిదాన్ని చేసుకోనా?

"శంకర్? యింత అన్యాయంగా మాట్లాడుతున్నావా? యాభై వేలు వద్దు నువ్వు పోషించనూ వద్దు! చట్టరీత్యా భార్యా భర్తలమైనా మనకేం సంబంధముండదు. దయచేసి నన్ను నవ్వులపాలు చెయ్యకు."

"నాకు ఒకరిని నవ్వులపాలు చేయడం సరదా కాదు. మీరే ఇలా



చించి మా ఫర్మ్‌కు ఫోను చేయండి" నిర్లక్ష్యంగా వెళ్ళి పోయాడు. తల్లి కూతుళ్లు ఒకరిని ఒకరు చూస్తూ. ఏడుస్తూ కూర్చున్నారు. చలపతి పిలుస్తున్నాడని మనిషి వచ్చినా, తల నొప్పిగావుంది తర్వాత వస్తానని కబురు చేసింది.

సాయంత్రం బజారునుండి తిరిగి వచ్చిన ప్రసన్న ఆత్రంగా తల్లివంక చూసింది! వెంకట్ పైకి వెళ్ళిపోయాడు. జరిగిన విషయమంతా కూతురితో చెప్పింది దుర్గమ్మ. ప్రసన్న ఆలోచనలో పడినది. తమకు జీవితం గురించి యింత క్లిష్ట పరిస్థితి వస్తుందని తెలియనే తెలియదు. మొదటిసారిగా గంభీరమైన సన్నివేశం ఎదుర్కొంటున్నారు.

"పోనియ్యమ్మా! యాభై వేలు సంపాదించడం గొప్పకాదు. ఇచ్చి చేసేసి పరువు కాపాడుకుందాము, చదువు పూర్తిచేసి శశి నాలుగు రాళ్ళు ఎక్కడో సంపాదించుకుంటుంది."

"యాభై వేలు ఎక్కడ తేనే? మీరే నా ధనమూ, సర్వస్వమూని నన్నూ మిన్నూ గానక ఖర్చు పెట్టాము. రఘు మరణించేనాటికి లక్ష రూపాయల నగదు, రెండు లక్షల వ్యాపారముందని చెప్పేరు మీ నాన్న. ఎవరో చట్ట వ్యాపారంలో లక్షలు ఆర్జించారని మీ నాన్నను కూడ ఆ వ్యాపారంలోకి దించాను!"

"అదేం వ్యాపారమమ్మా!"

"లాటరి లాగానే నగదు అంతా తుడిచిపెట్టుకు పోయింది. మావయ్య ఇస్తానన్న డబ్బు పాతికవేలు ఇస్తే ఆఖరిగా మిగిలిన వాడని వేణు నామకరణోత్సవమూ? నీవు రజస్వల అయితే పండుగ, శశికి పెళ్లి చేయటం ఘనంగా చేసి ఖర్చు పెట్టేము. మీ నాన్నగారు క్రమంగా వృద్ధి చేస్తూనే వున్నారు. మన ఖర్చులు పెరిగిపోతున్నాయి! బ్యాంకిలో సేవింగ్ చేసే అవకాశము రానేలేదు" కళ్ళు తుడుచుకుంది.

"అందుకే ఇంత కష్టపడి చలపతి తాతయ్యను, సునీలను చేసుకోవడానికి ఒప్పించాను. రేపు ఏ వివాహమైనా అనుకుంటానని, అతని

కూతుర్ని వెంకటుకి ఇచ్చినా సరే. లేదా శశి తన కొడుక్కి చేసుకున్నా మనకు డబ్బు విషయము బాధ వుండదని ఆలోచించేను. ఈ పిల్ల నా పథక మంతా పాడుచేసింది. ఇంకేం చేద్దామే!"

ఏమ టుంది ఆ పిల్లది మాత్రం? ధనవంతుల జీవితాలన్నీ పై పండు సామెతేనా? అవి విస్తుపోయింది! బట్టలు కొనడానికి వెళ్ళితే తల్లి వద్దు ఎందుకు రాస్తుందో ఇప్పుడర్థమైంది. ప్రతి పనికి తండ్రి ఎందుకు ప్రతిఘటించేవాడో తెల్సుకో గలిగినది. ఆంధ్ర దేశంలో ఈ అతి పోకడ లకు పోయి ఎన్ని కుటుంబాలు నాశనమవుతున్నాయో, తల్లివి, తనవి, చెల్లెలివి కలిసి ఎంత లేదన్నా మూడు నాల్గు వందల చీరలుండవచ్చు. అవిగాక శశి పంజాబి దుస్తులు, పరికిణీలు, గరారాలు వేస్తుంది! కుటుంబ మంతా కల్సి సినిమాకు వెళ్ళితే ఎప్పుడు వంద రూపాయలకు తక్కువ ఖర్చు చేయలేదు, ఉపహారాలు, పూ మాలలు చల్లని పానీయాలు, సంవత్సరములో ఆరుగురి పుట్టిన దినముల పండుగలు జరుగుతాయి. యే పండుగకు అయిదు వందలకు తక్కువ ఖర్చుకాదు. ఇవిగాక వెంకటు ఖర్చులు వేరే వున్నాయి. ఢిల్లిలో చదివే సంపత్ ఖర్చులకు అంతూ వరీ లేదు. ఇంట్లో ఒకరికి వచ్చిన కూర రెండోవారికి నచ్చదు. పూటకు నాల్గు రకాల కూరలు, సాంబారు, రసము లేవిదే జరుగదు, మాటకు శాఖా హారులే. ఆధునిక యువతులూ, యువకులూ కాబట్టి విధిగా మాంసాహారము అలవాటు చేసుకొన్నారు, అది హోటళ్ళ వరకే పరిమితం చేసుకొన్నారు. బలహీనత పేరుతో గ్రుడ్డు మాత్రం స్వేచ్ఛగా ఇంట్లోనే వండుతారు. రాను రాను గ్రుడ్లు ఉదయాన్ను ఫలహారములో ఒక భాగంగా మారిపోయాయి. మాంసాహారులు గ్రుడ్డు వాడినా, వాటికి జరినా ఏ రొట్టె ముక్కో తీసుకొంటారు. ఇక్కడ అలా కాదు, దేనికదే వుండాలి. ఆదమ్మ బజారు వెళ్ళొచ్చిందంటే పళ్ళు మిఠాయిలతో కాదు నిండుతుంది.



ఇంట్లో రిఫ్రిజిరేటర్. పెట్రోలుబంకువాడు బిల్లుతేగానే ఉమాపతి గుండె క్షణకాలం కొట్టుకోవడం ఆగిపోతుందనటంలో అతిశయోక్తి లేదు.

రాత్రికి లాంఛనంగా, సుశీలకు క్రొత్తబట్టలు పెట్టారు. అ దరి మనస్సులలో అగ్నిగుండాలు రాజుతున్నా చలపతికోసం నవ్వుతున్నారు. విందుభోజనం ఒక్కరికీ నచ్చలేదు. అత్తలోని ఆరాటమేమిటో సుశీలకు అర్థం కాలేదు. బయట కూలీలు పందిరి వేస్తున్నారు. వెంకట్ పేక పట్టుకున్నాడు.

"త్వరగా పడుకోండి. రెండుగంటల రాత్రికి లేస్తేగాని పనులు తెములవు. రేపు అడుదువులే.

"రేపు తాతయ్య పెళ్ళికూతురితో బిజీగా ఉంటాడు" వెంకట్ మూతి బిగించాడు.

దాంతో చలపతి పైకప్పు యెగిరిపోయేలా నవ్వుతూ, మెలికలు తిరిగాడు. అతన్ని చూచి చిన్నపిల్లలు నవ్వటం మొదలుపెట్టారు. అతనితో సుశీల యెలా కాపురం చేస్తుందో, అనే ఆలోచన రాగానే ప్రసన్నకు కంపరం పుట్టుకొచ్చినది. "అమ్మ స్త్రీయేనా?".... ఆమెచేసే పనులకు తాము బాధ్యులు కావటంలేదుకదా? ఆ ఆలోచన రాగానే తల్లిపై అసహ్యం వేసింది. మరుక్షణమే ఏ మూలో దాగిన జ్ఞానము మేల్కొన్నది. ఆమె ఏం చేసినా తమకోసమే. తమ సుఖం కోసమేననే ఆలోచన రాగానే తల్లిపై జాలి కలిగినది.

"అమ్మాయ్, దుర్గా! ఏర్పాట్లు నువ్వుచూడు. ఆరుగంటలవరకు నన్ను మాత్రం లేపకు."

"మంచిది మామయ్యా!"

అతను పైకి వెళ్ళిపోయాడు. తల్లీ, కూతుళ్ళు గది తలుపులు వేసి మంతనాలకు దిగారు. సుశీల, ప్రేమ, వేణు ఒక గదిలో పడుకుని ...తున్నారు!

"సుశీలక్కా! ఓ కథ చెప్పవూ" వేణు మారాం చేశాడు.

"ఏం కథ చెప్పను వేణూ! నా బ్రతుకే ఓ కథలా ఉంది" కాల్వలుగా కారే కన్నీటిని తుడుచుకుంది.

"సుశీలక్కా! మరే, సినిమాలలో పెళ్ళి అయితే, సంతోషంగా పాటలు పాడుతారు. నువ్వేమో ఏడుస్తున్నావే!" అమాయకంగా అడిగాడు.

ప్రేమ విసుక్కుంది. "పండుకోరా! మతిలేని కబుర్లూ నువ్వూ!"

అరగంటలో పిల్లలు నిద్రపోయారు. తను ఈ పెళ్ళి తప్పించుకోవాలనే దృఢనిశ్చయానికి వచ్చింది సుశీల. "అఘాయిత్యం చెయ్యకు తల్లీ" అనసూయమ్మ మాటలే గుర్తుకురాసాగినవి. అఘాయిత్యం చేస్తేనే ఈ కష్టాలనుండి శాశ్వతమైన సుఖం లభిస్తుంది. మరణం తప్ప. నుండి రక్షించే శక్తి ఏదీలేదు. అంతే, ఆ ఆలోచన రాగానే ఎక్కడలేని బలము వచ్చింది. కళ్ళు తుడుచుకుని లేచింది. నగలు ఒక్కొక్కటి తీసి పెట్టెలో పెట్టసాగింది. గుమ్మంవద్ద అలికిడి రాగానే గుండెల్లో రాయి పడింది. మత్తుగా చూస్తూ నిలబడ్డాడు వెంకట్.

"మీరా బావా!" అన్నది తేరుకుని.

"అలా బయటకువెళ్దాం రా! నాకు తెలుసు అమ్మ నీకు అన్యాయం చేస్తుందని. ఒకందుకు ఇది మంచిదే అయింది. అమ్మకు వ్యతిరేకంగా పెళ్ళి చేసుకుంటే ఒక్క పైస యిచ్చేదికాదు."

"ఇప్పుడంతా మించిపోయింది. ఏం మాట్లాడినా లాభంలేదు."

"అట్లా అనకు. ఈ వెంకట్ లాభంలేని పనులే చేయడు. తెల్లవారి ముసలోడు పెళ్ళానివి. ఈ వెంకట్ హృదయరాణివి సుసీ! ఆ సుంకా నీకు రాగానే, ఆ సకల రోగాలున్న ముసలాడిని యే ఆస్పత్రిలోనో చేర్పించుకోబోయాడు. మనము హనీమూన్‌కు బయలుదేరుదాము" అంటూ దగ్గరగా వచ్చి కౌగి

"పెళ్ళి అయినాక ఏం చేసినా ఫరవాలేదు. ఇప్పు డెవరయినా



"చూడని ఏం చేస్తారు?" అతని ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు వేడిగా ఉన్నాయి.

"చేసేవే చేస్తారు. అతనితో చెప్తే రాద్ధాంతము! పెళ్ళి ఆగిపోతుంది! అత్తయ్య యిద్దర్నీ కొరతవేస్తుంది" తగ్గిపోయాడు వెంకట్. కల్యాణతిలకంతో మెరిసిపోయే సుశీల నుదురు చుంబించకుండా ఉండలేకపోయాడు!

"ఛీ! ఏమిటిది పశువులా పాడవుతోంది!" విసుక్కుంది సుశీల.

"సారీ సుసీ! రేపు ఆ ముసలివాడికి నిద్రమాత్ర యిచ్చి నా దగ్గరికి రావాలి సుమా" చెవి దగ్గర గుస గుస లాడినాడు.

"అలాగే ముందు నువ్వు యిక్కడినుంచి పో" అతన్ని బయటికి నెట్టి తలుపు వేసుకుంది. వెర్రివాడి గేదె ఈనితే ఊరందరూ ఉట్లు కట్టారన్న సామెతగా ఉంది తన పెళ్ళి. యెవ్వరి స్వార్థం వారిది! మరో గంట గడిచాక, అనసూయ తెచ్చిన చీర కట్టుకుని, విడిసినవి వదిలి బయటకు వచ్చింది. నెమ్మదిగా కిటికీగుండా అత్తగదిలోకి తొంగిచూచింది. తల్లీ, కూతుర్లు నిద్రపోయారు. సింహద్వారము తలుపు తీసుకుని బయటికి వచ్చి రోడ్డుకు మధ్యగా నడవసాగినది. దూరాన కారు హారన్ వినిపించింది. భగవంతుడికి మనసులోనే నమస్సు లర్పించి, అక్కడే ఆగిపోయింది. కారు తనను ఢీకొనగానే కుప్పలాగా కూలిపోయింది సుశీల!

"అమ్మా! సుశీల మీ గదిలోగాని పడుకుందా?" అదుర్దాగా వచ్చాడు వెంకట్. దుర్గమ్మ నిద్రమత్తు వదిలిపోయింది.

"లేదురా!"

"తలుపు తీసేవుంది!"

"సామాను గదిలోనే పడుకుంది!"

అన్నది, సిగముడి వేసుకుంటూ.

గదిలో లేదు, బయటి తలుపులు తీసి ఉన్నాయి!

ఆత్రంగా బయటికి వచ్చారు.

బయట తలుపు తీసి ఉంది. తప్పక యెటో వెళ్ళిపోయిందిరా ... దని తెలుస్తే తాళ్ళతో కట్టివేసేదాన్ని." ... తెగిస్తుం... ఏడుపు రావటం లేదు.

"ఇప్పుడు రెండే అయిందమ్మా. పన్నెండుగంటలకు ఇంట్లోనే ఉంది. నేను మంచినీళ్ళకని లేస్తే తన దీపం కనిపించినది. వచ్చి పలకరించాను. ఏడుస్తున్నది. ఓదార్చి వెళ్ళిపోయాను. ఇప్పుడు లేపుదామని వస్తే లేదు."

అతని మనసంతా సుశీల తీసిపెట్టిన నగలమీదనే ఉంది.

"అయితే ఇప్పుడప్పుడే వెళ్ళి ఉంటుందా? కాస్త వెళ్ళరా! వెళ్ళు... యిది ఎక్కడిది తద్దినము. నాకు వచ్చిపడింది. దేవుడు నన్ను పరీక్షిస్తున్నా...డురా తండ్రి!"

సన్న సన్నగా రాగాలు మొదలుపెట్టింది. వెంకట్ లోపలికెళ్ళి దుస్తులు వేసుకుని చేతిలో చిన్న మూటతో తిరిగి వచ్చాడు.

"అదేమిటిరా?"

అంది మూటను చూస్తూ! అతను తడబడ్డాడు.

"ఏం లేదమ్మా వేసవికాలమైనా బయట చలిగా ఉంది! మఫ్లర్!"

"త్వరగా వెళ్ళి కారు తీశాడు. దుర్గమ్మ వెళ్ళి కూతుర్లను లేపింది! అందరూ వచ్చి నగలకోసం చూశారు. దుస్తులు, పెట్టెలూ అన్నీ ఉన్నాయి.

కానీ నగలు మాత్రం లేవు.

"దాని సిగ తరగా? కొంపే ముంచినదే. చలపతికి ఏమని జవాబు ...ప్పనే."

"గుండెలు బాదుకుని ఏడ్వడం మొదలు పెట్టింది. మేడమీదున్న ...లపతికి ఏమీ వినిపించలేదు. కాని క్రింద పనివాడు, డ్రైవరూ అందరూ ... వినోదం తిలకించసాగేరు.





నాల్గు గంటలకు తిరిగివచ్చిన వెంకట్ సుశీల జాడ తెలుసుకుని రాలేక పోయాడు. చుట్టూ వెతికాను. యెక్కడా కనిపించలేదని చెప్పాడు.

"పదండే పనులు మొదలు పెడదాము."

పనిమనిషి కదిలింది.

"ఇంకేం పనులే. పెళ్ళికూతురే లేదు. పెళ్ళి ఆగిపోతుంది. మెల్లగా చెయ్యొచ్చు పడుకుందాం పద."

"పెళ్ళి ఆగిపోవడానికి వీలులేదు. వెళ్ళి మీమీ పనులు చూచుకోండి"

దుర్గమ్మ మాటలకు అందరూ వెళ్ళిపోయారు.

"అమ్మా! ఏమిటి నీకేమీ పిచ్చెత్తలేదుకదా!"

ప్రసన్న ఊపింది.

"ఇప్పుడు లేదు ప్రసూ! ఈ పెళ్ళి ఆగిపోతే యెత్తుతుంది. అరవై కాసుల బంగారం తెమ్మని చలపతి పీకలు నొక్కుతాడు యెక్కడ తేను."

"అమ్మ బ్రతకాలంటే, యింటి పరువు నిలపాలంటే. శశీ నువ్వు పెళ్ళికూతురివి కావాలి. కావు? నా అజ్ఞ ఉల్లంఘించకు! ఊం."

"అమ్మా!"

"అమ్మా, బొమ్మా ఏమీలేదు. నామాట వినాల్సిందే. లేదా రేపు అందరము యీ లోకములో ఉండము. ప్రసన్నా! లే దాన్ని పెళ్ళికూతుర్ని చెయ్" అని రెండేసి మెట్లు ఒకేసారి యెక్కుతూ మేడపైకి వెళ్ళిపోయింది దుర్గమ్మ.

అక్కా!" ప్రసన్నను కౌగలించుకొని బావురుమంది శశి.

"చూడక్కా! అమ్మ యెంత అన్యాయం చేస్తుందో."

"అమ్మ విధిలేక ఈ నిర్ణయానికి వచ్చిందే. నువ్వే ఆలోచించు. రేపు నేను ప్రేమ వివాహం? ఉన్న ఆస్తి ఊడ్చి ఆ శంకరంగారికి కట్టబెట్టినా తిన్నగా చూస్తాడని నమ్మకమేమిటి? అందరి పరువూ నీ చేతిలో వుందే శశీ!"

శశి హృదయం రాయి అయిపోయింది. యవ్వనమదంతో కళ్ళు మూసుకుని తిరిగినందుకు శిక్ష అనుభవించవల్సిందే. ఆమె కంటిలో కన్నీరుకూడా ఇంకిపోయినది.

"మామయ్యా!" అప్పుడే లేచి ఈజీఛేర్‌లో కూర్చున్న చలపతి పాదాలను వాటేసుకుంది దుర్గమ్మ. "నన్ను రక్షించు మామయ్యా! నా కెవ్వరూ లేరు. అన్నీ నువ్వే."

అతను తెల్లబోయాడు. ఆమెను బలవంతంగా పాదాలు విడిపించి ప్రక్కనే కూర్చోబెట్టాడు. "ఏం జరిగిందో చెప్పుదుర్గా!"

"ఏం చెప్పను మామయ్యా! అదే, ఆ పిల్లదానికి నీ గురించి అలాగా చెప్పాను. పెళ్ళికి సంతోషంగా ఒప్పుకుంది నిన్ను చూచికాదు. నీతబ్బని తెలుసుకోలేక పోయాను. సరదాకుచేయించిన నగలన్నీ పెట్టాను. అవన్నీ తీసుకుని ఉడాయించింది. నా కొంప ముంచింది."

"ఆఁ....అరవై కాసుల బంగారం పోయిందా దుర్గా నిజమేనా?" ముసలాడు ఉగ్రుడయిపోయాడు.

"నిజమే మామయ్యా! పామును పాలుపోసి పెంచాను. నన్ను నిలువునా కూల్చింది."

"దుర్గా! ఇదంతా యేదో నాటకంలా ఉంది. నా బంగారం పోతే పోయింది. నీ చెవులు పిండి తీసుకుంటాను. నా పరువేంగాను; ఇంకా నయము అందరికీ చెప్పలేదు. దగ్గిర బంధువులకు మాత్రం చెప్పాను. మీరు యిట్టాన్నా చావండి. గుట్టుగా నా బంగారంతే! నాకు అప్పగించు" ఆవేశంతో ఊగిపోయాడు చలపతి.

దుర్గమ్మ మరోసారి అతని పాదాలను ఆశ్రయించినది. అందితే జుట్టు అందకపోతే కాళ్ళు అనే సామెత ఉండనే వుండి. మేనగోడలు విచ్చావని అతని జుట్టుపట్టి ఆడిద్దామనుకుంది దుర్గమ్మ. కాని అతనికాళ్ళు పట్టుకునే గతి పట్టినది. "నామాట వీను మామయ్యా! ఈ పెళ్ళి ఆగిపోదు అది మోసగించినందుకు శిక్ష నేను అనుభవిస్తాను. నా కూతుర్ని



ఇస్తాను మామయ్యా! బంగారము నెమ్మదిగా కొనిపెడతాను. నా పరువు కాపాడు. పోలీసులకు రిపోర్టిచ్చి యెక్కడున్నా దాన్ని పట్టి తెప్పిస్తాను. నా బిడ్డను చేసుకో మామయ్యా!"

అతను ఆశ్చర్యపోయాడు. దుర్గమ్మ మీద జాలి కూడా తలచాడు. పరువుకోసం బిడ్డను బలిచేస్తుంది అనుకున్నాడు. సుశీలను సరిగా అతడు చూడలేదు. ప్రసన్నను చూచాడు. అతని హృదయం పొంగిపోయింది.

"లే దుర్గా? మనలో మనకు ఈ పట్టింపులు దేనికి? పరువు పోతుందే అని అలా అన్నాను. కాని బంగారము నీకంటే యెక్కువా! లే! ప్రసన్నను అడిగావా? దాని కిష్టముందో లేదో."

"ప్రసన్నకాదు మామయ్యా! శశి నా రెండో కూతురు."

"అదేమిటే పెద్దదాన్నుంటే పెట్టి రెండవదాన్ని యిస్తాననటావు!"

"అది యిదివరకే మాటయ్యింది. దాన్ని చూచి వెళ్ళారు. దీన్ని చేసుకో. దానికిష్టమే. మీహోదా. కాస్త చూచి కరగిపోయింది." వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ క్రిందికి వచ్చింది దుర్గమ్మ.

విధి బలీయమైనదని తెలియక మిడిసిపాటు పడతాం. తానొకటి తలచింది. జరిగింది వేరొకటి.

గంభీర వదనుడై ఇంట్లో అడుగుపెట్టిన ఉమాపతి ఇంట్లోని వాతావరణం కూడ గంభీరంగానే కనిపించినది. సామాన్లు గదిలో పెట్టించి యెదురుగా భార్య కనిపించినా పలుకరించక సోఫాలో కూర్చున్నాడు. దుర్గమ్మ నిగ్రహించుకోలేక పోయింది. అతని భుజంమీద తలవాల్చి గుండెలు అవిసేలా దుఃఖించింది, "ఎందుకు ఏడుపు నీ పంతము నెగ్గినదిగా?" కఠినంగా అడిగాడు.

"నాన్నా? ఈరోజు పత్రిక చూడలేదా." వెంకట్ పత్రికఅందిం

చినాడు. ఉమాపతి ఆశ్చర్యంగా పేపరు విప్పాడు. సుశీలఫోటో. దానికింద
అరవై కాసుల బంగారముతో పరారి పట్టియిచ్చిన వారికి మూడు వందల
రూపాయలు బహుమానము అనివుంది. యెందుకో అతని హృదయ
భారమూ తగ్గినట్లు అనిపించినది.

"ఏడుపు దేనికి! నీ యిష్టమొచ్చినట్లు నువ్వు అధికారం చెలా
యించావు దానికి చేతనైన పనిఅదిచేసినది" అమెకు దూరంగా జరిగాడు
ఇంతలో శశి వచ్చి అతనికి వంగి నమస్కరించినది. అతనికంతా అయో
మయంగా ఉంది. రకరకాల వస్తువులు ధరించి సీతాకోక చిలుకలా జాలీగా
తిరిగే శశి గంభీరముగా, వాడిన పువ్వులా, బిగుతుగా జడ వేసుకుని
మొలమీద పైట ముసుగుతో రావటం నమస్కరించటము అర్థంకాలేదు.
"అది చేసిన అనర్థపు పనికి శశిని బలియిచ్చాను." రెండు చేతులతో
ముఖం దాచుకుంది. వెంకట్ జరిగినదంతా చెప్పాడు. ప్రసన్న నెమ్మదిగా
శశి పరిస్థితి చెప్పింది. యే పరిస్థితులలో పెళ్ళి చేయవలసి వచ్చినదో
వివరించింది.

"నీ పాపం నీకే బెడిసినదా దుర్గా!" రఘుకు అన్యాయం చేశావు.
దేవుడు మనకు అన్యాయం చేశాడు. బాగా లేదూ! ఒక్కపని చెయ్యా
ల్సిందే! అతనికిచ్చేకంటె దానికింత విషం యివ్వలేక పోయావా? తప్పు
నీదిగాదే. నీకు, నీతల్లికు దాసుడనై చెప్పినట్లు విన్నాను. ఈపాప
మంతా నాది" అతను లేచి గదిలోకి వెళ్ళి తలుపులు బిగించుకున్నాడు.

"ఏరా దానిజాడ తెలిసిందా?" కొడుకువంక చూచింది.

"లేదమ్మా పేపర్లో యిచ్చాము, ఇవాళో రేపో తెలియాలి. సాయం
తము శశిని తీసుకు పోవటానికి చలపతిగారు వస్తామన్నారు."

"దాని పెళ్ళిచేశాము. అరోజు దాని వొంట్లో బావుండలేదని సాకు
ట్టివచ్చాము. ఈరోజు తప్పుతుందా?" అక్కడ నిలబడలేక పోయింది



సాయంత్రము చలపతిగారు వచ్చారు. మనసును మభ్యపెట్టి అల్లు
డికి చేసే మర్యాదలు చేసింది దుర్గమ్మ. ఉమాపతి ముభావంగా పలుకరించి
ఊరుకున్నాడు. భోజనాల వద్ద శశిని తీసుకుపోయే ప్రస్తావన వచ్చింది.
ఇప్పుడే ఏం తొందర!" దాటెయ్యబోయింది దుర్గమ్మ.

"బావుండే వయసు వస్తుందా పోతుందా? ఇల్లు పాడు కావుదు
మంటుందనే ఈ వయస్సులో పెళ్ళిచేసుకుంది." విక్కచ్చిగా తన అభి
ప్రాయము చెప్పాడు చలపతి. దుర్గమ్మ నోరు యెత్తలేదు. శశి బట్టలు
సర్దుకోసాగింది. రోట్లో తల పెట్టాక రోకలిపోట్లకు జడిస్తే లాభమేమిటి?
వార్తాపత్రికలోని ప్రకటన, చలపతి వెంబడి పోయే శశిని చూచి ఏం జరిగి
నదో కొంతభాగం అర్థంచేసుకుంది అనసూయ. అంత తెలిగ్గా ముసలాడికి
దుర్గమ్మ తన కూతుర్నిచ్చిందంటే దాని వెనకాల ఏదో గూడుపుఠాణి ఉందని
ఊహించి. సుశీలను తలచుకుని రెండు అశ్రుబిందువులురాల్చింది. భర్త
ఊళ్ళోఉన్నా తనపని తేలికయ్యేది. యెక్కడని వెతుకుతుంది. ఒంటరిగా
కూడా కాదు, వెంట బంగారముందాయె! దొంగలు, మోసగాళ్ళు పట్నం
నిండా ఉన్నారు. యెటుపోయిందో ఏం చేస్తోందో ఒకటే ఆందోళన
చెందినది. యే ఆందోళనలేక వేదాంతిలా ఉన్నవాడు ఉమాపతి మాత్రమే.

సుశీల నీరసముగా కళ్ళు విప్పింది. గదంతా పట్టపగలులా ఉంది.
ఇంకా యెందుకు ప్రొద్దు క్రుంకలేదా అని విసుక్కున్నది. తనెలా యిక్క
డికి తేలినది. మృత్యువును కౌగలించుకోవాలని కారుకు అడ్డముగా వెళ్ళింది
ఆ తరువాత ఏం జరిగింది జ్ఞాపకం లేదు. తిరిగి తెలివి ఆ రోజే ఉద
యమే వచ్చింది. తను యెలా తేలిందని అడిగితే యెవరూ జవాబు
చెప్పరు. రెట్టిస్తే "సాయంత్రం ఆయన వస్తారు. అడుగు." అంటారు.
యెవరాయన? వెంకట్ కాదుగదా? భగవంతుడా! దయామయుడవంటారు.
నన్ను నీవరికి చేర్చుకోలేకపోయావా?" చేయి యెత్తబోయింది. విపరీత
మయిన నొప్పి వేసింది, తలకు బ్యాండేజీ ఉంది కదలడానికి మహాబాధగా

"ఇంకేదిరా ముఖ్యం? బ్రతకటానికి తింటాము. ఆరోగ్యంగా కండలు పెంచడానికి మంచి ఆహారం కావాలి. సంఘములో పెద్దమనుషులుగా చెలామణీ కావడానికి విలువైన దుస్తులుండాలి. కొన్ని క్షణాలు సర్వం మరచి ఆనందించటానికి సినిమాలు కావాలి" అన్నాడు గర్వంగా.

"నీతో వాదించలేను. అవతల పేషెంటు ఉంది. బాస్‌కు ఫోను చెయ్యి ఈ రాత్రికి నాకు సెలవుకావాలని. ఏస్‌యూ గుడ్ టైమ్," జామా అనే అతను వెళ్ళిపోయాడు. సుధీర్ ఇటు తిరగగానే కళ్ళుమూసుకుంది సుశీల. అతను కుర్చీలోకూర్చుని కూర్చున్న శబ్దమయింది. అతనెవరో తెల్సుకోవాలనే ఆరాటం ఎక్కువైంది. కళ్ళు విప్పి ప్రక్కకు తిరగబోయింది.

"వద్దు అటు తిరక్కండి. ఆ చెయ్యి చాలా నొప్పిగా ఉండవచ్చు" అతను అదుర్దాగా లేచాడు.

"మీరెవ్వరు? నేను యిక్కడికి యెలా....యెలా వచ్చాను," అతని వంక సూటిగా చూచింది.

"నేనే యిక్కడకు తీసుకొచ్చాను. నన్ను సుధీర్ అంటారు. మీరు నా కారుకు అడ్డువచ్చారు. ఇది నర్సింగ్‌హోం, ప్రమాదం తప్పింది.

మూడు రోజులు స్పృహలేకుండా పడివున్నారు. ఇప్పుడింకేం మాటలు వద్దు. రేపు మాట్లాడదాము" అజ్ఞాపించినట్లే అని. మగ్గులో పాలు తెచ్చాడు. నోరంతా చేదుగా వుంది. పాలను చూడగానే అసహ్యం వేసింది. అతను మెడక్రిందగా చేయివేసి, కొంచెం పైకిలేపి మగ్గు నోటి దగ్గరకు తెచ్చాడు. కడుపులోని అలజడిఅపుదామని రెండుగుటకలు వేసింది అంతే భళ్ళున డోక్కున్నది. అతను టవలు అడ్డం పెట్టాడు. అయినా అతని చేతులన్నీ పాడయిపోయినాయి. భయంగాచూసింది. ఫరవాలేదన్నట్లు చూచాడు. వేరొక గుడ్డతో అంతా శుభ్రంగా తుడిచి పడుకోబెట్టాడు. డాక్టరు తిరిగివచ్చి ఓ ఇంజెక్షన్ చేశాడు. అంతే గాఢంగా నిద్రపోయింది. తెల్లవార్లు అక్కడే వుండి ఉదయం వెళ్ళిపోయాడు సుధీర్.



ఉంది. థర్మామీటరు తీసుకునే నర్సు వచ్చింది. "నోరుతెరువు," థర్మామీటరు నోట్లో పెట్టి పల్స్ చూచినది. అన్నీ చార్టుషీటుపై నోట్ చేసింది. "నర్స్ ఈ రోజు తారీఖు యెంత?"

"మార్చి తొమ్మిదో తారీఖు" అని బ్లాంకెటు సరిగా కప్పి వెళ్ళిపోయింది.

"అయితే నేను యిక్కడ చేర్చబడి నాల్గురోజులయిందా? మార్చి అయిదో తారీఖు ఉదయం తన పెళ్ళి! .... ఏమయిందో" అత్తయ్య యెంత మండిపడుతోందో! పాపం మామయ్య మంచివాడు తన పెళ్ళి చూడలేక వెళ్ళిపోయాడు "ఆలోచనలు తరంగాలుగా వస్తున్నాయి. కళ్ళు మూసుకుని మగతలోకి జారినది. నాల్గు జతలబూట్లు శబ్దం వినిపించింది. అవి తన మంచందగ్గర ఆగిపోయి" సుధీర్ "ఆమె తెలివిలోకి వచ్చింది. ప్రమాదము తప్పినట్లే" ఒక గొంతు పలికింది "మధ్యాహ్నము నేను రౌండ్సుకు వచ్చినప్పుడు పూర్తిగా స్పృహలోకి వచ్చే మాట్లాడినది" మరో గొంతు. ఇవాళ రేపు ఆడపిల్లలు కూడా బరితెగించి పోయారు. కార్లకు అడ్డం రావటం మనల్ని తికమక పెట్టటం. నేనైతే ప్రక్కకు ఈడ్చి వచ్చేవాడిని" మరోగొంతు పలికింది. మగత వదిలించుకొని బలవంతంగా కళ్ళువిప్పింది యెదురుగా యిద్దరు డాక్టర్లు మెడలలో స్టెతస్కోపు ప్రేలాడ వేసుకుని నిల్చున్నారు, మరో యిద్దరు యువకులు నిల్చున్నారు. సుధీర్ యెవరా అని ఆలోచన! డాక్టర్లు ఓ యువకుడితో కరచాలనం చేసి వెళ్ళిపోయారు "నేనూ వస్తాను ప్లాజాలో మంచి పిక్చరుంది. నీతో పెట్టుకుంటే కదరదు. దారినపొయ్యే కంపను నెత్తికి రుద్దుకుంటావు" అన్నాడు అక్కడ నిల్చున్న పొట్టిఅతను, ఖరీదయిన సూటులో వున్నాడు.

"నీకు సినిమాలు, తిండి, డ్రస్సు తప్ప ఏదీ ముఖ్యమనిపించదా బాషా?"

# 4

"లేదు. నన్ను నమ్మండి. నేను అన్నీ తీసి పెట్టెలో పెట్టి వచ్చాను ఇల్లు దాటి పది అడుగులు వేశానో లేదో కారు వచ్చింది. నాకా సొమ్ముల గురించి ఏమీ తెలియదు" ఒడిలోనున్న పేపరు చూచి కంపించి పోయింది సుశీల. తనఫోటో.... క్రింద దొంగతనం చేసినట్టు వివరాలు.

"మీరు తీసుకురాకుంటే భయంలేదు. కాని పెద్దచిక్కు వచ్చిందే. మీరు బయటికి వచ్చిన మరుక్షణం పోలీసులు పట్టుకుంటారు. డాక్టర్లకు తెలుగు పేపరు చూచే అలవాటు లేదు. నర్సులంతా అరవవారు. అందుకే మీ ఉనికి బయటపడలేదు. ఇంకా. రెండు రోజులు చూచి అన్ని పేపర్లకిస్తారు."

"నన్ను యెందుకు తెచ్చి కాపాడారు. నా కెవరూ లేరు. అన్ని అనుభవాలు అయ్యాయి. ఇక జైలుకి వెళ్ళటం కూడా రాసిపెట్టి ఉందేమో, దయచేసి నాకింత విషం ఇప్పించండి" రెండు మోకాళ్ళ నడుమ తల పెట్టి ఏడవసాగింది.

"చూడండి. జీవితం అంతం చేసుకోవటానికి కాదు. భగవంతుడిచ్చింది. మీరు బుద్ధి తెలిసినప్పటినుండి కష్టాలే అనుభవించారు. కాబట్టి అలా అంటున్నారు. నాకు కొన్ని విషయాలు నెమ్మదిగా చెప్పండి. నగలు తీసిందెవరో తెల్సుకోవడానికి ప్రయత్నిస్తాను" ఆదరముగా అడిగాడు. ఏం చెప్పాలన్నట్టు చూచింది. "మీరు నగలు పెట్టెలో పెట్టినపుడు యెవరయినా చూశారా?"

"అవును. గుర్తుకొచ్చింది. వెంకటు బావ చూశాడు గదిలో వుంది. పిల్లలూ నేను."



"పనిమనుషులు ఎంతమంది? వారు ఎక్కడ పడుకున్నారో తెలుసా?"

"ఆ, ఒక వంటమనిషి, ఒకమ్మాయి వడ్డనా, చిల్లర పనులూ చూస్తుంది, మాలి, డ్రయివరు. మాలి డ్రయివరు బయట పడుకున్నారు. వంటమనిషి, అమ్మాయి హాల్లో పడుకున్నారు."

"మీరు రాగానే వీరెవరయినా చేయొచ్చుగా? మీరు విశ్రాంతిగా ఉండండి. మీకేం తినాలని ఉన్నా నిర్మొహమాటంగా నాకు చెప్పండి. మీ మీదకు ఏ నేరము రాకుండా చూస్తాను. కొంచెము నగల వివరాలు చెప్పండి" తన డైరీలో అన్నీ వ్రాసుకున్నాడు.

దయచేసి ఫోనుచేసి మామయ్యను పిలిపించగలరా?"

"అతనే పోలీసులకు చెపితే? రెండురోజులు ఆగండి."

"అతను అలాంటివారు కాదు. అతను వస్తే మీకు కొన్ని వివరాలు దొరకవచ్చు."

"అయితే నేనే వెళ్ళి తీసుకువస్తాను" సుధీర్ వెళ్ళిపోయాడు. మరో రెండు గంటలలో ఉమాపతిని వెంటబెట్టుకొని వచ్చాడు. ఉమాపతి సుశీల చెప్పిన విషయాలు నమ్మాడు. అతను శశి పెళ్ళి విషయం చెప్పితే నమ్మలేకపోయింది సుశీల. కొడుకు తత్వము తెలిసిన ఉమాపతి అతన్నే అనుమానించారు. అతని పూర్తి వివరాలు స్నేహితుల గూర్చి సుధీర్‌తో చెప్పారు. సుధీర తలాడించి వెళ్ళిపోయాడు.

వెంకట్ ప్రియురాలివద్ద నగలు కొన్ని దొరికాయి. కొన్ని మార్వాడి కొట్లో వెయ్యి రూపాయలకు తాకట్టు పెట్టినట్లు తెలిసింది. సుధీర్ స్నేహితుడు మారువేషంలో వెంటాడినాడు వెంకట్‌ను. నిజం గ్రహించాక ఉమాపతిని పిల్చుకుపోయారు. నగలు విడిపించడానికి వెయ్యి, పోలీసులు నోరు మూయ్యడానికి అయిదువందలు ఖర్చయినది. "నేను అప్పుడే అ

మాట ఏమిటిరా అని అడిగాను. మర్నాడు అంటే నిజమే కాబోలు అనుకున్నాను. యెంతపని చేశావురా వెంకట్." దుర్గమ్మ వాపోయింది.
కొందరు కొన్ని తప్పులకు శిక్ష అనుభవించగానే మారిపోతారు. దుర్గమ్మ విషయంలో అలా జరగలేదు. తన కూతురు జీవితం నాశనం కావటానికి, తన కుమారుని బ్రతుకు బయట పడటానికి కారణం సుశీలనే తలుస్తుంది. ఆమెమీద మునుపటికంటే యెక్కువ కసిగా ఉంది. యెదురుగా ఉంటే గొంతు నులిమి చంపేద్దును అన్నట్టు ఉందామెకు. ప్రసన్న పరీక్షలకు చదువలేకపోతోంది. కొత్త వంటమనిషి చాలా గొడవ చేస్తోంది. మునపటిలా సుశీలకో రకం అమరటంలేదు. వంటచేసి వెళ్ళిపోతుంది. వడ్డన ప్రసన్న నెత్తిన పడింది.

నగలు అప్పగించి రావటానికి చలపతి యింటికి బయలుదేరినది దుర్గమ్మ "మీరు రండి" అన్నది.

"నేనెందుకు? ముచ్చటపడి బ్రాహ్మడితో కన్యాదానం చేయించి తెచ్చుకున్న అల్లుడు వెళ్ళిచూడరా" వెటకారంగా మాట్లాడినాడు ఉమాపతి. డ్రైవరును తీసుకొని వెళ్ళింది. చలపతి పుసుగును మాడినట్లే చూశాడు.

"యెంత నంగనాచిలా పరాయిపిల్ల మీద పెట్టావే దొంగతనం. అయింది చాలు. నీ పిల్లలను ఈ ఛాయలకు పంపకు. పెళ్ళి చేసుకో నీ కూతుర్ని యిస్తాను అంటే మోసపోయాను. ప్రపంచంలో లేని రోగాలన్నీ నీ కూతురికే ఉన్నాయి. ఒకరోజు కడుపునొప్పి, ఒకరోజు నెత్తినొప్పి, ఒకరోజు గుండెదడ. లేనిపోని తద్దినం కొని తెచ్చుకున్నాను. హాయిగా పదిరూపాయల దగ్గర పదిహేను పారేస్తే వంటమనిషి వచ్చేది."

నగలు అలమరలో పెట్టి తాళం వేసుకున్నాడు. శశి ఓమూల కూర్చున్నది.

"యేదో పొరపాటు జరిగింది. మామయ్యా! శశికి ఈ మధ్య కొం



చెము బాగాలేదు. నేను డాక్టర్ దగ్గరకు తీసుకెళ్తాను. పసిది దానికేం తెలుసు" మండుతున్నా మెత్తగా మాట్లాడినది.

"నాకామాత్రము తెలియదా? డాక్టరు దగ్గరకు వెళ్దామంటే, మందులు వద్దు అంటుంది. నాతో మాట్లాడటం ఉండటం అంత అయిష్టమయినపుడు పెళ్ళి ఎందుకు చేసుకుందట. అడుగు, నేను పొలాల దగ్గరకు పోతున్నాను."

చేతికర్ర వూపుకుంటూ వెళ్ళిపోయాడు.

"శశీ! ఏమిటే యిది? యిప్పటికే సగం చచ్చిపోయాను!"

"నేను పూర్తిగా చచ్చిపోయానమ్మా. అతనంటే అసహ్యము. అతని చేష్టలు చూస్తే రోత వస్తుంది. నన్నేం చెయ్యమంటావమ్మా?" దీనంగా అడిగింది.

నేనేం చెప్పాలి? అయిందేదో అయింది. అతడిని మంచి మాటలతో లొంగదీయి. తల్లి మన రహస్యము బయట పడకూడదు. తియ్యని మాటలతో రాసి యిస్తానన్న ఆస్తి రాయించుకో. రేపు యేమాత్రం అనుమానము వచ్చినా చిల్లిగవ్వ దక్కదు. రెంటికీ చెడ్డ రేవడివి కాకు."

తల్లి బ్రతిమాలి రక రకాలుగా నచ్చచెప్పి వచ్చింది. ఆమె హృదయం కుమ్మరావాలా కుములుతున్నది. యింట్లోకి వచ్చి గ్లాసెడు మంచినీళ్ళు తాగి కూర్చుంది.

భయపడుతూ భయపడుతూ సుశీల వచ్చింది. వెనుకాలే ఓ యువకుడున్నాడు. దుర్గమ్మ ఉరిమి చూచింది. సుశీల అక్కడే ఆగిపోయింది.

"యెందుకొచ్చావు? నా పరువు తీశావు. నా పిల్లల బ్రతుకులు నాశనం చేశావు. నన్ను రచ్చకీడ్చావు, ఇంకా నీ పగ తీరలేదా? వెళ్ళు. నా కళ్ళముందునుండి వెళ్ళు. నిన్ను చంపి ముక్కలుగా నరికినా పాపం లేదు" దుర్గమ్మ అరుపులకు అందరూ హాల్లోకి వచ్చారు. ఉమాపతి భార్యవంక తీక్షణంగా చూశాడు.

"ఊఁ ఇంకా యెందుకు అరుపులు. అమ్మాయి క్షేమముగా తిరిగి వచ్చింది. చాలు. రండి సుధీర్, సమయానికి అమ్మాయిని కాపాడినారు. థాంక్స్!"

"పెద్దవారు. అంతమాట అనకండి. మానవధర్మం నెరవేర్చాను. నాకు పనివుంది. మీ అమ్మాయిని మీకు అప్పగించాలని వచ్చాను" అన్నాడు. దుర్గమ్మ మాటలను లెక్క చేయలేదు. ఇల్లు విడిచిందన్న కోపంతో అలా అంటుందని సరిపెట్టుకున్నాడు.

"మా అమ్మాయి కాదు. మాకు అప్పగించవల్సిన పనిలేదు ఎప్పుడైతే అది ఇల్లు విడిచిందో అది అప్పుడే బజారు మనిషి అయింది. చూడండి. మీరు ప్రతిసారి దానికోసం నన్నూ, నా పిల్లలను అవమాన పరుస్తే సహించాను. ఈసారి నన్ను కాదని దాన్ని ఇంట్లోకి రానిస్తే నా శవం కళ్ళ చూస్తారు. అడ్డమైన మగాళ్ళను వలలో వేసుకుని...."

"అత్తయ్యా, నన్నసంది వారు పాపం దయతో నన్నింతదూరం తెచ్చారు."

"యెంత ధైర్యమే. నన్నే యెదిరిస్తున్నావు. వారట వారు. వారితోనే ఉండు" గొంతు చించుకుంది.

"మీ అత్త గుణం తెలియదా సుశీలా. క్షమించండి సుధీర్ గారూ!"

"ఫరవాలేదు. ఇక్కడ అమ్మాయి ఉన్నా మొదటి పరిస్థితులే యెదురవుతాయి. యేదయినా హాస్టల్‌లో ఉంచటం మంచిదండి. సుశీలా, మీకు నాపై నమ్మకముంటే రండి. మీకు ఏదో ఒక యేర్పాటు చేస్తాను." సుధీర్ చివాలున వెనక్కి తిరిగాడు. ఒక్క నిమిషం ఆలోచించి సుశీల కూడా వెనుదిరిగింది.

"చూచారా! దాని నాటకం. అది నిజంగా ఉండాలని వచ్చిందా? మిమ్మల్ని విషూరంచేసి వెళ్దామని వచ్చింది" దుర్గమ్మ వెనకనుండి అరిచింది



"అత్తయ్యా, మనుష్యుల్ని యిరకాటంలో పెట్టడం నీకు బాగా తెలుసును. ఒక్క విషయంమాత్రం మరిచిపోకు. నువ్వున్నది నా తండ్రి యిల్లు. నువ్వు తింటున్నది నా నాన్న డబ్బు. నన్ను అన్యాయం చేసి నందుకు ఒకరోజు ఫలితం అనుభవిస్తావు. నీ యింట రాజభోగాలు అనుభ వించలేదు. బయటకు వెళ్ళి కష్టపడేది ఏమీలేదు. నీ యింట చేసిన చాకిరి యే యింట చేసినా. నా కడుపు నిండుతుంది. నాకు వేయి వరాలు యిచ్చినా వుండను. యే అనాధ ఆశ్రమంలోనైనా వుంటాను."

"అనాధ ఆశ్రమములో యెందుకే! అందం మెరగా పెట్టుకొని ఎక్కడైనా బ్రతుకు."

"అది నీ బిడ్డలకు నేర్పావు చాలు. చచ్చి స్వర్గానవున్న మా అమ్మను అన్నదానికి ఫలితంకూడా అనుభవిస్తున్నావు ఇంకా నీ గర్వం తగ్గలేదంటే విచారంగా వుంది." తిరస్కారముగా చూచి దుర్గమ్మ పెట్టే శాపనార్థాలను వినక తానే బయటికి వచ్చింది. అనసూయ దగ్గరకు పోబోయింది. దారిలోనే కనిపించిన ప్యూన్ వారు ఎక్కడికో వెళ్ళారని వారం రోజులవరకు రారని చెప్పాడు. నిరాశగా వెళ్ళి సుధీర్ కారులో కూర్చున్నది. అతని కారు వెళ్ళి పట్టణానికి అవతల ఒక పెద్ద తోటదగ్గర ఆగింది. సుశీల దిగి అతని వెనకాలే తోటలో ఉన్న యింటిలోకి నడిచింది. ముసలి నౌకరు యెదురొచ్చి సుధీర్ చేతిలో వున్న బ్యాగు అందుకున్నాడు

"మీరు యే విచారం లేకుండా విశ్రాంతి తీసుకోండి. మీ జీవనోపాధికి నేను ఏర్పాటు చేస్తాను దాదా! అమ్మాయిగారికి వేడినీళ్ళు, భోజనం వగైరాలు చూడు. నేను పనిమీద వెళ్తున్నాను. అక్కడ దారిలో

కొన్న చీరలున్నాయి తీసుకోండి" అని చెప్పి, సుశీల జవాబుకైన యెదురు చూడకుండా వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయాక ఇల్లంతా చూచింది. పెద్ద హాలు, ఒకవైపు తెరలుకట్టి ఉన్నాయి. తెర చాటున భోజనాల బల్ల, బేసిన్, అందమైన గాజుతలుపులతో చేసిన అలమర, దాని కెదురుగా చిన్న రిఫ్రిజరేటర్ ఉన్నాయి. అలమరలో రక రకాల గాజు పాత్రలు తళ తళ మెరుస్తున్నాయి. బల్ల కెదురుగా చిన్న వంటగది యింకోవైపు స్నానాల గది, దానిని దాటిపోగానే మరుగుదొడ్డి ఉన్నాయి. హాలు మధ్యలో ఖరీదయిన సోఫాసెట్టుంది. ఒక మూలకు బుక్ షెల్ఫ్, దానిపైన రేడియో, రేడియో దగ్గర కెళ్ళింది. అటు ప్రక్కనే గుమ్మము కనిపించింది. గుమ్మం దాటి గదిలో అడుగు పెట్టింది. పడకగది. గదిమధ్య అందమైన రోజ్‌వుడ్ కాట్, దానిపై పరుపు, దిండ్లూ, గళ్ళదుప్పటి పరిచి వుంది. ఒకవైపు బల్లపైన కాగితాలు, పెన్నూ ఉన్నాయి. మంచానికి రెండోవైపున చిన్న బల్ల. దానిపై అందమైన ల్యాంపు ఉన్నాయి. గోడ కున్న షెల్ఫ్‌లో రకరకాల పుస్తకాలున్నాయ్. గోడకు అందమైన ప్రకృతి చిత్రాలున్నాయి. బయటి వరండాలో చిన్నగది వుంది. అందులో పాత నులకమంచము. దండెముపై బట్టలు ఉన్నాయి. అది దాదా గది కావచ్చు ననుకుంది. బయట మొక్కలకేసి చూస్తూ నిల్చుంది.

"రా బేటియా! నీకు కాగాయి" పొట్లం విప్పి చీర తీసుకుంది. కలకత్తా చేనేతచీర అందంగా వుంది. బ్లవుజు పీసులు బయట పడవేసి స్నానానికి బయలుదేరినది. తన జీవితములో మొదటిసారి కడుతున్న కొత్తచీర. ఎప్పుడూ అత్త పాతచీరలే కట్టేది. అతనెవరు? తనెవరు, ఏమిటీ అవినాభావ సంబంధము? అతని వివరాలు తెలుసుకోవాలని దాదా దగ్గర కెళ్ళింది. బంగాళాదుంపలు వేయిస్తున్నాడు.

"దాదా! ఈ అయ్య యెవరు నీకు తెలుసా?" దాదా తిరిగి చూచి



వాడు. అతని చూపులు భక్తిభావంతో నిండుకున్నాయి. "ఎవరని చెప్ప నమ్మా? దీనులకు దిక్కు! అయినవారిచే అనాదరింపబడి జ్వరంతో ఒణుకు తున్న నన్ను తెచ్చి, మందు ఇప్పించాడు. బాగుపడి యెటు పోవాలో తెలియక యిక్కడే ఉన్నాను. ఆయనకు వండి పెట్టి మిగిలింది తింటాను. నన్ను ప్రేమగా చూస్తారు. ఇతర వివరాలు నేను అడగను అతను చెప్పలేదు."

మరేం మాట్లాడక వెళ్ళి స్నానం ముగించుకు వచ్చి భోజనం చేసింది. పడుకోవాలనిపించినా యెక్కడ పడుకోవాలో తెలియక సోఫాలో వాలిపోయింది. నిద్ర ముంచుకు వచ్చింది.

సుశీల మేలుకునేసరికి ప్రొద్దు పడమట వాలింది. దాదా వస్తూ కాఫీ తెచ్చాడు. కాఫీ త్రాగుతూ బల్లమీద జాకెట్లను చూసి ఆశ్చర్యపో యింది. "ఇది యెప్పుడు కుట్టినారు?"

"మీరు నిద్రపోయారు. నే ప్రక్కనే ఉన్న దర్జీ దుకాణాని కెళ్ళి కుట్టించుకు వచ్చాను."

"ఇంత తొందరగా కుట్టినారా?" ఆశ్చర్యంగా చూచింది.

"మరేమిటి? దర్జీవాడు జైలుకెళ్ళి వచ్చి యెక్కడా పని దొరకక ఏడుస్తుంటే. అయ్యగారు మిషన్ కొనియిచ్చాడు. పాపం, పిల్లా పాపలతో బ్రతుకుతున్నాడు. వాడి పెద్దకూతురు అచ్చు మీలాగే ఉంది. అదే అదిలో కుట్టించాను. "ఖాళీ కప్పు తీసుకుని వెళ్ళిపోయాడు. రాత్రికి భోజనంచేసి అతనికోసం పదకొండు గంటలవరకు చూచి సోఫాలోనే నిద్రపోయింది.

"దాదా! ఆమెను క్రొత్త మంచంమీద పడుకోమని చెప్పలేక పోయావు. దిండుకూడా లేదు" సుధీర్ గొంతు విని అదిరిపడి లేచింది. తెల తెలవారుతోంది. అతను బట్టలు మార్చుకుంటున్నాడు. అతనివంక పరీక్షగా చూచినది. చామనఛాయ, పొట్టి పొడవుకాని యెత్తు బలిష్ఠమైన

దేహం. చిన్నవే అయినా సూదంటురాయిలా వాడిగా కనిపించే కళ్ళు. కని చెంపపైన అడ్డుగా అంగుళం మేరకు గీసుకుపోయిన మచ్చ ఆ మచ్చ వికారాన్ని కలుగజేయటం లేదు. ముఖానికి ఏంత అందాన్ని చేకూరుస్తున్నది. వత్తుగా, నల్లగా ఉన్న జుట్టు. అన్నీ కలిపి అతడి అందాన్ని సాన పెట్టినట్టున్నాయి. "మీరు లేచారా! రాత్రంతా ఆ సోఫాలో యెలా నిద్రపోయారు. నాదే పొరపాటు. ఏర్పాటుచేసి ఉండాల్సింది. భోజనమైనా సరిగ్గా చేశారా లేదా?"

"లేదు భోజనం చేశాను. నిద్రకూడా పోయాను" అన్నది మొహమాటపడుతూ.

"సరే. మీకోసం ఒక ఉద్యోగం చూశాను. ఇష్టమైతే మధ్యాహ్నం వెళదాము."

"యెక్కడ? ఇష్టముకాక ఏమవుతుంది?" ఆత్రంగా అడిగినది.

"సికిందరాబాద్ అవతల అనాథపిల్లల గురుకులం ఉంది. అక్కడ బోధనాభాష హిందీ వారికి తెలుగు బోధించుటకు ఉపాధ్యాయిని, హాస్టల్‌కు వార్డెనుకూడా కావల్సి ఉంది. విద్యార్థినులను మూడు తరగతులుగా విభజించినారు. పెద్దవారు అంతా పదిహేనునుండి యిరవై సంవత్సరముల వారు. వారికి వార్డెన్ ఉంది. యెటొచ్చి చిన్నపిల్లలకు లేదు. వాళ్ళంతా. పది సంవత్సరములవారే. వారిని అదుపులో పెట్టడం మీకు పెద్ద కష్టం కాదనే అనుకుంటాను."

"చిన్నవారయితే ఫరవాలేదు" అన్నది తృప్తిగా.

"మీరు పిల్లలను అజమాయిషి చేసినందుకు అన్నం ఉచితంగా పెడతారు. తెలుగు బోధించినందులకు నెలకు అరవై రూపాయలు ఇస్తారు. నాకు జీతం మరీ తక్కువనిపించింది. కానివ్వండి యింకోచోట చూడాక అది వదిలివేయవచ్చును. అక్కడుంటే మీకు కొంత ధైర్యం చిక్కుతుంది.



పరిపంచంలో తిరిగే గమనం నేర్చుకుంటారు" అని చిన్నగా నవ్వాడు, సుశీల ముఖం దించుకుంది.

"నా చదువుకు అన్నం పెట్టి అంతకంటె యెక్కువ డబ్బు యెవరిస్తారులెండి. అక్కడే వుంటాను"

"మంచిది" అతను కాలకృత్యాలు తీర్చుకుని వచ్చాడు. సుశీల కూడా తయారయినది. ఇద్దరూ దాదా పెట్టిన చపాతీలు తిన్నారు. ఓవల్టిన్ త్రాగి అతను నిద్రపోయాడు.

తోచక ఏదో మాగజైను పేజీలు తిరగవేస్తూ కూర్చుంది. రెండు బుట్టలనిండా కూరగాయలు తీసుకుని ఓ రైతు వచ్చాడు. దాదా కూరగాయలను చూచి, "ఇన్ని ఎందుకయ్యా? అయ్యగారికి యెన్నికావాలి? అసలు నీకు డబ్బుమీద మోజులేదా?" అని అడిగాడు.

నా యిల్లు నిలబెట్టిన దాతకు యిస్తే నా ధనం తరిగిపోతుందా? సమయానికి బకాయిడబ్బు కట్టకపోతే ఈ పాటికి ఇల్లూ, పశువులూ వేలం వేసేవారు. అతనికిచ్చి వెళ్ళితేనే తృప్తి, లేచినాక నా దండాలు చెప్పు" అతను వెళ్ళిపోయాడు.

ఒంటిగంటకు వంట కాగానే లేపాడు దాదా. అతను స్నానంచేసి వచ్చాడు యిద్దరూ భోజనాలు చేశారు. అతను చిన్న తోలుపెట్టె ఇచ్చాడు

"ఎందుకండీ?" మొహమాట పడింది.

"మీరు ఉద్యోగంలో చేరాక వడ్డీతోసహా తీర్చుకుందురుగాని." అతను తెచ్చిన చీర, తనది, అందులో సర్దుకుని కార్లో బయలుదేరినారు. దారిలో సానె, సబ్బు, టవల్, అద్దం, బొట్టు కొని యిచ్చాడు. నాల్గు గంటలకు గురుకులం చేరుకున్నది కారు.

పెద్ద తోటలో కనిపించే గురుకులములో లోపల ఇండ్లు కనిపించాయి. గేటు ప్రక్కనే వున్న అతిథి గృహములో కూర్చున్నారు. అక్కడ

నిక్కరు, చొక్కా వేసుకున్న ఒక అమ్మాయి వీరిని చూచి లోనికి వెళ్ళింది. పది నిమిషాలకు తిరిగి వచ్చి, తనవెంట తీసుకుని వెళ్ళింది. చెట్ల ప్రక్కగల దారిగుండా నడిచి వంద గజాల దూరం వెళ్ళి ఎడమకు తిరగగానే "స్వాగతం" అని హిందీలో వ్రాసివుంది. ఆ బోర్డు యింటి తలుపుకు కట్టబడియున్నది, ఆ తలుపు చూసి లోపలికి వెళ్ళమని చెప్పింది—ఆ అమ్మాయి। అందమైన చేనేత తెర తొలగించుకొని లోపల అడుగు పెట్టారు, మెత్తని తివాచీలు- చక్కని సోఫాలు, గోడలకు దేశ నాయకులవి, పెద్ద మనుషుల ఫోటోలు వ్రేలాడుతున్నాయి. తెల్లని దుస్తులు ధరించిన స్త్రీ—విధవరాలిలా కనిపించింది. తెల్లని మేనిఛాయ, నలభై ఎనిమిది యాభై సంవత్సరాలు ఉండుండవచ్చు.

"ఆమె ఈ గురుకులాన్ని నడుపుతుంది. "అమ్మాజీ" అంటారు. వెళ్ళి నమస్కరించు."

సుధీర్ చెప్పగానే నమస్కరించింది. ఆమె ప్రతిగా చేతులు జోడించి చల్లని మందహాసము చేసింది. సుశీల హృదయంలో ఓ శీతల పవనము ప్రవేశించింది. "రామ్మా! కూర్చో. పేరేమిటి?" సుశీల వెళ్ళి ఆమె ప్రక్కన కూర్చుంది.

"సుశీల" అని తన పేరు చెప్పింది.

"చాలా బావుంది. సుశీల పేరుకు తగ్గ గుణాలున్నాయని సుధీర్ గారు చెప్పారు. ఇక్కడ వుండటం ఇష్టమేనా?"

ఇష్టమేనన్నట్లు తల ఆడించింది.

"గురుకులమంతా చూపిస్తాను" అని ఆమె లేచింది.

ఇంతలో ఒక అమ్మాయి వచ్చి "అమ్మాజీ వంటమనిషి వంట ఏమి చెయ్యాలని అడుగుతుంది!" అని చెప్పింది.

"ఇప్పుడే వస్తాను" ఆమె తల పైకి ముసుగు లాగుకొని వెళ్ళింది



లోపలి గదిలోనుండి ఒక అరవై యేళ్ళ వృద్ధుడు. నెరిసిన గడ్డం, తలపై జుట్టుముడి, చెక్క పావుకోళ్ళు, మెడలో జంధ్యం. కావిరంగు పంచతో బయటికి వచ్చాడు, సుధీర్ గౌరవంగా నమస్కరించాడు.

"కూర్చో! కూర్చో!" అని చెప్పి బయటికి వెళ్ళిపోయాడు.

"ఇతను ఆమె భర్త బాబాజీ" అన్నారు.

"మరి ఆమె విధవలా కనిపించిందే?" ఆశ్చర్యంగా చూచినది సుశీల.

"పోయిన సంవత్సరం వార్షికోత్సవంనాడు చక్కగా పునిస్త్రీగా వుంది। ఇప్పుడు ఇరువురూ సన్యాసి ఆశ్రయం స్వీకరించారట—అదిగో అక్కడ కనిపించే బంగళా వుందే అది వీరి కుమారునిది. కుమారునికి ఈ రెండు మూడు సంవత్సరాలలో అంతా తర్ఫీదు చేసి కాశీకి వెళ్ళిపోతారట" వారి ఆశయాలు చాలా నచ్చాయి. అమ్మాజీ వచ్చి సుశీలను పిలిచింది.

"మీరూ చూస్తారా సుధీర్?" అన్నది.

"వెళ్ళరండి. నేను చాలాసార్లు చూచానుగా?" ఇద్దరూ బయటికి వచ్చి. కుడివైపునున్న మెట్లు దిగి కొంచెం క్రిందుగా నిర్మించబడిన రేకుల షెడ్డువైపు వెళ్ళారు. నూట పన్నెండు అడుగుల పొడవుతో యాభై అడుగుల వెడల్పుతో వుంది షెడ్డు దానిలో చెక్కబల్లలు వేసి వున్నాయి బల్లకు బల్లకు మధ్య గజం స్థలం వదిలివేశారు. బల్ల క్రింద పెట్టెలు, పైన తలవద్ద ప్రక్క చుట్టలున్నాయి. అమ్మాయిలంతా చెడ్డీలు, షర్టులు వేసుకొని వున్నారు. అందరిలో పెద్దవారు మాత్రం తెల్లని చీరలు, జాకెట్లు వేసుకొని వున్నారు. అమ్మాజీని చూడగానే అందరూ మర్యాదగా లేచి నిల్చున్నారు? అటునుండి వంటశాలకు వెళ్ళారు. రెండు పెద్ద హౌజులలో నీళ్ళున్నాయి. నలుగురు అమ్మాయిలు దొండకాయలు తరుగుతున్నారు నలుగురు గోధుమ రొట్టెలు చేస్తున్నారు. వంటమనిషి కానప్పు!

పెద్ద పెనము పెట్టి తడవకు అయిదు రొట్టెలు కాలుస్తుంది. దాని ప్రక్కనే భోజనశాల. దానిలో బట్టలు ఆరవేసుకునే తాళ్ళున్నాయి. దాని ప్రక్కనే బావుంది. నలుగురు బిందెలతో నీళ్ళు తీసుకెళ్ళి వంటింట్లో హౌజులలో పోస్తున్నారు ఇద్దరు నీళ్ళు చేదుతున్నారు. కొళాయి వుండగా నీళ్ళెం దుకు చేదుతున్నారో అర్థంకాలేదు. అటునుండి ఓ ఎత్తయిన అరుగుమీద తీసుకు వెళ్ళింది.

"ఇది ఆర్య సమాజం గురుకులం సుశీలా! రోజూ ఉదయమే ఇక్కడ సంధ్యావందనము జరుగుతుంది సెలవు దినాలనాడు, పర్వ దినాలనాడు. హోమము జరుగుతుంది. ఇక్కడ అమ్మాయిలకు గృహస్థ జీవనం సుఖంగా గడిచే విద్యలన్నీ నేర్పబడాలని నా ఆశయము. మా కోడలా కాపురానికొచ్చి ఆరో సంవత్సరము. ఇంకా రొట్టెలు వెయ్యటం రాదు.

ఎంత అపహాస్యం! వారానికి ఒకసారి వంతులవారీగా గదులూడ్చ డము, రొట్టెలు వెయ్యటమూ, కూరలు తరగటమూ, నీళ్ళు తోడటమూ వడ్డన చేయటము. ఒక్కొక్క జట్టుకు కేటాయింప బడుతుంది. సాధా రణంగా చిన్న పిల్లలకు బియ్యం ఏరే పని తప్ప పని వుండదు. ఆ వచ్చే ఆమెను "భగినిజీ" అంటారు. పెద్ద పిల్లలపై అజమాయిషి చేస్తుంది. పన్నెండు సంవత్సరాల క్రితం తల్లి పెంచలేక వదిలివేసింది. ఇక్కడే చది వింది. రా కోమలా. ఈ అమ్మాయే మన క్రొత్త వార్డెను. కోమల నిజంగా కోమలంగానే వుంది సన్నని కలువతూడులాంటి చేతులు, గులాబి రంగు శరీరం పొడుగ్గా చిన్న పాదాలు! చిన్న అరచేతులు. తెల్లని బట్టలు ముట్టు కుంటే కందిపోతుందేమో అన్నట్టుంది. ఆమె వచ్చి చనువుగా సుశీల భుజం తట్టింది! ఇద్దరూ చూపులతోనే పలుకరించుకున్నారు.

"రా అటు వెళదాము" ఇద్దరూ ఆమె కుమారుడుండే, ఇంటివైప



వెళ్ళారు ఇంటిముందు మొక్కలకు చిన్న పిల్లలు నీళ్ళుతెచ్చిపోస్తున్నారు అయిదు సంవత్సరాల పిల్ల. మూడు సంవత్సరాల పిల్లలూ వాకిట్లో మంచంపై కూర్చుని ఆటలాడుతున్నారు, బొద్దుగా ముద్దుగా ఉన్నారు.

"ఇది నా కుమారుని ఇల్లు. వారు వేరుగానే వుంటారు. సంసారుల కొరుగు వద్దని నేను వేరుగా వుంటాను" తిరిగి ఇద్దరూ సుధీర్ వున్న స్థలానికి వచ్చారు. అప్పటికే ప్రకృతి చీకటి ముసుగు కప్పుకుంటోంది! మెట్ల ప్రక్కన గదిలో సుశీల పెట్టె పెట్టారు, అందులో అదివరకే ఇంకో మంచం ఉంది. అది ఇంకో వార్డెనుది. కోమలకు వేరే గది, చక్కని పందిరి మంచము, తివాసి, మెత్తని కుర్చీలు వున్నాయి.

"జాగ్రత్తగా చూసుకోండి అమ్మాజీ! మిమ్మల్ని నమ్మి వదలి వెళ తున్నాను!

సుధీర్ లేచాడు!

"ఆ సంగతి వేరే చెప్పాలా సుధీర్‌గారూ! మీరు విశ్రాంతిగా ఉండండి,"

"వస్తాను సుశీలా! మీరేం దిగులు పెట్టుకోవద్దు ఇదిగో ఈ రూపాయ లుంచు, ఇదిగో నా అడ్రసు! మీకేం కావల్సి వచ్చినా నాకు ఉత్తరం రాయండి" అడ్రసు కాగితం ఇచ్చాడు! ఆమె కళ్ళు నిండుకున్నాయి. అతని వెనకాల రెండు అడుగులు వేసింది.

"చాలా కృతజ్ఞురాలను! నన్ను మనిషిని చేశారు. ఇది ఎప్పుడూ మరిచిపోను. నా జీవితం ఇలాంటి మలుపు తిరుగుతుందని అనుకోలేదు"

"చూడండి జీవితంలో అనుకోనివి అనేకం జరుగుతాయి! మీరు ఇంతగా కృతజ్ఞత చూపటం నన్ను చిన్న బుచ్చటమే అవుతుంది. మళ్ళ వారం రోజులకు వస్తాను."

"మీకంటే చిన్నదాన్ని. మన్నించటం దేనికి?" కళ్ళు తుడుచుకుని అడిగినది.

"వయసులో చిన్నవారయినా. మిగతా విషయాలలో పెద్దవారు కావచ్చుగా?" అన్నాడు నవ్వుతూ.

"అంత మాటనకండి" వంగి పాదాలంటబోయింది. మధ్యలోనే భుజాలు పట్టి ఆపాడు.

"ఇదేంపని? ఇంత మార్దవముగా? మంచిగా ఉంటే ప్రపంచములో బ్రతుకలేము" ఆమె చేయి నొక్కి వదిలి ముందుకు కదిలాడు. అతను కారువరకు వెళ్ళాక వెనుకకు తిరిగింది। అమ్మాజీ నిల్చుని వున్నది.

"తను నీకేం కావాలి?" ఆరాగా అడిగినది.

"ఏం కాదు। దేవుని వంటివాడు" అన్నది వచ్చే కన్నీటిని అపు కుంటూ।

"చుటాల అమ్మాయి అని చెప్పారే అతను."

"దూరం చుట్టరికం వుందిలెండి?" అని తప్పించుకుంది.

ఇంతలో గంట వినిపించింది.

"సంధ్యావందనము గంట, వెళ్ళి కోమలతో అక్కడికి వెళ్ళు" నెమ్మదిగా కోమల దగ్గరకు వెళ్ళింది. అప్పటికే అమ్మాయిలందరూ ముందు గ్లాసులు పెట్టుకుని అరుగుమీద, చుట్టూ కూర్చున్నారు, వీరిద్దరూ వెళ్ళారు. కోమల అందరికీ సుశీలను పరిచయం చేసింది. నమస్కరించి, పద్మాసనం వేసి, చేతులు నిటారుగా మోకాళ్ళవద్ద ఆన్చి, చూపుడువేలు, బొటనవేలు, కలిపి కూర్చున్నారు। కోమల కూర్చుని తనప్రక్కకు సుశీల స్థలంచూపించి ఆమె కూర్చోగానే అందరూ "ఓం శన్నో అభిషయ" అంటూ మొదలు పెట్టారు.

పది నిమిషాలలో సంధ్య ముగియగానే, మరో గంట కొట్టారు'



పిల్లలందరూ పరుగు పరుగున పోయి, తమ కంచాలు, గ్లాసులు తీసుకుని భోజనశాలవైపు వెళ్ళారు,

"మరి నీకు కంచము కావద్దూ?" సుశీల నడిగింది.

"నేను తెచ్చుకోలేదు" దిక్కుమొహం వేసింది.

"ఫరవాలేదులే అయిదురూపాయలుంటే యివ్వు. భాండాగారంనుండి తెప్పిస్తాను" అన్నది.

సుశీల పెట్టెలోనుండి అయిదురూపాయలు తీసి ఇచ్చింది. పది నిమిషాలకు ఓ అల్యూమినియం కంచము, అలాంటిదే చిన్న గిన్నె, ఓ యిత్తడిగ్లాసు తెచ్చారు. వాటిని శుభ్రముగా తోముకుని పిల్లలకు ఎదురుగా ముగ్గురు వార్డెన్లు కూర్చున్నారు. వడ్డన ప్రారంభమయింది, పెద్దవారికి మూడు, చిన్నవారికి రెండు రొట్టెలు వేశారు గరిటెతో ఒక్క గరిటెడు కూర వడ్డించారు. పిల్లలు మరల మంత్రము చదివి తినటం మొదలు పెట్టారు. కోమల అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్తూ తింటున్న సుశీల కలకలం చూచి తలెత్తింది.

"భగినీ, వడ్డించేవారు మిగిలిన రొట్టెలు తమ స్నేహితులకే వడ్డిస్తారు"

"అవును భగినీ దాచి తర్వాత తింటారు" ఇంకో గొంతు.

"రీటా। అక్కడ యెన్ని రొట్టెలున్నాయి?" కోమల అడిగింది.

"నూటా పదిమంది ఉన్నారు. ముప్పై రొట్టెలున్నాయి. అందరికీ ఎలా వడ్డించను భగినీ?"

"అన్నింటిని నాల్గు నాల్గు ముక్కలు చెయ్యి। అందరికీ వడ్డించు" ఆమె కంఠస్వరం వింటూనే సీతముఖం మాడ్చుకుని, ఒక్కొక్క రొట్టెను నాల్గు ముక్కలు చేసి తపీమని కంచాలలో వెయ్యసాగింది. చిన్న మాడి పోయిన ముక్క కూడా క్రింద వెయ్యకుండా తిని కంచాలు శుభ్రంగా

నాకినట్లు చేసి లేచారు. తలొకచోట కూర్చుని వాటిని తోమి కడిగి పెట్టుతున్నారు. వాళ్ళు అలా కడుగుతుండగానే మరో గంట అయింది. అందరూ తమ మంచాలుగా ఉపయోగించే బల్లలమీద కూర్చుని పుస్తకాలు తీశారు. కోమల ఇంకో వార్డను సుమన్ ఇద్దరూ చేరొక బెత్తం పుచ్చుకొని పెట్టెల్లో తిరుగసాగారు. ఆ ప్రక్రియను మెచ్చుకోకుండా ఉండలేక పోయింది సుశీల.

ముప్పావుగంట అలా గడిచిందో లేదో మరో గంట వినిపించింది. అందరూ లేచి లైనుగా నిల్చుని పైకి వెళ్ళారు. మైత్రివి పరుపు మీద కృష్ణాజినం వేసుకుని రెండు ప్రక్కలా దిండు పెట్టుకొని బాబాజీ కూర్చున్నారు. కొద్ది దూరంలో చిన్న మంచంపై అమ్మాజీ పడుకున్నది. అందరు దగ్గర దగ్గరగా కూర్చున్నారు. వారికి ఒక ప్రక్కన వార్డెనులు కూర్చున్నారు.

"పిల్లలూ! మీరంతా లేత మొగ్గలవంటి వారు. మీ హృదయాలు వికసించలేదు. మన సమాజములో యెన్నో అన్యాయాలు అక్రమాలు, మూర్ఖపు పనులు, మూర్తి పూజలు జరుగుతున్నాయి. దానిని అరికట్టవలయుననే కొందరు మహనీయులు కొత్త సమాజమును స్థాపించినారు. అదే ఆర్యసమాజము!" హిందీలో సాగుతోంది ఉపదేశం. అతని కొడుకు కోడలూ నీటుగా ముస్తాబై వచ్చారు.

"అమ్మాజీ! మేము సినిమాకు వెళుతున్నాము పిల్లలున్నారు" అని చెప్పి వెళ్ళిపోయింది కోడలు. వెనకాలే కొడుకు వెళ్ళిపోయాడు క్రాపు సవరించుకుంటూ.

"కోమలా! వెళ్ళమ్మా" అమ్మాజీ ఆజ్ఞ వింటూనే కోమల వెళ్ళిపోయింది!

"యెక్కడికండీ?" సుశీల అడిగినది! సుమన్ మూతి ముడిచి గుసగుస లాడింది!



"ఆమాత్రం అర్థం చేసుకోలేవూ? ఆ పన్నెలాటి సినిమాకెళ్ళింది కోమల పిల్లలను చూడాలి."

"సుమన్ కొత్త! ఆమెకు తెలియదు. నీకు తెలియదా యిక్కడి నియమము!" బాబాజీ హిందీలో మందలించాడు. "మన పెద్దలు దబ్బుకూడబెట్టడం తప్ప మరేమీ నేర్వలేదు! కాళ్ళకు కడియాలు, చేతులకు కంకణాలు, మెడకు గొలుసువేసి, స్త్రీని పశువులా బంధించేవారు. వారి పద్ధతులే యువ తరంవారు అనుకరిస్తున్నారు. మీరంతా విద్యావంతులై .... ఆమూల యెవరో నిద్ర పోతున్నారు. సుమన్ చూడు."

సుమన్ వెళ్ళి చూచింది. ఒకరేం కర్మ అందరూ జోగుతున్నారు. "అందరూ జోగుతున్నారు బాబాజీ."

"పంటల అజమాయిషీ యెవరిది? చకోరిదనుకుంటాను. అందరికి పొట్టలు పగుల పెడుతుంది, అందుకే నిద్ర. బెత్తంతో రెండు అంటించు సుమన్" బాబాజీ ఎర్రగా చూచాడు అందరివంకా, అందరూ కళ్ళు నులుముకుంటూ వీపులు చక్కగా పెట్టి కూర్చున్నారు.

"నేను ఎప్పటిలాగే తిండి పెట్టాను బాబాజీ. ఇప్పుడు సమయము తొమ్మిదిన్నర దాటింది...."

"చకోరి! నీకు యెదురు జవాబులు చెప్పవద్దని చాలాసార్లు చెప్పాను. అమర్యాద పిల్లవు."

"వెళ్ళి పడుకోమనండి, వారికి మంచి విషయాలు వినవలెనని లేదు" అమ్మాజీ చెప్పింది. వెంటనే పిల్లలు కిలకిలమంటూ అమ్మాజీ బాబాజీ పాదాలు అంటి క్రిందికి పరుగు తీశారు.

"సుమన్ బేటా! ఈ మందు కొంత వీపులకు రాయి." అమ్మాజీ దగ్గరకు వెళ్ళింది సుమన్!

"ఇలా రా!" బాబాజీ పిలిచాడు సుశీలను. దగ్గరకు వెళ్ళింది. "సత్యార్థ ప్రకాష" యిచ్చి చదువమన్నాడు.

పదకొండు గంటలకు సుమన్, సుశీల తమ గదిలోకి వచ్చిపడ్డారు. సుమన్ మళ్ళీ లేచింది." పద పిల్లలు సరిగా పడుకున్నారా. తలుపులు వేసుకున్నారా, లైట్లు ఆర్పారా.... ఇవన్నీ చూచి రావాలి" అన్నది. ఇద్దరూ వెళ్ళి అన్నీ పరిశీలించి వచ్చి పడుకున్నారు.

సరిగ్గా నాల్గు గంటలకు అలారం మ్రోగింది, సుమన్ లేచివెళ్ళి గంట కొట్టింది, కోమల పిల్లలను లేపడానికి వెళ్ళింది. మరో పది నిమిషాలలో పెద్ద లైను తయారయింది. చంకలో బట్టలమూట, చేతిలో చెంబు. పిల్లలందరూ కళ్ళు నులుపుకుంటూ వచ్చారు. సుశీల హడావుడిగా ఓ చీర బ్లౌజు, టవల్‌లో చుట్టుకుంది, తనకు చెంబులేదు.

"పర్వాలేదు పద" అన్నది సుమన్.

కోమల ముందూ, సుమన్, సుశీలలు వెనుకగా ఏవో మంత్రములు చదువుతూ దగ్గరలో ఉన్న చెరువుకేసి వెళ్ళారు. దగ్గర అంటే ఇంచుమించు అరమైలు, ఓ పెద్ద బండమీద కోమల కూర్చుంది. ఆమె చుట్టూ బట్టలు పెట్టి, చెంబులతో నీరు తీసుకుని అందరూ తలో మూలకు వెళ్లారు.

"సుమన్! నువ్వూ, సుశీల చూచుకోండి కొంచెము నిద్ర పోతాను. రాత్రి పిల్లలు పడుకోనివ్వలేదు!"

కోమల చల్లటి బండమీదపడి నిద్ర పోయింది. అందరూ చెంబులు తోమి కడిగి, ముఖాలు కడుగుతున్నారు. ఆ చీకటిలోనే బట్టలు ఉతుకుతున్నారు! తరవాత చెరువులోకిదిగి ఈతలు మొదలు పెట్టారు. పట్టపగలు అయింది. సుమన్, సుశీలలు కూడా తయారు అయ్యారు, సుమన్ కోమల బట్టలు ఉతికింది.

"కోమలక్కా లే! అందరూ తయారవుతున్నారు."



కోమల లేచి హడావుడిగా, ముఖం కడుక్కుని, అండర్‌వేర్‌తో ఈత కొట్టివచ్చి పొడిబట్ట లేసుకుంది. ఈ లోగా సుమన్ అందరిని వరుసగా నిలబెట్టింది. సూర్యోదయం అయ్యేసరికి అందరూ గురుకులం చేరారు బట్టలు అరవేసి వచ్చారు.

తొందరగా సంధ్యావందనము చేసి చెట్టు క్రింద మూగారు. చిన్న పిల్లలకు పెద్ద పిల్లలు జడలు వేస్తున్నారు, ఒకమ్మాయిది ఒత్తయిన జుట్టు, దానికితోడు వంకీలు తిరుగుతూ పొడ. పొదలాడుతున్నది. చకోరి ఆ పిల్ల తలను దువ్వుతూ విసుక్కుంటోంది. సుశీల అక్కడికి వెళ్ళింది.

"ఎందుకలా విసుక్కుంటున్నావు?" నెమ్మదిగా ప్రశ్నించినది.

"విసుక్కోక ఏం చెయ్యమంటారండీ! వీళ్ళు నెలకు ముప్పై రూపాయలు తీసుకుని సగం కడుపుకు కూడు, నెలకు నాల్గు ఉపవాసాలు వారానికి ఓ సారి తలకు నూనె ఇస్తారు, సబ్బులు, అవి తెచ్చేటప్పుడు ఓ నూనెసీసా తెప్పించుకోమని చెప్తాను! అది తెప్పించుకోదు. ఈ జుట్టును అదుపులోకి తెచ్చి జడ వేసేసరికి నా ప్రాణం పోతుంది. పైగా ఓనీళ్లుకు నేను వేస్తేనే నచ్చుతుందట...."

"సుశీలా, ఇటురా! చకోరి పక్కా కమ్యూవిష్టు. ఈఅమ్మాయిలకు తల దువ్వు" కోమల పిలిచింది.

జడలు కాగానే అందరు, తమ తమ బల్లలమీద పాఠాలు చదువుతూ కూర్చున్నారు. ఊడ్చేవంతున్నవారు మాత్రం తలలకు టవలు చుట్టుకొని చీపురు పుచ్చుకుని బయలుదేరినారు, చకోరి బియ్యమూ, పప్పు తీసుకుని వంట యింటివైపు బయలుదేరినది. శేరున్నరపప్పు, పదిశేర్ల బియ్యమున్నాయి.

"చాలా చకోరీ? ఇంకేమయినా వండుతారా?" చకోరి పెద్దగా నవ్వింది.

"అదిగో అక్కా! ఆకలయితే అ గడ్డి తినవచ్చు. నేను పదిపేర్లు యిస్తాను. కొందరున్నారు. అమ్మాజీ అనుగ్రహము సంపాదించాలని రోజుకో అర్ధసేరు తక్కువ ఇస్తారు. వారిని చూచి ఓహో! అంటుంది. ఈ పప్పులో పసుపుపోసి రంగు నీళ్ళలా చేస్తారు. చింతపండు వంటికి మంచిదికాదు. మిరపకాయలు రోగాలు తెస్తాయి. మసాలాలు కడుపులో మంటలు లేవదీస్తాయి. మీరే చూస్తారు! నేను చెప్పితే తమాషాగా కనిపిస్తుంది!" అన్నది బియ్యం కడిగి వంటామెకిస్తూ.

"మరి ఇంత ఇష్టము లేనిదానివి ఇక్కడెందుకున్నావు చకోరి?"

"ఖర్మ! అమ్మలేదు! నాన్న పిన్ని పెట్టే బాధలు చూడలేక ఇక్కడ వుంచారు" చకోరి మాటలు పూర్తికాక మునుపే "అమ్మాజీ" పిలుస్తుందని ఓ అమ్మాయి కబురు తెచ్చింది.

"వెళ్ళక్కా! కోడలికి వంట సహాయమో, తనకు కాళ్ళు ఒత్తుడో చెయ్యాలి?" చకోరి మాటలకు నవ్వుకుంటూ పైకి వెళ్ళింది.

"రామ్మా సుశీలా! నీకు వంట బాగా వచ్చునని విన్నాను. నా కోడలి విషయం చెప్పానా? కాస్తవెళ్ళి సహాయం చేయగలవా? నీ కిప్పుడేం పని లేదుకదా?" లేదని తలూపి, కోడుకు ఇంటికి వెళ్ళింది. అప్పటికే కోమల అమ్మాజీ బాబాజీకి వంట చేయటంలో లీనమయింది.

"రా అమ్మాయి! మొదట పిల్లలకు స్నానాలు చేయించుకో" కోడలు ఆజ్ఞాపించింది. పిల్లలకు స్నానాలు చేయించి బట్టలు వేసి వంట ఇంట్లోకి వచ్చింది,

"ఇదిగో అమ్మాయి మూడు స్టవ్‌లున్నాయి! ముప్పావుగంటలో వంట అయిపోవాలి. కూర, పప్పు, రొట్టెలు అన్నం చాలు! అదుగో పప్పు పుడుకుతోంది, మా వారికి కారం, నూనె దండిగా వుండాలి సుమా!" అంతే



ఆమె వెళ్ళి డ్రాయింగ్ రూమ్‌లో భర్తతో బాతాఖాని వేసుకొంది. తన నేర్పునంతా చూపి వంట చేసింది. అనుకున్న సమయానికి పూర్తి చేసింది!

"వెళతాను" అన్నది కోడలితో,

"వెళ్ళు. ఇప్పుడే మీ భోజనాల గంట అయింది" ముఖాన పట్టిన చెమట తుడుచుకుంటూ త్వరగా భోజన శాలలోకి వెళ్ళింది.

"రా నీ కంచము పెట్టాము" సుమన్ పిలిచింది.

అందరికి గుప్పెడు మెతుకులు చిన్న గిన్నెలో పప్పు అనబడే నీళ్ళలాంటి పదార్థము వడ్డించారు. నీళ్ళు అన్నంలో పోసుకుంది. వేడినీళ్ళు పోసుకున్నట్లే వుంది. ముద్ద దిగడంలేదు. అందరు తనవలెనే బాధపడుతున్నారా అని చూచింది. పాపం! ఆవురావురుమంటూ తింటున్నారు. తలెన్నా ఎత్తటం లేదు.

కొంచెము ఉప్పు అడిగి వేయించుకొని భోజనము కానిచ్చినది. బైట చెట్లనీడలో కొన్ని క్లాసులు. షెడ్డులలో కొన్ని క్లాసులు జరుగుతాయి. ప్రత్యేకముగా ఉపాధ్యాయులు లేరు. కోమల అన్నీ ఇంగ్లీష్ క్లాసులు తీస్తుంది. అమ్మాజీ ఓ పండితులు వస్తారు. మిగిలినవితీరికను బట్టిఅమ్మాజీ బాబాజీ చెప్తారు. కొన్ని చిన్న తరగతులకు పెద్ద తరగతి పిల్లలే ఉపాధ్యాయినులు. తెలుగు మొత్తము సుశీల కిచ్చారు. మొదటిరోజు కాబట్టి గుణింతాలు అవి ఇవి చెప్పి పాఠము అయిందనిపించినది. రెండు గంటలకు విరామము గంటకొట్టారు. పిల్లలు చెట్టుక్రిందే గుమిగూడినారు. చకోరి రెండు బుట్టలు పట్టుకొచ్చి వారి యెదురుగా దింపింది. ఇంకో ఖాళీ బుట్టతో మరో అమ్మాయి వచ్చింది. ఇద్దరూ కలిపి బుట్టలోని అరటిపండు ఒక్కొక్కటే తీసి తొక్క వలచి ఒక్కొక్క అమ్మాయికిచ్చి పంపుతున్నారు. తొక్క వలచక యిస్తే అది కూడా తింటారని భయమా? ఒక్క అరటిపండు తినటం యెకత పేపు? అందరు మంచినీళ్ళకు క్రిందికి

వెళ్ళిపోయారు. ముగ్గురి వార్డెన్స్‌కిమాత్రం తొక్కు వలచక ఇచ్చింది చకోరి రెండో అమ్మాయి తొక్కల బుట్టమీద వార్తాపత్రిక కప్పి తీసుకు వెళ్ళింది.

"తొక్కలు అంత జాగ్రత్తగా తీసుకెళుతుందేమిటి?" సుశీల అడిగింది. ఆ అమ్మాయి తెలివికి జాలి తలచినట్టు!

"అవి రాత్రికి కూర వండుతారు" సుమన్ చెప్పింది. అవనమ్మకంగా చూచింది సుశీల.

"నిజమే! సుశీలకు కొత్తకదూ? రాత్రికి రుచి చూద్దుగాని పద చందాదారుల పట్టిక తయారు చేయాలి."

ముగ్గురు "అమ్మాజీ" గదిలోకి వెళ్ళారు. కోమల కొన్ని కాగితాలు తీసుకునిబయటికి వచ్చింది.

"సుమన్ కొంచెము నా అలమారా సర్దు" అమ్మాజీ పడుకుని సుమన్ను పిలిచింది. ఆమె అక్కడే ఆగిపోయింది. సుశీల కోమల దగ్గర కొచ్చింది,

"కాస్త ఈ లిస్టులో ఉన్న పేర్లు చెప్పు. నేను రిజిష్టరులో ఎక్కిస్తాను."

సుశీల చెప్పుతూ ఓ పేరు దగ్గర ఆగిపోయింది. సుధీర్ సంవత్సరానికి వెయ్యి రూపాయలు చందా యిస్తున్నాడు. అందుకేనా తనకు వీళ్ళు ఉద్యోగం యిచ్చింది.

"ఊఁ ఆగిపోయావు, గంట కాకముందే పూర్తిచెయ్యాలి." కోమలి హెచ్చరించింది.

"అక్కా! పిల్లలవద్ద ఫీజులు తీసుకుంటారుకదా? మరి చందాలు దేనికి?"

"మనలాంటి అనాథలను పోషించడానికి! అదంతా పెద్దవ్యాపారం. నెమ్మదిగా అర్థం చేసుకుందువుగానిలే!"



ఇద్దరు పని పూర్తిచేసి మంచినీళ్ళు త్రాగేసరికే గంట అయింది. తర్వాత రెండే పిరియడ్లున్నాయి. వ్యాయామము గంట అన్నారు. సుమన్ వెళ్ళి ఓ చిన్న గదితాళం తీసింది. కొందరు కర్రలూ, లేజీమ్స్, బంతులూ తీసుకుని వారి పెద్దముందు వ్యాయామము మొదలు పెట్టారు.

"అమ్మాజీ, బాబాజీ, సికింద్రాబాద్ వెళుతున్నారు, మిమ్మల్ని వంట చెయ్యమన్నారు కోమక్కా!" సుమన్ చెప్పింది.

కోమల విసుక్కుంటూ వారి వంటయిల్లు చేరింది. గాజులకు పిండి కలిపి పెసరపప్పు కుంపటిమీద పడవేసింది. బంగాళాదుంపలు, బటానీలు తీసింది. దోసకాయలు పచ్చడికి తీసింది. పచ్చిమిరపకాయలు, కందగడ్డ మజ్జిగ పులుసులోకి తీసింది.

"ఇవన్నీ ఆధరువు లెందుకక్కా?"

"నయం పంచదార కంట్రోలు బ్రతికిపోయాము, లేకుంటే జాజర్ గడ్డహల్వా రవ్వ కేసరో, ఖీరో, రత్నపురి గడ్డలో హల్వానో రోజూ చెయ్యాల్సి వచ్చేవి."

"అక్కా! వంట తర్వాత గీత నాన్నగారు వచ్చారు. తీసుకెళ్లారి" సుమన్ వచ్చింది.

"అక్క ఎందుకు? గీత వెళ్ళ లేదా?" సుశీల సుమన్ వంక చూచింది.

"సుశీలమ్మ తల్లీ! వారంరోజులు ఇక్కడి వాతావరణం జీర్ణించుకుని తర్వాత ప్రశ్నలు కురిపించు. పెద్ద అమ్మాయి తల్లి తండ్రులు వస్తే కోమక్క, మధ్య వారి బంధుజనం వస్తే నేను చిన్న పిల్లల ఆత్మీయులు వస్తే, నీవు వారి వెంటవెళ్ళి వారి వారు తెచ్చిన వస్తువులు చూచి, అమ్మాజీకి చూపించి, అమె తృప్తి చెందిన దాంట్లో కొంత భాగం అంచే వాళ్ళిస్తేనే సుమా, మనము మెయ్యాలి."

"తెలుసు. కాని, వారు దూరంనుండి వచ్చారు. చాలా ప్రాధేయపడ్డారు."

"ఏదో పెద్ద బుట్ట తెచ్చారట" క్షణం ఆలోచించింది. కోమల తలవంచుకుని జవాబు చెప్పింది.

"లేదు. సబ్బులు, నూనె చిన్న వస్తువులుంటే బుట్టతో తెచ్చుకోమని సుమన చెప్పింది,"

"మీకు నా బాధ అర్థంకాదు! మూర్ఖులు తల్లితండ్రులు తెస్తారు. ఈ పిల్లలు తింటారు. అడ్డమైన రోగాలు వస్తే గురుకులం పేరు పాడవుతుంది. కోమలా నువ్వు చాలా స్వేచ్ఛ యిస్తున్నావు పిల్లలకు.... అమూల్యమెవరదీ? కవిలూ, అ కూర అలా పారేశావే? రుచులు కావాలి" అని గొణుక్కుంటూ వెళ్ళిపోయిందామె.

"ధన్యవాదాలు భగినీ నా కోసం మీరు అబద్ధం ఆడవలసివచ్చింది.

గీత వచ్చింది.

"ఫర్వాలేదు. వెళ్ళమ్మా."

వార్డెన్‌లు ముగ్గురూ కూర్చున్నారు. చకోరి రెండేసి పచ్చిమిరపకాయలు, ఇంత ఉప్పు తెచ్చి కంచాలలో వేసింది.

"భగినీ! ఈ రోజు కూరగాయలతో పది పచ్చిమిరపకాయలు కలిసి వచ్చాయి. అమ్మాజి లేదు. ఉంటే యేరించి కూరగాయలు బుట్టలో వేసుకునేది" చకోరి తనూ కూర్చుంది.

"అయితే కూరగాయలమ్మేవాడి కెలా తెల్సిందబ్బా ఈ రోజు అరటితొక్కల కూరవి?" సుమన్ చమత్కరించింది,

"ఏమర్రా పిల్లలూ! రేపు గురువారం అని గుర్తుందా? రేపు ప్రొద్దున అన్నమూ మధ్యాహ్నము టిఫినూ ఉండవు. అరటి తొక్కలో, ఆకో-అలమో తిని కడుపు నింపుకోండి." ఆమెమాటలకు పిల్లలునవ్వారు.





సుశీల పక పక నవ్వింది. "సుమా! నువ్వు వెళ్ళరాదూ?" కోమల అడిగింది.

"పోనీ గీతను ఒక్కదాన్నే పంపనా? ఆ వచ్చినవారు మింగేటట్టు చూస్తారు బాబూ!"

"- కావలా వెధవ సి. ఐ. డి. అమ్మాజి రాగానే అంటిస్తాదు. వెళ్ళమ్మా!" సుమన్ వెళ్ళిపోయింది.

త్వరగా ఇద్దరు వంట ముగించి వచ్చేసరికి గీత పెద్ద పండ్లబుట్ట, మిఠాయి డబ్బా, సబ్బులు పట్టుకుని వచ్చింది.

"భగినీ! చాలా వున్నాయి. ఇక్కడే వుంచనా?" ఆ పిల్ల ముఖం మలినమయింది.

"పరవాలేదు బుట్టలోవివి పెట్టెలో దాచి, బుట్ట ఎటన్నా పారెయ్యి. తీసుకెళ్ళు" కోమలిపైపు కృతజ్ఞతా పూర్వకంగా చూచింది గీత. కొంత మిఠాయి, ఆరు బత్తాయిలు వారి ముందు వుంచినది.

"ఇదిగో గీతా! మా ముగ్గురికి మూడు చాలు. ఇవి తీసుకో." అనగానే అన్నీ తీసుకుని వెళ్ళిపోయింది.

"అదేమిటి కోమలక్కా! మనసతి భగిని వుండగా పాపం నగం మింగేది" సుమన్ అన్నది.

అందరు భోజనాలకు కూర్చున్నారు. తలపై ముసుగేసుకుని అమ్మాజి వచ్చింది.

"కోమలీ!" అని పిలువగానే కోమలి లేచింది.

"అతిథులు ఎవరయినా వచ్చారా?" అన్నది.

"అవును గీత బంధువులు ఎవరో వచ్చారు."

"ఈ రోజు అతిథులు కలిసే రోజు కాదని తెలియదా!" ఆమె కంఠము తీవ్రంగా వుంది.

రెండవరోజు అందరూ ఉపవాసము. చిన్న పిల్లలు మాటిమాటి మంచినీళ్ళకు పోవడం మొదలు పెట్టారు. విరామ సమయంలో గీత ఇద్దరు పిల్లల్ని ఈడ్చుకుని కోమల దగ్గరకు తెచ్చింది.

"భగినీ! వీళ్ళిద్దరు నా పెట్టె తాళం లాగి పండ్లు తీసుకు తిన్నారు."
కోమల ఆ పిల్లల చెవులు మెలివేసింది.
"గీతా! వెళ్ళి బెత్తం పట్టుకురా."

"వద్దు అక్కా! కొట్టకు బాగా ఆకలి వేసింది. యింకెప్పుడు చెయ్యము." యిద్దరూ ఏడ్వడము మొదలు పెట్టారు.

కోమల ముఖం అదోలా అయింది. గీతకు క్షమార్పణ చెప్పించింది. సాయంత్రము అన్నంకోసం తహ తహ లాడసాగారు. కొందరు చిన్నపిల్లలు కంచాలు కడుక్కునే ఓపికలేక అలాగే తెచ్చిపెట్టుకున్నారు. వాళ్ళను కేకలేస్తూ చకోరి అందరి కంచాలలో నీళ్ళు పోసింది. అన్నంపెట్టి సున్నపు తేటగా వున్న మజ్జిగ పోశారు. దానిలోకి రాలిన మామిడి పిందెల పచ్చడి నంజుకోవడానికి వేశారు. దాంట్లో ఉప్పు తప్ప మరేం లేదు. దాన్నే అవురావురుమంటూ తింటున్నారు. ఇంకో అమ్మాయి తన యింటి నుండి తెచ్చుకున్న పచ్చడి వీళ్ళ ముగ్గురికి వేసింది. భోజనం కాగానే అందరు సంధ్యావందనము చేసే అరుగుమీద చేరారు.

"ఈ రోజు చదువు. ఉపన్యాసము ఉందా!" సుశీల కోమలవంక చూచింది.

"ఉండవు. ఈ రోజు పిల్లలు గురుకులము. యశము పాటలు పాడతారు పద"

అందరూ కూర్చున్నారు.

"చకోరి అమ్మా భారతితో మొదలు పెట్టు" కోమల ఆజ్ఞాపించింది. చకోరి మధ్యలో వెళ్ళి కూర్చుంది.

"అమ్మా భారతి నేడు మాకు మధురగానము వినిపించు!



స్వతంత్రరాగ మాలపించి అమృతమే కురిపించు॥
ఇన్ని వర్షము మేముంటిమి మన పాలనలో
పరవశింప జేయవే మము నీ స్వేచ్ఛా పాలనలో॥ అమ్మా॥

"ఈ రోజు నాకు బాగా లేదక్కా! మరో రోజుపూర్తిగా పాడుతాను మధ్యలోనే లేచింది చకోరి. గీత హిందీలో పాట చెప్తుంటే అందరు అందుకుని పాడుతూ తాళం వేయసాగారు.

ప్రాణోంకి నే నెవాలి గురుకుల్ తు మేరి మాతా!
అమృత్ పిలానే వాలి గురుకుల్ తు మేరి మాతా!

(గురుకులం స్థాపించిన అమ్మ మా కోసం ప్రాణం యిస్తుంది అమృతం తెస్తుంది తాగడానికి.)

చకోరి నవ్వుతూ తాళం వెయ్యసాగింది.

"యెందుకు నవ్వుతున్నావు!" సుశీల అడిగింది.
"ప్రాణాలు యిచ్చేది అనేది తీసుకునేది అంటే చాలా బాగుండేది.

చకోరి మాట పూర్తి కాకముందే బాబాజీ వచ్చాడు. "పాటలు చాలు అందరూ ఒక్కొక్క శ్లోకం చదవండి."

వరుసగా లేచి తమ కొచ్చిన శ్లోకాలు చదివారు.

"సుశీలా! నువ్వు నేర్చుకో. చూడు యిక్కడ చిన్న పిల్లలు కూడా ఇక్కడ యెంత బాగా నేర్చుకున్నారో" గర్వంగా గడ్డం రాచుకున్నాడు.

"నాకు గీత మొత్తం కంఠతా వచ్చును. బాబాజీ!" కొన్ని శ్లోకాలు చదివింది.

అప్పటికే పది కావస్తూంది. అందరూ లేచి అతనికి పాదాభివందనం చేసి వెళ్ళిపోయారు.

ఆ రోజు ఆదివారం. అందరూ హోమము చేసి లేచేసరికి అతిథుల రాక ప్రారంభమయింది. యెవరో చిన్నపిల్ల తల్లి వస్తే అమ్మాయిని

తీసుకుని బయలుదేరింది సుశీల. దారిలో అమ్మాజీ కనిపించింది.

"చూడు సుశీలా! చిన్న పిల్లలు ఉన్నవి లేనివి చెప్తారు. నేర్పుగా ప్రవర్తించి తల్లితండ్రులను మెప్పించాలి. తెచ్చిన వస్తువులు జాగ్రత్తగా తీసుకు రావాలి" అని బోధన చేసింది.

తలూపింది.

అందరూ తమ తమ వారికోసం, అటునుండి, యిటునుండి తొంగి చూస్తున్నా.

సుశీల అతిథి గృహం చేరింది. ఆ పిల్ల తల్లి వడిలో దూరిపోయినది. తల్లి కన్నీరు పెట్టుకుంది.

"అమ్మా! నేను ఇక్కడ వుండనే కడుపు నిండా అన్నం పెట్టరు. మాయింటికి వస్తానమ్మా" ఆ పిల్ల మారాం మొదలు పెట్టింది.

"నేను ఏం చెయ్యను? ఇదంతా మీ నాన్న ముచ్చట. నేను చదువలేదుట. నిన్ను పెంచలేనుట" ఆ తల్లి ఓదారుస్తూ తాను తెచ్చిన వస్తువులు తీసి తినమంది. మీగడ, ఉడికించిన గుడ్లు, రెండు పూరీలు తిన్నది. మిగిలినవి అన్నీ సంచిలో పెట్టుకున్నది. అరగంట అయ్యాక ఏడుస్తూ తల్లి వెళ్ళిపోయింది. పిల్లనూ, వస్తువులను అమ్మాజీ ముందు హాజరు పరిచింది సుశీల.

"ఇదేమిటి? సెనగపిండి చక్కిరాలా! ఇవి తిని కడుపునొప్పి తెచ్చుకుంటావ్. నాలుగు తీసుకుని మిగతావి ఇక్కడుంచెయ్యి. ఆ అవకాయ తినటానికే! కడుపులో మంట. అది పెట్టు. పళ్ళు నలిగిపోయినట్టున్నాయి. తీసుకుపో" నాలుగు చెక్కిలాలు తీసుకొని మిగతావి అక్కడ ఉంచినది, ఆ పిల్ల క్రిందికి వచ్చాక రెండు పండ్లు, ఓ చెక్కిలం సుశీలకు యివ్వబోయింది.



"వద్దమ్మా! ఉంచుకో," ఆ అమ్మాయి స్కర్టుతో కళ్ళు వొత్తుకుంటూ వెళ్ళిపోయింది. దినమంతా అలాగే గడిచిపోయినది. మధ్యాహ్నము రెండేసి పూరీలు, గరిటెడు చక్కెర అందరికీ యిచ్చారు.

సాయంత్రం అమ్మాజీ బంధువులు వచ్చారు. అందరికీ పిల్లలు దగ్గర తీసుకున్న ఫలాహారాలు పెట్టించింది. అవి పెట్టి అందించినపుడు సుశీల కళ్ళు చమర్చాయి. సాయంకాలం ఆరు దాటాక అమ్మాజీ కోడలు_ పిల్లలు షికారుకి వెళ్ళారు. అప్పుడు సుధీర్ వచ్చాడు. కోమల వెంటరాగా సుశీల వెళ్ళి అతనికి నమస్కరించింది.

"యెలా వున్నారు?" నవ్వుతూ ప్రశ్నించాడు.

"బాగుంది. పిల్లల మధ్య సమయం యెలా గడిచిపోతోందో తెలియదు. దాదా బావున్నాడా?"

"దాదాకేం మిమ్మల్ని చూచినప్పటినుండి వాడికి క్రొత్త క్రొత్త ఆలోచనలు వస్తున్నాయి. దానికేంగాని ఓ విషాదవార్త. ఉమాపతిగారు పక్షవాతం వచ్చి ఆసుపత్రి చేరినారు."

"యెప్పుడు? మీరు వెళ్ళి చూచారా?" బాధగా అడిగినది.

"చూచాను! మీ విషయం చెప్పాలని దుకాణానికి వెళ్ళితే అతని విషయం తెలిసింది. వెంటనే ఆసుపత్రికి వెళ్ళాను. ఒకవైపు పూర్తిగా పడిపోయింది."

"అమ్మాజీని అడగండి. వచ్చి చూస్తాను."

"ఆయన్ను మద్రాసు తీసుకెళ్ళారు. రెండు నెలలవరకు రారనే అనుకుంటాను. మీరేం బాధపడవద్దు. ఖర్మానుస్వారముగా జరుగుతుంటుంది. ఆ బ్యాగులో పండ్లు, అవి ఉన్నాయి, తీసుకోండి. నేను తొందరగా వెళ్ళాల్సిన పని ఉంది. మీరు యెదురు చూస్తారని వచ్చాను."

"యెందుకు యింకా శ్రమ తీసుకుంటున్నారు. ఇక్కడ తినటానికి పెడ్తున్నారు." బ్యాగు అందుకున్నది.

"నాకెప్పుడయినా అవసరం వస్తే మీరు సహాయం చెయ్యరా?"
అతని చూపుల నెదుర్కోలేక తల దించుకుంది.

"వస్తాను. అవసరమనిపిస్తే ఉత్తరం రాయటం మర్చిపోయేరు." అని కార్లో కూర్చుని స్టార్టు చేశాడు,

"అక్కా! యివి అమ్మాజీకి చూపించవలెనా?"

"చూపిస్తే అవి అన్నీ అలమరలోకి వెళ్ళాయి మరేం ఫర్వాలేదు ఉంచెయ్!"

కోమల చెప్పినదానికి తలాడించి అవి గదిలో పెట్టింది.

"సుశీలా! సుధీర్ వచ్చాడా?" అమ్మాజీ అడిగింది.

సుశీలకు భయం పట్టుకుంది. అతను తెచ్చినవి యెందుకు చూపలేదని అడుగుతుందేమో, తడబాటుగా జవాబు చెప్పింది. "అవునండీ, మా మావయ్యకు పక్షవాతం వచ్చిందట. చెప్పి వెళ్ళారు" అన్నది.

మరేం మాటలు జరుగలేదు.

"ఈ కోమల చెడగొడుతుంది అందరిని. దాన్ని యేటన్నా పంపడమంటే బాబాజీకి ఇష్టంలేదు" గొణుక్కోవటం వినిపించింది.

ఆ రోజు పెద్ద గందరగోళం జరిగింది. చెట్టుకున్న పెద్ద మామిడి కాయలు యెవరో కోశారట. అందరినీ సమావేశపరచి ఆరా తీశారు. యెవరూ తీశామని ఒప్పుకోలేదు మాకు తెలియదంటే మాకు తెలియదని గోలపెట్టారు. అమ్మాజీ మండిపడింది.

"ఈ రోజు యిది. రేపు మరొకటవుతుంది. వార్డెనులు అజాగ్రత్తగా ఉంటున్నారు. దీనికి శిక్ష అందరూ అనుభవించాల్సిందే! ఈరోజు సాంతము అన్నంలేదు మీకు, వంటయిల్లు మూసివెయ్యమను."

అంతే, వంటయిల్లు మూసివేసి, వంటావిడ వెళ్ళిపోయింది. చిన్న పిల్లలు బిక్కమొహాలు వేశారు.



సాయంత్రానికి కొందరు కడుపులు పొదువుకుంటూ ఏడ్వసాగారు. చకోరిలాంటి అభిమానవంతులు నిబ్బరంగా తిరుగుతున్నారు. ఆరు గంటలకు అందరూ సమావేశం కావల్సిందిగా శ్రీముఖం వచ్చింది.

"ఇంకేమి ఉంది? దొంగతనాలు చేస్తే పాపం చుట్టుకుంటుందని ఉపన్యాసం యిస్తారు. కోమలక్కా! నీకు పుణ్యం ఉంటుంది గాని నాకు కడుపునొప్పి, పడుకున్నానని చెప్పి, ఆవిడో ఆయనో క్రిందికి రావలిస్తే కాస్త యెవరితోనన్నా కబురు చెయ్యి" అని పడుకుంది.

"వారు వస్తే కాస్త మూల్గుడు ఎక్కువ చేస్తావా చక్కీ?" నీరసంగా చెప్పింది కోమల.

"యెన్ని వేషాలు వెయ్యకపోతే బ్రతుకు వెళ్ళమారుతుంది?" గంభీరంగా అన్నది.

అందరూ పైకి వెళ్ళారు, ఉపన్యాసం మొదలయింది. చెవులు దిమ్మగా వున్నాయి. వారు చెప్పేది ఏమి వినిపించటంలేదు. రెండుగంటలు గడిచాయి.

"ఆ మూర్ఖురాలు కనిపించదేం?" అమ్మాజీ ప్రశ్నించింది.

"కడుపులో నొప్పిట. పడుకున్నది" సుమన్ జవాబు చెప్పింది.

"అది చెబితే మీరు నమ్మారా. జడలు పట్టుకుని ఈడ్చుకు రాకపోయారా?"

"ఆమె మా అంత పొడవు ఉన్నది. తిరగబడితే? నిన్న రాత్రి కూడా తిండి తినలేదు."

అమ్మాజీ కోపంగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

"వెళ్ళి పడుకోండి! మిమ్మల్ని ఉపవాసం ఉంచడం మాకు యిష్టం కాదు. మీ తప్పు మీకు తెలియాలి. అందుకిదే మార్గము" అని ఆయన లేచి అమ్మాజీ గదిలోకి వెళ్ళాడు,

"వెధవ బుద్ధులు, చెప్పేవి శ్రీరంగనీతులు. దూరేవి దొమ్మరగుడిసెలు. ఇంతమంది కండ్లు కప్పడానికి సన్యాస ఆశ్రమం స్వీకరించారు. ఇద్దరికీ ఒక మంచమైతేనే నిద్రవస్తుంది" కసిగా గొణిగింది సుమన్.

అందరూ వెళ్ళి పడకలు చేరినారు.

చకోరి పరుగున వచ్చింది. "కోమలక్కా మీరు ముగ్గురు మెట్ల దగ్గరే కూర్చోండి. యెవరన్నా యిటు వస్తే "లైట్లు ఆర్పేయండి" అని గట్టిగా చెప్పండి చాలు. వెళ్ళిపోయింది."

"ఎందుకు?" సుమన్ అడిగినా వినిపించుకోలేదు. అరగంట తర్వాత మూడుగ్లాసులు కంచములో పెట్టుకుని తెచ్చినది. బియ్యము, గోధుమపిండి, తెచ్చినది. బియ్యము, గోధుమపిండి, బెల్లం కలిపి చేసిన పాయసంలాంటి పదార్థము.

"యెంత ధైర్యము, చకోరి అమ్మాజీకి తెలిస్తే కొంప మునుగదు గదా!" కోమల కోపంగా చూచింది.

"ఫరవాలేదక్కా! ఈ గ్లాసెడు ఆధరువు లేకుంటే రాత్రికి ఆ చిన్నపిల్లలు నిద్రపోరు. రెండు మూడు రోజులలో అమ్మాజీకి యెలాగూ తెలుస్తుంది. మీకు తెలియదని బొంకేయండి చాలు."

"అంత నమ్మకంగా చెప్తున్నావు. అమ్మాజీకి యెలా తెలుస్తుంది?"

"గీత వంటమనిషి దగ్గర రెండుపూటలా కడుపునిండా తిన్నది. ఈ దొంగ భోజనం అక్కరలేదు అన్నది." సమయము చూచి అమ్మాజీకి చెప్తుంది. తీసుకోండి అక్కా."

"నీకు బెల్లం యెలా దొరికింది?" సుమన్ ఆశ్చర్యంగా చూచింది.

"ఈసారి రేషన్‌కు నేను వెళ్ళాను. అంతా కొన్నాక అర్ధసేరు వాడిచ్చాడు. యింకో కిలో నేను కొన్నాను. బొప్పాయికాయలు, అరటి తొక్కలు, మేడికాయలు వండినప్పుడు ఆధరువుగా ఉంటుందని."



"మరి నీకేది?"

"నాకు తినాలనిపించడం లేదక్కా! గ్లాసెడు పదార్థానికే విందు భోజనం పెట్టినట్టు సంబరంగా తినే చిన్న పిల్లలను చూస్తేనే కడుపు నిండిపోయింది. మీరు తీసుకోండి. గిన్నె తోమి వస్తాను."

వెళ్ళబోయే ఆమె చెయ్యిపట్టి ఆపింది కోమల. "చక్కా ఉన్న దాంట్లో అందరము పంచుకుందాము రా." ఆ క్షణంలో యెంగిలి, శుభ్రత అన్నీ మర్చిపోయి మూడు గ్లాసులు నలుగురు యువతులు పంచుకుని తిన్నారు.

అర్ధరాత్రి మేలుకుంది సుశీల. సుమన్ లేదు. తలుపులు చేరవేసి వున్నాయి. భయం వేసింది. ప్రక్క గదిలోంచి సన్నగా ఏడుపు వినిపించింది. ఆదుర్దాగా పరుగెత్తింది. కోమల నేలపై పడి దొర్లుతోంది. వాంతులు చేసుకుందేమో. సుమన్ తుడుస్తోంది? కోమలంగా, అందముగా కనిపించే కోమల ముఖం వికృతంగా కనిపిస్తోంది.

"సుమన్ నా ప్రేవులు బయటికి వస్తున్నాయి.... అమ్మా.... అయ్యో ....మీరు ఈ నరకంలో ఉండొద్దు, పరిగెత్తి పొండి, సుశీ.... సుమా...." సుమన్ వచ్చి పట్టుకుంది. సుశీల రెండోవేపు కూర్చుంది. ఇద్దరూ ఆపినా ఆగకుండా దొర్లుతోంది.

"ఈ రోజే వచ్చిందా? ఎప్పుడూ వస్తుందా? అమ్మాజీకి చెప్పనా అక్కా!"

"వద్దులే, తెలుసుకుని ఏం చేస్తావు సుశీ? అనాధలమని తెలిసినప్పుడు ఎవరు ఏమైనా అనగలరు."

యమబాధ అనుభవించాక ఉదయం నాల్గు గంటలకు ఉపశమనం అయింది. అప్పుడు అలిసి నిద్రపోయింది. సుమన్ సుశీల పిల్లలను తీసుకుని స్నానాలకు వెళ్ళారు,

బాబాజీ పాలు, పళ్ళు తెచ్చి కోమలకు స్వయంగా ఇచ్చి మంచి—చెడ్డలు కనుక్కుంటూ ఉంటే సుశీల తన తప్పుడు ఆలోచనలకు తానే సిగ్గుపడింది. తప్పుగా అంచనా వేసింది. క్రమశిక్షణ, సద్గుణాలు నేర్పడానికే పిల్లల యెడ కఠినంగా ప్రవర్తిస్తారు. అవసరమైతే ఆత్మీయులవలె చూస్తారు అనుకుంది. ఆ రాత్రి అందరూ నిద్రపోయాక తలుపులు తాళ్ళు చూచి వచ్చారు. ఈ రోజు వంటావిడకు బాగులేదు. బయట గేటు అతిథి గృహాము వేసి వున్నాయో లేదో చూచి వద్దాము పద" ఇద్దరూ వెళ్ళి అవన్నీ చూచి వస్తున్నారు. అమ్మాజీ, బాబాజీ గట్టిగా అరుస్తున్నారు. కాసేపటికి దెబ్బల చప్పుడు అమ్మాజి ఆర్తనాదం వినిపించాయి. సుశీల సందేహంగా సుమన్ వంక చూచింది.

"రా, నీవు వారి కొడుకింటికి వంటకు వెళుతున్నావు. జాగ్రత్తగా ఉండటం మంచిది." ఇద్దరూ గదికి వచ్చి తలుపులు వేసుకున్నారు.

"ఇదంతా ఓ పెద్ద నరకం సుశీ, బయటివారికి ఈ సంగతులు తెలియవు। వారు చూసేది క్రమశిక్షణా, వినేది. వీరి తీయని మాటలు ధనదాహంతో తపించిపోతున్నారు. అందరూ ఫీజులు చెల్లిస్తారు. అయినా కొందరి అనాధులను సృష్టించి చందాలు వసూలు చేస్తారు, ఇక్కడ హరిజనులు లేరు. వారి పీడను చూస్తేనే అసహ్యించుకుంటారు. ఇరవై మంది వున్నట్టు తెలిసి ప్రభుత్వానికి తెలిసి స్కాలర్‌షిప్‌లు తెప్పిస్తారు. యే గెజిటెడ్ ఆఫీసర్నో పట్టుకుని తీయని మాటలతో సర్టిఫై చేయిస్తారు. ఇక బాబాజీ కాషాయ వస్త్రాలు ధరిస్తాడు. కాని అయన మానసం పంచవన్నెలను, పడతులను, పంచభక్ష్య పరమాన్నాలను కోరుతుంది. అవినీతి గర్భకోశములో జబ్బు. ఇతని కోర్కెలు తీర్చడానికి సిద్ధపడదు ...."

"అదేమిటి? సన్యాస ఆశ్రమము పుచ్చుకున్నారు కదా?"

"అవును. అమాయకుల కళ్ళు గప్పడానికి.... అందరిచేత ఓహో అనిపించుకోవడానికి. ఆమే నిరాకరించగానే చావబాదుతాడు. అప్పుడే దిక్కు దివాణం లేక వికసించిన కుసుమములా కోమలక్క కనిపించినది। అరచి, గోలపెట్టి చావు దెబ్బలు తిని అతని పశుత్వానికి బలియైంది."



"అక్కా! నువ్వు చెప్పేది నిజమా?" సుశీల సుమన్‌ని పట్టుకుని ఊపింది.

"నిజం సుశీ! రోజూ నాలుగు రకాల వంటలు తింటూ కండలు పెంచినవాడి శక్తిముందు గుప్పెడు మెతుకులు తిని విరామము లేక పని చేసే అమాయకురాలి శక్తి యెక్కడ? అలవాటు పడిపోయింది నెలవెనకా ముందు అనిపించగానే యేదో మందు యిప్పిస్తాడు. దాని ప్రభావమే నిన్న రాత్రి అనుభవించిన నరకయాతన. ఇక్కడ బాగా లేదని భార్యమీద అత్యాచారానికి దిగాడు ఈ రోజు.

"యెంత దారుణం?" వణికిపోసాగింది సుశీల!

"దారుణమే. పాపం! కొడుకు ఉత్త అమాయకుడు. ఆ కోడలు మహాతల్లి, అత్తమామల గుణాలను అరువుతీసుకుని ఈ ఇంటి కోడలుగా వచ్చింది. ఆమె అన్న వస్తాడు. అతనితో జాగ్రత్తగా వుండు."

"ఇవన్నీ తెలిసి నువ్వెందుకున్నావు సుమక్కా?"

"ప్రపంచంలో తల్లిని కోల్పోవటమంత దురదృష్టం మరోటిలేదు! సుశీ! అమ్మలేదు నాన్న కట్నం లేకుండా పెళ్ళి చేసి తన బాధ్యత తీర్చుకుందామని చూశాడు. దైవసముడయిన బావ ఉన్నాడు. తల్లితండ్రుల చాటువాడు. ఈ యేటితో అతని చదువు అవుతుంది. ఈ చెరనుండి విముక్తి లభిస్తుంది. యే హాస్టల్‌లో వుంచినా డబ్బు కావాలి. యిక్కడ యేదో బ్రతకడానికింత దొరుకుతుంది."

"పాపం కోమలక్కను చూస్తే జాలి వేస్తుంది. అక్కడే పడుకుందాము పద."

"వద్దు, ఆ రాక్షసుడు యెప్పుడైనా రావచ్చు" సుమన్, సుశీల ఒకే మంచము మీద పడుకుని నిద్రపోయారు. సుశీల యిక్కడ తనకు

ఏం బాగోలేదని, వివరాలు తర్వాత చెప్తాను। వచ్చి తీసుకు పొమ్మని సుధీర్‌కు ఉత్తరం వ్రాసి విశ్రాంతిగా చేతులు దులుపుకుంది. ఆ రోజు ఓ చిన్న అమ్మాయికి జ్వరం వచ్చింది, వేరే గదిలోకి ఆఅమ్మాజీపిలుస్తుం దని ఓ అమ్మాయి చెప్పి వెళ్ళింది సుశీల వంక కొర కొరా చూచింది. కోమల, సుమన్, చకోరి నిల్చున్నారు.

"దిక్కు లేనివారని దయ తలచి మీకు ఆశ్రయము యిచ్చాను. ఏం సుశీలా, పదిహేను రోజులకే పొగరు యెక్కిందా? నిజం చెప్పు మొన్న ఈ చకోరి మీ కందరకు పాయసం ఇచ్చింది కదూ,

"కోమల సుమన్ ఒప్పుకున్నారు. నీ సంగతి చెప్పు."

అత్త చేతిక్రింద ఉండి అన్ని రకాల అనుభవాలు గడించిన సుశీల అమ్మాజీ అంతర్యము గ్రహించింది.

వాళ్ళు నిజం చెప్పారని తనూ నిజం చెప్పేస్తుందని అలా అడిగిం దని గ్రహించింది." వాళ్ళు తిన్నారేమోనండి నాకేం తెలియదు." అన్నది దృఢంగా?

"ఇక్కడ నీకొచ్చిన కష్టమేమిటి? రాళ్ళు రప్పలూ తినమంటు న్నామా? రంకుతనాలు లేవని కదూ!"

"నా కిక్కడ కష్టంగా వుందని నేను అన్నానా?" వెంటనే సుశీల సుధీర్‌కు వ్రాసిన ఉత్తరం అమ్మాజీ విసిరి కొట్టింది.

ఆమె పోస్టు డబ్బాలో వేసిన ఉత్తరం ఈమెకెలా లభించిందా అని ఆశ్చర్యంగా చూచింది.

"ఊ! చెప్పు చకోరి నీ పనికీ శిక్ష ఏం యివ్వమంటావు?"

"అమ్మాజీ! మీ చేతిలో వున్నాం యే శిక్ష విధించినా మంచిదే. కాని ముందు ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పాలి. నన్నెలాగూ అపతేయు రాలనే అంటారు" చకోరి నిర్భయముగా అడిగింది.



"ఓహో! ఎదురు నన్నే ప్రశ్నిస్తున్నావా! గుడ్లురిమి చూచింది.

"ప్రతి ఒక్కరికీ వాక్ స్వాతంత్ర్యమున్నదనే తలుస్తాను మామిడి కాయలు తెంపి స్నేహితునికిచ్చినట్టు 'భయ్యాజీ' మీతో చెప్పారు. ఆ మాట మాతో చెప్పి మీ సంతాపం తెలిపారా? చెయ్యని నేరానికి శిక్ష విధించారు. మీ మనుమలు, మనుమరాండ్లకు ఒక్కరోజు చిరుతిండ్లు లేకుంటే కోటలి అజాగ్రత్తకు చింతిస్తారే? అలాంటి వారిమే మేము కామా? మా తల్లి తండ్రులను మోసపుచ్చి యిక్కడుంచుకొని మమ్మల్ని ఆకలితో చంపుతారా?"

"చకోరీ! గట్టిగా అరిచి బెత్తం అందుకున్నది. దానిని రెండు ముక్కలు చేసి దూరం విసిరివేసింది చకోరి!

"అమ్మాజీ నా మీద ఒక్క దెబ్బ పడితే మర్యాద దక్కదు. నేను అనాధగా చేర్పబడలేదు. మా నాన్న నెలకు ముప్పై రూపాయలు యిస్తు న్నాడు. నన్ను శిక్షించేకంటే ముందు మీ తప్పుకు పిల్లలందరికీ సంజాయిషి యిచ్చుకోండి" నిర్లక్ష్యంగా అని పోటోయింది.

"రాక్షసి! తెగించావు అందుకే ఆ తండ్రి యిక్కడ విడిచాడు. భాండాగారం తాళంచెవులు యిటు పడెయ్యి." చకోరి వాటిని ఆమె దగ్గర పడేసి వెళ్ళిపోయింది. లోపల కాగితాలు సర్దుకున్న తనను పిలిచి తాళాలు యిచ్చింది.

"నాకు వద్దని కూడా వుంది అమ్మాజీ,"

"అదెవరికన్నా అప్పగించు" తను తాళంచెవులు అందుకని వెళ్ళి పోయింది.

•

"ముసు వెళ్ళింది. సుశీలా? నీవు వ్రాసిన ఉత్తరానికి ఫలితం త్వర లోనే అనుభవిస్తావు సుధీర్ నిన్ను చేరదీసి ఇక్కడ చేర్చినందుకు పశ్చా త్తాప పడేలా చేస్తాను, గుర్తుంచుకో" సుశీల నోట మాట రాలేదు. తనెంత పొరపాటు చేసింది. మెట్లు దిగుతుంటే సుమన్ నిసుక్కుంది.

"ఉత్తరం వ్రాస్తున్నట్లు నాతో చెప్పొద్దా?

"కూరకాయలకు వెళ్లేవారికో, ఎవరికో ఇచ్చేవారము మహాతీవిగా డబ్బాలో వేసింది. డబ్బాలోని ఉత్తరాలన్నీ ఆమెకు అందజేస్తాడు పోస్ట్ మెన్, తను చదివి, పంపాలనుకున్నవే తిరిగి డబ్బాలో వేయిస్తుంది. మిగిలినవి చించి పడేస్తుంది."

"అమ్మాజీకి తెలుగు చదవటం వచ్చా?"

"ఆమెకు రానిది యేది? అవి అడుగు, ఇక నీ గురించి ఆయనకు అర్థమైన విషయాలు రాస్తుంది."

సుశీల హృదయం బండబారినది. తనను చూచి జాలిపడే వాళ్లే వుండరు. వాళ్ళు పెట్టిన అన్నంలో సగం తినడం గగన మవుతుంది. పని యెక్కువ అయింది, సాధింపులు, విసుక్కోవడాలు ఎక్కువ అయ్యాయి. పనిమనిషి రానినాడు అంట్లు తోముడు కూడా సుశీల వంతే అయింది. చేయిజారి కప్పు పగిలింది. అది రాసి పెట్టారు! జీతంలో కోస్తారు. "సుశీలా! ధనపాల్ రాలేదు. కాస్త ఆవులకు గడ్డివేసి, దూడలను కట్టెయి" ఆ పని చేసింది. మరు రోజు పిడకలు చెయ్యమని పురమాయించినది. ఎదురు చెప్పి యెటు పోగలదు? చెయ్యటం మొదలు పెట్టింది. మరో పదిహేను రోజులు గడిచాయి. ఆ రోజు శుక్రవారం "వెళ్ళి పేడతో పిడకలు చెయ్యి. శుక్రవారం కల్లాపి జల్లు" అమ్మాజీ ఆజ్ఞ.

"స్నానం చేశాను. మళ్ళీ ఒళ్ళంతా పేడ పడుతుంది అమ్మాజీ!" తప్పించుకోబోయింది.

"పడితే ఏం మునిగిపోయింది? వెళ్ళు" కోపంగా చూచి లోపలికి వెళ్ళిపోయింది, అందరూ చదువులకు కూర్చున్నారు. సుమన్ జాలిగా చూచి, కోడలికి వంట సహాయం చెయ్యటానికి వెళ్ళింది. వర్షాకాలం వస్తే కూలిపోయిన పాత గోడలు పిల్లలచేత పెట్టిస్తుందట. పేరుకు వారెను?



చేసేది ఎంత నీచమైన పని! తనకు యింకా యెన్ని రాసి పెట్టాడో భగవంతుడు? కారే కన్నీరు తుడుచుకోవడానికి వీలు లేదు. రెండు చేతులకు పేడ, భుజాలకు కళ్ళు రాస్తూ పని మొదలు పెట్టింది.

"సుశీలా!" అదిరిపడి చూచింది. సుధీర్ నిలబడి వున్నాడు. అతని కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి. నోట మాట రాని అచేతనంగా ఉండిపోయింది.

"లేవండి చేతులు కడుక్కోండి," ఈసారి అతని కంఠం న్మృదువుగా వుంది.

"పదండి. మీ పెట్టె తెచ్చుకుంటే వెళ్ళిపోదాము." అతను సరీక్షగా చూచాడు! మునుపటికంటే చిక్కిపోయింది. రంగు నల్లబడింది. కళ్లు పీక్కుపోయాయి, ఇటువంటి చోట వుంచానేమిటా అని అతనిహృదయం అలమటించ సాగింది. సుశీల చేతులు కడుక్కున్నది, ఇద్దరూ అమ్మాజీ గది దగ్గరకు వెళ్ళారు. ఆవిడే బయటికి వచ్చింది సుధీర్‌ను చూచి తెల్లబోయింది.

"నమస్కారం సుధీర్ గారూ! కూర్చోండి. సుశీలా! ఇందాక నీ కోసం క్రింద చూస్తే లేవు! ఎక్కడున్నావు? వీళ్ళందరికీ బయట తిరుగుతూ, పని మనుషుల పనులు తాము చేస్తూ వారిని చిరుతిండ్లకు పంపడం అలవాటు. ఇక్కడ పెట్టేది తింటారు, బయట తెప్పించుకుంటారు."

సుశీల ఆవిడ తెలివికి అభినందించకుండా ఉండలేక పోయింది. జాలిగా సుధీర్ వంక చూచినది,

"మీరు పనిమనిషిని ఎక్కడికయినా పంపారా సుశీలా?'

"లేదు. పనిమనిషి ఎవరో కూడా నాకు తెలియదు" అన్నది జంకుతూ!

"అమ్మాజీ! మీకు పేరుకు అర్యసమాజీయులు. కాని గుణాలు?

యెలా చెప్పాలో అర్థం కావటంలేదు. మీరు మంచిని చెడుగా చూపిన నేను చెడును చెడుగా వినిపించలేక పోతున్నాను. పసిపిల్లలకంటే అమాయకురాలు. మేనకురాలు అయిన సుశీలమీదనా మీరు అన్ని నిందలు మోపుతూ ఉత్తరం వ్రాసినది. నీ ఎత్తు తెల్సింది. ఆమె మంచిది కాదని తెలిస్తే ఆ యిచ్చే జీతం కూడా ఆపి మరో అనాథను లిస్టులో చేర్చాలి కదూ? సంవత్సరం క్రితమే నీ గురుకులం భండారం నాకు తెల్సింది. ఇక్కడ అనాథులు ఎవరూ లేరని కూడా తెల్సింది. మంచి మాటలు వినకూడదని జాప్యం చేశాను."

"సుధీర్ గారు మీరు మా సంస్థను అవమాన పరుస్తున్నారు."

"మీకంటేనా? సుశీలకు చెప్పేపనులు ఏమిటని అడుగుతున్నాను. తెలుగు పాఠాలు చెప్పటం, పిల్లలను అజమాయిషీ చెయ్యటం. మీకొంపలో వంట చేయిస్తానని అనలేదే? సేవలు చేయిస్తానని చెప్పలేదే!" హూంకరించాడు.

"ఎంత కృతఘ్నురాలు! వంట చేయించానని చెప్పిందా! మీరు నమ్మారా?"

"బహు గొప్ప పలుకులే. ఆమెను ఒక్కమాట అనటానికి వీలు లేదు. మీ కుమారుడే దారిలో కనిపించి సుశీల వంటను, పనితనమును, సహనాన్ని మెచ్చుతున్నారు. ఇంకా వాదనదేనికి?"

"మీ సామాన్లు తెచ్చుకోండి" సుశీల వెళ్ళి సూటుకేసు సర్దుకొని తెచ్చుతుంది చకోరితో చెప్పింది.

"చాలా సంతోషం అక్కా! ఈ పంజరము నుండి బయటికి రాగానే నిన్ను కలుస్తాను. అడ్రసు యివ్వు."

"సుధీర్ అడ్రసు యిచ్చింది."



"ఇతన్ని అడిగితే నేను యెక్కడుందేది తెలుస్తుంది" అని కోమల దగ్గరకు వచ్చింది.

"అక్కా! నేను వెళ్ళిపోతున్నాను" అన్నది. కోమల తెల్లబోయి చూచింది.

"ఎక్కడికి సుశీ!" చేతులు కడుక్కొని లేచింది.

సుధీర్ వచ్చిన సంగతి చెప్పింది. ఒకరిని ఒకరు కౌగలించుకొని విలపించారు.

"నువ్వయినా క్షేమంగా ఉంటావంటే అదే సంతోషం సుశీ! వెళ్ళు ఆ దెయ్యం చెప్పులు చప్పుడు వినిపిస్తోంది" త్వరగా బయటపడింది.

సుధీర్ వెంట నడిచింది.

అమ్మాజీకి నమస్కరించ బుద్ధి కాలేదు. పెట్టె కార్లో పెట్టి, సుమన్ దగ్గరకు వెళ్ళింది.

"రా సుశీలా! ఈ రోజు చాలా పని ఉంది ఇద్దరు చెయ్యండి" సొరకాయలు హల్వాకు గిరుతూ పిలిచింది కోమలు.

"క్షమించండి. నేను ఇంటికి వెళుతున్నాను. సుమనక్కతో చెప్పాలని...." సుమన లేచి వచ్చి, రెండు నిమిషాల్లో సంగతి సందర్భాలు తెలుసుకుంది.

"వెళ్ళు, అదృష్టముంటే తిరిగి కలుసుకుంధాము" అని బుగ్గలు నిమిరి పంపినది.

సుశీల జీవితంలో తల్లి మరణించటంతో ఓ అధ్యాయము ముగిసింది. అత్తఇల్లు వదిలిననాడు రెండో అధ్యాయము ముగిసింది. గురుకులం వదలటంతో మూడో అధ్యాయము ముగిసింది. కాలపరిమితి స్వల్పమే అయినా మూడో అధ్యాయంమీ చాలా అనుభవం గడించినది.

ఆమె ఆలోచనలతోపాటు కారు సాగిపోతూంది. సుధీర్‌తో జరిగిన విషయాలు ఒక్కొక్కటే చెప్పింది. అతను తేలికగా నిట్టూర్చాడు.

"చాలా గడుసుదానిలా ఉంది. అమాయకులను మోసగిస్తుంది. కొన్నాళ్ళకు పాపము పరిపక్వమయిననాడు భండారం దానంతట అదే బయట పడుతుంది, ఇప్పుడే పేపర్లో ఇచ్చి అభాసు చెయ్యెచ్చు మన కెందుకు?" అన్నాడు.

"ఏదైనా ఫలహారము చేస్తారా?"

"ఇంటికి వెళ్ళి భోజనం చేస్తాను. ఆ బాబాజీని తలుచుకుంటే ముద్ద దిగడం గగనమయ్యేది వాడి గడ్డము, వాడూనూ" సుధీర్ నవ్వాడు.

స్పీడు హెచ్చించాడు. కారు వెళ్ళి అతని తోటలో ఆగినది. దాదా యెదురు వచ్చి, సుశీలను చూచి సంబరపడ్డాడు.

"వచ్చావా? రా బేటియా! నేను ఆ రోజునుండి చెపుతూనే ఉన్నాను" ఆమె పెట్టె అందుకుని లోపలికి వెళ్ళాడు.

"మీ మామయ్యకు కొంచెం నయంగా ఉందని తెల్పింది. ఈ రోజు దుకాణం వద్దకు స్వయముగా వెళ్తాను. దాదా! అమ్మాయిగారు ఏమీ తీసుకోలేదు. మొదట కాఫీ తరువాత ఫలహారం చెయ్యి.

"సుశీల వద్దని వారించింది. కాఫీ చాలు దాదా! ఒకేసారి భోజనం చేస్తాను. ఇద్దరూ గురుకులం విషయాలే మరల మరల మాట్లాడుకున్నారు.

"మీరు ఏ పని చేయాలన్నా, మొదట చదువు అడుగుతారు. బి.ఏ.లు చదివినవారే ఉద్యోగాలు లేక తిరుగుతున్నారు. మొదట ఏదైనా ఇన్‌స్టిట్యూట్‌లో చేరి మెట్రిక్ పూర్తిచేయండి. తరువాత హైవో యింకేదో ఆలోచించవచ్చు" సుధీర్ తన అభిప్రాయం తెల్పాడు.

"ఫీజులు, అవన్నీ మీకు శ్రమ అవుతుంది" మొహమాటపడింది.



"నేను మొదటే చెప్పాను కదండీ. మీరు సంపాదించేటప్పుడు అంతా వడ్డీతో సహా తీర్చుకుందురు. మీవల్ల వెయ్యిరూపాయలు కూడా కలసి వచ్చాయి!"

"నావల్లా- అదెట్లా?" అర్థం కానట్లు చూసింది.

"మరి మీవల్లే గురుకులానికిచ్చే చందా మిగులబాటు కాలేదా? మరల ఏప్రిల్‌లో ఆఖరులో వార్షికోత్సవము అంటూ, పిలిచి వెయ్యి రూపాయలు వదిలించుకునేది" అతను చెప్పినదానికి వ్యతిరేకించి వేరేపని తనేం చూసుకోగలదు? అంగీకరించినట్లు తలాడించి ఊరుకున్నది.

సాయంత్రము సుధీర్ ఇన్‌స్టిట్యూట్‌నుండి అప్లికేషన్ ఫారం తెచ్చాడు. నెలకు పదిరూపాయలు. ఒంటిగంటనుండి ఐదువరకు క్లాసులు "మరి లోపలి సంగతులు చెప్పలేను కాని, బోర్డులో మాత్రం రిజిస్ట్రు దాగానే ఉన్నట్టు పెట్టుకున్నారు. అయిదారుగ్రూపులు కలిసి రెండువందల దాకా విద్యార్థులు ఉన్నారు. మీరు యిక్కడినుండి నిర్భయముగా వెళ్ళి వచ్చు" అన్నాడు.

"మీకు శ్రమ అనే తప్ప నాకేం యిబ్బంది, సందేహం లేదు!"

"ఇంతదానికే బాబుగారికి శ్రమా తల్లీ! యెంత మందిని యెన్ని రకాలుగా ఆదుకున్నారో...."

"దాదా! నీవు మాట్లాడ్డం మొదలుపెడితే అంతూ దరీ ఉండదు. కాని వెళ్ళి రంగయ్యను పిలుచుకురా" దాదా బుర్ర ఆడించి బయటకి వెళ్ళిపోయాడు.

"మా యింటి సంగతులు తెలిసాయా?"

"ఇంకా మీ యిల్లేమిటండి! మీ అత్తగారు మీ పేరు వింటేనే మండిపడుతున్నారు. ఉమాపతిగారి వద్ద ప్రసన్నగారిని ఉంచి వచ్చారట. కలప వ్యాపారంలో భాగస్తుడు తను విడిపోతానంటున్నాడట. మిమ్ము ఇక వారితో మీకేం పని? వారిని మరిచిపొండి" అన్నాడు.

"ప్రయత్నిస్తాను" అన్నది యెటో చూస్తూ.

ఇన్‌స్టిట్యూట్‌లో సప్లిమెంటరీ బాచ్‌లో చేరింది. వేసవి కాబట్టి యెక్కువమంది విద్యార్థులు రావటం లేదు। ఉపాధ్యాయులుకూడా అట్టే లేరు. ఇద్దరూ అన్ని విషయాలూ చెప్తారు. బస్‌పాస్ తీసుకున్నది. పాఠాలు బాగానే అర్థం అయ్యాయి। ఏవో నోట్సుకూడా వ్రాయించారు। సాయంత్రము ఇంటికి వచ్చేసరికి లెక్కలతో ఆమెకోసం హాల్లో గది తయారయింది. మంచమూ, బల్లా, అలమర అన్నీ సర్ది వుంచాడు దాదా. వేడి పానీయంతో ఎదురు వచ్చాడు. తనకు యింత ప్రత్యేకమైన సదుపాయాలు కలుగుతాయని యేనాడు అనుకోలేదు. తన కృతజ్ఞతలు తెలుపటానికి సుధీర్ గదిలోకి వెళ్ళబోయింది. అతను పరిసరాలను మరిచి ఏదో వ్రాసుకుంటున్నాడు. అతని ఏకాగ్రతను చెడగొట్టలేక తిరిగి వచ్చేసింది. అప్పుడప్పుడు కార్లో వెళుతుంది. కొన్నిసార్లు సాయంత్రం వస్తూ వస్తూ పిలుచుకువస్తాడు. దాదాతో చనువు ఎక్కువయినా, సుధీర్‌కు దూరముగా వుండిపోయింది. అతనితో కారులో వచ్చినా, ఎక్కువగా మాటలుండవు, దానికి కారణం అతడు ఆమెను గౌరవముగా 'మీరు' అని సంబోధించుట కావచ్చు. భోజనాల దగ్గర యిద్దరూ కూర్చున్నా, అతను లేనప్పుడు వచ్చినవారి గురించి చెప్తాడు దాదా.

లోకం తను సుధీర్ యింట్లో వుంటే ఏమనుకుంటుందో? అనుకొంది. అత్తయ్య యింట్లో వుండగా యమయాతన పడితే అడ్డు వచ్చిందా లోకం? అన్యాయమని ఆమె చర్యలను అరికట్టిందా? తనను తానే సమాధానం చెప్పుకుంది. మే నెలంతా సుధీర్ యెక్కడికో వెళ్ళాడు. దాదా తనే వున్నారు। ప్రశాంతముగా వుండగలుగుతుంది। తన అనుభవాలు కథలుగా చెప్పాడు దాదా। అప్పుడప్పుడూ తను పడిన కష్టాలు చెప్పుకునేది. సుధీర్ వచ్చాడు. సుశీలకోసం యెన్నో వస్తువులు తెచ్చాడు, ప్రతిసారి చూపుతోనే కృతజ్ఞతలు తెలుపుతుంది. జూన్ మాసం। విద్యార్థుల రాక యెక్కువయింది. ఎక్కడ చెపుతున్నా అర్థంకావటంలేదు. సుధీర్‌ను అడగాలంటే అభిమానంగా వుంది. ఆ రోజు లెక్కలు తీసి ముందట పెట్టుకుంది. చెయ్యలేకపోయింది.



"సుశీలా!" హాల్లోంచి సుధీర్ కేక వినిపించింది. "మీ వ్రాత పుస్తకాలు, నోట్సు ఒక్కసారి యిలా తెండి. ఏం చెపుతున్నారో చూద్దాము" వినయంగా అన్నీ తెచ్చి అతని ముందు బల్లపై పెట్టింది.

"కూర్చోండి"

యెదురుగ సోఫాలో కూర్చుంది. అన్నీ చూశాడు. ఇంగ్లీష్, సైన్స్‌లో చూసుంటే, ప్రశ్నలు అడుగుతుంటే విపరీతంగా కంగారుపడిపోయింది. "అంత భయపడితే యెలా? దానివి ధైర్యంగా అడగాలి. సరే రోజూ ఒక గంట లెక్కలు చేద్దాము" అన్నాడు. ఆమె భయం తీరిపోయింది. కాలము_పని-కాలము దూరము చెప్పాడు. అతను చెప్పేవిధానము బాగా వచ్చింది. ఆ రోజుకు ఆపేశారు. ప్రతిరోజూ అతను చెప్పటంమూలాన క్లాసులో ఆమె ఫస్టులెక్కలలో.

ఆ రోజు లెక్కలు చెప్పించుకోవటానికి సుశీల రాలేదేమా అని ఆమె గదిలోకి తొంగిచూశాడు. చేతిలో వారపత్రిక పట్టుకుని దీక్షగా చదువుతుంది, పిలవటం ఇష్టంలేక, వచ్చి కూర్చున్నాడు. గంట తర్వాత తన అలస్యానికి నొచ్చుకుంటూ వచ్చింది.

"వారపత్రికలో అంతగా యిమ్మల్ని ఆకర్షించిన విషయమేమిటి?"

"అరే! మీరు వచ్చారా! నేను చూడలేదు. అందులో "జగత్ గుప్త" అన్న కథానిక చదువుతుంటే మా బాబాజీ గుర్తుకొచ్చాడు. చాలా బావుంది. అసలు ఆ రచయిత కథలే చాలా బావుంటాయి. సమాజములో గల కుళ్ళును సాంఘిక కథాంశముగా తీసుకుంటాడు."

"ఇదివరకు అతనివి చదివారా ?" కుతూహలంగా అడిగాడు.

"చాలా చదివాను. అత్తయ్య ఇంట్లో అన్ని మాగజైన్స్ వచ్చేవి. చదువనిచ్చేది కాదు. వేణుచేత చాటుగా తెప్పించుకొని చదివేదాన్ని. "నిజం మాట్లాడకు" "బంధువులే శత్రువులు" "సజీవ సమాధి" ఈ కథలన్నీ మరపురానివి" అన్నది.

"అతను వ్రాసిన "ప్రతీకారం, అనే కథ చదువలేదా ?"

"చదివాను అది నాకంతగా నచ్చలేదు. యెవరిమీదో ప్రతీకారం తీర్చుకుంటానికి తనే దొంగగా మారటం ఏమో అంతగా నచ్చలేదు." ఆ క్షణం సుధీర్ ముఖంవంక చూస్తే ఆ మాట అనకపోయేది. "ఈ అర్జీబా క్లాసులో యెవరూ చెయ్యలేదు. నేనే చేశాను."

"సుశీలా! ఈ రోజుకు మీరే చదువుకోండి. నా తల భారంగా ఉంది." అతను లేచి గదిలోకి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన దిక్కే ప్రశ్నార్థంకగా చూస్తూ కూర్చుందామె.

పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. ఏకాగ్రతతో మరే ఆలోచన లేక చదువసాగింది. ఆమెకు భవిష్యత్తు ఆశాజనకంగా కనిపిస్తుంది. బెదిరింపులు సాధింపులు లేవు. తిట్లూ, దీవెనలూ లేవు, రోజూ ఏడున్నరకు యిల్లు విడిచే సుధీర్ తొమ్మిది కావస్తున్నా బయటకు వెళ్ళలేదు. చీకటి రాత్రి కిటికీలోంచి నక్షత్రాలు మెరుస్తూ అందంగా కనిపిస్తున్నాయి. అలా బయటకు చూస్తూ తనగదిలో కూర్చున్నది.

"సుశీలా ఈరోజు ఏమి తోచటంలేదు. సినిమాకు వెళదాము పద" రెండవఆటకు వంటరిగా సుధీర్ వెంటనా ? అతన్ని అనుమానిస్తే అతనేం అనుకుంటాడో.

"పదండి" అని నిలబడింది.

అతను అవతలికి పోగానే, దుస్తులు మార్చుకుని బయటికివచ్చింది దాదాకో చెప్పి కార్లో కూర్చున్నారు.



"నాతో రావటానికి భయం వెయ్యటం లేదా!" అని అడిగాడు.

"మూడునెలలనుంచి మీతోనే! మీ యింట్లోనే ఉంటున్నాను. రోజూ లేని భయం ఈ రోజు దేనికి ?"

మరేం మాట్లాడలేదు. రిజర్వేషన్ చేయించిన సీట్లలో వెళ్ళి కూర్చున్నారు. క్రింద రెండవవరుసలో యెవరో యువకుడితో కూర్చున్నది శశి. అతను శంకరేనని ఆమెకు తెలియదు. ఆమెకు అసహ్యం వేసింది. దనశతో ముసలాడిని చేసుకొని పరాయివారితో తిరగడానికి యెంత సిగ్గు లేదో ! "ఏమిటి తెరవంక చూడక అటుచూస్తున్నారు?"

సినిమా మొదలుపెట్టారా?" అని ఉలిక్కిపడి సర్దుకుని కూర్చున్నది. విరామసమయంలో బయటికి వచ్చారు. బాల్కనిలో నిలబడి వచ్చేపోయేవారిని చూస్తోంది. సుధీర్ దూరంగా వెళ్ళి సిగరెట్టు కాల్చుకుని వచ్చాడు "అరే ..యెవరూ సుధీర్?" యెన్నాళ్ళకురా? " ఓ యువకుడు వచ్చి అమాంతం కౌగలించుకొన్నాడు. నవ్వుతూ అతని వీపు సుధీర తట్టాడు.

"ఇంకా నీ తుర్రతనం వదలలేదురా సత్యం....సుశీలా! ఇతను నా బాల్యస్నేహితుడు."

"ఓరే. ఓరే. చిన్నాయనతో పోట్లాడి సన్యాసులలో కలిశావని అంటే సంపాదివయ్యావూ ! కంగ్రాచులేషన్స్‌రా బ్రదర్ నీకు తగినట్టుందిరా అమ్మాయి....!" అతని మాటలు ఆగకముందే మధ్యలోనే ఆపాడు సుధీర్.

"సత్తి! అదా, మగా జంటగా కనిపించగానే భార్యభర్తలుట్రా"

"మరేమిట్రా, వరుసకైనా నీకు అక్కాచెల్లెండ్లు లేరు. ఇక పోతే ఆడపిల్లలను చూస్తేనే ఆమడదూరం పరుగెత్తే నీతో వచ్చేది నీ భార్యకాక మరెవర్రా?" అప్పటికే సుశీల ముఖం ఎర్రబారింది.

"ఛ, ఆమె నీలాంటి స్నేహితురాలే!" సత్యం యింకా ఏమో చెప్పబోతుండగా ఆట మొదలుపెట్టినట్టు గంట వినిపించింది.

"నువ్వు పైక్లాసులో కూర్చున్నావా? ఏనుగు వచ్చినా, ప్రతికిన పదివేలు చేస్తుందని ఆస్తి వదిలి వచ్చినా జమిందారువేలా," అని అతను వెళ్ళిపోయాడు.

"సుశీలా! ఏమనుకోకు నోటిదురుసు మనిషి." సుధీర్ నొచ్చుకున్నాడు.

"అతడొక్కడేకాదు మన సమాజమే అంత. మా ఇన్‌స్టిట్యూట్‌లో మీ రొచ్చినప్పుడల్లా, మీ వారు వచ్చారు అని చెప్పారు. కాదు అని నవ్వ చెప్పబోతే, ఎన్నో ప్రశ్నలు వేస్తారు. అందుకే ఊరుకుని వారి మాటలు వింటాను. 'మంగసూత్రం మోటా?' మెట్టెలు మోటా ఇలాంటి ప్రశ్నలు బోలెడు వేస్తారు. నవ్వుతాను," సీట్లుచేరుకున్నారు. అప్పటికే ప్రకటనలు పూర్తిఅయి, సినిమా మొదలుపెట్టారు. సుధీర్ హృదయం తియ్యనిబాధతో నూల్గింది. మాటి, మాటికి సుశీలవంకే చూస్తూ గడిపాడు. ఒకసారి ఆమె భుజాలచుట్టూ చేతులువేసి దగ్గరకు లాక్కోవలెనని కోర్కె కలిగింది. నిగ్రహించుకొని మామూలుగా కూర్చున్నాడు.

# 6

పరీక్ష ఫలితాలు వచ్చాయి. సుశీల సెకండ్ క్లాసులో పాసయింది. పేపరు పట్టుకొని వంటింట్లోకి పరుగెత్తింది "దాదా! నేను పాసయ్యాను" సంతోషంతో పొంగిపోయినది.

దాదా ఆమె గడ్డంపట్టుకుని మృదువుగా నిమిరినాడు. "సంతోషం తల్లీ!" అన్నాడు.



సుధీర్ ఉంటే తను పాసయిన ఆనందము పూర్తిగా పంచుకోగలిగేది. అతను నెలరోజులక్రితం ఢిల్లీ వెళ్ళిపోయాడు. అతను లేడే అని ఆరాటపడుతుండగానే అతడు దిగాడు.

"కంగ్రాచులేషన్స్ సుశీలా!" అతని ముఖంలో సంతోషం కొట్టవచ్చినట్టు కనిపిస్తూంది.

"థాంక్స్!" అంటూ వెళ్ళి అతని పాదాలు కళ్ళకు అద్దుకుంది.

"ఛ! ఇదేం పని?" ఆమె భుజాలుపట్టి లేపాడు.

"అదేం? కళ్ళలో నీ రెందుకు?"

"ఏం లేదు. సంతోషం పట్టలేక మీరు లేరే అని ఒకటే బాధ పడుతున్నాను." అన్నది కళ్ళు ఒత్తుకుంటూ.

"ఇంకా రెండురోజులు పనివున్నా నువ్వు బాధపడతావనే ఉరుకులు పరుగులు పెడుతూ వచ్చాను. నేను కొంచెము శ్రద్ధవహించి ఇంగ్లీషు సైన్సు చెప్తే తప్పక క్లాసు తెచ్చుకునేదానివి. ఇప్పటికైనా పరవాలేదు, సెకండ్ క్లాసు వచ్చింది."

"మా ఇన్‌స్టిట్యూట్‌లో నల్గురే సెకండ్ క్లాసు తెచ్చుకున్నారు." మరోసారి నంబర్లు తిరగవేసింది. అతని గదిలో పెట్టె అని పెట్టుకుంటున్నాడు.

"సుశీలమ్మా! అయ్యగారికి కొంచెం కాఫీ యిస్తావు. చేతిలో పనివుంది." దాదా పిలిచాడు. అతడు కావాలనే లోపలకుండిపోయాడు. కాఫీ ట్రేలో పెట్టుకుని అతని గదిలోకి వెళ్ళింది. "దాదా లేడా! మీరు తెచ్చారేం?"

"మీ కామాత్రం పనిచేస్తే అరిగిపోనులెండి" అన్నది నిష్ఠూరముగా.

"అరిగిపోతారని కాదు. మీరు పరీక్ష పాసయ్యారు కదా! ఏం బహుమతి కావాలో చెప్పండి."

"కోరింది యిస్తారా ?" అన్నది ఆ దినము ఆమె సంతోష వర్ణనాతీతం.

"అంత సందేహిస్తున్నారు ? ఏం కోరుకుంటారమ్మా ?" కాఫీ సి చేస్తూ అడిగాడు.

"ఏంలేదు, నన్ను మీరు అని పిలువవద్దు, అదే నేను కోరేది!" అతడు చిన్నగా నవ్వాడు.

"సరే. కొన్నాళ్ళు పాఠాలు చెప్పానుగా. శిష్యురాలిగా భావిస్తాను. మీరు కోరినది కాక నేను యిచ్చేది స్వీకరించండి." అన్నాడు వంగి బ పెట్టెతీస్తూ.

"మళ్ళీ మీరు అంటున్నారు." మధ్యలోనే అందుకుంది. అతను నవ్వాడు. ఒక పెద్ద ప్యాకెట్టు మరో చిన్నప్యాకెట్టు బయటకు తీసి "ఒకేసారి అలవాటు ఎలా మారుతుంది? తీసుకో." ప్యాకెట్టు విప్పాడు. అందమైన రోమన్ గడియారము, రెండవప్యాకెట్టులో నల్లచుక్కలున్న గులాబీ రంగు శిఫాన్ చీర. "మరోలా భావించక తీసుకో సుశీలా, మొన్న దినమంతా తిరిగాను. వీటికోసం...." ఆమె కళ్ళు మెరిశాయి. నెమ్మదిగా తన యెడమచేయి ముందుకు చాచి తలవంచింది. దానికి కట్టాడు. చీరవిప్పి భుజాలమీదుగా కప్పాడు, "అరే! పూలు మరిచి పోయాను. సన్మానము పూర్తి అయ్యేది." అన్నాడు కొంటెగా చూస్తూ.

అక్కడినుండి తన గదిలోకి పారిపోయింది సుశీల.

కలలు కంటూ నిద్రకు దూరమై తెల్లవారు ఝామున కునుకుతీసింది సుశీల. తెల్లవారిందేమోనని త్వరగా లేచి బయటికి వచ్చింది. సుధీర్ గదిలోనుండి కొత్తగొంతు వినిపిస్తూంది "....నీ శ్రేయోభిలాషిని సుధీర్! ఆ అమ్మాయిని యింటిలో పెట్టుకోవటంలో అర్థంలేదు. చుట్టముకాదు, పక్కమూ కాదు. యెందుకు వుంచుకున్నట్టు ? దేశంలో ఆశ్రయంలేని వారు చాలామంది వున్నారు. వారందరినీ నెలలతరబడి పోషించగలవా!"



"బాస్ అనుభవజ్ఞులు, పెద్దలు మీరే అపార్థం చేసుకుంటే ఎలా? దేశంలో ఎంతో మంది విధివంచితులున్నారు. మీరు నన్నే ఆదరించారు యెందుకు ?"

"సుధీర్ నీలో కొన్ని గుణాలు నన్ను ఆకర్షించాయి. మొదటి చూపులోనే పుత్రవాత్సల్యము కలిగింది." అన్నాడు గంభీరంగా.

"అమాయకంగా మృత్యువును కౌగలించుకో బోయిన ఆమెను మొదటిసారి చూడగానే అనురాగం, ఆత్మీయత నా అంతరంగము నలముకొన్నాయి. ఆ ఆకర్షణనుండి తప్పుకోలేక పోయాను."

"ఆమెతో నీ భావాలు చెప్పావా ?"

"లేదు ఇప్పుడు చెప్పలేనుకూడా, ఆమె అపార్థం చేసుకుంటుంది. దురుద్దేశంతోనే సహాయం చేశాననుకుంటుంది. అది నేను భరించలేను."

"బావుంది నీ వాదన. ఆమె అన్యథాభావిస్తే భరించలేవు. ఆమెతో నిజం చెప్పలేవు! ఆలోచించుకో! ఆమెకు నీపైన యిష్టము లేదనుకుందాము. అప్పుడు నీ యింట యిన్నిరోజులు ఒంటరిగా వున్న స్త్రీని స్వీకరించేవారుండవద్దూ ? స్త్రీ ఉనికే ప్రమాదభరితమైనది. వస్తాను నిన్ను హెచ్చరించటానికే వచ్చాను" అని అతడు చరా చరా వెళ్ళి పోయాడు. సుశీల దూరంనుండే గదిలోకి తొంగి చూసింది.

అతను జుట్టులోకి వేళ్లుపోనిచ్చి ఆవేదనగా రాసుకుంటున్నాడు. మొదటిసారిగా అతన్ని చూడటానికి ఆమెకు సిగ్గుతెర అడ్డువచ్చింది. అతను....వివాహం చేసుకోవాలనుకుంటే ఆలస్యందేనికి ? దిండులో తల దూర్చింది. ఇప్పుడు తనే ధైర్యంచెయ్యాలి. లేకుంటే....తను జీవితాంతము పశ్చాత్తాప పడాలి. అతనంటే తనకు యెంతయిష్టమో యెలా చెప్పగలను ? అతనే అతని చర్యలతో తనను దూరంగా వుంచాడు. తనకు అందరాని వానిని పిగురించే ఆశలను అణచివేసింది.

"వద్దు, లేపకు. పాపం చదువు అంటూ లేచేది. ...ప్పటేం తొందర!" సుధీర్ గొంతు వినిపించింది. తలెత్తి కిటికీ వంక చూసింది. పాల ఖాస్కారుడు తన హయాలకు కళ్ళేలు బిగిస్తున్నాడు. లేచి బయటికి వచ్చింది. సుధీర్ కాఫీ త్రాగుతున్నాడు.

"లేచావా? ఫరవాలేదు, నీ కంపెనీకోసం మరో కప్పు తాగుతానులే," ప్రశాంతంగా ఉంది అతని ముఖం. కాలకృత్యాలు తీర్చుకుని వచ్చేసరికి అతను పేపరు చదువుతున్నాడు. సుశీలతోపాటు కాఫీ కూడా వచ్చింది.

"రిజల్ట్స్ వచ్చాయిగా ఏం చేద్దామని వుంది సుశీలా?"

నాకేం తెలుసు? మీరేం చెయ్యమంటే అదేచేస్తాను." అతనిని సూటిగా చూడలేక పోతూంది.

ఏం మనిషి? తనకోసం యింత ప్రేమగా దాచి ఒక్కసారి వ్యక్తం చెయ్యడేం? అనుకుంది.

"చాలా థాంక్స్. నాపై అంత నమ్మకం గౌరవం వుంటే బాలు, వుమెన్స్ కాలేజీ హాస్టల్లో చేరితే అక్కడ కుట్లూ, అల్లికలు నేర్పుతారు వుక్కసెంటవుంది, అవి నేర్చుకో, జూన్‌లో పి.యు.సి. లో చేరుదువుగాని. మంచి మార్కులువస్తే పై చదువులు చదువుదువు" మనఃపూర్వకంగా చెప్పినట్టులేదు.

"నాకు ఇక చదివే ఓపికలేదు" అన్నది దృఢంగా.

"మరి ఈ చదువుకు ఏం ఉద్యోగం వస్తుంది?" కొంచెం తీవ్రంగా ప్రశ్నించాడు.

"సుశీలా!" వినబడ్డ కప్పులు బేసిన్‌లో వుంచుతూ "నా ఉనికి అంత భరించరానిదయితే, అలాగే వెళ్ళి హాస్టల్లో ఉంటాను" అన్నది.

అతనికేం తోచలేదు, ఆమె అభిప్రాయము స్పష్టముగా బోధపడలేదు. రెండురోజులు గడిచిపోయాయి. "ఏదైనా గుడికి తీసుకెళ్ళండి



నన్ను." మధ్యాహ్నము విశ్రాంతి తీసుకుంటున్నపుడు అడిగింది.
"పాసయితే వస్తానని మ్రొక్కుకున్నావా?" అతను వెక్కిరింపుగా అడిగాడు.

"అలాంటిదేం లేదు. అప్పుడప్పుడు వెళ్ళాలనిపిస్తుంది." అన్నది

"సాయంత్రము వెళదాము." ఆ సాయంత్రము ఆమె ముస్తాబును చూచి ఆశ్చర్యపోయాడు. కధాన్ గులాబీ చీర కట్టింది. నల్లజాకెట్టు వేసుకుంది. తల నిండా సన్నజాజుల మాల పెట్టుకుంది. కండ్లలోని కాంతి వంటి తళుకులకు పోటీ పడుతూంది. సజ్జలో కొబ్బరికాయ పూలు, చిన్న సీసాలో నూనె అగరువత్తులు. అరటిపండ్లు పెట్టుకున్నది, ఆమె వంకే చూస్తూ కారు స్టార్టు చేశాడు. ఆంజనేయస్వామి ఆలయంలోకి వెళ్ళారు. పూజ ముగిసింది. ప్రసాదం తీసుకుని బయటికి వచ్చారు. కారులో కూర్చుని నెమ్మదిగా అడిగాడు. "ఏమని మ్రొక్కినావు సుశీలా? పెద్ద అఫీసరు కావాలనా లేక పంతులమ్మ కావాలనా?"

"లేదు యెలాంటి పరిస్థితులలోనూ నాకు వ్యక్తిత్వము ప్రసాదించి నన్ను మనిషిగా చూచి, జీవితంపై ఆశను కల్పించిన వారికి దూరం చేయొద్దని; వారింటి పనిమనిషిగానైనా వుంటానని.... .... ...." చెప్పి ముఖం ప్రక్కకు త్రిప్పుకుంది. అతను ఆమె చెయ్యి పట్టుకున్నాడు.

"నిజమా? నిజమా? .... .... .... కాని సుశీలా! బాగా ఆలోచించావా?"

"ఏం ఆలోచించాలో చెప్పండి?" అన్నది కొబ్బరను గోళ్ళతో బయటికి తీస్తూ.

"నా విషయాలు నీకు తెలియవు, నేను నువ్వు వూహించినంత మంచివాడిని కానేమో"

"మంచి! కొలమానమేమిటి? తల వంచుకునే జవాబు చెప్పింది. ఆమె అందించిన కొబ్బరిముక్కలు నోట్లో వేసుకొని కారు స్టార్టుచేసాడు.

రిజిష్టర్ ఆఫీస్‌లో సుశీల, సుధీర్‌ల వివాహం క్లుప్తంగా జరిగింది. అతని స్నేహితులే నలుగురు వచ్చారు. కోమలను ? సుమన్‌లను పిలవాలని వున్నా ఆ గురుకులం నియమాలను గుర్తుకు తెచ్చుకుని ఊరుకుంది. వివాహానంతరం అందరూ హొటలు కెళ్ళి విందారగించారు. జాషు దంపతులకు అంగుళీయములు తెచ్చి బహూకరించాడు. ఈ వివాహానికి అందరికంటే ఎక్కువ సంతోషించినవాడు దాదా ! పాలు తెచ్చి ముత్తయిదువుచే దంపతులకు మొహంతడిపించి ఎర్రనీళ్ళు తిప్పి హోయించాడు. ఆ రోజంతా హాయిగా గడిచిపోయింది. "సుశీ నా జీవితంలో యింత మధురమైన ఘడియలుంటాయని అనుకోలేదు సుమా !" విశ్రాంతిగా వింగి వంక చూస్తూ పలికినాడు సుధీర్.

"నేను మాత్రం అనుకున్నానా ? నాకోయిల్లూ, నన్ను మనిషిగా గుర్తించిన దేవుడులాంటి భర్త — —"

"మనుష్యుల్ని మనుషులుగానే ఉంచు దేవుడు, దెయ్యమూ అంటే తరువాత బాధపడవలసి వస్తుంది. ముఖ్యమైన విషయాలు మరిచిపోయాము మీకు పెళ్ళిఅయినట్లు ఓ లైసెన్సుబిళ్ళ కట్టవద్దు? అమ్మగారూ ! కావలసిన వస్తువులు తయారుచెయ్యి !"

"ఛ ! పవిత్రమైన మంగళ సూత్రమును అలా అంటారేం ?"

"ఆ ! పవిత్రమూ, పాతివ్రత్యమూ అంటూ యింకా పాతపాట పాడతావేం ? అక్షరజ్ఞానం లేని అజ్ఞానురాలు, డిగ్రీలు పుచ్చుకున్న విద్యావంతురాలు, భర్తలచే చీరలుతికించునే కాలం ! పెద్దలు చేయించిన మంగళసూత్రము ఫ్యాషన్‌గాలేదని మార్చుకునే ఈ కాలంలో పవిత్రతలేమిటి ?"

"ఎవరినో కొందరిని చూసి మీరు అభిప్రాయాలు మార్చుకోవటం ఏం బాగాలేదు."



ఈ ఆనంద సమయంలో వాదనలు దేనికి సుశీ !" ఆమె వంక మత్తుగా చూచాడు. ఆమె అతని వంకచూస్తూ గర్వపడింది. తమ అత్తయ్యకు యితన్ని చూపాలి దీవెనలు ఫలించలేదని చెప్పాలి."

"ఏం అమ్మగారిని ఆహ్వానించటానికి లేచి రావలయునా ?" మాట్లాడలేక తలుపులు వేసి, కిటికీ తెరలు లాగి వచ్చి అతని సరసనే కూర్చుంది. "అంత మౌనంగా వున్నావు, చలపతి తాతయ్య, బాబాజీ గుర్తుకొస్తున్నారేమిటి ?" వెక్కిరించాడు చెదిరిన కుంకుమ సవరిస్తూ.

"పొండి" దిండులో తల దూర్చింది. అతను నవ్వుతూ జడలోని పూలు తీసి వాసన చూసాడు. సుశీల జీవితములో వసంతం మరుదెంచింది. ప్రపంచమంతా పచ్చగానే కనిపించ సాగింది. ఇంట్లోకి రకరకాల సామానులు కొన్నది. బిల్లుచూచి డబ్బు అందించటమే అతని పని. వాటిని యింటి నిండా అమర్చి తృప్తిగా నిట్టూర్చింది. కొందరు మిత్రులను భోజనానికి పిలిచారు! పెళ్ళి పార్టీ అయిందనిపించారు. సుధీర్ తన యిష్టముతో ఆమెకు రకరకాల దుస్తులు కొన్నాడు. నగలు కొన్నాడు. దినాలు క్షణాల్లా దొర్లిపోతున్నాయి. ఆరోజు అతను బయటకు వెళ్ళినాక అతని పుస్తకాల అలమర తీసి సర్దటం మొదలు పెట్టింది. అడుగన వున్న చిత్తు కాగితాలు—ముత్యాలవంటి అక్షరాలు, కుతూహలంగా తీసి చదివింది. చిన్న చిన్న కథలు, వ్యాసాలు. ఇంచుమించు అందులోని సగం కథలు వేరు వేరు వారపత్రికలలో పడినవే ! అనుమానంగా అతని బల్ల సొరుగు లాగినది. సామానులు కొన్న రసీదులు, వాటిక్రింద పత్రికాధిపతులు వ్రాసిన లేఖలు అగిపించాయి. ఆ యింట్లో అతనికి వచ్చే ఉత్తరాలు చూడటం ఏనాడూ తటస్థించలేదు. ఉత్తరాలు వేస్తే డబ్బాకు తాళం వుంటుంది. ఎంత గుట్టు మనుషులు ! కథలు మారుపేరుతో రాస్తానని ఒక్కసారయినా చెప్పలేదేం? తను సంతోషించేదిగా! అతనిమీద ఎక్కడలేని కోపం వచ్చింది. అతను వచ్చేసరికి మూతి ముడుచుకుని కూర్చుంది.

మాదిరెడ్డి సులోచనారాణి గారి

# శిక్ష



"సుశీ! నువ్విష్టపడే సినిమావచ్చింది.ఢిల్లీలోకి, ఏమిటో చెప్పుకో!" కోటు సోఫామీద పడేసి అడిగాడు, రోజూ అయితేకోటు అలా దానిమీద పడకుండానే అందుకొని హేంగర్‌కి వేసి వచ్చి, అతని టై ఊడదీసి బూట్లు విప్పి, నవ్వుతూ! నవ్విస్తూ కాఫీయో, ఓవల్టీనో అందించేది ఈ రోజు మూతి ముడిచి తన కోపమంతా స్వెట్టర్ సూదులపై చూపించ సాగింది.

"ఏమిటక్కా అంత త్వరగా అల్లుతున్నావు. సూదులు వ్రేళ్ళలోకి గుచ్చుకుంటాయి సుమా?"

"మరేం ఫర్వాలేదు" తలెత్తనే లేదు.

ఏదో అలకని గ్రహించాడు. నెమ్మదిగా లేచి ఆమె కుర్చీ వెనుకకు వచ్చాడు. "ప్రణయవతీ! నాపై కోపమా? ఏదు....ఏదు సహోదరు అవమానించిన వాడునా కినుక? అదే! తర్వాతచరణం జ్ఞాపకం రావటం లేదు." పకపకా నవ్వింది. మరోసారి పాడుతాను అలుక ఎందుకో చెప్పు' ఆమెకు నవ్వాగలేదు. "ఛ! అక్కడ దాదావున్నాడు. ఏమనుకుంటాడు!"

"ఏ మనుకోడు. తన యవ్వనపురోజులు గుర్తుకు తెచ్చుకుని నవ్వు కుంటాడు. ఇంతకీ అలకదేనికి? వస్తానన్న సమయానికి అరగంటముందే వచ్చాను" ఆమె ముఖం యిటు తిప్పుకుని అడిగాడు.

"నా అభిమానరచయిత 'రజని' మీరేనని యెందుకు చెప్పలేదు?"

"ఓస్! అంతేకదా? నేను హడలిపోయాను. అలనాటి సత్య భామలా ఏ పారిజాతంకోసమో అడిగితే ఎలా? నందనవనమున్నదా? ఉన్నా స్వార్థం పెరిగిన ఈ రోజులలో మనుషులనే తోటిమనిషి అసహ్యిం చుకునే ఈ రోజులలో దేవతలు నన్ను అక్కడికి రానిస్తారా అని జడుసు కున్నాను సుమా." భయం నటించాడు.



"గొప్ప నటకులేలెండి. ఇంత చిన్నవిషయం చెప్పని మనిషి దేవ లోకం వెళ్ళి పారిజాతం తెస్తారుట. అన్నీ గొప్పలు" అంది వచ్చేనవ్వును సంతోషాన్ని మ్రింగుతూ!

"ఏ రష్యావారో! అమెరికా వారో ఆ దేవలోకాన్ని కనిపెట్టి ఓ రాకెట్ పంపితే నీ కోర్కె తీర్చాలని – వారి రాకెట్లో మొదటి వ్యక్తిగా వెళతాను. పారిజాతం వాడిపోకుండా వుంటే తెస్తాను."

"చాల్లెండి చమత్కారం? నాకు ముందే ఎందుకుచెప్పలేదూ అంట"

"ముందే చెప్పితే థ్రిల్ ఏముంటుంది? తెలుసు మాష్టారు సత్య భామ రూపం వర్ణిస్తే ఏమిటో బుర్రకెక్కలేదు. ఈ నాడు నిన్ను చూచినా. వచ్చే నవ్వును బిగించేమూతి, నన్ను చూడాలని ఉన్నా బలవంత ముగా వాల్చుకుని. కొనలగుండా ప్రశ్నలు కురిపించే కనుదోయి బలవంత ముగా ముడివేసిన బొమలు, అచ్చు సత్యభామలాగాగే ఉండొచ్చు అని పించింది. అది పురాణ యుగం కాబట్టి కోపగృహాలుండేవి. సుశీ! నవీన యుగంలో భార్యలు సంతోషంగా వుంటె పెద్దసోఫాలో కూర్చుని ప్రక్కన భర్తలకు చోటు వదులుతారు. కోపంగా వుంటే చిన్నసోఫాలో కూర్చుం టారు. అదే కోపగృహం అనుకోవాలి. ఏమంటావు?" మాటలు నేర్చిన వారిని ఏమన్నా ఏమిలాభం "ప్చ్ ...." నిట్టూర్చింది?

"నాది తప్పే ఒప్పుకున్నాను, పరిహారం చెల్లించ మంటావా? నీకిష్టమైన ప్రదేశం చూద్దాం లేదా నీకువచ్చిన నెక్లెసు—"అతను ఆమె కెదురుగా వచ్చి అడిగాడు.

"నాకు నెక్లెస్ వద్దు తాజ్‌మహల్ చూడాలని వుంది. అక్కడికి వెళదాము."

"తథాస్తు దేవిగారు యింత తొందరగా ప్రసన్నం అవుతారని అను కోలేదు. వేడి కాఫీ. అంతకంటే ముందు ఒకటి...." అతని మాట పూర్తికాకముందే, లేచి వంటిట్లోకి పరుగెత్తింది.

ప్రయాణానికి సర్దుకోసాగింది. రెండు పెట్టెలలో యిద్దరి దుస్తులు సర్దినది. బెడ్డింగ్ చుట్టినది. ఓ మర చెంబు, టిఫిన్ కారియర్, ఓ బ్యాగులో దువ్వెనా, అద్దం అన్నీ సర్ది తల విప్పుకుంది. "సుశీ యివన్నీ ఏమిటి? చిన్న సంసారానికి సరిపడే సామాన్లు సర్దినావు?"

"మరి వద్దా? అన్నీ అవసరమైనవే.... అందులో వుంచేయవలసిన సామాను ఏమిటో అర్థంకాదు."

"మనము వెళ్ళేది విమానంలో మనిషికి కొంత సామానే అనుమతిస్తారు తూస్తారు. ఎక్కువైతే డబ్బు చెల్లించాలి" అన్నాడు.

"అట్లయితే మనము ట్రెయినులోనే వెళదాము. అనవసరంగా డబ్బు దండుగ."

"ట్రెయినులో రెండురోజులు విసుగొస్తుంది సుశీ! నా మాట విని ఆ బెడ్డింగ్! మరచెంబు, టిఫిన్ కారియర్ అన్నీ తీసెయ్. బట్టలు కూడా ఒకే పెట్టెలో తెచ్చుకో. వచ్చేటప్పుడు ఎలాగూ రెండో పెట్టె అక్కడ కొన్న వస్త్రువులతో తయారవుతుంది."

మరి అక్కడ దేనిమీద పడుకుంటాము?" అదుర్దాగా చూచింది.

"ఒట్టి అమాయకురాలివి సుశీ! మనము వెళ్ళి హోటల్లో గది తీసుకుని వుంటాము, అక్కడ అన్ని సదుపాయాలూ వాళ్ళే కలుగజేస్తారు. చూద్దువుగాని, నీకు ఏ వస్తువూ లోటు రానివ్వను సరా?"

"మీరు రానిస్తారని గాదు. నాకు తెలీక సిద్ధంచేసాను" చిన్న బుచ్చుకుంది.

"అంత చిన్నబుచ్చుకోవలసిన పనిలేదు, నువ్వెప్పుడూ యిల్లు వదలలేదు. అందుకే తెలియదు దాదాపు అన్నీ జాగ్రత్తలు చెప్పి బయలుదేరినారు. విమానాశ్రయములో శశిని చూచి పరుగెత్తుకు వెళ్ళింది సుశీల. "పిచ్చిపిల్ల ప్రేమేతప్ప ద్వేషము. అసహ్యము తెలియదు." అనుకున్నాడు సుధీర్.



"బాగున్నావా సుశీ!" అమాంతము కౌగలించుకున్నంత పని చేసింది, శశి కూడా సుశీలను రెండుచేతులతో వాటేసుకుంది. "నీ సంగతి చెప్పు సుశీ అతనెవరు?" అని సుధీర్ వంక చూసింది. సుశీల కొంచెము సిగ్గుపడి "మావారు" అన్నది. యిద్దరిని ఒకరికొకరికో పరిచయం చేసింది. నమస్కరించుకోవటాలు, పరామర్శించుకోవటాలు అయ్యాక "రండి అక్కడ కుర్చీలు, సోఫాలున్నాయి కూర్చోండి. నేను సామాన్లకు చిట్టీ వేయించి వస్తాను." ఇద్దరు అతను చూపిన పొడుగాటి హాల్లోకి వెళ్ళారు. రకరకాలజనం కూర్చుని వున్నారు. కొందరు కాఫీలు, మరికొందరు కోకాకోలాలు త్రాగుతున్నారు ఇద్దరు వెళ్ళి ఒక సోఫాలో కూర్చున్నారు. "నాకో పాపపుట్టింది తెలుసా?" శశి అన్నది.

"నిజం! నాకు తెలియదు ఒకరోజు నువ్వు సినిమాలో యెవరితోనో కనిపించావు."

"వాడే నా జీవితానికి పట్టిన గ్రహణం సుశీ! మనిషి ఒక తప్పు చేసాక దానిని సమర్థించుకోవడానికి ఎన్నో తప్పులు చేయాల్సివస్తుంది. నా పని అలాగే అయినది." నెమ్మదిగా. చలపతితో తనపెళ్ళి యే పరిస్థితులలో అయినదో చెప్పింది. ఒకవైపు అనుక్షణం పాపవంకా నా వంకా, అనుమానంగా చూసే భర్తా, ఇంకొక వంక ఏడు నెలలకు పుట్టిన పాప యింత ఆరోగ్యంగా ఎలా వుంది? అని ఆరాలు తీసే బంధువులు, మూడో వంక నేను నిన్ను ప్రేమించాను. చెప్పినట్లు వినకపోతే నీ జీవితం బట్టబయలు చేస్తానని బెదిరించే ప్రియుడు. రోజూ నరకం చూస్తున్నాను! కంట తడి పెట్టుకుంది శశి. "ఊరుకో! ఇక్కడి కెలా వచ్చావు?" తన రుమాలతో శశి కన్నీరు తుడిచినది. "మా అబ్బాయి బెంగుళూరు నుండి వస్తున్నాడు. అతన్ని రిసీవ్ చేసుకోవటానికి వచ్చాము. పూలమాలలు కట్టించుకురావటం మరిచిపోయారట. ఆయన మళ్ళా సికింద్రాబాద్ వెళ్ళారు. పాప మరీ చిన్నది, నలిగిపోతున్నదని పనిమనిషివద్దనే వుంచేసాను."

"మావయ్యవాళ్ళు బావున్నారా?" నీరసంగా నవ్వింది. శశి, జీవం లేని నవ్వు. సుశీల చెయ్యిపట్టుకుని "సుశీ, నిన్ను అన్యాయం చేసిన దానికి ఫలితం అనుభవించవద్దు! అమ్మ నిన్ను తిట్టిన ప్రతిమాట మాకే ఎదురు కొట్టింది. రెండువేలు ఖర్చుచేసినా నాన్నగారి ఆరోగ్యం అంతంత మాత్రంగానే వుంది. సమయం చూచి అంతా నష్టమే చూపి కలప వ్యాపారంలోని భాగస్తుడు, తప్పుకున్నా అమ్మ యింటలేని సమయం చూచి, నగలు విలువయిన వెండిసామానులు పట్టుకొని మద్రాసులో సినిమా తీస్తానంటూ వెళ్ళాడు సంపత్. ఢిల్లీలోని సిక్కుల అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడట. మనముండే ఇల్లు అద్దెకిచ్చి పొలం దగ్గర షెడ్డులో వుంటున్నారు. కారుకూడా అమ్మేద్దామని చూస్తున్నారు. నాన్నగారికోసమని వుంచారు. అప్పుడప్పుడు డాక్టర్ దగ్గరకు వెళ్ళిరావాలి కదూ!"

"అయ్యో! ఎంత కష్టమొచ్చింది. శశీ, మేము ఢిల్లీనుండి రాగానే మామయ్య దగ్గరకు వెళ్ళాను. నా పెళ్ళప్పుడు చెప్పాలనుకున్నాను. ఆయనను అత్తయ్య అవమానించింది. అది మనసులో పెట్టుకున్నారేమో! వద్దన్నారే" తను యిల్లు విడిచింది మొదలు సుధీర్‌తో వివాహము వరకూ అన్ని విషయాలు క్లుప్తంగా చెప్పింది. అంతా విని శశి దీర్ఘంగా నిట్టూర్చింది.

"నీ మంచితనము నిన్ను కాపాడింది. నీ తల్లి దండ్రులు చేసిన పుణ్యము నీకు అడ్డుపడింది. అమ్మ జన్మలో మారదు. ఇక ఆ జీవి అలా దాటిపోవాల్సిందే, ఇప్పుడింకా కోపం. విసుగు యెక్కువయ్యాయి."

"ఏమిటో చిత్రంగా ఉందికదూ? పోయిన సంవత్సరము ఈ రోజులలో యెప్పుడయినా అనుకున్నామా? ఒక్క సంవత్సరంలో యెంత మార్పు."



యేమే! యింకో అర్ధగంటలో ప్లేను వస్తుందట, ఇదిగో పూలు" కర్ర వూపుకుంటూ యెవరిచేతనో పూలు పట్టించుకు వచ్చాడు. "వాళ్ళు యెవరు? నీకు స్నేహితులకు, స్నేహితురాండ్రకేం కరువు?"

"అక్కడుంటాను, తిరిగి వచ్చాక ఒకసారి మా యింటికి రా, తెలుసుగా?" శశి లేచి, చలపతితో వెళ్ళిపోయింది. శశి భర్త ముసలివాడు. అమ్మో! తను కొంచెము ఆలస్యంచేస్తే? అతనికి దాసీదయ్యేది.

"హాట్, కోల్డ్! ఏమైనా కావాలా?" సుధీర్ వచ్చాడు. వద్దన్నట్లు తలూపింది. ఆమెకు ఏర్ పోర్టు అంతా చూసే సరికి విమానం వచ్చింది. "పదండి అదేవన్నారుగా?"

"అదే. కాని వాళ్ళు అనౌన్స్ చేస్తారు. అప్పటివరకు వేచియుండాలి తెల్సిందా?" చిన్నగా భుజం తట్టాడు. "ఇక్కడ విమానంలో యెక్కేవారికంటే సాగనంపే వారే యెక్కువవున్నట్లున్నారే."

"అవును. బంధువులు, ఆత్మీయులు, స్నేహితులున్నవారు, దూర దేశాలకు వెళ్ళేవారిని సాగనంప వస్తారు. మనవనే బాగుంది కదూ? నాకు నీవు, నీకు నేను" అన్నాడు, నవ్వుతూ అన్నాడో బాధపడుతూ అన్నాడో తెలియదు. ఆమెకుకూడా రెండు నిమిషాలు అదోలా అనిపించింది. ప్రతి వారికి యెవరో ఒకరు ఉంటారు. తనకెవ్వరూ లేరు. మరుక్షణమే సుధీర్ కంటే బంధువులెవరు అని తృప్తిచెందినది. శశి యెక్కడా కనిపించలేదు. "మీ జాషు యెక్కడ?" అని అడిగింది.

"అతనా? ఎక్కడని చెప్పను? సినిమావాళ్ళన్నీ వాడివే. కబ్బులలో యితను లేనిదే పని జరుగదు. ఎన్ని పనులున్నా మనకోసం వచ్చేవాడే. వాడిఅభిమాన నటుడి సినిమా వుంది". అంటుండగానే ఢిల్లీవెళ్ళే ప్రయాణికులు తమ సీట్లలో కూర్చొన వచ్చునని అనౌన్స్ చేశారు. అతని చెయ్యిపట్టుకుని విమాన మెక్కింది. అందులో అడుగు పెట్టగానే

క్షణం వణికింది. ఇద్దరూ వెళ్ళి తమ సీట్లలో కూర్చున్నారు. తరువాత విమానం తలుపు మూసి, బెల్ట్ పెట్టుకోమని మైకులో చెప్పారు. సుధీర్ సుశీల బెల్టు పెట్టి తనది పెట్టుకున్నాడు. ఏర్ హోస్టెస్ ఒక ప్లేటులో దూది తెచ్చి యిచ్చింది. అది అందరూ కొంత కొంత, కొంత తీసుకుని చెవులలో పెట్టుకున్నారు. "ఎందుకూ ?" అవి అడిగింది సుశీల.

"పైకి ఎగిరే టప్పుడు రొద చెవులలో జొరబడి దిమ్ముగా వుంటుంది. అందుకు" విమానం పైకిలేవగానే, యేదో తిప్పినట్టు అయింది. ఫరవాలేదన్నట్టు, తన చేయి ఆమె భుజాలమీదుగా వేశాడు సుధీర్ ఒక లెవల్‌కు ఎగిరాక; ఎలాంటి అలజడి అనిపించలేదు, కిటికీగుండా చూచింది. ఇళ్ళన్నీ బొమ్మరిళ్ళలా కనిపించసాగాయి. తెప్పలు దూదిపింజాలలా కదలసాగాయి. ఇంతలో హోస్టెస్ కాఫీ తెచ్చింది. ముందుసీటుకున్న మీటను తిప్పగానే చిన్న టేబుల్ లాంటి స్టీలు చదరము ముందు అమిరింది దానిపై కప్పు పెట్టి కాఫీ పోసింది. సుధీర్‌ను గుర్తించినట్టు చిరుగా నవ్వింది.

కాఫీ మరో అరగంటలో ఫలహారం వచ్చింది. అదో నూతన అనుభవం. ఆరుగంటలకు పాలెం విమానాశ్రయంలో ఆగింది.

విమానం దిగగానే వారికోసం అక్కడ ఏర ఇండియా వారి వ్యాను సిద్ధముగా నున్నది. ఇద్దరూ అందులోకిఎక్కారు. మన"సామాన్లు" అదుర్దాగా చూచింది. అతను నెమ్మదిగా తన జేబులోనుంచి రెండుచీటీలు తీశాడు. "మనమువెళ్ళి ఒక పదిహేను నిమిషాలు ఆ కనుపించే భవనములో ఆగితే. మన సామాను వస్తుంది. మన సామాన్లు యింకెవరయినా తీసుకునే ప్రమాదమున్నది. అందుకే ఒకేనంబరుగల రెండు చీటీలు తీసి ఒకటి మన సామానుకు కట్టి రెండవది మనకిస్తారు. ఎన్ని సామానులుంటే అన్ని చీటీలు యిస్తారు. అక్కడ మనము ఈ చీటీలు చూపించి మన సామాన్లు తీసుకోవాలి." అతని మాట పూర్తికాక మునుపే వాడు విగవచ్చి



వచ్చింది. ఇద్దరూ లోపలికి వెళ్ళి పదినిమిషాలు కూర్చున్న తరువాత సామానులు తెచ్చుకున్నారు, ఏర పోర్టు బయటికి రాగానే విపరీతమైన చలి వెయ్యసాగింది.

"నేను చెప్తే విన్నావా ? నాకెందుకు కోటు. శాలువ అన్నావు ఈ ఢిల్లీలో బాగా చలి వుంటుంది."

"ఫరవాలేదు. మన దగ్గర కూడా యింత చలి ఉన్నప్పుడు లేచి చెట్లకు నీళ్ళు పోసేదాన్ని."

"మొండి మనిషివి ఇక్కడ కొనాలి" ఆటోరిక్షాను పిలిచి యెక్కి ఏదో హోటల్ పేరు చెప్పాడు. పట్నం ఏర్‌పోర్టుకు చాలా దూరం. రివ్వుమని వచ్చే గాలి, చలి, విశాలమైన భారత రాజధాని రోడ్డులు; వణుకుతూ అతని దగ్గరగా జరిగింది. అతను ఓరగా చూచి నవ్వాడు "అయిందా అమ్మాయిగారి పని?" భుజాలచుట్టూ తన చేయివేసి యింకా దగ్గరకు తీసుకున్నాడు.

రెండవ రోజు ఇద్దరూ తయారయ్యేసరికి టిఫిన్ వచ్చింది. టిఫిన్ తీసుకుంటూ. సుశీల అభిప్రాయం అడిగాడు. "సుశీ ! ఢిల్లీ నాకు కొట్టిన పిండి. పట్నం అంతా చూడాలంటె, ఆటోలో వెళ్ళవచ్చు లేదా టూరిస్టుబస్సులుంటాయి వాటిలో వెళ్ళవచ్చు." అన్నాడు.

"టూరిస్టు బస్సులు ఈ హోటలు కొస్తాయా? లేక బస్సుదిలోకు వెళ్ళాలా ?"

"రెండూ కాదు. ఇక్కడికి కొంచెము దూరంలో కన్నాట్ ప్లేస్ అని ఒక పెద్ద బజారుంది. అక్కడనుండి బయలుదేరుతాయి. టూరిస్టు బస్సులో అయితే పదిమందితో వెళ్ళవట్టుంది. మనకు తెలియనివి చెప్పడానికి ఓ గైడ్ ఉంటాడు. కాని కొన్ని నిముషాలేసమయము యిస్తారు."

"అయితే వేరుగా వెళ్దాము. గైడ్ చెప్పడం దేనికి; మీరున్నారుగా!" అన్నది మెడలో హారము సర్దుకుంటూ. మొట్ట మొదట

ఆటోలో ఎర్రకోటకు వెళ్ళారు. 'లాల్ ఖిల్లా' ప్రసిద్ధిగాంచినది. పైన రంగంతా ఎఱ్ఱదే. అక్కడ యిరవై పైసలు పెట్టి యిద్దరికి టిక్కెట్లు తెచ్చాడు. పెద్ద యినుపగేటు దాటి లోపలికి వెళ్ళినారు. కుడిచెయ్యి ప్రక్కకి తిరిగి యాభై అరవై గజాలు నడవగానే రెండువైపులా కొట్లు కనిపించాయి. అన్నీ అలంకార వస్తువులే, అవి కాక చిన్న, చిన్నహోటళ్ళు చల్లని పానీయాలు అమ్మే దుకాణాలు ఉన్నాయి. మురాదాబాద్ గ్లాసులు ఫ్లవర్ వాజులు. యాష్ట్రేలు కుండీలు, రక రకాల రంగుల్లో చూపరుల నాకర్షిస్తున్నాయి. మరో కొట్టులో పాలరాతితో చేసిన జంతు జాలములు, తాజ్‌మహల్‌కు ప్రక్కగా చెక్కిన చిన్న చిన్న తాజమహల్లు ఉన్నాయి. సన్నికళ్ళు మొదలగు ఉపయోగకరమైన సామానులు కూడా ఉన్నాయి. అవి దాటి మరో కొట్టుముందు ఆగినారు. భారతదేశంలో ఉన్న అన్నిరకముల గాజు లున్నాయి. అవి అన్నియూ మొగల్ సామ్రాట్టుల అభిరుచులకు చిహ్నాలే.

"కొంటావా సుశీ?" భార్య ఆశగా, ఆనందంగా వాటివైపు చూస్తూంటే అడిగాడు సుధీర్.

"తిరిగి వచ్చేటప్పుడు కొందాము. అన్నీ మోసుకుని ఎలా తిరుగుతాము." అన్నది. మరో కొట్టువద్దకు నడిచారు. రెకిన్, రబ్బరు, స్పాంజి గుడ్డ, నార ప్లాస్టిక్, యిన్నింటితో చేసిన పర్సులు, బుట్టలు అమర్చారు ముఖ్యంగా నల్లని ముఖమల్ గుడ్డపై జరీతో హంసలు, మహాళ్ళు, నెమళ్ళు మొదలుగునవన్నీ కుట్టిన పర్సులు చూడముచ్చటగా ఉన్నాయి. మరోచోట పిల్లల ఆటసామానులు, రంగురంగుల గాజుమేడలు వాటిలో చిన్న చిన్న జంతువులు. ఇవి బల్లమీద అలంకారాలకి పెట్టే వస్తువులు. కొంచెము దూరం వెళ్ళగానే రక రకాల నకిలీ సొమ్ములు, (నగలు) వాటి పని తనమును మెచ్చుకోవచ్చు. అవి దాటగానే, ఓ చోట



మనుషులు గుంపులుగా చేరి చెరుకురసం త్రాగుతున్నారు. అటునుండి కొలది దూరం వెళ్ళగానే మూడు దోవలు చీలినాయి, రెండు ఎడమ కడికి ఒకటి చిన్నగా ఎదురుకు దారితీయుచున్నది. "ఆ ఎడమవైపు దారి సైనికులుండే యిళ్ళకు దారితీస్తుంది. కుడి ప్రక్కగా కొన్ని ఇళ్ళున్నాయి. షాజహాన్ కాలములో దాసీజనం, మొదలగువారు నివసించే వారేమో, ఇప్పుడు కూడా కొందరు ప్రభుత్వఉద్యోగులు నివసిస్తున్నారు" అతని మాట పూర్తికాక మునుపే, మార్చి చేసుకుంటూ, ఓ సైనిక దళం ఎడమవైపు నుండి వచ్చినది. వీరు తిన్నగా వెళ్ళినారు అక్కడహాలుంది. కొందరు మనుషులు ఏదో లెక్కలు చూచుకుంటున్నారు. దాంట్లోనుండి ముందుకు వెళ్ళగానే యెదురుగా, అంతా చలువరాతితో కట్టిన పెద్దహాలు కనిపించింది. దాంట్లో పెద్ద స్థంభాలు. మధ్య యెత్తయిన ఆసనములున్నాయి. వెనుక గోడకు చిన్నచిన్న కిటికీలున్నాయి. ముందు పెద్ద ఖాళీస్థలముంది. "చూడు సుశీ. దీనిని "దివాని-ఆమ్" అనేవారు "ఆమ్" అంటే అందరికీ ఇందులో ప్రవేశించే అర్హత వుంటుంది. ఇది కూడా షాజహాన్ కట్టాడని అంటారు. ప్రజలకు తమ సుఖ దుఃఖాలు ప్రభువుతో చెప్పుకో వాలనిపించినా. నేరస్తులను విచారించదలచినా అందరూ సమావేశం అయ్యేవారు ఈ ఖాళీస్థలములో మామూలు ప్రజలు కూర్చునేవారు. యెంత లేదన్నా రెండువేలమంది తేలికగా కూర్చుంటారు. ఆ పెద్దహాలులో ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద మనుషులు కూర్చునేవారు. యెత్తయిన ఆసనము మీద ప్రభువులు కూర్చునేవారు, ఆసనము యెదురుగా మంత్రిగారు నిలబడి, ప్రజలు చెప్పేది వినేవాడు. ఆ చిన్న గవాక్షముందే కిటికిలాంటిది, అక్కడి నుండి బయట జరిగే విషయాలను తిలకించే వాళ్ళు అంతఃపుర స్త్రీలు, బయటివారిని వారు చూడవచ్చును కాని వారిని బయటివారు చూడరాదు."

"ఇదెక్కడి న్యాయము? తమ స్త్రీలకు అంత ఘోషా దేనికో?"

"స్వార్థం, అపనమ్మకం, ఒక్కొక్కరికి లెక్కలేనంత మంది భార్యలు అనుక్షణము వారిని అనుమానిస్తూ జాగ్రత్తగా కాచేవారు. అంత ఘోషా వున్నా జరిగే ఘోరాలు జరుగుతూనే ఉండేవట, పురుషులు కొందరు వేషం వేసుకుని, స్త్రీల మందిరాలలో యధేచ్ఛగా సంచరించే వారట."

"అంత రహస్యంగా యెలా నెట్టుకు వచ్చేవారు? ఆ సంగతి బయట పడదా?"

"యెందుకు పడదు? పడ్డనాడు నేరస్తులను గుట్టుచప్పుడు కాకుండా యమునా నది పరము చేసేవారుట, గొప్పవారి గోత్రాలవింటే కథలేలే."

"రాతిని రాతిని జత చేయటానికి మధ్య యేం వాడినారో? వారెటువంటి వారయినా కొన్ని శతాబ్దాలపాటు ప్రజలలో వారికీర్తి నిలిచిపోయే ఈ కట్టడాలు మాత్రం కట్టుట అభినందనీయము" అన్నది తన్మయత్వముతో రాళ్ళని తాకి చూస్తూ.

"వారికేంనొప్పి. ప్రజలను పీడించి తెచ్చిన ధనము, వారినీతు ద్రుపు వచ్చి. రక్తం నీరుగా చేయించి కట్టించినారు" నీరసంగా నవ్వాడు సుధీర్. అతనికి ప్రభువులన్నా, వారి నిరంకుశత్వమన్నా గిట్టదు. మరేం మాట్లాడక, దాని ప్రక్కగా వున్న దారి గుండా "దివానీ ఆమ్" వెనుక వైపుకు వెళ్ళారు.

తరువాత అటునుండి దానికెదురుగా ఉన్న చిన్న-చిన్న గదులు అంతఃపుర స్త్రీల అలంకార మందిరాలు, ఇదే "ఖాస్ మహల్" అంటే ప్రత్యేక మందిరము, దనిలోనే పీకాక్ త్రోన్ ఉండేది. "కోహినూర్" వజ్రము ధరించి ప్రభువు దానిపైఆసీనుడై తన ప్రత్యేక సదస్యులతో ముచ్చటించేవారు. దానిని అంగ్లేయులు తన్నుకుపోయారు. నేరుగా మెట్లు మెట్లుగా కనిపిస్తుందే అక్కడి నుండి నీరు ఆ క్రింది హౌజులోకి ప్రవహించేది. అంతఃపుర స్త్రీలతో అక్కడ కాలం గడిపేవారు, వెనుకవైపు



తలుపు సైజులో కిటికీలున్నవే వాటిని నేరస్తులను గుట్టుగా యమునా నది పరం చేయటానికి ఉపయోగించేవారు." ఆ కిటికీ దగ్గరకు నడిచారు. యమున చాలా దూరంలో కనిపించినది. "అంతదూరం ఎలా విసిరివేసేవారండీ భయంగా చూచింది.

"అప్పుడు యమున ఎర్రకోట ప్రక్కగానే ప్రవహించేది. రాను రాను యిటు మట్టీ, యిసుక పేరుకు పోవటంతో అటుదొర్లినది.... ఇదుగో యీ కనిపించేది "రంగమహల్ అంటే రంగులరంగుల మహల్ అని అర్థం పైకప్పు అందాలతో చేయబడినది. రాను-రాను అద్దాలు ఒలిచి వేశారు. ఆ మధ్యలోనే ఒక గజము వ్యాసార్థము గల చలువరాతి కలువ. దాని మధ్యనుండు రంగు-రంగు ద్రవాలు పొంగు నల్లా యెగసి ప్రవహించివి. దీని చుట్టూ స్త్రీలు, పురుషులు కూర్చుని వినోదించేవారు.... అదిగో అ కనిపించేది "షీష్ మహల్ అంటే అద్దాలమేడ." అటు దారి తీశాడు సుధీర్.

ప్రతి భవనము చలువరాతిదే. ఎక్కడ లభించినదో ఈ రాయి?" కనులు పెద్దవి చేసింది సుశీల.

"డబ్బుతో మాట. డబ్బుంటే కొండమీది కోతికూడా దిగివస్తుంది. ప్రజలను దోచారు పరపతి నిలుపుకున్నారు ...శృంగార పురుషులు. ఈ షాజహాన్‌కు ఎంత లేదన్నా రెండువందలకు పైనే భార్యలుండేవారుట. అతనికి చాలా దగ్గరగా వచ్చి, ప్రత్యేక అభిమానం సంపాదించుకున్నది. ఒక్క ముంతాజ్ మహలే, అందుకేఆమె పేరున తాజ్‌మహల్ నిర్మించాడు

"తాజ్‌మహల్ చూద్దామండి ?...." అన్నది.

"మరి మనమొచ్చింది దేనికి ? ఢిల్లీలో ఉన్నవి చూచినాక. అక్కడికి వెళ్దాము."

"ఈ కమలములోకి నీరు ఎలా వచ్చేదో?"

"అదంతా ఇంజనీర్లు ప్లాను బి మీన్ అప్పుడూ వుండేవారుగా! యమున నుండి వచ్చేది, అటే వెళ్ళేది. ఈ సన్నని కాలువ చూడు అన్ని మందిరాలనుండి ఆగుతూ పోతుంది. దానిగుండా నీరు బయటకు వెళ తుంది" అద్దాలమేడలో అడుగు పెట్టారు. అద్దాలు యింకా అక్కడక్కడ ఊడనవి వున్నాయి.

"దీన్ని విలాసమందిరము క్రింద వాడేవారు. నాట్య గానాలు యిక్కడే జరిగేవి. ఒక్కొక్క నాట్యకత్తె వందలాది ప్రతిబింబాలను సృష్టిస్తూ, ప్రభువులను పరవశింప జేసేవారు" అద్దాలుండిన గుర్తులు పైకప్పుకు గోడలకు స్పష్టంగా కనిపిస్తూ, అక్కడక్కడ ఊడని అద్దాలు దాన్ని బలపరుస్తున్నాయి. అటునుండి బయటకువచ్చి యిద్దరూ ఒక చెట్టు నీడలో నిల్చున్నారు. సుశీల కందిపోయినది.

"సుశీ! ఫలహారము ఎప్పుడో అరిగిపోయినదిలే మనము, తిరిగింది యిక్కడిక్కడే అయినా, రెండుమైళ్ళు తిరిగాము ఇకవెళ్దామా!"

"ఇవన్నీ చూస్తూంటే ఆకలి దప్పులు గుర్తుకు రావడంలేదు. ఇలాంటివి వున్నాయని ఊహించనైనా లేదు సుమండీ," అన్నదితృప్తిగా ఒక చోట ఆపి చల్లని పానీయము యిప్పించాడు, పర్సులు, గాజులు కొన్నారు. ఓ క్రాస్‌నెక్లెస్‌ను కొంటానన్నది. "ఎందుకు బంగారుదికొందాము"

"కాదండి, దానిచేత ఎంత బాగుందో!" అమెను నిరాశపరచటం యిష్టంలేదు. అవీ కొన్ని, ఓ ప్లాస్టిక్‌బుట్టలో పెట్టుకున్నారు. ఆపురావుర మంటూ హుటాహుటి చేరినారు. భోజనం కాగానే బట్టలు కూడా మార్చక పక్కపైపడి నిదురపోయినది.

నాలుగు గంటలకు మళ్ళా బయలుదేరి జామామసీదు చేరుకున్నారు. పొద్దుట కెమెరా మరచినందుకే బాధపడ్డాడు. ఈసారి కెమెరా లోడ్ చేసుకుని తెచ్చాడు. ఎత్తయిన భవంతిపైన కట్టబడిన పెద్ద మసీదు, పైన



ఎర్రరంగు పూసినా, లోపలంతా చలువరాయే, మసీదుకు ఒకవైపు తలుపు. ఇరుప్రక్కలా పాలవలే పెద్దహాల్లున్నాయి దానిశిఖరముపైన పావురాలు ఎగురుతున్నాయి. మసీదుకు మధ్యగా దాని ఎదురుగా నీటిహౌజు. దాని నలుమూలలా సన్నని కాలువలలా మోరీలు. కాళ్ళు చేతులు కడిగిన నీరు బయటికి పోతుంది. అక్కడ సుశీలను నాలుగైదు భోజులలో ఫోటోలు తీశాడు, "మీరు?" అంది.

దూరముగా నిల్చున్న అమెరికన్ దంపతులతో తమ ఇద్దరినీ ఒకే సారి ఫోటో తీయించాడు సుధీర్.

వాళ్ళని తను తీశాడు. అక్కడినుండి శ్రీ॥ హు॥ శాస్త్రిగారిని దహనము చేసిన స్థలమును దర్శించారు. అది ఎర్రకోట వెనుకవైపు వుంది. శ్రీ నెహ్రూగారి సమాధిని "శాంతి వనము" అంటారు. సమాధి ముందు. రోజా మొక్కలు వేశారు, ఏవేవో కట్టడములకు ప్లానులున్నాయి. అక్కడ రెండు గులాబీలు కొని ఆయన సమాధిపై నుంచి నమస్కరించారు. అటునుండి రాజ్‌ఘాట్ చేరారు అక్కడ శ్రీ గాంధిగారి సమాధి ఉంది. దూరాన యమునా నది ప్రవహిస్తోంది. విశాలమైన ఆవరణలో కట్టారు. అక్కడ ఒకతను వచ్చి వీరి పేర్లు వ్రాయించుకున్నాడు.

"ఎందుకు, టికెట్లు కొనాలా!"

"కాదు, ప్రతిరోజు ఎంతమంది చూచి వెళ్తారో తెలుసుకొవడానికి.... మొగలు చక్రవర్తులని చూచినాక ఏమనిపించిందో గాని నెహ్రూగారు ఈ సమాధిని, దాని చుట్టూ కట్టడానికి కొన్నిలక్షలు ఖర్చుచేశాడు."

ఇద్దరూ లోపలికి వెళ్ళారు. చుట్టూ ఎత్తుగా కట్టబడిన గోడ దానిలో గూళ్ళలా ఉన్న గదులు, మధ్యగా నల్లరాతితో కట్టబడిన సమాధి రకరకాల రాళ్ళు కనిపిస్తాయి. అక్కడ శ్రద్ధాంజలి ఘటించి, నాల్గు ఫోటోలు తీసుకుని, యెడమప్రక్కకు తిరిగారు, ఆ గూళ్ళలా కట్టిన

హాలులో, బాపూజీ జీవిత విశేషాలను తెలిపే ఫోటోలు వరుసగా నున్నవి. అటునుండి బయటకు వచ్చారు. అప్పటికే సంధ్యచీకట్లు అలముకొన్నాయి. చలి ప్రారంభమైనది. ఆటోరిక్షాలో బజారుకు వచ్చి, సుశీలకో కోటు, కాశ్మీరు శాలువా కొన్నాడు. ఇద్దరూ హోటలు చేరుకున్నారు. "సర్ మీకోసం ఒకాయన నాల్గుసార్లు ఫోను చేశాడు" కుర్రవాడు చెప్పాడు. "అతని ఫోను నంబరు యిచ్చాడా?" వెళ్ళబోయి ఆగిచెప్పినాడు. త్వరగా వెళ్ళి అతనికి ఫోను చేశాడు. "హల్లో ! సారీ వంటరిగా రాలేదు. నా భార్య వెంట వుంది. వీలు కాదు బాస్‌కు ట్రంకాల్ చేసి చెప్పండి...." ఇంగ్లీషులో చెపుతున్నాడు. "ఆతను చేసే వ్యాపారమేమిటబ్బా?" అడుగుదామని, అతడు రాగానే మరచిపోయినది. అలసటగా గది చేరినారు.

రెండవ రోజు ప్రొద్దుటే అతను పని వుందని, ఆమెను హోటల్లో వుంచి వెళ్ళిపోయినాడు. ఒక్కర్తే, ఏమీ తోచటంలేదు. గది తలుపులు బిగించుకుని మంచముపైన దొర్లినది. దొర్లి దొర్లి విసుగు రాగానే లేచి వచ్చి బాల్కానీలో నిలబడినది రోడ్డుపై వచ్చేపోయే జనాన్నిచూస్తూ మధ్యాహ్నము వచ్చినాడు సుధీర్.

"ఈ రోజు పూర్తిగా విశ్రాంతి మనకు, సాయంత్రము సినిమా చూద్దాం. స్టేషన్‌కు వెళ్ళి వస్తున్నాను. తాజ్ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్లుండికి రిజర్వేషను చేయించాను, రేపు ఢిల్లీలో మిగిలినవి చూచి అక్కడికి వెళ్దాము." ప్రోగ్రామ్ అంతా గడ గడా చెప్పేశాడు.

"మీరలా బయటికి వెళ్ళారా ? నాకైతే ఏం తోచలేదు. ఏమైనా తెలుగు మాగజైన్సు తెప్పించరా !" అన్నది. తను పడిన విసుగంతా ముఖంలో కనపరుస్తూ.

"అది ఊహించే తెలుగు పత్రికల కోసం వెతికాను, అరవం మళయాళం, కన్నడం అన్ని భాషలలో ఉన్నాయి పత్రికలు. కానీ తెలుగులో మాత్రం దొరక లేదు."



"అదేం ? భారత రాజధానిలో తెలుగువారే లేరా !" ఆశ్చర్యంగా చూచినది.

"ఎందుకు లేరు ? చాలా మంది వున్నారు. కాని తెలుగు తమ భాష తెలుగుపత్రికలు తాము చదువుట ఏనాడో మరిచిపోయారు, వాటిపేరెత్తితేనే తమ స్టాండర్డు తక్కువయినట్లు భావిస్తారు. మనవారు యిక్కడ ఎవరైనా కనిపించినా తెలుగు రానట్లే నటిస్తారు."

"ఎందుకు? అన్ని భాషలవంటిది కాదు మన భాష. ఇతరులు అంత ఆరాటపడుతూ తమ భాషలకై ప్రాకులాడుతుంటారే. ఒక అరవ మామి రెండో మామి కనిపించగానే పరుగెత్తుకుపోయి, ప్రక్కన మనుష్యులున్నదికూడా గమనించక వారి భాషలో మాట్లాడుకుంటారే"

"అది వారి గొప్పతనం విమర్శించాలని కాదుగాని మన వేష భాషను అసహ్యించుకోవటం, హావా భారత్వము అరంభ భారత్వము ఆంధ్రుల అభిమాన విషయాలు. పెట్టని సొమ్ములు .... ఏం చేస్తాము.!" అన్నాడు. వెయిటర్ భోజనం తెచ్చాడు. ఇద్దరు భోజనంచేసి, విశ్రాంతి తీసుకుని "షీలా" టాకీసులో సినిమాచూచారు.

సాయంత్రం సినిమానుండి లక్ష్మీనారాయణ మందిరము దగ్గర కొచ్చారు. "సుశీ ! మన హిందూదేవాలయాలు ఎన్నో దర్శించాను. నేను కోరిన ప్రశాంతతా పవిత్రతా యిక్కడ గోచరిస్తాయి. దీనిని కట్టించినతను బిర్లాఅని ఒక ధనికుడు." ఇరువురు పాదరక్షలు వదిలి లోపలికి వెళ్ళారు, దూరంనుండి సన్నని సుమధురమైన కంఠముతో "ప్రభూ తేరా నామ్‌కో" అను భజన వినిపిస్తుంది. ఆ మందిరం కూడా పాలరాయితో కట్టినదే. చెత్తా చెదారం, పూజారుల ఆర్భాటం, భక్తుల గోల అసలు లేదు. ఎదురుగా పున్న పొడుగాటి హాలుతో మధ్యగా లక్ష్మీనారాయణ ప్రతిమలూ, ఎడమవైపు దుర్గాదేవి ప్రతిమ,కుడివేపు శ్రీ శంకరునిలింగము

ఉన్నాయి. ఆ మందిరముకెదురుగా విఘ్నేశ్వరుని గుడి వుంది. కుడి వైపు పైకి వెళ్ళగానే. చక్రధారి అయిన శ్రీకృష్ణుని ప్రతిమవుంది. అక్కడే సితార్ మీటుతూ పాడుతున్నాడో వ్యక్తి, చిన్న మైకు ద్వారా మందిరమంతా వినిపించేలా చేయుచున్నాడు. మందిరం గోడలలో తెల్లని రాతిపైన నల్లని అక్షరాలలో భగవత్ గీత శ్లోకాలు, వెనుకవేపు తోట, అక్కడ తెల్లని రాయితో చేసిన జోడు గుర్రాలున్నాయి కుడివైపున ధర్మసత్రము ఎడమవైపున బుద్ధదేవుని ప్రతిమ, అక్కడ అతనికి సంబంధించిన గ్రంథాలున్నాయి. అక్కడక్కడ దారులకుయిరువేపులా ఏనుగుల వంటి, రాతితో చెక్కినవి వున్నాయి. పృథ్వీరాజు విగ్రహముంది ఒకచోట ప్రతి విగ్రహము దగ్గరా ఒక్కొక్క గల్లాపెట్టె పెట్టివుంది. బలవంతము లేదు. ఇష్టమున్నవారు తృణమో ఫణమో వెయ్యొచ్చు. లేనివారు లేదు. అందరికీ అమ్మవారి కుంకుమ మాత్రము లభించింది. "చాలా ప్రశాంతముగా ఉన్నది" అన్నది సుశీల తృప్తిగ నిట్టూరుస్తూ, రేపు తాజ్‌మహల్ చూస్తుంది. ఒక భర్త తన భార్యపై వుండే ప్రేమ ప్రకటించుకొనుటకు కట్టాడు....ఓహో! ఆనందముతో తిరిగి వచ్చారు. భోజనం చేసి హాయిగా పడుకున్నారు. నాల్గు గంటలకు సుధీర పేర టెలిగ్రాం వచ్చింది. అది చూస్తూనే అతని ముఖం గంభీరంగా మారిపోయింది.

"సుశీ! మన తాజ్ ప్రోగ్రామ్ కాన్సిల్ అయింది, రేపు మనము హైదరాబాద్ వెళ్ళాలి. లేకుంటే కొన్ని వేలనష్టం వస్తుంది వ్యాపారములో" అన్నాడు.

సుశీలకు నిరాశగా వుంది. అతని వ్యాపారం ఏమిటో....అసలు ఏమిటో....ఆమెకు అర్థం కాలేదు. "వెళ్ళితీరాల్సిందేనా?" అన్నది

"అవును. మరోసారి వద్దాము చెప్పా! ఎంతో అవసరముంటేనే టెలిగ్రాము యిస్తారు...." అన్నాడు ఆమె భుజాలురాస్తూ.



"ఎంతో ఆశపడ్డాను. తాజ్‌ని చూస్తానని" ఆమె కంఠంలో నీరూరింది.

"ఛ, కంట తడి పెడుతున్నావా?.... నువ్వుండలేవు. ఇక్కడే వుంచి రెండురోజులలో తిరిగి వచ్చేవాడిని. తాజ్ అన్నీ చూచుకువెళ్ళే వారము" అన్నాడు.

"అమ్మో! ఒక్కర్తిని వుండలేను. ప్రాప్తంలేదు, మరోసారి ప్రయత్నిద్దాం రావటానికి."

"అయితే రాణీ పడ్డావన్నమాట. మా సుశి చాలామంచిది." అన్నాడు.

"ఉబ్బేయవద్దులెండి. ఒక్కమాట అడుగనా?" అన్నది అతనికి దగ్గరగా వెళ్ళి.

"అంత సందేహం దేనికి?.... అడుగు అన్నాడు నిదానముగా.

"మరేం లేదు. మీరుచేసే వ్యాపారం ఏమిటండీ? రాత్రింబవళ్ళు పని-పని అని పరుగెత్తుతారు." అన్నది, అతను కొన్ని నిమిషాలుమాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా చెప్పాడు.

"ఎగుమతి దిగుమతి వ్యాపారము సుశీ! విదేశాలనుండి చవకగా ఉన్నవస్తువులు తెప్పిస్తాము. కాని ప్రభుత్వం కన్నుకప్పి చేస్తాము." అన్నాడు చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"పోదురూ! అంతా అబద్ధం. నిజం చెప్పండి" అన్నది, అతను ప్రభుత్వం కన్ను కప్పగలడంటే నమ్మలేకపోతోంది.

"సరేలే నమ్మకు. అన్నీ సర్దు—నేను గంటలో వచ్చేస్తాను." అతను వెళ్ళిపోయాడు.

## 7

శశి ఎంత మరిచిపోదామన్నా సుశీలను ఆమె భర్తనూ మరువలేకపోతోంది. తమయింటో దాసీగా పడివున్న. సుశీల. .ఒక ధనిక యువ

కుని అర్ధాంగి, తాను ? అకాశము అదుకోబోయి అగాధంలో పడినది. "పిన్నీ ! పాప ఏడుస్తున్నది." మారుటి కుమారుని హెచ్చరింపు విని గదిలోకి వెళ్ళి పాపను తీసుకున్నది. అతను బయటికి వెళుతున్నాడు. అతని అర్ధాంగి అయితే! " అనే ఆలోచన వచ్చింది, వెంటనే నిట్టూర్చింది. చల పతి తోటలు చూడడానికి వెళ్ళారు. మూడు రోజులవరకు రాడు. కొంత తెరిపిగా వుంటుంది. ఒకటే రొద.

"ఏమే ! ఏమే?" అంటూ తన అందమైన పేరు పిలువలేకుండా పోయింది పాపను ముద్దుపెట్టుకుంది. "భలే అందమైనసన్ని వేశం! బావుంది శశి...." తలెత్తి చూచింది. శంకర నిల్చున్నాడు.

"ఓ....నువ్వా ?" అన్నది ముఖం తిప్పుకుంటూ.

"నీ పడకగదిలోకి నేను, చలపతి తాత తప్ప ఇంత స్వతంత్రంగా యెవరు వస్తారు. శశీ? తాత మూడు రోజుల వరకు రాడని విన్నాను." అన్నాడు వచ్చి కూర్చుని,

"శంకర ! నామీద నీకెందుకింత కసి? నన్నెలాగైనా బ్రతుకని య్యవా? నీ మూలంగా నేను ఈముసలివాడి ఇల్లాలు నయ్యాను, పరువుగా బ్రతుకుదామంటే నీ గోల ? యింట్లో అతని కొడుకున్నాడు. ఏమను కుంటాడు?" అన్నది కోపంగా.

"నిన్ను నేన్ను ఏమన్నానని ? ఒక పని చెయ్యి శశీ !"

"నీ సలహాలు అనవసరము, దయచేసి నన్ను వదలిపెట్టు. మొన్న సినిమాలో. మా సుశీల చూసిందట. నన్ను యెంత నీచంగా ఊహించిందో ?"

"రెండు నెలలనుండి మనము సినిమాకేపోలేదు. మొన్నంటా వేమిటి?"

"వెళ్ళినరోజులే, వెళ్ళిపో శంకర్. వెళ్ళిపో, నాకోసం కాదు పాపను చూడు. దాని బ్రతుకు బజారున పెట్టకు, చలపతి కూతురుగా పెరిగితేనే మంచిది.



"కాదని యెవరన్నారు ? నీదారికెప్పుడూ అడ్డురాను, ఒక వంద రూపాయలుంటే సర్దు"

"వందయిచ్చి నెలకాలేదు. యింకా నా దగ్గర యెక్కడున్నాయి?" ఏడుపు రాబోయింది, బింకంగా ఆపుకుంది.

"మరీ అవసరము. చూడు సాయంత్రము వస్తాను," అతను వెళ్ళిపోయాడు.

ఆమె అచేతనంగా కూర్చుంటిపోయింది. చాలా సేపటికి కొడుకు వచ్చినట్టు కబురు అంది భోజనానికి క్రిందికి వెళ్ళింది.

"ఏంతోచటంలేదు పిన్నీ మీ ఇంటికి వెళ్దామా ?"

తలాడించింది.

మారుటి కుమారునితో తమ పొలంలో ఉన్న షెడ్డు చేరింది శశి. అక్కడి దృశ్యం చూడగానే కడుపులో దేవినట్లయింది. ప్రసన్న హౌజు దగ్గర బట్టలు పుతుకుతోంది. ప్రేమ పిండుతోంది. వేణు అరవేస్తు న్నాడు. షెడ్డు కవతల వేసిన చిన్న గుడిశలో. కట్టెలను ఊదుతూంది కనకదుర్గమ్మ, ఉమాపతి నులకమంచంలో పడుకున్నాడు.

"యెలా ఉంది నాన్నా ?"

"రోజులు లెక్కపెడుతున్నాను. మీ అబ్బాయా !" అన్నాడు యువకుని చూచి.

"అవును నాన్న, మీరు అంత నిరాశగా మాట్లాడితే యెట్లానాన్నా? పక్షవాతం యెంతమందికి రాలేదు. బాగుపడలేదు. ?

"కూర్చో అబ్బాయ్." అని తల్లిదగ్గరకు వెళ్ళింది. ప్రేమ. వేణు పరుగున వచ్చి పాపను అందుకున్నారు. వారి చేతులు చల్లగా ఉన్నా యేమో ఒకటే ఏడుపు మొదలు పెట్టింది.

"నువ్వెప్పుడొచ్చావే ? యింత ఉప్మా చేసి ఏడుద్దామని అరగంట

నుంచి పోయిముందు కూలబడ్డానే. వచ్చి కష్టాలు మండిచావటంలేదు, పా[illegible] ఒల్లు చేయనే లేదు." చేతులు చీరకు తుడుచుకుని పాపనెత్తుకుంది.

"నాన్నగారు తిరుగుతున్నారా అమ్మా ?" అని అడిగింది.

అక్కడ ఉన్న పీట వాల్చుకుని కూర్చుంటూ "తిరుగుతారేమి ఆయన మంచమెక్కి బాగానే ఉన్నారే. మధ్యన నేను చస్తున్నాను. ఏం మాట్లాడినా పిచ్చి ఎత్తినట్లే మాటాడుతారు. నన్ను సాధించితే ఆయనకేం ఒరుగుతుందో ?

"తమ్ముడూ అంటూ పెంచి పెద్దచేసి ఈ కష్టం కొని తెచ్చుకున్నాను. ఇదంతా దాని మూలంగానే వచ్చిందే. దానికి నా కష్టాలన్నీరాను. యెవడినో కట్టుకుని కులుకుతుందటగా ?"

ఈసారి శశికి తల్లి మీద కోపం వచ్చింది, "మన కర్మకు యెవరినో ఎందుకు నిందించాలి. అది మంచినోములు నోచుకున్నది. చక్కని ఈడు జోడయిన భర్త సంసారము ముచ్చటగా ఉంది ..."

"ఏమిటే ? మీ నాన్నగారి పిచ్చే మీ కందరకు పట్టిందా? అది నీ కెక్కడి కనిపించిందే ?"

"మొన్న భర్తతో కలిసి ఢిల్లీ వెడుతోందిలే! ఛాయ తేలి యెంత అందముగా తయారయిందని? అందరినీ అడిగింది. ఎంతో బాధపడింది."

"కొంపకు నిప్పుపెట్టింది చాలక యింకా మన గురించి అడిగిందా? సిగ్గుండాలి ముఖానికి. నువ్వు మాట్లాడినావా ? నేను అయితేనా పేడనీళ్ళు ముఖాన కొట్టేదాన్ని...."

"ఎవరినే అమ్మా ?" అంటూ ప్రసన్న వచ్చింది. పాపను సంబరంగా తల్లిచేతుల్లోంచి లాక్కుని. శాలువా చేతులమీదుగా తీసుకుని యెత్తుకుంది. "ఏందిరా చిన్నమ్మలూ? నవ్వుతున్నావా ?" పాప బుగ్గలు ముద్దుపెట్టుకుంది. "ఏం శశీ అమ్మ పోటు పోటుగా ఉంది?"



"సుశీల కనిపించిందక్కా! ఓ ధనికుడిని పెళ్ళాడి సుఖంగా ఉందంటే అమ్మ మండిపడుతోంది."

ప్రసన్న గాఢంగా నిట్టూర్చింది. "ఈ యింట కోపతాపాలే మిగిలినాయి. అతను మీ కుమారుడనుకుంటాను. తాతయ్య పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయిలే?....' పాపను తల్లికిచ్చి త్వరగా విప్పు చేసి, కాఫీ, టిఫిన్లు చేసింది ప్రసన్న. అందరూ తీసుకున్నారు. పొలాలు తిరిగి చూచి వచ్చారు.

"ఇక్కడ దగ్గరలో మిషన్ కాంపౌండుంది శశీ! వాళ్ళకు టీచరు కావాలట! వెళ్దామనుకుంటున్నాను. నెలాఖరులో చాలా కట-కట లాడవల్సివస్తోంది....పిల్లలు నడిచి ఊళ్ళోకి వెళ్ళలేకపోతున్నారు. ఓ వంద రూపాయలిచ్చినా నయమే!" అన్నది.

"ఎంతకు దిగజారి పోయామక్కా! కాదు లేదేం?"

"ఊళ్ళోకి క్రొత్తగా వచ్చిన డాక్టరు నాన్నగారిని అడిగి తీసుకెళ్ళారు. కాదనటానికి వీలులేదు. అతనిచ్చిన మందులకు పైసలు యివ్వలేదు. ఇక మిగిలింది ఈ పొలం మాత్రమే!"

"మరి నువ్వు స్కూలుకు వెళ్ళితే పనులకు కష్టం కదక్కా! ఏ జీతగాడి పెళ్ళాన్నో పనికి పెట్టుకోలేకపోయారా?" అన్నది శశి తల్లి పడే అవస్థ చూడలేక.

"ఆ సంబరం తీరింది శశీ! అమ్మకు కోపం యెక్కువయింది. మనమన్నా అమ్మ అన్నా దిక్కులేనిది కాబట్టి సుశీల పడివుంది. నీళ్ళు [illegible] ఒకపూట ఉపవాసమైనా వుంటారుగాని, [illegible] ఒకరు పోగానే [illegible] మాట్లాడుతోంది."

"ఇద్దరూ [illegible] కారు దగ్గరకు వెళ్ళారు. కనకదుర్గమ్మ అత[illegible] [illegible]హించినట్లు అన్నీ సానుకూలపడితే, శశి

అతని భార్య అయ్యేది నుదిటి రాత-తల్లి అయింది. "అమ్మా, వెళ్లాను యెప్పుడయినా రా, వారం పదిరోజులుండి వద్దువు."

"ఎందుకు లేమ్మా! నువ్వున్నా నిశ్చింతగా ఉండు. అదే చాలు."

తండ్రికి చెప్పి వచ్చి కార్లో కూర్చుంది. కారు వెళ్ళిపోయింది. ప్రసన్న పేడ, ఎర్రమన్ను కలిపి తండ్రి షెడ్డు అలుకుదామని వచ్చింది. అలాంటి స్థితిలో తన కూతుర్ని చూసి ఉమాపతి కళ్ళు చమర్చాయి. "తండ్రిగా నేను, విద్యాలయాలు, సంఘం ఏవీ నేర్పలేనిపాఠాలు, పరిస్థితులు నేర్పుతాయి కాబోలు. ఇంగ్లీష్ నవలలు! కొత్త సినిమాలు, లేటెస్టు ఫ్యాషన్ దుస్తులు తప్ప మరేం తెలియని కూతురు యెన్ని పనులు చేస్తోంది?" గొణుక్కున్నాడు.

"ఏం నాన్నా! ఏం చెప్తున్నారు? నాకేం వినిపించటం లేదు." ప్రసన్న తల యెత్తింది.

"ఏం లేదు తల్లీ. వినిపించని విషయాలలో అంత ఆసక్తి దేనికి పోనీలే." అన్నాడు.

"ఏమిటి నాన్నా! రోజుకు రోజు ఇలా మారిపోతున్నారేమిటి?"

"నేను ఏమీ మారటము లేదు తల్లీ. నేను చేసిన పుణ్యము నన్నిలా వెంటాడుతోంది" పుణ్యము అనే మాట ఒత్తి పలుకుతూ అన్నాడు. ప్రసన్న మాట్లాడలేదు. తనపని పూర్తిచేసుకుని వెళ్ళిపోయింది. అందరూ భోజనాలకు కూర్చున్నారు.

వేలు వాడి చదువుకు తగిలాయి
మెక్కితే మందు యిప్పించే దిక్కులేదు.
"సుతుల గన్నది గతులకొరకు—" అంటారు. ఆడపిల్ల
అయ్యో అవి ఈసడించుకుంటారు. మొగపిల్లవాగానే
కురిసినట్లు మురిసిపోయారు" అన్నది ముద్దు కల



"అమ్మా! కూర కారంగా ఉందే." ప్రేమ మారాం చేసింది.

"కారం తక్కువే వేశామే. నెయ్యిలేదు. రేపు జీతగాడితో చెప్తాను. యెక్కడయినా ఓ గేదె ఉందేమో చూడమని, పాలు, పెరుగు లేనిది ఎంత కష్టము."

"కష్టము సంగతి దేము దెరుగు. ఇప్పుడు డబ్బులెక్కడివమ్మా?" ప్రసన్న అడిగింది.

"ఏదో ఏర్పాటుచూడొద్దూ! నాల్గు అయిదు పెట్టెలనిండా పుస్తకాలు అయిదారు బ్యాగులలో పేపర్లు....ఎక్కడ చూడు అవ్వే. అన్నీ అమ్మి పడేశాను. వాడెవడో నాల్గు అక్షరం ముక్క లొచ్చినవాడు. నీ పుస్తకాలన్నింటికి నాల్గోవంతున ధరకట్టాడులే. మూటయాభై రూపాయలు వచ్చాయి." కనకదుర్గమ్మ చెప్పుకుపోతోంది. ప్రసన్న కనుల వెంబడి కారే నీరు ఆమె చూడటం లేదు. అందలమెక్కటోయి అగాధంలో పడ్డారు. దానినుండి బయటికి రావటానికి యెంతో ప్రయత్నం చేస్తారు. ఆ ప్రయత్నములో తమ చేతికందినది పామో, కొమ్మో తెలుసుకోలేరు. దుర్గమ్మ పని అలాగే ఉంది. రోజు ముదిమెతుకులు పిల్లలకు పెట్టేటప్పుడు ఆమె కంట నీరూరుతుంది. అందుకే మంచి, చెడు ఆలోచించక, మంచివి, చెడ్డవి యింట్లో ఒక్క కాగితపుముక్క లేకుండా అమ్మివేసింది. అమ్మడానికేం మిగిలాయి గనక? యేనాడు లేనిది శనిదేవత ఆవహించి పట్టు, నగలన్నీ తీసి భర్తవెంట వెళ్ళింది. బయటి దొంగలకే భయపడింది. కానీ యింటిదొంగలు ఇంతపని చేస్తారని ఊహించనైనా లేదు. మంగళసూత్రం తాడు. రెండు జతల గాజులు మిగిలినాయి. దుస్తులకు మాత్రం ఇంకో అయిదు సంవత్సరాల వరకు కొరతలేదు.

# 8

"రా శశీ! నేనారోజు చెప్పితే యిప్పుడు తీరినదా? పాప నవ్వుతుందే! ఏం పేరు పెట్టావు?" శశి కెదురేగి కౌగిలించుకుని, పాపను ముద్దుపెట్టుకుంది సుశీల.

"ఒక్కసారి వచ్చి అరగంట ఉండి అఘమేఘాల మీదొచ్చి కబుర్లు చెప్తుంది నంగనాచిలా! అత్త మంచిదిగాదు_ పోవద్దురా!" పాపను లాక్కుపోయింది చిరుకోపంతో.

"మలి కాలో చాన మంచిదన్నావుగా?" చిక్కమొహం వేసింది పాప, ఇద్దరూ పక పకా నవ్వారు. వచ్చి కూర్చున్నారు. "పసిపిల్లలు యెంత అమాయకులో చూడు."

"అంత పరవశించి పోకు. త్వరలో నువ్వూ యెత్తుకునేలా ఉన్నావుగా పసిదాన్ని."

"పసివాడిని అను" అన్నది సుశీల సిగ్గుగా చూస్తూ.

"అదేమిటే? అప్పుడే కట్నాలమీదకి మనసు పోతోందా? నీ అత్తలా?"

"కట్నకానుకల కోసంగాదు శశీ! ఆడపుట్టుక పుట్టి అనుభవించాము చాలదూ? అదే నేను మొగాడినయితే ప్రేమకు కాటోయేభర్తగా అత్తయ్య చేతిలో దర్జాగా పెరిగేదాన్ని. పగవారికికూడా ఆడ జన్మ వద్దే!—

"సుశీ అన్ని సుఖాలు ఉన్న నువ్వే యిలా అంటే నేనేంచెయ్యనే? ముసలి మొగుళ్ళను కొంగున ముడివేసుకుని, యెన్నో అఘాయిత్యాలు



చేసిన కథలు విన్నాము. అతని అడుగులకు మడుగులొత్తుతూ పాప పేర కొంత ఆస్తి రాయించలేకపోతున్నాను."

"పోనీలే! దాని అదృష్టమెలా ఉన్నదో! అంతా అస్తిపాస్తులున్నవారేనా?"

"అవును దానికి విపర్యనము నువ్వన్నావుగా? సుశీ! అనుభవము నేర్పిన పాఠాలు ఏ చదువు నేర్పవు. కనీసం యెవరికి సహాయం చెయ్యకపోయినా హాని చెయ్యొద్దనే నిర్ణయం చేసుకున్నాను. నాలోవున్న యే కొద్ది మంచితనము, మానవత్వమూ నా పాపకు రక్షగా నిలుస్తే చాలు........" అన్నది. ఊరిన కన్నీరు బయటకు రానీయకుండా.

"మీ అమ్మాయి పెళ్ళి యెంతవరదాకొచ్చింది?"

"వేసవిలో అవుతుందేమో? అమ్మ అక్క పెళ్ళి గురించి ఒకటే దిగులు పడుతోంది. ఏమవుతోందో, ఏమో?...." ఆవెప్పుడూ ఉండే గొడవలేగా? ఎన్నో మాసము?"

"ఏడు. ఏమవుతుందో యేమో దిగులుగా ఉంది శశీ. అమ్మ, వేరే ఆదరిక్కు లేదు. అనసూయ పిన్ని వాళ్ళకు దూరం ట్రాన్స్‌ఫర్ అయిందట. ఆమె ఉంటే తప్పక వచ్చేది.

"ఇప్పుడేముంది? నేను లేనూ?.... చిన్నప్పుడు తెలియక అతి చనువులకు పోయాము. ఇంకా మారలేదనుకున్నావా" ఇద్దరూ మాటల్లో ఉండగా రేడియో ఫుల్‌వాల్యూమ్‌లో వినిపించింది.

ఉలిక్కిపడి చూచారు. పాప కుర్చీయెక్కి రేడియో తిప్పుతున్నది. గబగబ పరుగున వెళ్ళింది. "ఎవి చేతులకు పట్టీలు వేయాలి. ఇంట్లోనూ అంతేనే? ఒక్క సామాను ఒక దగ్గర ఉంచదు."

"పిల్లలు కాక మనము నర్తుతామా?" అని సుశీల నవ్వుతూ

పాపకు బిస్కెట్లు, చాకలెట్లు పెట్టింది. సాయంత్రము వరకుండి,ఫలహారం చేసి వెళ్ళిపోయింది శశి.

"సుశీల సరిగ్గా తిండి తినలేకపోయింది. భర్త ప్రొద్దుట వెళ్ళి యింతవరకూ రాలేదు. తను వింత మనిషి. ఏ క్షణములో ఏం జరుగుతుందో? మంచముపై దొర్లుతున్నది గాని నిద్ర రావటంలేదు. రెండు గంటల ప్రాంతములో వచ్చాడు సుధీర్. "దాదా! సుశీల అన్నం సరిగ్గ తింటున్నదా?"

"ఈ మధ్య ఒకటే దిగులుగా ఉంటున్నారు బాబూ! మధ్యాహ్నము వారి వదినగారు వచ్చారు. ఆమె ఉన్నంతసేపు సంతోషంగా ఉన్నారు. అమె వెళ్ళగానే దిగులు పడిపోయారు."

సుధీర్ మరేమనక వచ్చి తలుపులు వేశాడు. అప్పుడే లేచి తన మనసులోని దిగులంతా వెళ్ళగ్రక్కాలి అనుకుంది—కాని అలసి వచ్చారు. వినుకుంటారో? భయంతో కళ్ళే విప్పలేదు. బలమైన చేయి తనచుట్టూ చుట్టుకొగానే అన్నీ మరిచి నిద్రబోయింది.

ఆమె అడుగవల్సిన అవసరమే లేకపోయినది. మధ్యాహ్నము రెండుగంటలు తప్ప, మిగతా సమయమంతా ఇంట్లోనే ఉంటున్నారు. కబుర్లతో, షికార్లతో, సినిమాలతో రోజులు నిమిషాల్లా దొర్లిపోతున్నాయి. ఒక శుభగడియలో సుశీల కోర్కె నెరవేరింది. పండులాటి మొగబిడ్డడు కలిగాడు. సుధీర్ గర్వంగా, సంతోషంగా చూచాడు వాడిని—

"అంత సంబరపడుతున్నారు? ఏం మోసుకొచ్చాడని మీ కుమారుడు?" సుశీల భర్తను వెక్కిరించినది

సుధీర్ నవ్వినాడు. "అక్కడికి నీకు సంతోషం లేనట్టు. మనము ఆనందము అనుభవించి ఊరుకుంటున్నాము, వాడి తాత బ్రతికి వుంటే ఊళ్ళు వాడ అంతా ఒక్కటి చేసేవాడు. ఇప్పటికి మరుపురాని దినము



మశీ! పదోక్లాసు పాసయిననాడు ఆయన సంతోషం యింతా అంతా కాదు! ఆనాడు ఊరంతా పండుగ చేసుకొన్నారు" యెటో చూస్తూ చెప్పాడు.

"మరి జమీందారు అన్నారుగా? ఏ ఊరు? ఆయన యెక్కడికెళ్ళారు? యెప్పుడూ చెప్పరేమండీ!"

"వద్దులే సుశీ! అవన్నీ మధుర స్మృతులుగానే నా గుండెలలో ఉండనియ్యి. వాటిని త్రవ్వి వాటి వెనుకాల జరిగిన దారుణాలు జ్ఞాపకం రానియ్యకు. మనమిలాగే హాయిగా ఉందాము. గతం త్రవ్వడం దేనికి?" అన్నాడు. అతని కనులలోకి చూచి బాధపడుతాడని మరేం మాట్లాడలేదు. అతను యింటిదగ్గరే కబుర్లు చెప్పి నవ్వించాడు. "శశికి ఫోను చెయ్యలేదా?"

"చేశాను, ఆమె ఊరిలో లేదుట. నాల్గురోజులయితేగాని రాదుట" అన్నది.

"బాబుకు ఏం పేరు పెడదామండీ?" అన్నది. వాడి మూసుకున్న పిడికిళ్ళు విడదీస్తూ.

"అన్ని పుస్తకాలు చదువుతావు. ఏదో ఒక పేరు యెన్నిక చేయి."

"అలాకాదు. మీ నాన్నగారిపేరు, మా నాన్నగారి పేరు కలిపి పెడదాము. మీ నాన్నగారి పేరు చెప్పండి. ఇద్దరికి మొదటి మనుమడేగా?" అన్నది కుతూహలంగా.

నాన్నగారి పేరు చాల పొడవు. శ్రీ రాజా రామకృష్ణరామ్," అన్నాడు సంతోషంగా,

"అయితే మనము పొట్టిచేద్దాము. శ్రీ రాజా రఘురామ్, అని పెడితే."

"అక్కడికి అది పొట్టి అయినట్లు. సరే రాజా" అని పిలువవచ్చు.

రేపే వెళ్ళొచ్చున్నారు డాక్టరు. వెళ్ళిపోదామా?" అసలతనికి పసివాడిని వదిలిపోవాలని లేదు.

"అవును నాకు యిక్కడ విసుగ్గానే ఉంది. దినమంతా దగ్గరే ఉండేవారు ఇవతలి_అవతలి గదులు దినమంతా బంధువులతో, స్నేహితులతో కిట కిట లాడిపోయేవి. అదంతా విని, చూచి ఆమె యెక్కడ నొచ్చుకుంటుందోనని అవతలికి జరిగేవాడే కాదు. అతని కబుర్లు వింటూ తన బాధను, ఆవేదనను మరిచిపోయేది.

బాబుకు రాజా అన్నపేరు ఖాయం అయినది. అతను పెద్దగా ఆడంబరము చెయ్యటానికి అంగీకరించలేదు. రాజా నామకరణోత్సవము పురస్కరించుకుని బీదలకు అన్నవస్త్రాలు దానం చేశారు.

"చూడు సుశీ! ఈ సొసైటీలో పెద్దమనుష్యలను పిలిస్తే నాజూకుగా సగం తిని, సగం పారబోస్తారు. లేనిపోని హంగామా, బీద జనులను చూడు. ప్రతి మెతుకు విలువయినదిగా యెంచి తింటున్నారు వారికి భుజించామన్న తృప్తి, మనకు పెట్టామన్న తృప్తి మిగులుతాయి, ఏమంటావు?"

"నిజమే! మీరెంతో ఆలోచించే పనిచేస్తారు. మరి కొందరయితే బహుమతుల కోసం పిలిచామన్నట్లు ప్రవర్తిస్తారు.... అత్తయ్య యింట్లో చూచేదాన్నిగా?" రాజాకు స్వెట్టరు వేస్తూ అంది. మంచి స్టీలుస్టాండు గల ఉయ్యాల, రకరకాల దుస్తులు, ఆటవస్తువులూ తెచ్చాడు.

రాజాకు నీళ్ళు పొయ్యటానికి మంచి, చెడు చూడటానికి ఓ స్త్రీని కుదిర్చినారు.

"ఏమండి! ఒక్కసారి అత్తయ్య వాళ్ళింటికి వెళ్దాము. నా బాబును చూపించి వస్తాను. ఆమె ముఖం యెలా మారుతుందో చూడాలి."

"వద్దు సుశీ! ఆమెలాంటి వారు మారరు. పైగా అవిధ శాప



నార్థాలు వినాలి. అచ్చు దుర్గమ్మే! ఆమె కుమారుడు మద్రాసులో వ్యాపారం చాలించి, చింకి ప్యాంటుతో యిల్లు చేరినాడు. దానికి నీవే కారణం అనుకుంటోంది దీవెనలు లేకపోగా, తిట్లూ, శాపనార్థాలు దేనికి? మనకు భగవంతుడొక్కడే నిజమైన బంధువు. ఏం రాజా!" కొడుకును ముద్దాడినాడు,

సుశీల యెదురు చెప్పలేదు. సంతోషమైనా దుఃఖమయినా ఇతరులతో పంచుకున్నప్పుడే దానికి పరిపూర్ణత లభిస్తుందని అతని కెలా చెప్తుంది? తను వివాహితురాలై, మాతృమూర్తి అయినా ఆ యింటమున్నట్లుగా, నొక్క శ్రేయోభిలాషి మామయ్యను చూడాలని ఉంటుందని ఎలా నచ్చచెపుతుంది? అతని భయం అతనిది. తన కుమారునిపై యితరుల దృష్టి పడకూడదని అతని భావన. దుర్గమ్మనూ, ఆమె నోటి దురుసుతనమునూ ప్రత్యక్షముగా చూచినాడు. సుధీర్ కు రాజా తోడిదే లోకము. ఇంట్లో ఉన్నంత సేపు తాను పసివాడై ఆడుతాడు.

బాబుకు డ్రస్సు, ఆటవస్తువులు తీసుకుని శశి వచ్చింది. సుశీలకు యెక్కడలేని ఉత్సాహము వచ్చింది.

"ఒట్టి పిసినారి పెద్దమ్మవేమే! మీ బాబు నామకరణోత్సవానికి పిలువలేదేం?"

చెప్పానుగా! ఆయనంతా అదో రకపు మనిషి! బీదలకు అన్నము పెట్టించి అయిందనిపించారు."

"మంచిదిలే! ఉన్నవాడికి. ఉన్నవారు పెడితే ఏం లాభం? మీవాడు నవ్వుతున్నాడే?" రాజాను యెత్తుకుని ముద్దులు కురిపించింది శశి.

"ఇంకా యింటిదగ్గర విశేషాలు చెప్తావనుకుంటే...."

"ఏమున్నాయి సుశీ? ఆశాజనకమైనవేమీ లేవు అన్నయ్య తిరిగి వచ్చినాడు. పూర్వపు పద్ధతే! ఇంకా కొన్ని అనవసపు అలవాట్లు నేర్చుకు వచ్చినాడు. మొన్న ఓ పెళ్ళికొడుకు అక్కయ్యను చూచి నచ్చిందన్నా

డట. ఎక్కడో ఆఫీసులో అప్పర్ డివిజన్ క్లర్క్‌గా పని చేస్తున్నాడట. కట్నం అయిదువేలు అడిగినాడు. ఆ తాకట్టుకే కాదు తెగనమ్మి అతనప్పు పోగా మిగిలిన రూపాయలు తెచ్చారు.... పెళ్ళి నిశ్చయం చేసుకుందామని వెళ్ళేసరికే పిల్ల త్వరగా జవాబు చెప్పలేదని యింకోవైపు నిశ్చయము చేసుకున్నారట. అమ్మ మరి దిగజారిపోయింది. ఆ డబ్బు తనకియ్యటం లేదని ఒకటే చిర–చిర లాడుతున్నాడు అన్నయ్య."

"చిన్న బావ దగ్గర నుంచి ఉత్తరాలు వస్తున్నాయా. అతనికి పిల్లలా?"

"ఏమో! అక్కయ్య యింటి పరిస్థితి వివరిస్తూ మూడు నాలుగు ఉత్తరాలు రాసి విసుగెత్తి ఊరుకున్నది. మీవారు ఎప్పుడొచ్చినా కనిపించరేమే?"

"ఆయన నన్ను నామకార్థానికి పెళ్ళి చేసుకున్నారు. అసలాయన పెళ్ళి వ్యాపారంతో అయ్యింది. ఈ మధ్య పోవటం లేదులే! ఈ రోజే పని ఉందని వెళ్ళారు" శశికూడా తొందరగ నే వెళ్ళిపోయింది.

కుండపోతగా వర్షం కురువసాగింది. కిటికీల అద్దాలు దించి వచ్చింది సుశీల. ఆయా రాజా ఉయ్యాల దగ్గర పడుకుంది. రాత్రి తొమ్మిది దాటినా సుధీర్ జాడ లేదు.

"రామ్మా! పసిబిడ్డ తల్లివమ్మా నువ్వు భోజనం చేద్దువురా!" దాదా పిలిచాడు.

"ఆయనను రానియ్యి దాదా?" ఆమె మాట పూర్తికాక పూర్వమే తలుపు బాదిన చప్పుడయినది.

దాదా తలుపు తీశాడు. సుధీర్ గడ-గడ వణుకుతున్న వృద్ధుణ్ణి లోపలికి పట్టితెస్తున్నాడు. పెరిగి నెరసిన గడ్డం. లోతుకు పోయిన కళ్ళు ఒక ప్రక్కకు చెవి దగ్గరగా వంగిపోయిన మూతి, యెక్కడో చూచిన పోలికలు! వెనకాల వచ్చిన వ్యక్తిని చూచి ఉలిక్కిపడినది సుశీల.



శరీరంలో బిగుతు సడలి, నగలేమి లేక అతి సామాన్యంగా ఉంది,

"మామయ్యా!" ఒక్క అంగలో అతన్ని చేరింది. "మీరా మామయ్యా! శరీరంలో యెముకలు తప్ప కండరాలు ఏమయ్యాయి?" అతని వంక చూస్తూ ఏడ్వసాగింది.

"ఏడుస్తే ఏమొస్తుంది? వెళ్ళి బట్టలు పట్టుకురా. అసలే జ్వరంగా ఉన్నాడు." సుశీల భర్త అలమార తీసి చలువ చేసిన ధోవతి, షర్టునట్టుకు వచ్చింది. దాదా సహాయంతో బట్టలు మార్చి, సుశీలకు ముందు అమర్చిన చెక్కల గదిలో మంచమువేసి పడుకోబెట్టారు. దాదా వేడి ఓవల్టీను కలిపి తెచ్చాడు. అది త్రాగించి రగ్గు కప్పాక మనిషి చూపులో జీవమువచ్చింది. సుశీలకు అత్తగురించి జ్ఞాపకం వచ్చింది. ఆమె బట్టలుకూడా తడిసి ముద్దయిఉన్నాయి. తన చీరె, పరికిణా, టవల్ తెచ్చిఇచ్చింది. ఇంటిని వేగకళ్ళతో పరికిస్తూ బట్టలు అందుకుంది.

"సుశీ! మీ అత్తగారికి భోజనం ఏర్పాటుచెయ్యి. ప్రొద్దున ఇంటి నుండి బయలుదేరారట. ఉస్మానియాలో ఎక్సరేకని వెళితే మళ్ళీ వారం రమ్మన్నారట. బస్సులో యింటికి వెడుతుంటే, బస్సు ఫేలయింది. చెట్టు క్రింద తడుస్తున్నారు. గుర్తు పట్టగలిగాను, నయమైంది."

"మీరు బట్టలు మార్చుకోండి. బాగా తడిశారు" భర్తకు పొడి బట్టలు యిచ్చింది. కనకదుర్గమ్మ జాకెట్టు మార్చుకుంటే మరొకటి లేదు. వణకసాగింది. సుశీల తన కోటు తెచ్చి యిచ్చింది. "మార్చుకోండి అత్తయ్యా– ఫ్యాను క్రింద ఆరవేస్తాను తెల్లారేసరికి ఆరుతుంది.

జవాబు చెప్పకుండానే మార్చుకుంది. సుశీల అందుకోకపూర్వమే ఆయా లేచి రవిక పిండి ఆరవేసింది. మవునంగా వెళ్ళి భోజనాల బల్ల దగ్గర కూర్చుంది.

"మీరు రండి, చల్లారిపోతుంది" భర్తను పిలిచింది. అతను వచ్చి కూర్చున్నాడు.

"రాజా త్వరగా నిదురపోయాడేం?" అన్నాడు.

"అలావుంది. మీరు ఆలస్యంగా వచ్చి వాడు త్వరగా నిదురపోయా డంటారేం?"

"నిజమే, నువ్వు రా దాదా!" అని పిలిచాడు.

"కూరొచ్చిందమ్మా చాలా వుంది అన్నం. చపాతీలూ ఉన్నాయి." దాదా చెప్పాడు. సుశీల కూర్చుంది. దుర్గమ్మ పని బోనులో ఎలుకలా ఉంది. నాల్గురకాల అధరువులతో సుశీల భోంచేస్తుందని తెలియదు. ఏ శంకర్‌లాంటి వెధవో అయివుంటాడు సుశీల భర్త అనుకుంది. అందరూ కూర్చుని భోజనం ముగించారు. కావకాచి తెచ్చాడు దాదా. మగతగా త్రాగి నిదురబోయాడు ఉమాపతి. అతని ప్రక్కనే నేలమీద దుర్గమ్మకి ప్రక్క పరిచింది పనవ్వ. బ్లాంకెట్టుతెచ్చి యిచ్చిపోయింది సుశీల. ఆమెకు యెంతో తృప్తిగా ఉంది. అత్త తన సంసారము! భర్తను చూచింది. అదే తనకు కావాలి. తన కోర్కె తీరింది చాలు అనుకుంది. దుర్గమ్మ అంత రంగము ఇంకొక రకంగా ఉంది. తను పెంచిన అనాధ! తన చేతిక్రింది నీరు— త్రాగే కులగోత్రం లేనిదాని కూతురు! ఆహా! మకుటంలేని మహా రాణిలా తిరుగుతోంది. దేవుడు గుడ్డివాడు. వాడి గుడ్డికంటికి మంచి యేదో చెడేదో తెలియటంలేదు. వీడు ఓ పిల్ల జమిందారులా ఉన్నాడు. యిది వరకే పెండ్లి పెటాకులు అయ్యాయి కాబోలు. కానీ లేకుండా దీన్ని చేసు కోవటానికి వాడేం వెర్రిపీనుగా! అయ్యే ఉంటుంది. ఇది చూడబోయింది పాడా? యెవడూ దిక్కులేక యెలా ఉంటుంది?" యెప్పుడో నిద్ర పోయింది.

ఉమాపతి ముఖం ప్రశాంతముగా ఉంది. సుశీల ఇచ్చిన వేడి పాలు త్రాగినాడు. "ఇప్పుడు ఫరవాలేదు మామయ్యా. రాత్రి మీ అవ తారము చూచి యెంత భయపడ్డానో! పలుకరించటానికి కూడా ధైర్యం చాలలేదు." అతనికి భుజాలమీదుగా శాలువా కప్పింది. అతను నవ్వాడు.



"నీ భర్తనూ, నీ సంసారాన్ని చూచాక తృప్తిగా ఉందమ్మా! విధాత వెర్రివాడు కాదు తల్లీ! నామాట నమ్ము. నిన్ను అన్యాయం చేయాలని కాదు.... నిన్ను కోడలిగా చేసుకోవాలని యెన్నో కలలు కన్నాను. కల్ల లవుతాయని అనుకోలేదు. నాసోది యెందుకు? నీ కొడుకును చూపించు, పడుకుంటే వద్దులే."

"లేచే వేళయిందండి" వెళ్ళి గదిలో నుండి కొడుకును యెత్తుకు వచ్చింది.

బొద్దుగా, అచ్చు సుధీర్‌లా ఉన్నాడు. వాడి బుగ్గలు నిమిరి సంబర ముగా చూచాడు. తనకి దుర్గమ్మ లేనిదే స్వతంత్రంగా తిరుగలేక పోతోంది. ఆమె అలవాట్లు యెరిగిన సుశీల, ఏ ఏ సమయాలకు ఏం కావలయునో అమర్చి పెడుతోంది. హాస్పిటల్లో ఎక్సరే తీయించాడు. రెండు రోజుల తరువాత రమ్మన్నారు. అందరిని యింట్లో దించి ఆ రోజువచ్చిన పోస్టు చూసుకున్నాడు సుధీర్. అతని ముఖం ఎర్రబడింది. వెంటనే లేచి. "సుశీ! నాకు వారానికి సరిపడే బట్టలు సర్దు. మీ మామయ్య వుంటానంటే సరే. రాజా. నువ్వు అతనితో జాగ్రత్తగా ఉండండి. వెళ్తానంటే దాదాతో చెప్పు కారు నడపడానికి డ్రైవరును తెస్తాడు."

ఎక్కడికి వెళ్తున్నారని అడుగబోయి మాటలను మింగేసింది.

ఆమె భావము గ్రహించినట్టు ఆమె దగ్గరగా వచ్చాడు. "సుశీ! మనము బీదవారము కాము. నాన్నగారు పోగానే ఆస్తి అంతా హస్తగతం చేసుకున్న శ్రీధర్‌కు లంచము పెట్టి మా బాబాయి నాటకం ఆడాడు. ఇప్పుడు ఆతని కుమారులు. నాటకం యింకా ఆడబోతున్నారుట. శ్రీధర్ గారి కుమారుడు ఉత్తరం వ్రాశారు. అతని దగ్గర నాన్నగారి ఆస్తికి సంబం ధించిన డాక్యుమెంట్స్ ఉన్నాయిట. నన్ను త్వరగా రమ్మని వ్రాశారు. పోయి వచ్చినాక చెప్తాను. మా విషయాలు యెప్పుడూ చెప్దామని,

"చచ్చిన గేదె" పాలసామెత అవుతుందని చెప్పలేదు." త్వరగా చెప్పి కొడుకును ముద్దాడి వెళ్ళిపోయాడు.

భర్త చెప్పిన విషయాలు గుర్తున్నా ఉమాపతికి దూరంగా ఉండ లేక పోయింది. సుధీర్ వెళ్ళిపోయాక దుర్గమ్మ తేలికగా ఊపిరిపీల్చింది. అతను ఉన్నంతసేపు ముండ్లపై కూర్చున్నట్లే ఉంది. "పై ఆడంబరమే కాని నగలు, గిగలు లేనట్లున్నాయి ఏమండీ?" అన్నది భర్తతో.

అతను నవ్వి ఊరుకున్నాడు. ఆమె భావము గ్రహించినట్టే సుధీర్ తనకు చేయించిన నగలు తెచ్చి చూపింది సుశీల. రెండు నెక్లెసులు, ఒక రెండు పేటల గొలుసు ముత్యాల హారము నాల్గు జతలగాజులు, చిన్న చిన్నవి చాలా ఉన్నాయి.

"అదృష్టవంతురాలవమ్మా." అన్నాడు ఆయన.

దుర్గమ్మ తన నగలను తలుచుకొని నిట్టూర్చింది. "రిపోర్టు రాగానే రేపు. వెళ్ళిపోదామండి" అన్నది.

"మంచిది." సుశీల వినకుండా జరిగినది సంభాషణ.

ఆ ఇంట్లో దుర్గమ్మకు నచ్చని యింకో విషయం ఏమిటంటే దాదా సుశీల యెడ అంత ప్రేమా భక్తి ప్రదర్శించడం .... అంతా నటనలా తోచింది. ఉమాపతి కడుపునిండా భోజనంచేశాడు. అర్ధరాత్రివరకూ సంతోషంగా మాట్లాడుతూనే కూర్చున్నాడు. సుశీల బలవంతము మీద నిదుర పోయాడు.

ఉదయము కనకదుర్గమ్మ అరుపులు విని అదరా బాదరాగా పరుగెత్తుకు వచ్చింది సుశీల.

"పిలిస్తే పలకటం లేదర్రో ....ఎటువేసిన చెయ్యి అటే పడుతుందర్రో! నేనేం చెయ్యాలి దేవుడో ...."

అతను తప్పించుకుని వెళ్ళి అతని ఒంటిమీద చెయ్యి వేసింది. చల్లగా చలనము లేదు, ఉమాపతి జీవుడు ఎప్పుడో ఈ అనంత విశ్వ



ములో లీనమయ్యాడు. సుశీలకు అత్తను చూడగానే దుఃఖం ముంచుకు వచ్చింది. స్వయంగా మేనత్తరక్త సంబంధం యెక్కడికి పోతుంది? ఎంత కష్టమున్నా. పూలు తలలో లేనిది బయటికి వెళ్ళేదికాదు. నిండుగా బొట్టు, కాటుక, పసుపుతో కలకలలాడే మనిషి....మనిషి ఇక ఊహించలేక పోయింది. "అత్తయ్యా!" అంటూ ఆమె మెడను వాటేసుకుంది.

పది గంటలవరకు రావలసినవారు వచ్చారు. చలపతి కూడా వచ్చాడు. సుశీల కేమీ తోచటంలేదు ఈ సమయములో భర్త లేక పోవటం యెంతో లోటుగా కనిపించింది. డబ్బు బీరువాలో ఉంది. తనెంతవాడినా సుధీర్ అడగడు. కాని తనకు ఎప్పుడు ఎలా ఉపయోగించాలో తెలియదు. తప్పిస్తే అత్తయ్య ఏమనుకుంటుందో? ఇవ్వకపోతే ఉన్నదో లేదో! ఆమె ఆలోచనలు పూర్తి కాకముందే ప్రసన్న, శశి పెరడువైపు వెళ్తూ రమ్మన్నట్టు సైగచేశారు. సుశీల కళ్ళు వత్తుకుని వెళ్ళింది.

"సుశీలా! నాన్న మనసులో నీ దిగులే ఉండేదేమో. ఎన్నోసార్లు ప్రాణం పోయినట్టే చేసేవారు. మరల కోలుకునే వారు. నిన్ను చూశాక ఆయన ఆత్మ తృప్తిగా పోయింది." నిట్టూర్చింది. "ఉన్నా లాభంలేదు, మా పాట్లుచూచి బాధపడేవారు. వెంకట్ యింతవరకు రాలేదు చూడు. మరేం అనుకోకు—మన పొలం దగ్గరే ఆయనను దహనం చేస్తే ఆయన ఆత్మ తృప్తిగా...." మాటలు మ్రింగింది ప్రసన్న.

"అలాగే చేద్దాము వదినా! నన్నేం చేయమంటావు? ఎంత డబ్బు కావాలి?"

"ఉంటే ఒక మూడు వందల రూపాయలు పట్టుకురా! చెల్లి కొంత తెచ్చానంటోంది."

"మంచిది వదినా! నాకివ్వన్నీ ఏమీ తెలియవు. కొన్ని పరిస్థితుల ప్రాబల్యంవల్ల విడిపోయినా, మనమంతా ఒక్కటే! సందేహ పడకుండా అడగండి. వదినా! నీకు శశి, నేను వేరు-వేరు కాను."

"సుశీ! నువ్వెప్పుడూ సుశీలవే మాకెవరున్నారని తప్పక అడుగుతాను" ప్రసన్న సుశీల భుజం మీద తలవాల్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

జరుగవల్సినదంతా జరిగిపోయింది. దుఃఖం మిగిలి పోయింది. దుర్గమ్మకు ఏడుపుకూడా రావటం లేదు ఒక విధంగా బండబారి పోయింది. ఆమెకళ్ళ ఎదురుగా పిల్లలు అన్యాయమయి పోయారు. ఆస్తి పోయింది... ఆరోగ్యం దిగజారింది....కడకు సౌభాగ్యం పోయింది....పోనీ! పోయేవి తను పట్టుకుండే ఆగుతాయా. ఖర్చులన్నీ సుశీల భరిస్తోందని తెలిసినప్పుడు మాత్రము ఆమె హృదయంలో గడ్డపలుగు దిగపడింది.

"భగవంతుడా! అన్ని విధాలుగా శిక్షించినావు. సరిపోలేదా? ఎవరి నీడను నేను అసహ్యించుకునే దాన్నో ఆ నీడనే ఆధారం చేస్తావా? కనికరం లేదా!" ఎవరు చూడకుండా విలపించింది.

సుధీర్, ఉమాపతి మరణం విని చాలా విచారించాడు. పదవరోజు వెళ్ళి కర్మకాండలు జరిపించాడు. చలపతి వెంకట్ పేకాట మొదలు పెట్టారు. సంపత్ సంతాపసందేశం పంపాడు. తీరికగావచ్చి తల్లిని చూచి వెళ్తానని ఉత్తరం వ్రాశాడు. వీరి పేకాట చూడగానే శశికి మండిపోయింది చరా, చరా అక్కడికి వెళ్ళింది. "ఏరా అన్నయ్యా! సిగ్గు, శరం లేదా? నాన్నగారి పెద్దదినం అవ్వకుండానే మువ్వు పేకాట ఆడుతావా! చూచినవారు ఏమనుకుంటారు? నీకు యింతయినా విచారం లేదుట్రా!"

"విచారం దేనికే? ఆయన బ్రతికి మనల్ని బాగుచేసింది ఏముంది? మందుల ఖర్చు తప్పిందని సంతోషించు. మీరంతా పడి ఏడుస్తున్నారు. ఏం తీసుకొచ్చారు?"

"ఛీ! నీతో మాటాడటం నాదే బుద్ధితక్కువ. మనిషివయితే కదా! నీ సంపాదనతో కద్రుటా నాన్నకు మందులు పెట్టించావు?" శశి శివమెత్తినట్టు చూచింది.

"ఘొవరిదో ఒకరిది! మంచంలో పడుకుని ఊరెక్కే ఏవో నీతులు



వల్లించే వాడు అవి మనకు కూడు పెట్టాయా గుడ్డ పెటాయా? యింట్లో కటకటలాడి పోతూంటే పెళ్ళికి తప్పింటూ బ్యాంకులో దాచాడు. నా అవస్థ మీకేం తెలుసు?"

"అందరూ అవస్థలు పడుతూనే ఉన్నారు. హాయిగా కాపురం చేసుకుంటూ అత్తగారింట్లో ఉండాల్సిన అక్కయ్య ఉద్యోగం చెయ్యటం లేదూ? నువ్వేదైనా పని చెయ్య...."

"నీ సోదియేందే? పోయినవారితో పోతామా? అతను మీలాగా అనుకుంటా "ఓ" అంటూ ఏడ్వడానికి....అయినా ముసలాడు. కాలం తీరింది, పోయాడు." చలపతి కసురుకున్నాడు.

"అక్కడికి మీరు బాలాకుమారులయినట్లు వయసురాగానే సరా!" కొర, కొరచూచి అక్కడనుండి లోపలికి వెళ్ళిపోయింది.

సుశీల కొన్నాళ్ళు దిగులుగా తిరిగినా రాను అల్లరితో, భర్త లాలనలో మామూలుమనిషి అయింది. కేసు, కేసు అంటూ సుధీర్ యెక్కువ యింటిదగ్గర ఉండటమే లేదు. అది సుశీలకు బాధాకరంగా ఉంది. "యెన్నాళ్ళండి ఈ తిరుగుడు! చిక్కి సల్లబడిపోయారు."

అతను ప్రయాణము అయినప్పుడు అడిగింది. "దాదానకుగు కేసు విషయం యింత పెద్ద గ్రంధము చెప్తాడు. "కచ్చేరీలో కాంతంబద్దా కోర్టగంపలో పిల్లి పడ్డా" త్వరలో తెమలవట. ఏం చేద్దాము." అన్నాడు బట్టలు కట్టుకుంటూ.

"పత్రికలవాళ్ళు ఉత్తరాలు రాస్తున్నారు. మీరేమో యిల్లు యిల్లాలిని విడిచారు."

"అబ్బే ఇల్లు విడిచాను. యిల్లాలిని మాత్రం గుండెలలో భద్రంగా దాచుకున్నాను. చిత్తుకాపీలలో కొన్ని అచ్చుగాని కథలున్నాయి. ఫేర్ చేసి పంపు. నీ పేరనే పంపు."

"వాళ్ళు అచ్చు వేయొద్దూ? పేరును చూస్తూనే కొన్ని చెత్తబుట్ట

దాఖలా అవుతాయి. మీ పేరునే పంపుతాను లెండి. ఈసారి అయినా త్వరగా రండి" అన్నది.

సుశీ! మిమ్మల్ని విడిచి ఉండటం నాకు మాత్రం సరదానా?.... ఈసారి కేసులో భయంతప్పదు. హాయిగా ఈ ప్రదేశం వదలి మన పిల్లల దగ్గరుందాము."

"ఎక్కడనండి? ఏం చెప్పరు, ఏం మనుషులో."

"ఇన్నాళ్ళు కాపరం చేసి ఏం మనిషినో తెలుసుకోలేదా? అన్నీ చెప్తాను సుశీ! నువ్వు అతి సున్నితమైన మనసుగల దానివి. ఒకేసారి అన్ని విషయాలు వింటే తట్టుకోలేవు. నెమ్మదిగా చెప్తాను. రాజా ఆరోగ్యం జాగ్రత్త. వీళ్ళ దగ్గరే ఉంటాడు."

"మరేం ఫరవాలేదు. మీరే జాగ్రత్తగా ఉండండి. మీరింట్లో లేకుంటే ప్రొద్దుగడవదు."

"ఒక పని చెయ్యనా? మీబాబాజీని పిలిపించుతాను. "ఆర్య సమాజం" "వైదిక్ ధర్మము" గురించి ఉపన్యసిస్తాడు" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

"మీరొకటి! యెప్పుడూ అతన్ని జ్ఞాపకం చేస్తారు." తనూ నవ్వుతూ భర్తను సాగనంపినది. కనిపించినంత వరకూ చూస్తూ నిల్చున్నారు.

అనసూయమ్మ వాళ్ళు ఆ ఊరికి వచ్చి నెలకు పైగా అయిందిట. వెళ్ళి తన రాజాను చూపించాలని ఉన్నా ఏరోజుకారోజు అశ్రద్ధ చేస్తోంది. "తాము క్షేమంగా ఉన్నామని, వెంకట్ మళ్లా ఇల్లు విడిచి వెళ్ళాడని ప్రసన్న ఉత్తరం రాసింది.... అది చదివి అవతల పెట్టింది. సుధీర్ సొరుగు లాగి ఓ కథ తీసి కాపీ చేద్దామని కూర్చుంది. దాదా వచ్చాడు.

"అమ్మా! ఎవరో మద్రాస్ అట.... అతనికి అవసరముందట. కొన్ని నగలు తెచ్చాడు. అవి కొంటే చవకగా యిస్తాడుట. లేదా వాటిని



ఉంచుకుని తనకు కావల్సిన డబ్బు యిస్తే తరువాత తెచ్చియిస్తాడట. ఈ చుట్టుపక్కల వారు అయ్యగారి పేరు చెప్పారట...."

"గమ్మత్తుగా ఉందే? ఆయన లేరని చెప్పలేక పోయావా, నగల విషయము మనకేం తెలుసు దాదా? ఇంకెక్కడయినా ప్రయత్నం చేయమను. మార్వాడీలు చాలామంది ఉన్నారు."

"అన్నీ చెప్పాను తల్లీ. కంసాలిని పిలిపించమంటున్నాడు. అతనికి వెయ్యిరూపాయలు కావలిట. నగల విలువ పదివేలు ఉంటేనే యివ్వమంటున్నాడు...." దాదా చెప్పాడు.

"వేలు మన దగ్గరెక్కడివి? చుట్టుపక్కలవారు మీ అయ్యకు బిరుదు యివ్వటము. అదివిని యెవరో రావటం కలల్లో జరుగుతుందే. అలా ఉంది."

"అతనికి మీరు వచ్చి చెప్పండి."

సుశీల లేచి వెళ్ళింది. బయట వరండా బెంచిమీద కూర్చున్న వ్యక్తిని చూచి గంతు వేసినంత పని చేసింది. "మీరా బాబాయ్! యెదురుగా వెళ్ళింది.

అతను కూడా పరిసరాలు మరిచి ఆమెను దగ్గరగా తీసుకున్నాడు. "నువ్వా యిక్కడున్నావా సుశీ! మీ పిన్ని రోజూ నా ప్రాణాలు తీస్తోంది. "ఏన్నాళ్ళయిందమ్మా నిన్ను చూచి" అన్నాడు సంతోషంగా.

"రండి. ఇంట్లోకి." సుశీల వెనుకాలే వెళ్ళాడు. హాల్లోకూర్చున్నాడు.

సుశీల రాజాను నడిపించుకువచ్చి. అతని చేతిలో పెట్టింది. "మీ మనుమడు బాబాయి." అన్నది.

"ఏమిటేమిటి....మనుమడా! అయితే అల్లుని వివరాలు చెప్పు" రాజాను ఎత్తుకుని అడిగాడు.

"అన్నీ చెప్తాను. మీరు మద్రాసీలు యెప్పుడయ్యారు? నగలు తాకట్టు పెట్టవల్సినంత అవసరం ఏ మొచ్చింది? పిన్ని బావుందా?" సుశీల అతనికి దగ్గరగా స్టూలు జరుపుకుని కూర్చుంది.

"అదా! పోలీసువాడివికదా! ఏదో కేసు విషయంలో తిరుగుతున్నాను. పిన్ని మునుపటి కంటే లావయ్యింది. నీ కోసం కలవరిస్తోంది." అన్నాడు.

"బావుంది బాబాయ్! మీ సి. ఐ. డి లు వేషాలు మారుస్తారన్న మాట. రెండు మూడు సార్లు ఆ యింటికి వచ్చాను. మీరు లేరని తెల్సింది." తను ఇల్లు విడిచింది మొదలు ఉమాపతి మరణించిన విషయాలు అన్నీ చెప్పింది. అతనుకూడా సానుభూతి చూపాడు. "తను చేసుకున్న ఖర్మ అనుభవించాడు. మనిషి మంచివాడే. బలహీనుడు. అందరినీ అదుపులో పెట్టలేడు. అందుకే మీ అత్త అంత విజృంభించింది. జరిగినదానికి విచారించి ఏం లాభం? ఆ మేడకూడా అమ్మివేయాలని చూస్తున్నట్టున్నారు. పట్నం అవతలకుంది. అద్దెలు యెక్కువగా రావు. అదికాక అద్దెలు రావాలంటే చిన్న చిన్న వాటాలుండాలమ్మా. పెద్దమేడ. మొన్నవాళ్ళు ఖాళీచేస్తే అద్దె పెంచారుట. రెండు నెలలనుండి ఖాళీగానే ఉంది."

"అత్తయ్య పట్టుదల మనిషి. మనం విచారించి ఏం చెయ్యలేము."

"నీ జీవితము కుదుటపడినందుకు సంతోషంగా ఉంది తల్లి వెళ్ళిరానా?"

"అదేమిటి బాబాయ్! భోజనం చెయ్యకుండానే." త్వరగా లేచి, దాదాతో పాయసంచేయించి అతనికి వడ్డించింది. భోజనానంతరము ఆయన సుశీలను కొన్ని ప్రశ్నలు అడిగాడు. అతని కళ్ళు అనుమానంతో వెతుక సాగాయి. "ఏమిటి బాబాయ్! మీరేదో దాస్తున్నారు. నాకు చెప్పండి. ఇన్ని ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారు!"

"ఏం లేదమ్మా ఊర్కేనే" తప్పించుకోబోయాడు. సుశీల వదల లేదు. ఒట్టు వేసింది.

"నిజానిజాలు భగవంతుడికి తెలుసమ్మా. వారంరోజుల క్రితం మేము దొంగనోట్లు ఒక వ్యక్తి మారుస్తుండగా పట్టుకున్నాము. అతనిని



రకరకాలుగా ప్రశ్నించి అవి ఎక్కడనుండి వచ్చాయో చెప్పమంటే అతను చెప్పలేదు. భయపెడితే చెప్తాడని రిమాండులో తీసుకున్నాము. ఈ దొంగనోట్ల మార్పిడి యెక్కువ జరుగుతోంది. సి ఐ డి వాళ్ళు చాలా కృషి చేస్తున్నారు. దొరికిన అవకాశము జారవిడుచుకోరాదని అతన్ని నయాన, భయాన ప్రశ్నించసాగాము, ఒక ప్రముఖవ్యక్తి తరపున ప్లీడరు వచ్చి అతనికి బేల్ యిచ్చి విడిపించాడు. రెండవరోజు పట్టుబడిన వ్యక్తి స్వయంగా వచ్చి కొన్ని వివరాలు చెప్పాడు. ఊపిరి పీల్చటంకూడా మరచి పోయివింటోంది సుశీల" సుధీర్ అనే అతను దొంగనోట్లను అచ్చు వేస్తున్నాడట అతని యిల్లు సోదాచేస్తే యంత్రము దొరుకుతుందని అతను చెప్పాడు. యే ఆధారంతో యిల్లు సోదా చెయ్యాలి? అందుకే నగలు తెచ్చాను. స్త్రీలు సాధారణంగా నగలు అనగానే అందులో చవకగా వస్తాయనగానే కొనడానికి ప్రయత్నిస్తారు. ఇంటిలో తప్పక దొంగనోట్లుంటాయి. అవే యిస్తారు. వాటి ఆధారంగా సెర్చివారెంటు తీసుకోవచ్చని చూచాను....కాని యిక్కడ నువ్వు దర్శనమిచ్చావు."

"బాబాయ్....బాబాయ్ .... మీ అల్లుడి పేరు సుధీర్...." ఆమె కంఠము వణికింది. అతను ఉలిక్కిపడ్డాడు. "మరి నన్నేం చేయమంటావు తల్లీ!"

"సెర్చివారంటు దేనికి బాబాయ్. రండి సోదా చేద్దాము. ఎవరో చెప్పి వుంటారు. రండి "బాబాయ్." ఇద్దరూ ఇల్లంతా వెతికారు. అతని బీరువాలు అన్నీ వెతికారు. ఎలాంటి ఆధారము దొరకలేదు. "ఎక్కడో పొరపాటు జరిగి ఉంటుందమ్మా! వెళ్తాను. పిన్నిని తీసుకుని వస్తాను. ఎంత సంతోషిస్తుందో!" అతను వెళ్ళిపోయాడు. మొదటిసారిగా భర్త జీవితం గురించి లోతుగా ఆలోచించసాగింది సుశీల. అనుమానాలు పెరగటం తప్ప తరగటం లేదు. ఆయన వ్రాసిన "ప్రతీకారం" అనే

కథలో నాయకుడు ఆయనే కాదుకదా! "వద్దు భగవాన్! అటువంటి ఆలోచనలు రానియ్యకు. నా భర్త సకలసద్గుణమూర్తి" అని మాంగల్యం కళ్ళ కద్దుకొన్నది. ఆ దినమంతా అన్యమనస్కంగా ఆరాటంగా గడిపినది. అతను వస్తే బాగుండును. అన్ని విషయాలు అడిగి హృదయం తేలిక పరుచుకొందును అనుకున్నది. స్వచ్ఛంగా మెరిస్తే ఆ కళ్ళు మోసం చెయ్యగలవా? అమాయకమైన ముఖం! దొంగతనం చేశాడంటే నమ్మగలనా? కథలు. కేవలం ఊహాగానాలు. ఆలోచిస్తూ గడిపింది.

రెండవరోజు ఇన్‌స్పెక్టరుగారికి ఆనందంగా యెదురేగింది. "పిన్ని రాలేదేం బాబాయి?"

"వస్తుంది లేమ్మా, సుశీ! అలా గదిలోకి వెళ్ళి మాట్లాడుకుందాం," యిద్దరూ గదిలోకి వెళ్ళారు. అతనేం చెప్తాడోనని ఆమె హృదయం వేగంగా కొట్టుకోసాగింది. ఇద్దరూ కూర్చున్నారు.

"సుశీ! విధి నిన్ను ఇక్కడకూడా వంచిస్తుందనుకోలేదు తల్లీ. జన్మతః సుధీర్ ఉన్నతుడే....కాని....తండ్రి మరణించగానే అన్నిదురలవాట్లకు లోనై ఒకసారి జైలుకుకూడా వెళ్ళి వచ్చినాడట."

అతను చెప్పేది వినలేకపోయింది సుశీల. ప్రతీ స్త్రీ తన భర్తను ఉన్నతంగానే ఊహిస్తుంది. అలా ఊహించని స్త్రీ .... అసలు భర్తను, భర్తగా కాక బానిసగా చూస్తుంది. "అబద్ధం బాబాయి. ఆయనను చూస్తే మీరు అలా అనరు. పచ్చి అబద్ధం."

"అబద్ధము అయితే అందరమూ సంతోషిస్తాము" లేచి ఆమె దగ్గరకు వెళ్ళాడు. నువ్వు నాకు కూతురువంటి దానవు. ధైర్యంగా విను. సుధీర్ దొంగనోట్లు వేయిస్తున్నాడట. అదికాక బయటినుండి కొన్ని వస్తువులు పైలెట్లకు, నావికులకు లంచంపెట్టి తెప్పించి అమ్ముతున్నాడట. ఇవి నిశ్చయముగా తెల్సిన విషయాలు. ఇంకా ఆరాలు తీస్తున్నాము.



నువ్వేం దిగులు పెట్టుకోకు." ఆమె తల నిమిరినాడు. అతని చేతులలో అలా శిలలా యెంతసేపు వుందో.

"ఇంత ఆవేదన తగదమ్మా. ఇందులో కొన్ని అబద్ధం కావచ్చుగా?...."

"కొన్ని నిజం అని నిశ్చయంగా చెప్తున్నారుగా? నేను .... నేను నష్టజాతకురాలిని బాబాయ్! ఏ పూర్వపుణ్యమో! ఈ కొన్ని రోజులు సుఖంగా ఉన్నాను. పెట్టేవారి చెయ్యి పెద్దదయినా, తినేవారికి తిరుగుడు రోగం అన్నట్టుంది నా గీత, ఒంటరిదానను కాను బాబాయ్ నన్ను రక్షించు. నా భర్తను నాకు వదలిపెట్టు" పిచ్చిగా అరిచింది.

"ఊరుక్కో తల్లి. పూర్తిగా పరిశోధన జరగనీ! నేను నీ కన్యాయం చెయ్యను. చెయ్యలేను. నీ మంచితనము నీ భర్తకు అడ్డుపడుతుంది లేమ్మా!" అన్నాడు.

"మీ డిపార్టుమెంటువారు యింకా మంచితనము, మానవత్వమూ నమ్ముతున్నారా?"

"అదేం మాట తల్లీ! మానవుడయిన వాడెవడయినా నమ్ముతాడు. నీకు చెప్పవల్సిన విషయాలుంటే ఫోను చేస్తాను. తొందరపడి యే అఘాయిత్యము చెయ్యనని మాట యివ్వు" అని చేయి చాచాడు. ఆమె కన్నీరు ఒత్తుకుని నవ్వింది.

"రోజు రోజుకూ బండబారి పోతున్నాను. ఏమీ చెయ్యను! ఆ దిగులు అక్కరలేదు" ఎన్నో విధాలుగా నచ్చచెప్పి వెళ్ళిపోయాడు ఇన్‌స్పెక్టరుగారు.

ఆరోజు గదిలోనే గడిపింది. దాదా పలుసార్లు వచ్చి "ఆరోగ్యం బాగుండలేదా?" అని పలుమారులు అడిగి వెళ్ళాడు.

"[illegible]మ్మా! [illegible]" అంటూ రాజా మారాం మొదలుపెట్టాడు.

రాజాను దాదాకు అప్పగించినది. ఆలోచనలు తెగటంలేదు. అనుమానాలు విడటం లేదు.

రెండురోజులు గడిచినా ఇన్‌స్పెక్టరుగారు ఫోను చెయ్యలేదు. ఆయన యింటినంబరు తీసుకోలేదు. అసలు ఫోనుందో, లేదో వారి యింట్లో! శశికి ఫోను చెయ్యాలని వెళ్ళింది. మరలా తిరిగి వచ్చింది. ఆ రోజు ఉదయమే సుధీర్ వచ్చాడు. అతను ఎప్పటిలా ఉత్సాహముగా కనిపించినా కళ్ళు లోతుకు పీక్కుపోయినాయి. ముఖం చిన్నగా కనిపిస్తోంది. మామూలుగా రాజాను ఎత్తుకున్నాడు. ఆటలు, మాటలు అన్నీ అవుతున్నాయి. మునుపటిలా వారి ఆనందంలో పాలు పంచుకోలేకపోతోంది. "కడుపులో పేరుకున్న కసి అంతా కక్కేయాలని ఉంది. ఎలా? వల్లరూ వింటే నాల్గిలోకాలు విన్నట్టు ఈ చుట్టుప్రక్కల అంతా ఆయనవి పూటిస్తారు. దాదా వింటే! క్షణంలో అందరికీ తెలుస్తుంది ఎలా? ఎలా?"

"అంత మౌనంగా ఉన్నావు. ఒంట్లో బాగుండలేదా సుశీ?" అతను ఈసారి భార్యవైపు పరీక్షగా చూస్తూ అడిగినాడు.

ఆమె ఆరు లంఖనాలు చేసినట్టు ఉంది.

"ఏం లేదు బాగున్నాను. ఉండండి కాఫీ తెస్తాను" వస్తే కన్నీరు అతనికి కనపడరాదని అక్కడినుండి వెళ్ళిపోయింది.

"దాదా అత్యవసరముగా నువ్వు అత్తయ్యగారింటికి వెళ్ళిరావాలి. వాళ్ళ గురించి చెడు కలలు వస్తున్నాయి రెండురోజులనుండి పోమ్మనా లనుకున్నాను. ఒక్కదానిని అవి ఊరుకున్నాను. ఇప్పుడు వెళ్ళిరా!" అన్నది తొందర—తొందరగా.

"అందుకేనా అమ్మా, అంత దిగులు? వంట, భోజనం కాగానే వెళ్తాను."

ఆమెకు అంతవరకు ఆగే ఓపిక లేదు. "వంట అయింది బాబు!



అయ్యగారు ప్రయాణ బడలికలో వున్నారు భోజనం అంతంతమాత్రమే వెళ్ళి ఫలహార సమయానికి రా!" అతనికి బస్సుకిరాయి డబ్బులిచ్చి పంపేసింది.

అంతకు ముందు రెండు రోజులనుండే పనిమనిషి పెళ్ళికి పోతానంటూ రావటం మానేసింది తలుపులన్నీ వేసింది రెండు కప్పుల్లో కాఫీ తీసుకుని వచ్చింది

"కాఫీ తయారు చేసి తెచ్చినట్టున్నావే!" అన్నాడు.

అతనికిచ్చి తను తీసుకుంది. రాజా తండ్రితెచ్చిన ఆటవస్తువులు పరీక్షించటంలో నిమగ్నుడయినాడు. కాఫీ కప్పు కింద పెట్టాడు.

"సుశీ! త్వరగా ఒక్క కునుకుతీసి అలా వెళ్దాము. సినిమాకారు విసుగు వచ్చింది. నీవుకూడా దిగులు పడ్డావల్లే వుంది. ముఖం చూడు." దగ్గరగా వచ్చి ఆమె నడుముచుట్టూ చెయ్యివేశాడు.

ఆమె దూరం జరిగింది. "నాకు ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పి. తరువాత మీరు చెప్పేది చెప్పండి." ఆమెగొంతు కఠినంగా వణుకుతోంది.

"సుశీ! ఏమిటి కొత్తగా మాట్లాడుతున్నావు" ఆశ్చర్యంగా చూచాడు.

"క్రొత్తగానే మాట్లాడుతాను, మీరు నిజం దాచితే మన జీవితమే కొత్తదార్లు పడుతోంది. చెప్పండి—మీరు.... మీరు దొంగనోట్లు అచ్చు వేస్తున్నారా? లేదా? ప్రభుత్వం కన్నుగప్పి బయటినుండి దిగుమతి అయిన వస్తువులు అమ్ముతున్నారా. లేదా?...."

"సుశీ!" అతని చెయ్యి ఆమె రెండు చెంపలను వాయించింది.

"చెప్పండి ....మీరు నిజం చెప్పకొట్టండి.... చంపండి....భరిస్తాను! అన్నది నిర్భయంగా,

అతను ఆశ్చర్యపోయాడు.

"ఎందుకంత ఆశ్చర్యంగా చూస్తారు ? ఎన్నడూ లేనిది, దిక్కుమాలినది ఎదురు చెప్తోందా అనా ? పోనీ ఒక్క విషయం చెప్పండి. నా మీద జాలి తప్ప మరేం లేదని మీ మీద గౌరవమూ కూడు గుడ్డా యిస్తున్న యజమానులని గౌరవిస్తాను" అన్నది.

ఆమె రెండు బుగ్గలపై వాతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమెను అతను దగ్గరకు లాక్కొని గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు.

"సుశీ! పొరపాటున ఆ మాట అనకు. నీపై జాలేనా నాకున్నది. లేదు–లేదు నాకీ ప్రపంచములో వున్న సర్వస్వము నువ్వూ, రాజా.... అన్నాడు. అతని కంఠము రుద్ధమయినది.

"అయితే రాజా మీద, నా మీద ప్రమాణంచేసి చెప్పండి. మీరు చేసే వ్యాపారము ఏమిటి?"

అతను ఆమెను వదలలేదు. ఆమె తలపై గడ్డం రాస్తూ కొన్ని క్షణాలు గడిపినాడు. దీర్ఘముగా శ్వాస వదిలినాడు "నిజమే కాని అంతా నిజం కాదు." అన్నాడు.

ఆమె అతని నుండి దూరం జరిగింది. "ఎందుకుచేశారు చెప్పండి నాతో ఈ విషయాలు ఎందుకు దాచారు? ఈ దొంగసొమ్ముతో మమ్మల్ని ఎందుకు పోషిస్తున్నారు? అంతకన్నా మీ చేత్తో యింత విషం యివ్వక పోయారా?"

అతను ఏమీ చెప్పలేదు. నేలకేసి చూస్తూ కూర్చున్నాడు.

"చెప్పరేం? నన్నెందుకు మోసంచేసినారు. ఆ దొంగనోట్లతో నన్నెందుకు పోషించారు? అన్నది గట్టిగా.

ఆమె అరుపులకు రాజా అదిరిపోయి రాగం మొదలు పెట్టాడు. అతను త్వరగా లేచి రాజాను ఎత్తుకున్నాడు. "ఏంలేదు రాజా! అమ్మ తమాషాచేస్తోంది. ఊరోక్క!" అతను తల్లివంక భయంగా చూస్తూ తండ్రి గుండెలకు హత్తుకుపోయాడు



సుశీలకు మతి పోతోంది. "వాడిని దించండి. నాకు జవాబు చెప్పండి. వాడిని ముట్టుకోవద్దు." అరిచింది.

ఈ సారి అతను కోపంగా చూచాడు: "సుశీలా ఏమిటి వెర్రి? నేను పారిపోవటంలేదు, నీ సందేహాలన్నింటికి జవాబు చెప్తాను. కాని.... వాడిముందు అడుచుకోవటం బావుండదు. పసివాడు భయపడిపోతాడు. త్వరమో వస్తే.... వెళ్ళి పాలు తీసుకురా. వాడికి నిద్రసమయమవుతోంది. వాడు నిద్రపోయాక మాట్లాడుకుందాము."

సుశీల లేవలేదు. స్రవించే అశ్రువులు ఒత్తుకుంటూ కూర్చుంది.

"రాజా! అమ్మదగ్గరకు వెళ్ళు. నేను పాలు తెస్తాను" అని సుశీల కందించబోయాడు.

వాడు తండ్రిభుజాన్ని గట్టిగా పట్టుకున్నాడు. "ఊఁ....అమ్మొద్దు." అని మారాము మొదలు పెట్టాడు.

వాడిని అట్లాగే ఎత్తుకుని వంటయింట్లోకి వెళ్ళాడు. గిన్నెలో పాలు హీటరు మీద వెచ్చబెట్టి సీసాలో పోసి త్రాగించబోయాడు.

"వద్దు, జాలే...." వాడు ముఖం చిట్లించాడు.

పంచదార వెయ్యలేదని గుర్తుకు వచ్చింది. మళ్ళీ వంట యింట్లోకి వెళ్ళి పంచదార వెతికితెచ్చి వాడిపాలలో కలిపి పట్టాడు. ఈసారి త్రాగి హాయిగా నిద్రబోయాడు. వాడి మూతి తుడిచి మంచంమీద పడుకో బెట్టాడు. అతన్నీ అతని పనులను చూస్తూ కూర్చుంది..... అతను వచ్చి ఆమె కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

"సుశీలా! ఒక్క విషయం గుర్తుంచుకో. నేనేంచేసినా, మిమ్మల్ని మాత్రం దొంగనోట్లతో పోషించలేదు నేను వ్యాపారం చేసిన డబ్బే వాడినాను...."

"ఏం వ్యాపారం! విదేశవస్తువులు దొంగతనంగా అమ్మడమేనా?

"వ్యాపారములో దొంగతనమూ మోసము లేనిదిఅసలు జరుగదు. అందరూ చేసిందే నేనూ చేశాను. ఏ వ్యాపారస్థుడు లాభం లేనిది అమ్ముతాడు చెప్పు? అలా అమ్మినవాడు అతనికి తినడానికి తిండె వుండదు. తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్మటం దొంగతనం అయితే అందరూ దొంగలే. నేను చెప్పేది వ్యర్థం."

"అది వ్యాపారం! దొంగనోట్లు వెయ్యటం కూడా వ్యాపారమేనా!" వెటకారంగా అడిగింది,

"కావచ్చు. చిన్నవాడు చిన్నతరహాగా చేస్తే అది దొంగతనం అవుతుంది. పెద్దవాడు పెద్దదొంగతనం చేస్తే అది వ్యాపారమవుతుంది, ప్రపంచమే అలా నడుస్తోంది.

"మీరు చెప్పేది చేస్తూ పైగా అందరినీ అనడం దేనికి? విదేశవస్తువులు అమ్మటం చట్టానికి విరుద్ధం కాదా! ప్రభుత్వం కన్నుగప్పినట్టు కాదా!"

"పెద్ద–పెద్ద పదాలు వాడుతున్నావు సుశీ! ప్రభుత్వం అంటే ఏమిటి?"

"ప్రజలకు రక్షణ కల్పించునది....బాగోగులు చూచునది."

"చట్టమన్నావే అదేమిటి?"

"ఏమని చెప్పాలి. జీవితానికి కొంతక్రమశిక్షణ అవసరం, అలాంటి క్రమశిక్షణే కొన్ని శాఖలుగా చేసి చట్టంగా మార్చినారు."

"ఓహో సుశీ! ప్రజలకు రక్షణ కల్పించే ప్రభుత్వం నిన్న ఇంటి అన్నరణం నుండి ఆపలేదే. మానవాళిని క్రమపద్ధతిలో నడిపే చట్టం నీ జీవితానికి రక్షణ కల్పించలేదేం? అవి నిదురబోతున్నాయా?

"ప్రభుత్వం చెయ్యలేని పనులు మీరు చేశామని చెప్తున్నారా?"

"పొరపడుతున్నావు. బయట యిలాంటివి కోకొల్లలు! అవి చెప్తే



ంటే చాలా సమయం పడుతుంది. అందుకే మనజీవితాన్నే ఉదాహరణగా తీసుకుంటున్నాను."

"ప్రభుత్వం ప్రతి యింటికి వచ్చి బాగోగులు చూస్తోందా? నేను వెళ్ళి నా గోడు చెప్పుకుంటే. నా విషయంలో శ్రద్ధ చూపేది." అన్నది బింకంగా.

"మరెందుకు చెప్పుకోలేదు? మీ వాళ్ళు నీకు చేసిన మోసం బయట ఎందుకు పెట్టలేదు! వారి రక్షణ లభించేదిగా?"

"చెప్పుకోవచ్చు. ఎవరితో మాట్లాడినా డబ్బు. పరపతి ఉండాలి. అవి రెండూ లేని నన్నూ నా మాటలను ఎవరు లెక్కచేస్తారు" అంది అమాయకంగా.

"మళ్ళీ మొదటికి వచ్చావు. పోనీ–ఏ పని చెయ్యాలన్నా డబ్బు కావాలికదా? అది ఉన్నచోటే న్యాయం వుంది. అది ఉన్నచోటే నిజం వుంది. డబ్బున్నచోటే పరపతి వుంది. డబ్బున్నచోటే అందం వుంది. డబ్బున్నచోటే దేవుడు వున్నాడు తెల్సిందా సుశీ!"

"అందుకని అది సంపాదించుటకు ఏ మార్గం అవలంబించినా తప్పులేదా?"

"తప్పే....కాని నేను అంత తప్పు చేయలేదు. పాలవాడు ఇంటికి తెచ్చి పాలు పోస్తాడు. వాడు నీళ్ళు కలిపాడని దగ్గరలోవున్న పోలీస్ స్టేషన్లో రిపోర్టుచేస్తాం. అక్కడ యస్. ఐ. మంచివాడయితే వార్నింగ్ యిచ్చి వదులుతాడు. కాస్త బ్రతుకనేర్చిన వాడయితే వాడిని బెదిరించి. ఏది. పాతిక వదిలిస్తాడు. ఇదిచిన్నతరహా జరుగుబడి. పాలవాడు మోసగాడు. వాడురాగానే ఇంట్లో చిన్నపిల్లల దగ్గరనుండి ముసలమ్మలు వరకూ శాపాలు విసరబోతారు. అదే పెద్ద–పెద్ద పార్టీలలో అయితే త్రాగటానికి పనికిరాని సారాబుడ్లు తెస్తారు. రబ్బరుబిరడాలో సిరంజి పెట్టి సగం

తీసి నీళ్ళుపోస్తాను. అది ఎవరికీ తెలియదు. 'అహా' అంటే 'ఓహో' అంటూ త్రాగుతారు. తప్పు బయటపడితే నేరం, దాగితే ఒప్పు. అదేకదా రీతి. నేను అవలంబించిన పద్ధతిలో నాకు తప్పు కనిపించలేదు. వారికి సామాన్లు తేవడం చేతవుగాని అమ్మడం తెలియదు. నాకు పెద్దమనుషులనే వారు చాలామంది తెలుసు. అమ్ముతాను. లాభాలు చెరి సగం పంచుకుంటున్నాము. ఆ లాభాలతో నాకు కావల్సిందే వుంచుకుంటున్నాను. మిగిలింది బీదప్రజలకు వినియోగిస్తున్నాను."

"మీ తప్పుకు పరిహారం చెల్లించుకుంటున్నారు. కాబోలు! నాకీ పద్ధతి నచ్చలేదు. మీరెన్ని చెప్పినా నేను ఆమోదించను. క్షమించండి. కాని నన్ను ఈ కూపంలోకి ఈడ్చటం ధర్మం కాదు....ఒంటరి దాన్ని అయితే ఎలాగో బ్రతికేదాన్ని. నా కాళ్ళకుబంధం వాడినేంచెయ్యాలి? వీడి తండ్రి దొంగ. మోసగాడు అని అందరు అంటుంటే ఎలా సహించాలి?"

"సుశీలా! ఇప్పుడు తెలుస్తోంది. నేను చాలా పొరపాటు చేశాను. నిన్ను మోసం చేశాను. క్షమించు దురుద్దేశంతో మాత్రం కాదు. అది గ్రహించుకో....చాలా పెద్ద ఆశలు పెట్టుకున్నాను. అనాథగా పెరిగిన నువ్వు తోటి అనాథుల బాధలు అర్థం చేసుకుంటావనుకున్నాను. ఇంకా నువ్వు ఆ స్థితికి రాలేదు. అది నా దురదృష్టం" అతని కంఠం నెమ్మదిగా వుంది.

"కాదు. అంతా నా దురదృష్టం. నష్టజాతకురాలిని." అని అడ్డు పడింది.

"నువ్వు ఎప్పుడూ అదృష్టవంతురాలివే. నిన్ను చూచిన మొదటి క్షణంలోనే ఏవేవో భావాలు నన్ను చుట్టు ముట్టాయి. నీ చల్లని వడిలో పడుకుని నా కథ వినిపించి సానుభూతి పొంది, మండే నా హృదయాన్ని చల్లార్చుకోవాలనుకున్నాను. కరుడు కట్టిన ఆవేదన కరిగించుకోవాలనుకున్నాను. సమయం రావాలని వేచి ఉన్నాను. ఆ సమయం నా పాలిట



కలిగా వస్తుందని ఆశించలేదు. గతం నాస్తి. పది–పన్నెండు రోజులలో నా కేసు గెలుస్తుంది. నా ఆస్తి నాకు వస్తుంది. అదంతా మీకు ఇచ్చివేస్తాను. రాజా పేర వ్రాసి నిన్ను ట్రస్టీగా పెడతాను ..."

"ఆస్తి పాస్తులతో మచ్చ తుడిచి వేయబడుతుందా? చెడు పేరు మంచిగా మారుతుందా?"

"నీకు సంఘంలో మంచిపేరే వుంది సుశీలా! నువ్వు సుధీర్ భార్యగా కాక రాజారామ్ కృష్ణారాయ్ కోడలివి. నీ ఆస్తి పాస్తులు. నీ వంశం అన్నీ చూచి ఎవరూ పేరు పెట్టరు. వేలెత్తి చూపించరు. నేను ఎటో దూరదేశాలకు వెళ్ళిపోతాను."

"మీ ఆస్తిపాస్తులు నాకు తృప్తి నిస్తాయా? నాకు ఆనందాన్ని కలుగజేస్తాయా!"

"అది నీబుద్ధినిబట్టి వుంటుంది....ఇంకోచోట నీకు శాంతిసౌఖ్యాలు లభిస్తాయని తోచిననాడు నీ పేర వ్రాసిన ఆస్తితో నిరభ్యంతరంగా నీకు నచ్చిన చోటుకు నీకు నచ్చిన వ్యక్తితో వెళ్ళిపోవచ్చు....రాజాకు రక్షణ కల్పించు. ఇది నేను చేయదలచిన ఏర్పాటు. నీకై నీవు యింకేం సూచించినా నాకు అంగీకారమే." తన వంతు ఐపోయిందన్నట్టు కూర్చున్నాడు. అతన్ని చూచినవారెవరూ అతడంటే నమ్మరు. గోడకున్న గడియారము టంగుమన్నది. సుశీల అదిరిపడి అటు చూచింది. ఒక గంట. ఆమె హృదయం పిండినట్లే అయింది. సుధీర యెప్పుడు ఉదయం వచ్చినా ఫలహారము చేసి నిద్రపోయి లేచి భోజనానికి సిద్ధమయ్యే సమయము. తను యెంత మూర్ఖంగా ప్రవర్తించింది. వాదనకు అతని మాటలకు అడ్డు వచ్చిందే కాని అతను చెప్పేవన్నీ నిజాలు. తను ప్రత్యక్షంగా గురుకులం చూడలేదా? ఘరానా దోపిడి. నెమ్మదిగా అడిగి అతనిని ఆ దారినుండి తప్పించవల్సింది పోయి అన్నం అదపురులేకుండా వాదులాడుతూ కూర్చుంది. లేచి వంటింట్లోకి వెళ్ళింది. కూర చారు చపాతీలు ఉన్నాయి. బియ్యం

హాస్యుమీద పెట్టి బాయిలర్ చూచింది. చల్లారిపోయింది. నీళ్ళు చల్లారి పోయినాయి. నిప్పువేసింది. పాలు వేడిచేసి ఓవల్టిన్ కలిపి తీసుకుని వచ్చింది. అతను వెళ్ళి రాజా ప్రక్కలో కూర్చుని వాడి ముంగురులు సవరిస్తున్నాడు. అతని దుస్తులు మాసి నలిగిపోయి ఉన్నాయి. షేవ్ చేసుకోలేదేమో ముఖం మరీ నీరసంగా కనిపిస్తోంది. "తీసుకోండి" గ్లాసు ముందుకు చాపింది.

"థ్యాంక్స్" అందుకుని రెండు గుక్కల్లో త్రాగేసిగ్లాసు యిచ్చాడు. "దాదా లేడా?" అన్నాడు.

"లేడు. ఉదయమే నేను అత్తయ్య వాళ్ళింటికి పంపివేశాను."

"మా [illegible]కు వెళ్లాదనుకున్నాను" రెండుచేతులూ నెత్తికింద పెట్టుకొని పడుకున్నాడు. ఆమె వెళ్ళింది. ఇస్త్రీబట్టలు స్నానాలగదిలో పెట్టి వచ్చింది. బకెట్టు నిండా నీళ్ళు తోడిపెట్టింది. గదిలోకివచ్చింది. అతని కళ్ళు చెమ్మగిల్లినట్టు కనిపించాయి. "స్నానానికి రండి" అన్నది."

"ఇప్పుడు రాలేను. ప్లీజ్! క్షమించు నాకు పడుకోవాలని ఉంది."

"మీబట్టలు చూచుకోండి! యెంత దుమ్మందో! రాజా లేచాక మళ్ళీ మీపైనే దొర్లుతాడు."

అతనికి సిగ్గు అనిపించింది. ఎన్నడూ తన అశుభ్రత గూర్చి ఎవరిచేత చెప్పించుకోలేదు. లేచి బాత్‌రూమ్‌లో దూరాడు. స్నానం ముగించి తడితల తుడుచుకుంటూ గదిలోకి పోబోయాడు.

"భోంచేసి పడుకోండి. వంటయింది"

అతను ఆమెవంక చూచాడు. చీర మార్చింది. ముఖంకడిగి బొట్టు పెట్టుకుందేమో! తేటగా కనిపిస్తోంది. మరి మాట్లాడక వెళ్ళి కూర్చున్నాడు. గరిటెడు అన్నం పెట్టుకుని పెరుగు వంచుకోబోయాడు.

"అదేమిటి? కూర, చారు ఉన్నాయి."

"చూచాను. నాకు తినాలని లేదు" అన్నాడు తలవంచుకునే. అతని



చేతిలోని పెరుగుగరిట లాగి. మరో రెండు గరిటల అన్నం వడ్డించింది. కూరవడ్డించింది. "ప్రొద్దుటనుండి టిఫిన్ కూడా లేదు. తినాలని లేదు" అని తనూ వడ్డించుకుంది. ఇద్దరి భోజనాలు మౌనంగా ముగిశాయి. రాజా లేచాడు వాడికి పాలుపట్టి ముఖంకడిగి యెత్తుకుని వచ్చింది. అతను కళ్ళు మూసుకున్నాడు "నాన్నా! బెలూన్....బెలూన్ తేలా?" వాడొచ్చి తండ్రి మీద పడ్డాడు. "మరిచి పోయాను. తరువాత తెస్తానమ్మా. నీ సైకిలు ఎక్కి ఆడుకో." అన్నాడు.

"మరిచాన్లే" చేతులు వెనక్కిచాపి అడిగాడు. "అలాగే! అని వాడి బుగ్గలు ముద్దిడుకుని పంపివేశాడు. వాడు తన సైకిల్‌తో హాల్లోకి వెళ్ళాడు. సుశీల వచ్చి అతనికి దగ్గర కూర్చుంది.

"ఏమండీ" అతను ఏమిటన్నట్టు చూచాడు. "ఆవేశంలో అన్న మాటలుపట్టించుకోవద్దు మీరు లేని ఆస్తి నాకెందుకు? మీరులేని ప్రపంచంతో నాకేం పని? ఇదంతా ఏమిటి? నాకేం అర్థం కావటం లేదు. ఆస్తిఎక్కడిది? పోలీసులకు పట్టుపడ్డ అతనెవరు? చెప్పండి." అన్నది అతని చేతులు పట్టుకొని.

అతనేం మాట్లాడలేదు.

"నాపై కోపం వుంటే నాల్గు చీవాట్లు పెట్టండి. అంతేగాని యిలా మౌనంగా వుండొద్దు మీ కంటే నాకెవరున్నారు?"

ఆమె కండ్లలో నీరు తిరిగింది. కొద్ది క్షణాలు నిదానంగా చూచాడు. "ఏం చెప్పినా అపార్థం తప్ప అర్థంకాదు సుశీలా! నా నిర్ణయం చెప్పాను. నీకేం భయంలేదు."

అతని హృదయంలో తలపెట్టి కన్నీటితో తడిపింది. "ఆవేశంలో అన్న మాటల నాధారం చేసుకుని నిర్ణయాలు చేస్తారా? మీరు తప్ప నాకేం వద్దండీ....నామీద ఏ మాత్రం ప్రేమఅనేది వున్నా నాకు నిజంచెప్పండి.... ఏం తెలిసి నిర్ణయం చేశారు! సుశీలకు చెప్పే ముఖ్యమనుకున్నారా?"

"లేదు సుశీ! నువ్వే పలుసార్లు నన్ను దొంగ అంటూ రెచ్చ గొట్టావు" అన్నాడు ఆమె తల నిమురుతూ.

"పొరపాటండి.... నిజం .... మీ మీద అయిష్టంతో అనలేదు" అన్నది.

"నేనే పొరపాటు చేశాను! మొదటే నేనెవరో చెప్పాల్సింది! లేచి కళ్ళు తుడుచుకో. రాజాను చూచిరా! వాడుఏదో చేస్తాడు" సుశీల వెళ్ళింది!

సైకిలు తిరగేసి దాని క్రింద పడుకుని గంభీరంగా పరీక్ష చేస్తున్నాడు! చేతిలో చిన్న పుల్ల వుంది! భర్తను పిలువాలనుకునే లోపలే వాడి ఏకాగ్రత చెడింది....బయట ఎవరో తలుపు తట్టారు! వెళ్ళి తలుపు తీసింది! కూరగాయల బుట్టతో దాదా వచ్చాడు!

"ఊరెక్కడెకెళ్ళి పోయారు! వాళ్ళు అంతా నిక్షేపంలా వున్నారు" అని లోపలికి వచ్చాడు!

"సరే! మీ చిన్నయ్యగారుంటారు." అతని మాట కెదురు చూడకుండానే వెళ్ళిపోయినది!

అమ్మాయిగారు విచిత్రంగా ప్రవర్తిస్తున్నదన్న ఆశ్చర్యంగా చూచాడు! రాజాను ఎత్తుకుని పెరడువైపు వెళ్ళిపోయాడు!

"దాదా వచ్చినాడు! ఇక యిద్దరూ కాలక్షేపం చేస్తారు!" అన్నది మీరు ప్రారంభించవచ్చు నన్నట్లు చూస్తూ.

"మాది ఢిల్లీ దగ్గర చిన్న గ్రామం. దానికి మా తాతగారు జమీందారు. ఆ చుట్టు ప్రక్కల భూములు తోటలన్నీ మావేనట. తాతగారికి అయిదుగురు కుమారులు. అందరూ తోటలు, భూములూ చూచుకుంటూ హాయిగా కాలక్షేపం చేస్తే జమీందారి నిలవదని తలచారుట. ఢిల్లీలో బట్టల కొట్లు పెట్టించి దానికి మా పెదనాన్నగారిని యజమానిని చేశారట. రెండో పెదనాన్నగారు కొంచెం మందమతి. ఆయనను వ్యవసాయం చూచుటకు నియమించినారట. మూడో పెదనాన్నగారిని చదువులకని విదేశాలు



పంపితే ఆయన అక్కడే సెటిల్ అయిపోయారు. మా నాన్నగారు నాల్గో ఆయన. ఎగుమతి దిగుమతి వ్యాపారము చేస్తూ భారతదేశం అంతా తిరిగినారట. మా బాబాయి చిన్నవాడు. చదువుకునేవాడు ఒకసారి నాన్నగారు హైద్రాబాద్ వచ్చినారు! ఇక్కడే కొన్నాళ్ళు వుండవల్సి వచ్చింది. ఆయన వుండే ఇల్లు కూడా ధనవంతులదే. పత్తర్ ఘట్టిలో వుంది. ఆ యింటి ఆడబడుచుని చూడటం. తటస్థించింది. ఇరువురికి యిష్టమయింది. వివాహం చేసుకున్నారు. దానితో అమ్మ పుట్టినింటికి దూరం అయింది. మా యింటికి రావలదని చెప్పివేసినారు."

"బాగా ధనవంతులన్నారు విద్యావంతులై యుంటారు. కదా! మీ నాన్నగారు వారి అంతస్థునకు తగినవారే కదా?"

"అది యిప్పటి మాట. ముప్పై సంవత్సరాల క్రితం యింత అభివృద్ధి ఎక్కడ? ధనవంతులందరూ ఉన్నతాశయాలు, కులమతభేదాలు లేకుండా వుంటారా? అప్పుడు నిజాము ప్రభుత్వం. స్త్రీలకు ఘోషాలుండేవట. నలుగురి ఎదుట భర్తను మాట్లాడించటం తప్పుగా భావించేవారుట. అమ్మ నాన్నగారితో ఢిల్లీ వెళ్ళిపోయింది. అక్కడ కూడా పరిస్థితులు తారుమారు అయ్యాయి. ఘజియాబాద్ దొరల పుత్రికను పెద్ద కట్నం కానుకలతో నాన్నగారికై కుదిర్చి ఉంచారు తాతగారు. భార్యసమేతుడై దిగిన కుమారుడిని చూచి మండిపడినారు. ఆస్థియందు ఆసక్తిగల అన్నలు కూడా నాన్నగారిని హర్షించలేక పోయినారు. కట్టుబట్టలతో అమ్మా నాన్న హైద్రాబాద్ చేరి వ్యాపారం ప్రారంభించినారు. వారికి లోటు లేకుండా గడిచిపోయేది. అలాంటిసమయంలోనే నేను పుట్టినాను. తాతగారి మనసు మారినది. ఆస్థిపంపకం చేసేటప్పుడు నాన్నగారివాటా నేను పెరిగి పెద్దఅయిన తరువాత నాకుచెందాలని వ్రాసినారు. అది ప్లీడరుగారివద్ద వుంచి ఆయన మరణించినారు. ఆయన మరణించగానే అన్నదమ్ములంతా ఎప్పటివలెనే కలిసి మెలసి వున్నారు. నా వంతుభూములను మబాబాయి చూస్తూ

వుండేవారు నాన్న, చిన్నాన్న కలిసి వారిమకాం విశాఖపట్టణంకు మార్చి నారు. అక్కడ హార్బరుంది. వ్యాపారానికి అనుకూలంగా వుంటుందని. అక్కడేన తరువాత యిద్దరు తమ్ములు పుట్టిపోవటం అమ్మ ఆరోగ్యం దెబ్బతినటం జరిగింది. ఇక తమకు సంతానంకలుగదని తెలుసుకున్న అమ్మా, నాన్నా నన్ను అపురూపంగా పెంచసాగారు. అమ్మ, నాన్న మాత్రం హిందీ తెలుగు మాట్లాడేవారు. మిగిలిన వారమంతా తెలుగే మాట్లాడే వారము. బాబాయి కుటుంబంకూడా తెలుగు నేర్చుకున్నది. నాచదువుతెలుగు లోనే.... నేను మొదటిసారి పరీక్ష ఫస్టుక్లాసులో పాసయినప్పుడు నాన్న గారి సంతోషం యింతా అంతా కాదు. అమ్మ వద్దన్నా వినకుండా పెద్ది అంతపార్టీ చేశాడు. అవి మరుపురాని రోజులు. ఒక రాజాలా గడిచి పోయింది బాల్యం. నేను కాలేజిలో అడుగుపెట్టాను. అమ్మ ఆరోగ్యం దెబ్బతిన్నది. దిగులుగా వుండే. వ్యాపారమంతా బాబాయి కప్పగించి, నాన్నగారు హైద్రాబాద్‌లోనే ఎక్కువగా వుండేవారు. ఆంధ్రప్రదేశ్‌గా మారి శరవేగంతో అభివృద్ధిపొందుతున్న పట్టణం. అమ్మకు విశ్రాంతిగా వుంటుందని, పట్టణానికి దూరంగా ఈ స్థలంకొని యిల్లు కట్టించారు. ఆయన ఎన్నిచేసినా అమ్మను దక్కించుకోలేక పోయినారు. మొదటిసారి అమ్మ వంక చూట్టాలను అమ్మ వద్దే చూచాను. నాన్న వాళ్ళను పలుకరించ లేదు. అమ్మమ్మతాతోలు వణుకుతూవచ్చి నన్ను దగ్గరకు తీసుకుని కంట తడి పెట్టింది." అతని కనులు అశ్రుపూరితాలు అయ్యాయి. ఆ నాటి సంఘ టన గుర్తుకు వచ్చినదేమో తన కొంగుతో కన్నీరువత్తినది. సుశీల. తన తల్లి పోవటం గుర్తుకువచ్చింది తరువాత ఎవరిదారులు వారివి. ఒకసారి మాత్రం అమ్మమ్మను చూచి వచ్చాను. అమ్మను తలుచుకుని బాధ పడ రాదని నాన్నగారు నాకు ఎన్నోసదుపాయాలు కలుగచేసినారు. నాభోజనం మొదలగునవి ఆయన స్వయంగా చేస్తేగాని తృప్తిగా వుండేదికాదు. నా చదువు: నా లోకం వేరు. ఇంటివిషయాలు, నాన్నగారి విషయాలు



పట్టించుకునేవాడిని కాను. బి. ఏ. చదువుచున్నప్పుడు. మా స్నేహబృందం కలిసి ఏదో ఒక పని చేసేవారం. సైకిళ్ళు విప్పటం, మళ్ళీ అసెంబుల్ చెయ్యటమూ మెకానిజంలో ఇంటరెస్టు పెరిగింది. "పోనీ—వాడి వయ స్సెంత? బి. ఏ. చేసి ఇంజనీరింగులో చేరుతాడు లెక్కల గ్రూపేగా?" అన్నాడు. నేను అలాగే చేరాలని ఉబలాట పడేవాడిని. పరీక్షలని దీక్షగా చదువుతున్నాను. ఇంట్లో ఏం జరిగేది తెలియదు. ఆ రోజు పొద్దుట. సాయంత్రము నాన్నగారు కనిపించలేదు. అప్పుడు ఆరావచ్చింది. యెక్క డున్నారని పనివారిని అడిగాను. చాలా కాలంనుండి ఉన్న పని అవ్వ నెమ్మదిగా నా వద్దకు వచ్చింది. "బాబూ! నాన్నగారు మీతో చెప్పొద్దని చెప్పినారు. ఈమధ్య ఆయనకు తరుచూ గుండెనొప్పి వస్తోంది. రాత్రి చాలా బాధపడ్డారు. తెల్లవార్లు డాక్టర్లు వారివద్దే ఉన్నారు. భయంగాఉంది." ఆ మాటలు విని తింటున్న కంచములో చెయ్యి కడిగివేసి ఆయనగది లోకి వెళ్ళాను. గుమస్తాతో నెమ్మదిగా మాట్లాడుతున్నారు. "సుధీ? నువ్వు వచ్చావా? కొంచెం ఒంట్లో బాగుండక నేను రాలేకపోయానురా. నీ ఆరో గ్యమెలా ఉంది? పరీక్షలు అంటూ భోజనం.... చేస్తున్నావా లేదా."

"నాకేం నాన్నగారూ దుక్కలా ఉన్నాను. మీకు రాత్రి అంత నొప్పివస్తే నాకు చెప్పలేదేం!" అన్నాను కోపంగా.

ఆయన నా చెయ్యిపట్టి దగ్గర కూర్చుండ బెట్టుకున్నాడు. "ఒట్టి వెర్రివాడవు. యెట్లా బ్రతుకుతావో ఏమో. నీ కెవరు చెప్పినారు? నాకు కొంచెమే నొప్పి....డబ్బున్న వాళ్ళము కాబట్టి హడావుడి." ఆయన కప్పి పుచ్చుకున్నా ఆయన మాట్లాడిన మాటలే యెంత ఆయాసంగా ఉన్నాయో తెలుసుకున్నాను. రాత్రులు చదువుతూ ఆయనగదిలోనే గడిపేవాడిని. ఆయన తృప్తిగా నిట్టూర్చేవారు. పదిహేను రోజులు పరీక్షలు జరిగాయి. పొద్దుటమాత్రం ఆయనకు చెప్పి వెళ్ళే వాడిని కాను-ఆయన ఆరోగ్యం

గుర్తించి అంతగా పట్టించుకోలేదు. నా పరీక్షలు ముగిశాయి. జీవితములో పరీక్ష మొదలయింది. నాన్నగారి పరిస్థితి విషమించినది. నన్ను బాబాయి చేతిలో పెట్టి కన్ను మూశారు. నాకు ప్రపంచమంతా చీకటిగానే కని పించినది. "అన్నగారు తిరిగిన ఈ ప్రదేశంలో ఉండలేనురా." అని బాబాయ్ మొసలి కన్నీళ్ళు కార్చినాడు. నిజమేనని నమ్మినాను. వ్యాపార మంతా అప్పటికే మందకొడిగా సాగుతున్నది. అంతా డబ్బుగా మార్చి ఢిల్లీ చేరుకున్నాము. నేను ఊరెక్కి తిరుగుతున్నాను. ఆసంవత్సరం చదువు ఆగిపోయింది." అతని మాటలు పూర్తికాకమునుపే రాజా వచ్చాడు "దాదా అచ్చి...." దాదా ట్రేలోపల ఫలహారం కాఫీ తెచ్చాడు. సుశీల దూరం జరిగి కూర్చున్నది. అతను స్టూలు జరిపి అవి పెట్టినాడు "రాత్రికి ఏం చెయ్యి మంటారమ్మా." అని అడిగినాడు.

"నీకిష్టమయినదేదయినా చెయ్యి" అనగానే అతను వెళ్ళిపోయాడు.

"లేవండి" అన్నది.

"వద్దులే తినాలనిలేదు. కాఫీ చాలు" అన్నాడు లేచి కూర్చుంటూ.

"మీరు భోజనం కూడా సరిగ్గా చెయ్యలేదు. ఇంత బాధను మన సులో దాచుకుని యెలా తిరుగుతున్నారండీ? నన్ను కూడా పరాయిదానిలా భావించారా?"

"గతించినది చెప్పుకుని ఏం లాభం?" ఆమె అందించిన ప్లేటు అందుకున్నాడు.

ఫలహారం, కాఫీ పూర్తి కాగానే, అన్నీ బయట పెట్టి వచ్చింది "అచ్చి అచ్చి" అంటూ రాజా మారాం మొదలు పెట్టినాడు. "వాడు మీరు, వెళ్ళినదగ్గరనుండి యెటూ వెళ్ళలేదు, అందుకే గొడవ. రాజా! నా బంగారు తండ్రి. రేపు వెళదామురా." నచ్చజెప్ప బోయింది. వాడు తిల్లాన మొదలు పెట్టాడు. "వాడికి దుస్తులేసి నువ్వు తయారు కావాలి. అలా వెళ్దాము." మరో అరగంటలో ముగ్గురూ కారులో షికారు బయలు దేరారు.



...క్ గార్డెన్స్, టాంక్ బండ్ అన్నీ తిరిగినారు. యెక్కడా రాజా వారిని ...టాడనివ్వలేదు. ఇంటికి తిరిగి వచ్చారు. వాడికి అన్నం పెట్టి నిద్ర ...చ్చేసరికి వారి భోజనాల సమయం అయింది. యిద్దరూ భోజనం చేసి ...రి చేరినారు. జామ ఫోను చేశాడు. "సుశీ! నిద్రపోయానని చెప్పు" ...లాగే చెప్పింది సుశీల. "లైటుతీసి చిన్న లైటువెయ్యి" అతను చెప్పి ...ట్టే చేసివచ్చి కూర్చున్నది. అతను మళ్ళీ మొదలు పెట్టాడు. "కొన్నాళ్ళకు వాళ్ళు నన్ను గుమస్తాక్రింద చూడటం మొదలు పెట్టారు. ...న్నికి కూరగాయలు, పిల్లలకు కావల్సినవస్తువులు తేవటము. బాబాయి ...లీల వసూళ్ళు చెయ్యటం అన్నీ నానెత్తిన పడ్డాయి. అంతవరకు యే ...ని చెయ్యని నాకు బేర. సారాలు యేం తెలిసేవికావు. దానితో యింట్లోకి ...గానే, వస్తువులు తక్కువ ఉన్నాయనో, బాగాలేవనో చీవాట్లు పెట్టే ...వారు. అంతకు ముందు నన్నో యువరాజుగా చూచిన పిన్ని అలా ...టాడటం సహించలేక పోయేవాడిని. జూన్ మాసం కొరకై ఎదురు ...న్నాలు చూడసాగేను చదువు మిషతో యెటన్నా వెళ్ళిపోవచ్చునని ఆశ. ...కరోజు బాబాయి హడావుడిగా వచ్చాడు. "సుధీర్! త్వరగా తయారుకా. మనము ఒక చోటికి వెళ్ళాలిరా" అన్నాడు. ఎక్కడికని అడిగే అలవాటు లేదు. తయారయ్యాను. ఇద్దరమూ లజపతి నగర్ లో ఉన్న ఒక పెద్ద ...గళాకు వెళ్ళాము. ఓ పెద్దమనిషి యెదురొచ్చి బాబాయిని కౌగిలించు కున్నాడు. నేను నమస్కరించగానే, నవ్వుతూ భుజంతట్టినారు. అందరము లోపలికి వెళ్ళాము. అందమైన ఓ కుంటి అమ్మాయి హాల్లో ఉంది. మమ్మల్ని చూడగానే తన కర్రకాలుతో లేచివచ్చి నమస్కరించింది. మేడంతా చూపించినారు. వారికి రెండు మూడు ఫ్యాక్టరీలున్నాయట. బాబాయి చెపుతున్నారు. కాని నా మనసేం బాగుండలేదు. మాటి మాటికి అమ్మా, నాన్నా గుర్తు కొస్తున్నారు...."

"ఆ కుంటిపిల్లను మీకిచ్చి చేయాలని ప్లానా ఏమిటి?" మధ్యలో సుశీ అడిగింది.

"ప్లాను అయితే ఫరవాలేదు. అది ఎంత అసహజంగా అమర్చి పెట్ట దలచారో విను. ఓ యువకుడు వచ్చి నాతో కరచాలనం చేశాడు. అందరమూ రాత్రికి ఆ యింటనే భోజనం చేశాము. ఆ అమ్మాయి నా వంక సిగ్గుతో చూడడం గమనించినా పట్టించుకోలేదు.

"ఏమిటి? వయసులో ఉన్న కుర్రవాడు అలా తింటున్నాడు!" వారి ప్రశ్న.

"వాళ్ళమ్మ ఆంధ్ర ఆవిడ. వాడు పుట్టి పెరిగినది ఆంధ్రలో. అన్నం తినటం అలవాటు" బాబాయి జవాబు. "అయితే ప్రెషర్ కుక్కర్‌లో అయిదు నిమిషాల్లో చేయిస్తాను." యిల్లాలు లేవబోయింది. వద్దని చెయ్యి కడిగాను. తిరిగి కరోల్‌బాగ్‌లో ఉన్న మా ఇంటికి వచ్చేసినాము. రెండవరోజు తోచక. మా పెద్దనాన్నగారి దగ్గరకు వెళ్ళాను. ఆయన ఆమాటా ఈమాటా అడిగి చివరకు నాపెళ్ళి సంగతి యెత్తాడు.

"ఏరా! మీనాన్న ప్రేమించిన అమ్మాయి కోసం ఆస్తి పాస్తుల వదులుకుంటే. నువ్వు ఆస్తి, హోదా వీటన్నిటికోసం కుంటిపిల్లను పెళ్ళి చేసికుంటున్నావా?" నేను ఆశ్చర్యంగా చూచాను.

ఆ కుంటిపిల్ల నా కళ్ళముందు కదలాడింది. "లేదు పెదనాన్నా మీతో ఎవరు చెప్పారు?"

"ఒకరేమిటి? మీ బాబాయి చెప్పాడు. ఆ అమ్మాయి తండ్రి చెప్పాడు. నిన్ను ఇల్లరికం తీసుకుని, మీ బాబాయి కూతుర్ని వారి అబ్బాయికి చేసుకుంటారట." వింతగా విచిత్రంగా వుంది. ఆయనతో నాకేం తెలియదనిచెప్పి వచ్చేశాను. ముసుగులో గ్రుద్దులాట దేనికి? ఆయననే అడుగుదామని, బాబాయి గదిలోకి వెళ్ళాను.

"రా సుధీర్. నీకు కబురు పంపుదామని అనుకుంటున్నాను" అని నవ్వుతూ పిలిచాడు.



"అవసరమైన పని ఉందా బాబాయ్!" అన్నాను శాంతంగా.

"మీ నాన్న అన్నీ తలనొప్పి పనులే చేశాడురా. హైద్రాబాద్‌లో ఇల్లెందుకు చెప్పు? ఈ కాగితా మీద సంతకం పెడితే చాలు. దాని ఖరీదు మనకు దొరుకుతుంది" కాగితాలవంక చూచాను. ఇల్లు నా పేరున వ్రాశారని అప్పుడే తెల్సింది.

"అమ్మటం దేనికి? అద్దెకిస్తే బావుంటుంది" అన్నాను.

"అద్దెల వసూళ్ళకు వాటికి యెవడు వెళ్తాడు? నువ్వు యెప్పటికి నా యింట్లోవకి తినలేవుకదా. దానికయినా డబ్బు కావద్దా? పెద్దవాడివి ఆలోచనలేకనే పనులు చేస్తానట్రా!"

"ఇల్లు సంగతి సరే బాబాయి. నాకు పెళ్ళి అంటున్నారు అందరూ నిజమేనా?"

"నాకృతిమరుపు చూడు. నిజమేరా! ఆస్తిలేదు అణుకువ లేదు. యెలా బ్రతుకుతావో అని నాకు దిగులు పట్టుకుంది. నీ కాబోయే మామగారురా.... మన పాలిట దేవుడు. సగం ఆస్తి నీ పేర వ్రాసానంటున్నాడు. పిల్ల కుంటిదయితే నేం బంగారపు బొమ్మ. దానినే నమ్ముకోవాలని యెక్కడున్నది? మొగవాడికి స్వేచ్ఛా స్వాతంత్రాలున్నాయి నీ యిష్టమొచ్చినట్టు తిరుగవచ్చు" ఆయన మాటలు వింటుంటే నా తల తిరిగిపోయింది. నాన్నగారు చేసే వ్యాపారము పెద్దదే. తాతగారు నాకిచ్చిన ఆస్తి అవన్నీ పోయాయి. నా ఖర్చుల నిమిత్తం హైద్రాబాద్‌లో ఉన్న యిల్లు అమ్ముతున్నాడంటే తల తిరిగిపోక ఏం చేస్తుంది?"

"మీరు కొంచెం పెద్దవారేగా అడగలేక పోయారా?" సుశీల అదుర్దాగా చూచింది.

"అడిగాను. ఆ కుంటిపిల్లను యే పరిస్థితులలోను చేసుకోనని. ఇల్లరికం అల్లుడిగా వెళ్ళనని ఖచ్చితంగా చెప్పివేశాను. నా కొచ్చేది యిచ్చివేయమని అడిగాను. ఆయన మండిపడ్డాడు. నాన్నగారి స్నేహితు

లంటూ నలుగురిని పరిచయం చేసి, వారితో హితవు చెప్పినాడు. నా పట్టుదల సడలలేదు దాంతో ప్లీడరుతో లాలూచీ పడి, నా ఆస్తి వివరాలకు సంబంధించిన కాగితాలు మాయంచేయించాడు. ఒక జత బట్టలతో ఇంట్లో నుండి తరిమివేశాడు. పెద్దనాన్నల దగ్గరకుపోయి నాగోడు చెప్పుకున్నాను. "మీనాన్న నిన్ను అతనిచేతులలో పెట్టారు. నిన్ను ఎలా చూసినా పడి ఉండాల్సిందే. మధ్యన కలుగజేసుకోవడానికి మా కేం హక్కున్నది!" అని అన్నారు. ఒకపూట వారింట ఆతిథ్యము ఇవ్వటానికి నిరాకరించారు. యమునానది ఒడ్డున కూర్చుని మొదటిసారిగా అమ్మ నాన్నలను తలచుకొని, ఆడపిల్లలా ఏడ్చాను. ఆదరించే ఆత్మీయులు లేరు. అవసరాలు గడిపే అర్థబలము లేదు. ఆకలి నక, నకలాడుతోంది. అదే ఆంధ్రలో అయితే రోజు కొక స్నేహితుని ఇంట్లో ఆతిథ్యము లభించేది అంతా కొత్త. అక్కడెవరో మార్వాడీలు పెద్దల పేరుమీద మిఠాయి పంచుతున్నారు. నాకివ్వడానికి వచ్చారు. చేతులు చాచాను. వారు పెట్టి వెళ్ళిపోయారు ఆకలిని అభిమానం జయించింది. నా పుట్టిన దినాలకు అమ్మా నాన్నా పంచిపెట్టే పళ్ళూ, బట్టలూ గుర్తుకొచ్చాయి వెంటనే అక్కడున్న బిచ్చపువాడికి అదియిచ్చి, కడుపునిండా నీళ్ళు త్రాగినాను...." అతని చేతిపై నీటి బిందువులు పడటంతో సుశీలవైపు పరీక్షగా చూచాడు. ఆమె కనులు వర్షిస్తున్నాయి. "ఛ, అలా అయితే నేను చెప్పను" అన్నాడు. ఆమె అతని చేతులు తనచెంపలకు రాసుకుంటూ "చెప్పండి. మీరుకూడా యిటువంటి పరిస్థితికి లోనయ్యారంటే కన్నీరు ఆపుకోలేక పోయాను" అన్నది.

అతడు చేతులు విడిపించుకొని కన్నీరు తుడిచాడు. "జీవితంలో యిలాంటి పరిస్థితి వస్తుందని తెలియదు. ఏం చెయ్యాలి? చేతిలో డిగ్రీ ఉన్నది. రికమండేషన్ లేనిదే కూలిపనిదొరకని ఈకాలంలో నాకు ఉద్యోగం ఎవరిస్తారు? సర్టిఫికెటు చూడక నా ఇంగ్లీష్ పరిజ్ఞానం చూచి, యెవరో



ఉద్యోగం యివ్వడానికిది సినిమాకాదు. కాళ్ళీడ్చుకుంటూ వచ్చి, ఆ రాత్రి జుమామసీదులో నిదురపోయాను. అప్పటికే రెండురోజులయింది తిండిలేక. లేనిబలం తెచ్చుకుని లేచి, మసీదులో ముఖం, కళ్ళు, చేతులు కడుక్కొని చాందనీ చౌకువైపు వెళ్ళాను. ఉదయం తొమ్మిదిగంటలు, అన్నిహోటళ్లూ కొట్లూ తెరిచారు. వంటకాల వాసనలు ఆకలితో ఉన్న నన్ను తెగఊరించసాగాయి. ఒక చిన్న సందులో సామానులుకొని తనతరువరకు మోసుకుపోలేక పోతున్నాడో వృద్ధుడు. అతని అసహాయతనుచూచి కూలీలు నానా గల్లంతు చేస్తున్నారు. అందరిని దూరంగాఉండమని సామానంతా కారులోకి చేర్చాను. అతను చిరునవ్వుతో నా వంకచూచి నాలుగు అణాలు చేతిలోపెట్టి కారు స్టార్టుచేసి వెళ్ళిపోయాడు నవ్వుకున్నాను. 'పిడిపోజు! వీడు యెప్పుడూ జేబులో ఎంతవుంటే అంతే వేస్తాడు బిక్షగాళ్ళకు. నాల్గు అణాలంటే మాటలా, డబ్బువిలువ తెలియదు. అయ్య సంపాదిస్తాడు. కొడుకు ఖర్చుపెడతాడు" వెనుకటి స్నేహితులనే మాటలు గుర్తుకొచ్చాయి డబ్బువిలువ తెలిసివచ్చింది. నాల్గు అణాలు నా సంపాదన. అవి ఉపయోగించుకోవటానికి సిగ్గుపడరాదు. రోడ్డుప్రక్కన అమ్మే టీ అతనివద్ద రెండణాలిచ్చి టీ త్రాగాను రెండణాలు పెట్టి మూడు అరటిపళ్ళు కొని తిన్నాను. యెంతో శక్తివచ్చినట్లు అనిపించింది. అభిమానం చంపుకుని పిన్నిపెట్టే శాపనార్థాలు వింటూ యింట్లోకి వెళ్ళి నా సర్టిఫికెట్లు తెచ్చుకున్నాను. తెలిసినవారికీ తెలియనివారికి చూపి ఉద్యోగం కోసం తిరిగాను. ఆ రోజు అలా గడిచిపోయింది. సిక్కుల మందిరంలోవెళ్ళి పడుకున్నాను. రెండవరోజు ఉదయం లేస్తూనే అలవాటుప్రకారం చెయ్యిచూచుకున్నాను. నా కళ్ళు మెరిసాయి. నా వా ....నాకు ఎంతో బలంవచ్చింది. నిన్ననే ఆ సంగతి జ్ఞాపకంరానందుకు నన్ను నేను తిట్టుకున్నాను. అది తీసుకుని మార్వాడిదగ్గర కెళ్ళాను. సంఘంతో పెద్దమనుషులుగా చెలామణి అయ్యే పేట్లు. బొజ్జలు పెంచిన మహావీరులు. దొరతనముగా దొంగతనంచేసే

మోసగాళ్ళు. రెండువందల యాభై రూపాయల గడియారాన్ని యాభై రూపాయలు వెలకట్టి డబ్బు యిచ్చారు."

"తాకట్టు పెట్టలేకపోయారా?" అమాయకంగా అడిగింది సుశీల.

"తాకట్టులతోనే మనసంసారాలుచాలామటుకు నాశనమవుతున్నాయి. నేను డబ్బు సంపాదించేసరికి, వడ్డీ రెండువందలు అవుతుంది. తెగనమ్మి డబ్బు జేబులో వేసుకుని. హోటల్‌కు వెళ్ళాను. క్లుప్తంగా రెండు చపాతీలు చట్నీతో కడుపునింపుకుని మరల ఉద్యోగాన్వేషణకు బయలు దేరాను. నాకు మెకానిజమ్ తెలుసునని తెలుసుకొని, ఒక గుజరాతీ అతను తనమోటారు కంపెనీలో పని ఇచ్చాడు. నాపని అతనికి నచ్చితే జీతం యెక్కువ ఇస్తానని. అంతవరకు నూట ఇరవై రూపాయలు ఇస్తానని చెప్పాడు. అదేచాలని సంతోషించాను. ఆరోజే పనిలోచేరాను మార్కెట్టులో పదిరూపాయలు పెట్టి ఖాకి నిక్కరు షర్టు కొన్నాను. ఓ టవల్. సబ్బుకొని, గదికోరకు బయలుదేరాను స్టేషన్‌వద్ద 'షీలా టాకీస్' వెనక ఒక చిన్న రేకులగది పది రూపాయలకు దొరికింది. పడుకోవడ మెలా? ఢిల్లీలో విపరీతమైన చలి. కప్పుకోవడానికి ఏంలేదు. బాబాయి ఇంటికివెళ్ళే. నా బట్టలు నాకిమ్మంటే ఇవ్వడు. పైగా అవమానిస్తాడు. పరువు పరపతి అన్ని పోయాక. బట్టలదేంగొప్ప. అనుకొని ఖాకీదుస్తులు పరిచి పడుకున్నాను. నేలనుండి చలి.... ఇంతలో ఆ రేకులగదికి అవతల గదిలో ఉండే గుర్రపుబండి తాత పిలిచాడు. వినుక్కుంటూ తలుపు తీశాను. ఓ నులక మంచం పట్టుకుని నిల్చున్నాడు.

"ఈఊళ్ళో నేలమీద పడుకోవడంఅసాధ్యంబాబూ.ఈమంచంవుంచు. మంచంకొన్నాక మంచం ఇచ్చేద్దువుగాని. ఈబొంతకప్పుకో.సందేహించకు. నేను నా మనుమడు ఒకమంచంలో పడుకుంటాంలే" అని హిందీలో చెప్పి ఇచ్చి వెళ్ళాడు. అప్పుడు నాకామంచం పట్టుపరుపులా అనిపించింది. నాన్న రోజూ పడుకుబోయేముందు వచ్చి నా దోమతెర సవరించి చేతులుదుప్పటి



లోకి నెట్టివెళ్ళిపోయేవారు. "అనా న్నే యీముసలిరూపంలో వచ్చాడా?" అని పించింది. బొంత కప్పుకోలేక పోయాను. నా రెండుజతల బట్టలే అడ్డదిడ్డుగా కప్పుకొని నిదుర బోయాను. మొద్దునిద్దుర బోయాను. ఉదయం నావళ్ళంతా దోమకాట్లతో ఎర్రబడింది. నవ్వుకున్నాను. పాపం! మనుష్యులు తోటి మనుష్యులను పీక్కు తినగా లేనిది. క్రిములు వాటికేం తెలుసు పని అల వాటు లేకపోవడం మూలాన సాయంత్రము విపరీతంగా అలసిపోయే వాడను. యింత తిని నిదురబోయేవాడిని. జీతం అందగానే ఒక చవకరకం బ్లాంకెట్ తాతకు నాలుగు చుట్టలు కొనితెచ్చాను. రెండు నెలలు గడిచాయి ఇంకో జత బట్టలు కొన్నాను. కాస్తగాలి వెలుతురు వచ్చే గదికోసం వెదుకసాగేను. మా బాబాయి వెనకాలే ఉంటాడని తలచలేదు ఒకరోజు. తెల్లవారుజామున యెవరో కుదుపుతుంటే మెలుకువ వచ్చింది. కళ్ళు విప్పాను. యెదురుగా పోలీసులు. అర్థంకాక కళ్ళు విప్పి చూచాను. రాత్రి బాబాయి ఇంట్లో దొంగతనం జరిగిందట. నగలుపోయాయట నాపైనే అనుమాన ముందట వెతుకోవాలన్నాను. ఇల్లంతా వెతికారు. ఒకే ఒక గది నా ఇల్లు. ఏం దొరకలేదు మూలకు నేను క్రితంరోజు కొనితెచ్చుకున్న రేకు పెట్టె కనిపించింది. దాన్ని తీశారు. నేనే ఆశ్చర్యపోయాను. దానిలో వెండి నగలు బంగారు నగలు ఉన్నాయి."

"మీరు నిదురపోయాక. మీకు తెలియకుండా పెట్టబడ్డాయి కాబోలు!"

"అదే జరిగినది. నేను అరెస్టు అయ్యాను. నా తరఫున వాదించే వారెవరు! బాబాయి ఇంటి నౌకరు నన్ను చూచానని నేను తన్ను కొట్టి పారిపోయానని సాక్ష్య మిచ్చాడు. అసహాయుడనై భగవంతుని ప్రార్థించాను. అతను నిదురపోతున్నాడో ఏమో. నా ప్రయత్నం వృధా అయింది. ఒక సంవత్సరం శిక్ష విధించారు. విధికి తల వంచాను. అంపటితో పాటు

నేను ఓ నెంబరు బిళ్ళ మెడలో వేసుకుని పనిచేసేవాడిని. గుడ్డి ప్రభుత్వమంటే. చెవిటి చట్టాలంటే విముఖత పెరిగిపోయింది. ధనవంతుడయితే, మనిషి ఏం చేసినా, దాగి పోతుందనే సూత్రాన్ని నమ్ముకున్నాను. సంవత్సరం గడిచింది. నాదుస్తులు నాజీతం డబ్బులు అరవై రూపాయలు ఇచ్చినారు. నేను పనిచేసే కంపెనీకి కూడా వెళ్ళి లాభం లేదు. వెర్రి వాళ్ళను సహించగలరు కాని, దొంగవాళ్ళను ఎవరూ సహించలేరు. చక్కగా హైద్రాబాద్ వచ్చేశాను. మాయింటికి వెళ్ళినాను. పాత వారిని ఖాళీ చేయించి కొత్త వారికిచ్చారట. నా ఇల్లు అని చెప్పుకుని వాళ్ళ వద్ద కిరాయి వసూలు చేసుకోవాలంటే. కొంత డబ్బు కావాలి. అదెవరిస్తారు? మేనమామలున్నారు. వెళ్ళాలనిపించలేదు. చక్కగా విశాఖపట్నం వెళ్ళాను. నాన్నగారిని ఎరిగిన వారినందరినీ ఆశ్రయించి నాబాధ చెప్పుకున్నాను. అందరూ సానుభూతి చూపారు. కాని నాకు బ్రతుకు తెరువు మార్గం చూపలేదు. మా బాబాయితో లావా-దేవీలు వదులుకోమని సలహా యిచ్చారు. అదివరకే ప్రపంచం తీరు చవిచూసిన నేను ఎక్కువగా ఆశ్చర్యపోలేదు. విరాశగా సముద్రపు ఒడ్డున కూర్చున్నాను. చీకటి పడినట్లుకూడా గుర్తించలేదు. అప్పుడు ఆజానుబాహుడయిన నడివయసు వ్యక్తి చప్పట్లు కొట్టి పిలిచాడు. లేచి వెళ్ళాను. కొంచెం కారు త్రోయటంలో సాయం చెయ్యమన్నాడు. అంగీకరించాను. ఎంతకూ కారు కదలలేదు. అతన్ని జరగమని. ఇంజను పరీక్షచేసి అందులోని భాగాలు విడిపోయినట్లు చెప్పాను. అతను నిస్పృహగా చూచాడు. మరో పది నిముషాలలో అవి సరిచేసాను. ఊర్లో వదిలి వెడతానని రమ్మని నన్ను పిలిచాడు. కార్లో నా విషయాలు అన్నీ తెలుసుకున్నాడు. తనయింటికే తీసుకు వెళ్ళాడు. అతనికక్కడా హైద్రాబాద్‌లో కంపెనీ ఉంది. దానిలో నాకు ఉద్యోగం యిస్తానన్నాడు ఎంత సంతోషించానో....! ధనవంతులందరూ పతినాత్ములుందరని నా నిర్ణయం మార్చుకున్నాను. అతనింట్లో రాత్రి గడిపి రెండవ రోజు యిద్దరమూ హైద్రాబాద్ ప్రయాణమయ్యాం. ఎలా తెప్పించాడో. నాన్నగారు నాపేర రిజిష్టరు చేసిన కాగితాల నకలు తెప్పించినాడు. మరో వారం రోజులలో యిల్లు స్వాధీనం అయింది. సంతోషంగా నా యింట్లో అడుగు పెట్టాను. నాకిల్లు యిప్పించిన నారాయణగారికి పాదాభివందనం చేశాను. అతడే నాకు సర్వస్వం అనిపించినాడా రోజు. అన్నట్టుగానే అతను తన రేడియో రిపేరింగ్ షాపులో ఉద్యోగం యిచ్చాడు. నెలకు రెండువందల రూపాయల జీతం. వేరే మనుషులున్నారు/ ఐనా నాకు ఇచ్చాడు ఏమంత పని ఉండేదికాదు. ఇల్లు ఒక్కడినే ఉంచుకున్నాను. నారాయణగారే వంటకు మనిషిని కుదిర్చినారు. అంతవరకు సాఫీగానే జరిగిపోయినది జీవితం అదృష్టమేఅను....పరదృష్టమేఅను. ఆ తరువ అయన విశాఖపట్నంవెళ్తూ నన్ను రమ్మన్నాడు. ప్రయాణమయ్యాం. దారిలో అతని ఉద్దేశం మారినది. ఇదుపురం చేరాయి, కలకత్తా వెళ్ళాలని చెప్పాడు. మొదట కలకత్తా వెళ్ళాం అక్కడ కొందరు నాన్నగారికి పరిచయమున్నవారు కనిపించారు ఒకతను నన్ను చాటుకు పిలిచాడు. "జీబూతీ" నుండి బంగారం తెచ్చాం. అమ్మి పెడితే నూటికి పదిరూపాయలు ఇస్తానన్నాడు. ప్రయత్నించాను. నారాయణగారు సహకరించారు. రెండు రోజులలో వెయ్యిరూపాయలు సంపాదించాను. మనిషి స్వాభావికంగా మంచివాడయినా కొన్ని ప్రలోభాలకు లొంగి పోతాడు. అలా లొంగక తలఎత్తి నిల్చున్నవాడు అతడు మానవోత్తముడే అవుతాడు. నాలో రాజుకుంటున్న ధనవ్యామోహపు జ్వాల వెయ్యి రూపాయలతో భగ్గుమన్నది. నేను దొంగతనం చెయ్యటంలేదు. వ్యాపారం అని తృప్తి చెందినాను. డబ్బిచ్చి ఓటు కొనటం తప్పు కాదు. పరపతిని బట్టి పదవులు రావటంతప్పులేదు. అవసరాన్నిబట్టి అమ్మేవస్తువుకు ధర హెచ్చటం తప్పులేదు. జీవితాంతం తనతోడునీడై ఉండే భార్యతో కట్నం రాబట్టటం తప్పులేదు. ఇన్ని సంఘంలో జరుగుతుండగా, నేను

వ్యాపారం చేస్తే వచ్చిన తప్పేమిటో! మోసమేమిటో అర్థంకాలేదు. ఒక సంవత్సరంలో కొన్నివేలు ఆర్జించినాను.... ఒకనాడు నాముఖం చూడనొల్లని పెద్దలు నన్ను చూడగానే లేచి చేతులు కలుపసాగేరు. కాని కొన్నాను బీద సాదలకు ఏదో రూపంలో సహాయం చేయటం మొదలు పెట్టాను. బొంబాయి, ఢిల్లీ కలకత్తా మద్రాసు యివన్నీ నాకు వ్యాపార కేంద్రాలు అయ్యాయి. ఎప్పుడూ పెద్దమనుషులనబడే చిన్న మనసుగల వారికి దూరంగా ఉన్నాను. నాయిష్టం వచ్చినట్టు తిరుగనిచ్చారు నారాయణ గారు. ఆయన ఏ విషయంలోనూ నన్ను ఆంక్షలు పెట్టలేదు. దహించే బాధలను అవమానాలను నాగుండెలో దాచుకోలేక చెప్పుకునే ఆత్మీయులు లేక వాటిని కాగితాలపైకి ఎక్కించాను. ఒకసారి ఒక కథ తోచక పత్రికకు పంపినాను. అచ్చు అయినది. అడపా-దడపా సమయం చిక్కినప్పుడు ఏవో వ్రాస్తుండే వాడిని. ఒక రోజు ఆప్యాయంగా మేనమామ వచ్చి పలుకరించాడు. అతను నన్ను చూచినట్టే అతని నేను అపరిచిత వ్యక్తిలా చూచి పంపివేశాను. వెధవ డబ్బు-పాపిష్టిడబ్బు అనే మాటలు నిరుపయోగం. డబ్బుకెంత విలువ ఉందో తెలిసి వచ్చింది. అందరికి దూరంగా నా ప్రపంచం నేను ఏర్పరుచుకొని ఉంటున్నాను. నాకు నమస్కరింపదగినవ్యక్తి ఒక్కనారాయణగారే నాతోపాటు అనేకులు ఆయన క్రింద ఉండేవారు."

"మరి ఈదొంగనోట్ల [illegible]కు ఏమిటి సంబంధం?...." ఆత్రంగా అడిగింది సుశీల.

"అదే చెప్పబోతున్నాను విను. అతని అపారమైన అదరణకు, అభిమానానికి పొంగిపోతూ. అతనికి ప్రతిగా ఏ విధమయిన సహాయం చెయ్యాలో తోచక కొట్టుకుపోయే వాడిని. అలాంటి సమయంలో నారాయణ నా సహాయం కోరినాడు. నేను సంతోషంగా అంగీకరించి నాను. ఇరువురం అతని యింట్లోగల భూగృహంచేరినాము. అక్కడి సరంజామా



చూచి నా మతి పోయింది. దొంగనోట్లు అచ్చువేసే యంత్రం. పదిమంది పనివారు ఉన్నారు "బాస్!" అన్నాను నా ఆశ్చర్యాన్ని దాచుకోలేక. అక్కడ అందరూ అతన్ని బాస్ అనే సంబోధిస్తారు. ఏమిటి సుధీర్! అంత ఆశ్చర్య పోతున్నావు? రెండు సంవత్సరాల వరకు చక్కగా నోట్లు అచ్చువేసే వారు.... యంత్రంలోని తంత్రములు తెలిసినతను కారు యాక్సిడెంటులో మరణించాడు. మూల పెట్టాం. నీకు మెకానిజమ్ తెలుసు నీ సహాయం ఉంటే తిరిగి నా పని సాగుతుంది.' అతని మాటలు నోరు వెళ్ళబెట్టి విన్నాను చరచరా పైకి వచ్చి హాల్లో కూలబడ్డాను. నావెనకాలే నారాయణ వచ్చాడు. "ఏమిటి సుధీర్! ఒంట్లో బావుండలేదా?" నా భుజం తట్టాడు. అతని చెయ్యి విదిలించి వేశాను. అతను వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడు. అంతవరకు నా పాలిట భగవంతుడుగా కనిపించిన నారాయణగారు యముడిలా కనిపించ సాగేరు. "ఏమిటి సుధీర్! పని ఎప్పుడు ప్రారంభించాలని... నీకు అనుకూలమైన సమయంచెప్పు?" అతను కుర్చీలో చేరబడి అడిగినాడు. "నాకు అనుకూలమైన సమయమే లేదు. ఈ విషయంలో నన్ను క్షమించండి బాస్! ఈ మోసం నేను చేయలేను" అని లేచాను. అతను పకపక నవ్వాడు. "నేను అగిపోయాను ఇప్పుడు చేస్తున్న వ్యాపారం మాత్రం న్యాయమైనదా సుధీర్? మనిషిని చూచి ఎప్పుడూ మోసపోవద్దు... నేను ఎవరి విషయంలో మోసపోలేదుగాని నీ విషయంలో మోసపోయాను. సాయం పొందేవాడివే గాని. అవసరమైతే సాయం చేసేవాడివి కావని తెలిసిపోయింది. పోనీలే! నాకేం బాధలేదు. అంత తెలివితేటలున్నవాడు ప్రపంచంలో ఏ మూలనున్నా కనిపెట్టి పోషించుకోగలడు." అతని మాటలువిని సహించలేక పోయాను. అతని దగ్గరగా వెళ్ళి అతని చేతులు పట్టుకున్నాను. "బాస్! అపార్థంచేసుకోవద్దు... నా సర్వస్వమూ మీది....దాన్ని అప్పగించ[illegible]న్నాను" అని ప్రాధేయపడ్డాను. "ఎందుకు సుధీర్ ఈ నమస్క ప్రియాలు

నీ మీద నాకేం కోపంలేదు. వెళ్ళు! నా పాట్లు నేను పడతాను" అని అతను దూరంగా జరిగినాడు. అతనికి ఆర్థికయిబ్బందులేవో ఉండవచ్చునని తలిచాను. "బాస్! మీరు పాట్లుపడుతుంటే చూస్తామా? బ్యాంకిలో యిరవై వేలుండి. తీసుకోండి నా కారు అమ్మితే పదివేలు వస్తాయి. ఇప్పటి ధరలనుబట్టి చూస్తే యింటికి యిరవై ముప్పై కంటే ఎక్కువే వస్తాయి....అవన్నీ తీసుకోండి" అన్నాను. అతను నావైపు తదేకంగా చూచి. సుధీర్! నీకు ఒక ఇల్లుంది. నాకు ఇక్కడా—విశాఖపట్నంలో కూడా మేడలున్నాయి. కార్లున్నాయి. అవి అమ్మితే వచ్చే డబ్బు ఏమూలకు? లక్షలతో పని. ఇందులో నీకు ఇబ్బందికలిగించే విషయమేమిటో అర్థం కావటంలేదు. నూటికి వది నీవి తెలుసా? మార్చినందుకు జాషువాకు. సిగ్గరు పది శాతమిస్తున్నాను. కావాలంటే. వ్రాసి యిస్తాను." అతని మాటలు వింటుంటే ఏడ్వాలో నవ్వాలో తెలియలేదు.

"నాకు డబ్బు అవసరములేదు. ప్రభుత్వాన్ని మోసగించడంకాదా? చట్టాన్ని వ్యతిరేకించటం కాదా. నన్నీ రొంపిలోకి దించకండి" ప్రాధేయపడ్డాను.

"ప్రపంచము మోసంతో కూడుకున్నది సుధీర్. నీవు అన్నార్తుడివై అర్థించిననాడు యెవరయినా నీ ముఖం చూచారా? నేడు నీ కారు. నీ సూటు చూచి మోసపోతున్నారు. చట్టానికి వ్యతిరేకమైన పనులెన్నో చేస్తున్నాము. విదేశవస్తువులు తెచ్చి అమ్మమని చట్టము నిన్ను శాసించిందా? అనుమతించినదా? సుధీర్ ఒక్కటేమాట చెప్పుచాలు. నీవు నాకు సహాయం చేయాలని కోరుకొంటున్నావా? అదీ హృదయపూర్వకంగా.... చెప్పు." విడదీసి అడిగాడు. ఏం చెప్పను? ఎలా చెప్పను? ఎలాచెప్పితే అతడు నన్ను అర్థంచేసుకుంటాడు? "ఒక్క విషయం గుర్తుంచుకో సుధీర్! ఆ నాడు నేను గొప్ప సహాయంచేశానని అనటంలేదు. కాని. నీకు దారి చూపాను. అదేగనుక చెయ్యకపోయుంటే ఈ పాటికి నీ స్థితి యెట్లుండునో!



రోడ్డు మీది కసిచేత—హత్యో ఆత్మహత్యో చేసి, చేసుకుని ఉండేవాడివి. పిచ్చాయి కొమ్ములు తిరిగిన బంటు. నువ్వు ఏమాత్రం అతనిమీద దౌర్జన్యం చేస్తున్నావని తెలిసినా, ఏదో కేసు పెట్టి నిన్ను పదిసంవత్సరాలపాటు కటకటాల వెనుక ఉంచేవాడు. నీ జీవితం చీకటిలా గడిచేది." నాకు మండిపోయింది.

"నా జీవితం యెత్తి చూపి లొంగదీయాలని చూస్తున్నారా?" తీక్షణంగా అడిగాను.

"ఊహూ పిచ్చివాడివి. అలా చెయ్యదలిస్తే యింత సేపు నీతో వాదిస్తానా? సుధీర్! మంచికో చెడుకో నిన్ను చూడగానే ఓవిధమైన వాత్సల్యము కలిగింది. ఈనాడు నువ్వు నా పంచ చేరకపోయినా నిన్ను నేను ఏమి అనను. కాని ప్రపంచాన్ని అర్థంచేసుకో. మోసమూ. అన్యాయము మనం పెద్ద మనుష్యులుగా వ్యవహరించటాన్ని సాధనాలు. అవి లేనినాడు మనకూ పెర్రివారికి తేడాయే వుండదు. లోకం దృష్టిలో. ఆలోచించు. నీకు అంగీకారమైతే రేపురా. లేకుంటే నువ్వు యిక రావద్దు. నా గురించి భయం అక్కరలేదు. సినిమాలో విలన్‌గా నిన్ను బ్లాక్ మెయిల్ చెయ్యను. హాని అంతకన్నా చెయ్యను." అతను తన గదిలోకి వెళ్ళిపోయాడు.

నా జీవితంలో అడుగడుగునా తలయెత్తే సమస్యల నెలా పరిష్కరించుకోవాలో తెలియదు. అర్ధరాత్రంతా పిచ్చివాడివలె హుస్సేన్ సాగర్ లోకి చూస్తూ టాంక్ బండ్ పైన గడిపానంటే యెవరూ నమ్మరు. అతను చెప్పింది నిజమే కదా. అవసరానికి అతను ఆదుకోనియెడల నా జీవితం యెలా వుండేదో! విజాయితీ యెక్కడ ఉంది? ఆలోచించి జాగ్రత్త పడి చేసుకుని చివరకు అతనికి సహాయపడుటకే నిశ్చయించుకున్నాను."

"యెంత పని చేశారు?" ఆశ్చర్యంగా భార్యవంక చూచాడు. ఆమె తను చేసిన దాన్ని అంగీకరిస్తుందనుకున్నాడు.

"చూడండి. ఎక్కువాడు తప్పు చేస్తున్నాడని మనం చేస్తాం? యెందరో మోసగాళ్ళుండవచ్చు. కొందరయినా మంచివాళ్ళు లేరా? ధర్మం నాల్గు పాదాల నడవక పోయినా కుంటిగా నడుస్తోంది. యెవరో చేశారని మనము ఊబిలోకి దిగడం ఏమి బాగాలేదు" అన్నది.

"మంచో, చెడో ఆ క్షణంలో అంతకంటే మార్గం కనిపించలేదు. వెళ్ళి నా అంగీకారము తెలిపాను. కాని ఆయన యిస్తానన్న పదవశాతం లాభం మాత్రం అంగీకరించలేదు. పని ప్రారంభమైంది. మనసు బాగాలు తిరిగినట్టే నాలో ఆలోచనలు తిరిగేవి. రాత్రింబవళ్ళు నిద్రలేక బాధపడ్డాను. రాత్రిళ్ళు పోలీసులు స్వప్నంలో తిరిగివారు. కొన్నాళ్ళకు అలవాటు పడ్డాను. ఈపని మొదలుపెట్టినప్పటినుండి మరీ ఒంటరితనము ప్రేమించడము మొదలుపెట్టాను. నాపీడను చూచి నేనే భయపడేవాడిని. అటువంటప్పుడే "ప్రతీకారం" కథ వ్రాశాను. అంత ఒంటరినైన నా జీవితంలో నువ్వు ప్రవేశించావు. నారాయణదగ్గర పని ముగించుకొని వస్తున్న నా కారుకు అడ్డంవచ్చావు. అశాంతితో అలమటించే నాకు అచేతనంగా ప్రశాంతముగా నున్న నీ ముఖం చూడగానే యెంతో తృప్తికలిగింది. నిన్ను హాస్పిటల్లో చేర్చాము. అపరిచితురాల వయినా యెన్నో రోజుల పరిచయమున్నట్టు తోచింది. దానికి కారణము ఇద్దరిజీవితాలు ఒకలాంటివి కావటమే కావచ్చు. నీవు చెప్పిన కథ విన్నంతసేపు మా పిన్ని, బాబాయి గుర్తుకొచ్చారు. నిన్ను ఒదులుకోవాలని లేదు. ఈ రోజు నిజం చెపుతున్నాను. సుశీ! నిన్ను మీ వారు ఇంట్లోకి రావద్దనే కోరుకున్నారు. అట్లాగేజరిగింది. కాని నాజీవితానికి స్థిరత్వంలేదు. నిన్ను అన్యాయం చేస్తానేమోనని బాధపడి గురుకులంలో చేర్పించాను. నీ ముఖంచూచాక నారాయణగారింటికి తరుచూ పోలేకపోయేవాడిని. యెప్పుడయితే నిన్ను యింట్లోతెచ్చి పెట్టుకున్నానో, అప్పుడే నారాయణగారు నాపై చిరుబురు మంటూ, యే పనిలేనిది ఇంటికి వచ్చి



హెచ్చరించారు? నీ ప్రశాంతమైన ప్రవర్తనను పువ్వులా విరిగే నిన్ను చూస్తూ యెన్నోసార్లు నా కథ నీకు చెప్పాలని. భయమువేసి ఊరుకునేవాడిని. నీ అంతట నువ్వే మన పెళ్ళికి అంగీకరించావు సంతోషించాను. నువ్వు బంధువులను, స్నేహితులను పిలవాలని ఉత్సాహపడేదానివి. నాలోని కల్మషమూ. బంధుజనంయొక్క రాబందు బుద్ధులు నన్ను వారికి దూరంగా వుంచేవి. మనము ఢిల్లీ వెళ్ళినప్పుడే సింగ్ పట్టుపడ్డాడు. అప్పుడు త్వరగా వచ్చి, అతనిని విడిపించవల్సి వచ్చింది. సింగ్ కావల్సి పట్టుపడ్డాడని నా అనుమానము. అతనికి నారాయణయిచ్చేది సరిపోలేదు ఇంకా కావాలని పేచీ పెట్టాడు. కనీసం నేను అంగీకరించని భాగమైనా తనకు, బాసు నాకు ఇవ్వమని పేచీపెట్టేవాడు. నారాయణగారు ఒప్పుకోలేదు. దానితో అప్పుడే పట్టుపడ్డాడు. కొంతడబ్బిచ్చి విడిపించినా, అతనివాలకం అనుమానస్పదంగా ఉంది, బాస్‌ను హెచ్చరించానుకూడా. ఇది రెండవసారి పట్టుబడటం...."

"మరి మీ పేరు చెప్పినాడట" సుశీల ఇనస్పెక్టరుగారు చెప్పినట్టు చెప్పింది.

"నా పేరు సింగ్ చెప్పలేదు. లంచం ఆశచూపించి చెప్పించుకొన్నారు."

"మీ బాబాయి చేసేపని అంటారా లేక యింకెవరయినా చేస్తున్నారా?"

"మా బాబాయి చేస్తున్నపనే. ఆ ఆస్తికై కోర్టులో దావా చేశాను కదూ...." తాతగారు రిజిష్టర్ చేసిన నాటి నకళ్ళు తెరిపించాను. డబ్బుంటే పనులు చాలా సులువుగా అవుతాయి. ఆస్తి నా కొచ్చినట్టే. యిక యిన్నాళ్ళూ దానిమీదొచ్చే ఆదాయము వాడుకున్నాడు. అది మాత్రం రావాలి. అతన్నికి మతిపోయింది. యిలా జరుగుతుందని ఊహించి ఉండడు.

([illegible])

నామీద పగబట్టాడు. ఒకరోజు నేను ఢిల్లీలో ఆటోకోసం చూస్తున్నాను. నలుగురు రౌడీలు చుట్టుముట్టారు. జేబులో నుండి పిస్టల్ తీయగానే అదిరిపోయారు, తాము డబ్బుకు గడ్డితిన్నామని, వదిలిపెట్టమని ప్రతిమాలారు. అప్పటినుండి అప్రమత్తుడనయి తిరుగుతున్నాను. నా గురించి, నారాయణగారి గురించి, విశాఖపట్టణము వచ్చి ఆరాలు తీయటం మొదలు పెట్టినాడట. మరి యెలా కనుక్కున్నాడో సింగుకు మాకు పరిచయమని. సింగు పట్టుబడగానే అతనిని జామీనుపై విడుదల చేయించి నాటకం ఆడుతున్నాడు. అదివియ్య నేను సిద్ధముగానే ఉన్నాను" తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు సుధీర్.

"అదికాదండి. మరి ఆ సింగు చెప్పే అబద్ధాల వల్ల మీపైకి కేసు రాదూ?"

"ఎందుకు రాదు. అప్పుడు చూద్దాము. చాలా రాత్రి అయింది పడుకోవో."

"నా నిద్రకేం రోగం? పడుకుంటాను లెండి. కేసు మీ మీదకు రాకుండా చూచుకోలేరా? మీరే అన్నారుగా డబ్బుతో పనులు సాధించవచ్చునని" సుశీల అడిగినది.

"సాధించవచ్చు. డబ్బు అవసరము లేదు. నేను కొంచెము మానవత్వము మరచిపోతే. నేను బయటపడాలంటే నారాయణగారిని, అతని మిషన్‌తో సహా పట్టించాలి. ఆ పని నేను చెయ్యలేను. సింగుకు మిషన్ ఉండేస్థలం తెలియదు. అవన్నీ ప్రభుత్వం తెలుసుకొని నన్ను బంధిస్తారు. నా తప్పు ఒప్పుకుంటాను. వారే శిక్ష విధించినా అనుభవించటానికి సిద్ధంగా వుంటాను" అన్నాడు నిశ్చింతగా.

"నారాయణగారి విషయంలో అంత ఉదారత చూపే మీకు, మా విషయము పట్టలేదా? నన్ను. రాజాను ఏం చేద్దామని?" ఈసారి ఆమె గొంతు జీరపోయింది.



"సుశీ!" ఆమెను దగ్గరకు తీసుకుని ఫాలభాగం ముద్దు పెట్టుకున్నాడు. "మీ యిద్దరూ నా రెండుకళ్ళు సుశీ! నేను అనుక్షణం మీ గురించే ఆలోచిస్తాను. నువ్వు యిరవై ఏళ్ళు నిండకముందే నూరేళ్ళు అనుభవించే కష్టాలు అనుభవించావు. ఇక నువ్వు హాయిగా ఉండాలి. రాజా భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలి. నాన్నగారు నన్ను విపరీతంగా ప్రేమించారు. నా కొసం ఎన్నో చేశారు. నాకు సుఖజీవితం అలవాటు చేశారు. రాజాను అలా కాదు. మామూలు మనిషిగా పెంచాలి. అందుకే నిన్ను వారించాను గుర్తుందా? రాజా పుట్టినరోజు ఘనంగా చేస్తానన్నావు. వద్దు మన బిడ్డడు కష్టసుఖాలు తెలుసుకొంటూ ప్రపంచాన్ని అర్థంచేసుకుని, ఆడంబరాలకు బానిసుడు కాకుండా పెరగాలి. నా విషయంలో ఏమీ దాచుకోలేదు. నీకు తోస్తే అలాచెప్పు. చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను. ఆలోచించి రేపు మాట్లాడుదాము? రాజా కదులుతున్నాడు చూడు." సుశీల లేచివెళ్ళి రాజా దోమతెర సరిజేసి వచ్చినది.

"నేను కోరేదల్లా ఒక్కటేనండి.... మీరు ఆ వలయంనుండి బయటపడాలి. మీ మీదికి కేసురాకుండా చూచుకోండి." అన్నది ప్రతిమాలుతూ.

"చూద్దాం. ప్రభుత్వము అన్ని విషయాలు సేకరించిననాడు శిక్ష అనుభవించక తప్పదు.... నీకూ, రాజాకు ఏలోటు రాకుండా చూస్తాను. నారాయణగారు ముందుగానే జాగ్రత్త వహించితే, ఎంత విషూరమైనా చూస్తాను కాని అతనికి సహాకరించను."

సుశీల ఏమో చెప్పబోయి మాని వేసింది.

"చెప్పు సుశీ! ఏవిషయములోనూ సందేహమువద్దు. నీకు వాగ్దానం చేస్తాను." ఆమె ముంగురులు సవరిస్తూ అడిగాడు.

"మీ పరిస్థితి యిలా ఉంది.... నాకేమో మన రాజాకు చెల్లెలో తమ్ముడో పుట్టబోతున్నారు."

"నిజం .... దొంగా! చెప్పవేం....తమ్ముడో అంటావేం-చెల్లెలే కావాలి." ఆమెను దగ్గరకు లాక్కున్నాడు. నువ్వేం దిగులు పెట్టుకో వద్దు సుశీ! మనిద్దరి గత జీవితాలు యింత కంటే గడ్డుగానే గడిచినాయి. ఇప్పుడు కష్టసుఖాలు చెప్పుకోవడానికి ఒకరి కొకరముఉన్నాము. బ్రతుకు మీద ఆశలు కల్పించటానికి మన పిల్లలుంటారు, జీవితములో యిదే చాలా కష్టతరమైన మలుపు. ఆ తరువాత అంతా నిశ్చింతగా ఉంటాము. నా మనస్సాక్షి చెప్తోంది. ఒక్క విషయము—నువ్వు సంతోషంగా ఉంటే నాకెంతో బలము. పొద్దుట నువ్వలా ఆవేదనతో అలమటించి పోతుంటే నేను ఎంత బాధ పడ్డానో, ఎంత పశ్చాత్తాప పడ్డానో...." భర్త నోటికి చెయ్యి అడ్డం పెట్టింది.

"క్షమించండి మీరు అలాటిపనులు చేస్తున్నారంటే సహించలేక పోయాను. మీకు కోపంవస్తే రెండు కొట్టండి. తిట్టండి కాని, మాకు దూరంవెళ్ళానని అనకండి. అది నేనుసహించలేను." అన్నది అతని హృదయముపై తలపెట్టి.

"మీకు దూరముగా నేను మాత్రముండగలనా సుశీ! లేటయింది పడుకో!" అన్నాడు.

ఆమె పడుకుంది. కాని నిద్రపట్టలేదు. అతను మాత్రం నిశ్చింతగా నిదురపోయాడు. ఆమెను ఎన్నో ఆలోచనలు, ఎన్నో సందేహాలు చుట్టుముట్టినాయి....నిదురలోనే ఆమె చుట్టూ చేతులువేసి దగ్గరకు తీసుకున్నాడు. అతని చెయ్యి ఆమెకు కంచుకోటలా అనిపించింది....ఎప్పుడో నిదురపోయింది.

రాజా, సుధీర్ల అల్లరితో మేలుకుంది సుశీల. ఎదుటి బిల్లమీద గడియారము ఎనిమిదిదాటి వెక్కిరించింది. త్వరగా లేచివచ్చింది. సుధీర్ సన్నగా నవ్వాడు. సిగ్గుతో తలవంచుకుని పెరడువైపు వెళ్ళింది.

# 9

"అమ్మా! నిన్ను తెలిసిన దానవనుకోనా, లేక వెర్రిబాగులదానవనుకోనా?" శశి కోపంగా ప్రశ్నించింది.

ప్రసన్న మౌనముగా వింటోంది....దుర్గమ్మ ప్రేమకు జడ వేస్తూ కూర్చుని ఉంది.

"ఏమన్నా అనుకో! యిరవై ఆరేళ్ళు ఎలాగూ పెంచాను, ఇంకా రెండేళ్ళు పెంచటానికేం అభ్యంతరములేదు. ఇల్లు అమ్మినడబ్బుతో కట్నం యిస్తాను. పెద్ద మునసబుసానిలా అది చెప్పినదట. ఇది వచ్చిందట. రెండో సంబంధం! ఇద్దరు పిల్లలున్నారు. నేను యివ్వనుగాక.... యివ్వను! నువ్వూ కన్నావు. నా బాధ నీకు అర్థం అవుతుందిలే" అన్నది ప్రేమ నెత్తిన పోటు పొడుస్తూ.

"నా నెత్తిన ఎందుకే పోటుపొడుస్తావు?" ప్రేమకంయని లేచింది.

"అమ్మా! అక్కయ్యంటే నాకు ప్రేమలేదనా? ఆమె ఓయింటిది కావాలనే నా తాపత్రయము. మొగపిల్లలు ఎట్లా తిరిగినా ఎవరూ ఆక్షేపించరు. వెంకట్ గురించి సంపత్ గురించి ఎవరూ పట్టించుకోరు. ఆడపిల్లలంటే అందరికి లోకువే. అక్కయ్యకు యిరవై ఆరేళ్ళు దాటాయి. ఇంకా ఎప్పుడు చేస్తావు పెళ్ళి? అప్పుడు అక్కయ్యకి ఈమెకు తగిన వరుడు దొరకవద్దా?" శశి ప్రశ్నించింది.

"మహా చెప్పొచ్చావు. అందరూ తమ పిల్లల పెళ్ళిళ్ళు సరయిన వయసు చెప్పే చేస్తున్నారుటే? ఇరవై రెండు అంటాను. నేను కోరిన విధంగానే దాని పెళ్ళి చేస్తాను. పోతే పోయింది. పాతికవేలు కట్నం యిస్తాను. కనకదుర్గమ్మ ఊరమ్మడు పోయిందా? పేరమ్మడు పోయిందా? నీకు ఘనముగానే చేయాలని కలలు కన్నాను. నా బంగారుతల్లిని నెత్తి మీదికి తెచ్చుకుంటిని. మర్యాదకు పాటుపడి, నిన్ను ఆ ముసలాడికి ధార పోసాను."

"గతం త్రవ్వితే లాభంఏమిటమ్మా? నాదెలాగో అయింది. అతనికి ముప్పై-ముప్పై రెండు కంటే ఎక్కువ లేవట. స్కూల్లో అక్కయ్యను లాతడవలు చూచాడట ఆస్తిపాస్తులున్నాయి. పిల్లలుంటే ఏమయిందే? న్ని జరిగినా నీకు కనువిప్పు కాకపోవటము ఆశ్చర్యంగానే ఉంది. వెర్రి ప్రేమతో మా జీవితాలు పాడుజేశావు."

"ఏమిటే వాగావు? మళ్ళా అను ఆ మాట. వెర్రిప్రేమా నాది? ు జీవితాలు నేనేం జేశానే! కళ్ళు నెత్తికి వచ్చి యిష్టమొచ్చినట్టు తిరిగి యిప్పుడు నన్నంటావు?"

"అమ్మా! అరుపులెందుకే....బయట జీతగాళ్ళు వాళ్ళంటారు. కటికి రెండు కల్పించి ప్రచారం చేస్తారు." ప్రసన్న నెమ్మదిగా జవాబు ప్పింది.

"నువ్వా నన్నే అంటావేమే! అది ఎంతెంత మాటలంటున్నదో ాడు. నా పిల్లలు రాజాల్లా పెరుగుతారని. ఆయనను కూడా లెక్క య్యక మిమ్మల్ని నెత్తిన పెట్టుకున్నాను. కొండ మీద కోతికావాలన్నా చ్చి యిచ్చాను." ఆమె ఏడ్పు మొదలు పెట్టింది.

"ఈ యింట్లో ఏడ్పు చవకై పోయింది. కొండమీది కోతినిచ్చే. మ్మల్ని కోతులను చేశావు మొన్నటికి మొన్న. బ్యాంకులోంచి డబ్బు



తీసి పెద్దన్నయ్య కెందు కిచ్చినట్టు? ఇదివరకే కొంప గుండమయి పోయి నది. నగలు, నాణ్యాలు నాశనం చేశాడు...."

"కావాలంటే అందరినీ అడుగు....వాడెంత మారిపోయినట్టు కనిపించాడో? చక్కగా యింటి పట్టునే ఉండి వ్యవసాయము పనులు చూచుకున్నాడు. బాధ్యతగా తిరిగినాడు. ఇంజను అయితే వ్యవసాయం సాగిస్తాను. రెండింతలు పంట పండిస్తాను అంటే నిజమేననుకున్నాను. నాకేం తెలుసు యింత మోసమని....పరాయి వాడయితే ఏమోఅనొచ్చు.... స్వంత కొడుకు. కాదని ఎట్లా అంటాను? నా రాతలే బాగలేదే తల్లీ! మీ అందరిచేత పడే దినము వచ్చింది."

"ఇదొక గోల....అదికాదే! ఉన్న యిల్లమ్మి అక్కయ్యకు కట్నం యిచ్చి రేపు ప్రేమను, వేణును ఏం చేద్దామని." శశి ఈ సారి మంచిగా అడిగింది.

"ఏదో ఒకటి అవుతుందిలే: నీకు అక్కయ్యమీద అంత ప్రేముంటే ఓ పని చెయ్యరాదుటే?"

"ఏం చెయ్యాలో చెప్పమ్మా? నాకు చాతనయినదయితే తప్పక చేస్తాను."

"చాతకాని పనేం కాదులే! మీ మారుటికొడుకు బావమరిది చక్కగా ఉన్నాడు. ఇంజనీరో ఏదో చేస్తున్నాడు. మీ ఆయనను వెంట బెట్టుకొని వెళ్ళి ఆ సంబంధము మాట్లాడు."

"అమ్మా! వాళ్ళ విషయము నీకు తెలియదు. లక్ష రూపాయల కట్నం. వేరే లాంఛనాల మీదున్నారు. ఆ అబ్బాయే ఎన్నోసార్లు తిట్టుకోగా చూచినాను. వారి పద్ధతులే వేరమ్మా!"

"వాళ్ళకు అర్హత ఉన్నది. అడుగుతారు పిల్లను చూస్తే వాళ్ళ ఉద్దేశాలు మార్చుకుంటారు."

"అక్కయ్య కంటే అందమైన అమ్మాయినే చూచారమ్మా!

ప్రతి అమ్మాయికి ఏదో ఒక వొంక పెట్టటము. వద్దనటము ఏ మాత్రము అవకాశమున్నా, నేను నా శాయశక్తులా ప్రయత్నించేదానను. అమ్మా! అలాంటివారు ఊరికే చేసుకుంటామన్నా అక్కయ్యను ఇవ్వకూడదు."

"పోపే పెద్దకబుర్లు.... ఈ వెంకట్ వెధవ మూలానగాని లేకుంటే చలపతి మామయ్యను ఒప్పించక పోదునా? చూద్దాము దాని అదృష్ట మెలా ఉందో...." దుర్గమ్మ ఆశగా చూచింది,

"అమ్మా! నేను చెప్పేది చెప్పాను. నీ యిష్టం. అక్కయ్య చిన్న పిల్ల కాదు. అందరూ ఆలోచించండి. మన విషయాలే కాక ముందు మన వెనక వారి జీవితాలు కూడా చూడాలిగా! చిన్నప్పుడే ఆలోచనలు అభి మానాలు లేక అంతా.... తారుమారు చేసుకున్నాము" విసురుగా చెప్పి లేచింది. శశి.

వేణు పాపను తీసుకొని వచ్చాడు. "చక్కగా కబుర్లు చెపుతోంది పాప వెళతాను అక్కయ్యా."

శశి వెనకాలే ప్రసన్న వెళ్ళింది పాపను ముద్దిడుతున్నది.

"శశీ! అమ్మ మాటలు పట్టించుకోకు. కోపం తెచ్చుకోకు - ఆమెది ఒక విధమైన తత్వము, ఇక మారదు. మనం నిందించి ఆమెనింకా గాయపరచవద్దు. అతను నన్నిష్టపడితే వివాహానికి ఒప్పుకో! నాకిష్టమే. బయటివారు నిన్నేకాదు. నన్నూ సూటిపోటి మాటలలో అనవల్సినవన్నీ అంటున్నారు. నేను భరించి ఊరుకుంటున్నాను. సిగ్గు విడిచి నాకు పెళ్ళి చెయ్య అమ్మా! అని ఈ పరిస్థితులలో యెలా అడగను? మనం యెన్నో అనుకుంటాం అన్నీ కావు. ముసలివాడితో నువ్వు కాపరం చెయ్యటం లేదా?" నిట్టూర్చింది. ప్రసన్న.

శశి ఆపుకోలేని దుఃఖంతో వచ్చి అక్క భుజంపై తలవాల్చి ఏడ్చింది.

"అక్కా! నువ్వు బాధతో ఈ నిర్ణయానికి రావద్దు. బాగా ఆలో



చించు? నన్ను ఉదాహరణగా తీసుకోకు. పగవారికి కూడా నావంటి జీవితం వద్దు. నేను గుడ్డిగా ప్రవర్తించినందుకు నాన్నను లెక్కచెయ్య నందుకు ఫలితం అనుభవిస్తున్నాను. నీ జీవితం సుఖప్రదం కావాలని నా వాంఛ" శశి కన్నీరు వత్తింది.

"ఛ. ఊరుకో చెల్లీ. నేను మునుపటి ప్రసన్నని కాను. జీవితం అనేకమైనపాఠాలు నేర్పినది. అహంకారము, అభిమానము, అతిశయమూ అన్నీ నశించాయి. నేను మామూలు స్త్రీని. నేను హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాను, అతనిని చూడవలసిన అవసరంలేదు. అన్ని విష యాలు నువ్వు మాట్లాడు. వచ్చే ఏడు ప్రేమ హైస్కూలు చదువు అయి పోతుంది. దాని విషయం చూడాలి" అన్నది.

"దాని విషయం తరువాత ఆలోచించవచ్చు. మరి నేను అన్నీ మాట్లాడినాక. అమ్మ పేచి పెడుతుందేమో...." కారులో కూర్చుని అడి గింది.

"మరేం ఫరవాలేదు. అమ్మ పేచీలకు భయపడే నాన్నగారు తనను తాను చంపుకున్నారు. నేను నచ్చచెప్తాను."

కారు కదలిపోయింది. ప్రసన్న భారంగా షెడ్డులోకి వెళ్ళింది. ఆమెకు తన నిర్ణయము సమంజసముగానే తోచిందే కాని తప్పుగా అని పించలేదు.

"ఏమిటే. అది అక్కడ నూరిపోస్తూంది" దుర్గమ్మ అడిగింది.

"నేనేం పసిదాననా అమ్మా! అది చెప్పింది సమంజసమే ననిపిం చింది. ఒప్పుకున్నాను."

"ఏమిటే. నేనున్నాని మరిచిపోయావా!" కోపంగా మీదికి వచ్చిం దామె.

"అమ్మా! నువ్వున్నావు! ఇంట్లో ఉంటావు నా విషయము నీకేం

తెలుసా? ఇంట్లో పొరపాటు ఒకరిదయినా శిక్ష అందరూ అనుభవించాలి.... నా ఎదుట మంచిగా పలకరించినవారే నా వెనుక... చూడు—ఆ వెళ్తోందే ఆవిడ చిన్న పిల్లలా జెం వ్రేలాడేసుకుని వస్తుంది. ఏం భాగవతమో ఏమో. చెల్లెలికి పెళ్ళయి ఓ అమ్మాయి కూడా ఉంది. ఇంకా ఈవిడకు కాలేదు." అని ఒకరంటే. ఆ కాలేజీలో చదివిందటగా? ప్రేమ వ్యవహారమేమోలే అని మరొకరు. ఇంకా నీచాతి నీచంగా అంటారు. నేను పేరంటాలకు పోవడము మాని ఎన్ని రోజులు అయింది? ఈ జీవచ్ఛవమైన బ్రతుకు కంటే, ఎక్కడో ప్రశాంతంగా చావటము నయముకదూ! మరో రెండేళ్ళలో ప్రేమ పెళ్ళి కెదుగుతుంది. దాని పెళ్ళికి నేను ఆటంకముగా వుండరాదు." అని అవతలికి పోయింది.

"మీయిష్టం? తల్లి అద్దాలనాటి బిడ్డలు గనకనా! నాకోరిక ఏది తీర్చారని భగవంతుడు....తమ్ముడిని ముద్దుగా పెంచి, పెళ్ళి చేద్దామంటే వాడో కులంలేనిదాన్ని తెచ్చుకునే. పిల్లలో పీట చెక్కలో అంటే వాడో దాన్ని కట్టుకునే. వీడు ఊరుమీద తిరుగుతూ గడిపే. ఆడపిల్లను అయినింటి కిచ్చి నల్గురు మెచ్చుకునేటట్టు చేద్దామంటే దాని రాతట్లా ఏడ్చింది. దీని రాత యిట్లా తుడిచింది." అని కళ్ళు వత్తుకుంది.

వేణు పరుగెత్తుకొచ్చాడు. "అమ్మా! చిన్నన్నయ్య ఉత్తరమే!" అని తెచ్చినాడు.

ఆత్రంగా అందుకుని విప్పింది...."పెళ్ళికో రోగం. అమ్మకు ఇంగ్లీషు రాదని తెలియదూ? అక్కయ్యను యిలా పిలువు."

వేణు వెళ్ళి ప్రసన్నను పిలుచుకువచ్చాడు. ఉత్తరం యిచ్చింది. "చిన్నన్నయ్య వ్రాశాడు? అతనికి అక్కడ విసుగెత్తిందట! ఇక్కడికి వస్తున్నాడట? ఇక్కడే ఉంటానని వ్రాశాడమ్మా!" అన్నది.

"ఇన్నాళ్ళకు జ్ఞాపకం వచ్చామా? పోనీలే. వాడికైనా మంచిబుద్ధి పుట్టింది. అదేచాలు యిల్లు కిలకిలలాడుతుంది." ఆ రోజు యింట్లో అందరూ



సంతోషించారు. రెండవరోజే వేయిరూపాయలు అప్పు తెప్పించి మరో [illegible]ద్దు వేయించడం ప్రారంభించింది.

అందరూ ఆనందంతో ఎదురు చూచినరోజు రానేవచ్చింది. సంపత్ కుమార్—ఇరువురు పుత్రికలతో, భార్యతో యిల్లు చేరాడు. వారూహించి నట్లు అతని భార్య పంజాబి దుస్తులు వేసుకోలేదు. మామూలుగా చీరకట్టి, జడవేసుకొంది. పిల్లలకుమాత్రం లిప్‌స్టిక్ వేసింది. అందరికో హిందీలో కలుపుగోలుతనంగా మాట్లాడింది. సంపత్ తండ్రి మరణానికి. అన్నగారి ప్రవర్తనకు విచారించాడు. రెండు మూడు రోజులు ఒకరి గొడవలు ఒకరు చెప్పుకుంటూ గడిపారు. నాలుగోరోజు తను వచ్చిన విషయము మెల్లగా బయట పెట్టాడు. సంపత్.

"అమ్మా ఏం ఉద్యోగం యెన్ని రూపాయలు వచ్చినా భోజనానికి చాలవు. వ్యవసాయం చేద్దామని అనుకుంటున్నాను. కొత్త పద్ధతులు మొదలు పెడితే చక్కని పంట వస్తుంది."

"నేను వద్దన్నానుట్రా నాయనా! నువ్వు వచ్చి యింటిపట్టున ఉంటానంటే ఎంత సంతోషమైందని. చెయ్యి! నువ్వు తినగా నల్గురికి పెడితే చూచి ఆనందిస్తాను. ఈ యిల్లు నీ కొరకని అప్పటికప్పుడు వేయించాను" అన్నది సంబరంగా.

వాలెట్ తీసి వెయ్యిరూపాయలు తల్లి చేతిలో పెట్టాడు.

"యెందుకురా? మాటవరసకన్నానుగాని" తీసుకోలేదామె.

"ఉంచమ్మా. మరేంఫరవాలేదు. వ్యవసాయం ప్రారంభించేముందు కొన్ని విషయాలే మనము నిక్కచ్చిగా మాట్లాడుకోవాలి. నాకుగొడవలు యిష్టంలేవు" అన్నాడు.

"నీతో గొడవపడేది యెవరురా?" అన్నది ఆశ్చర్యంగా.

"నీకుండదమ్మా! రేపు అన్నయ్య వస్తాడు. రెండుసంవత్సరాలలో వేణు యెదిగివస్తాడు. అప్పుడు లేనిపోని గొడవలు రావటం బాగుండదు.

ఇప్పుడే ఎవరిది వారికి ప్రత్యేకించితే బావుంటుంది. అలా అవి పంచుకున టం లేదు. అదికాక పట్టణంలో యిల్లుకూడా మూడుభాగాలు చేసి. యెవరికి వచ్చే అద్దెలు వారు వసూలు చేసుకోవచ్చు. నేను మాత్రం నా క్రిందే ఉంచుకుంటాను. అవి జరిగితీరాలి" అని లేచాడు.

"అది కాదురా! పొలం యెవరిది వారు ప్రత్యేకించుకోండి. కాని మేడ సంగతి వదలివేయండి. యిద్దరు ఆడపిల్లలున్నారు నే నున్నాను. నా తదనంతరం మీ ఇష్టం."

"అదేం మాటమ్మా! ఆడపిల్లల విషయము మేము చూడమూ! నీవు మాకు పరాయిదానివా? నాన్నగారంటే యేదో అర్ధంగాని భావాలతో అలమటించేవారు. నీవు అన్నీ తెలిసినదానవు. అట్లామాట్లాడితే యెట్లా?"

దుర్గమ్మ పొంగిపోయింది. ఇన్నాళ్ళకు తన కొడుకైనా తన తెలివి తేటలను మెచ్చుకున్నాడు. ఒప్పి తన ఇష్టం తెలియజేసింది. సంపత్ కుమార్ సంతోషముగా వెళ్ళిపోయాడు. ప్రసన్న వచ్చి తన తల్లి వద్ద కూర్చున్నది.

"అమ్మా! బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చావా?" అన్నది. దుర్గమ్మకు కూతురిమాటలు రుచించలేదు. అయిష్టంగా జవాబు చెప్పింది.

"ఇందులో ఆలోచించవల్సిందేమున్నదే? ఏనాటికయినా వాళ్ళదే కదా?"

"వాళ్ళది కాదని యెవరన్నారు? నా విషయం నిర్ణయమైపోయిందనుకో. రేపు యింకా చిన్న పిల్లలున్నారు. వారి విషయమేమిటి? ఇప్పుడే ఈ పంపకాలెందుకు? ఈయనది ఈయన చూచుకుంటే రేపు పెద్దన్న వచ్చి తనవాటా అమ్ముకుంటాడు" అన్నది.

"అన్నీ అయ్యబుద్ధులు సరమంత్రాన నీ కెలా అబ్బినాయే?" మండిపడింది.

"ఆ అయ్యబుద్ధులు మొదటినుండి వుంటే బాగుపడే వారమే.



పంపకాలు లేక వ్యవసాయం చేస్తే వచ్చిన నష్టం ఏమిటి? అన్నిటికీ ఇలా తొందరపడొద్దమ్మా."

"చాల్లేవే గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట. నా యిష్టం నాది. నా కడుపున పుట్టిన నీకే నాలక్ష్యం లేనప్పుడు, నీమాట నేనెందుకు వినాలి? వాడేం పసివాడు కాదు. దేశం తిరిగివచ్చిన వాడు చదివిన పిల్లట యెంత ప్రేమ. అణుకువో చూడు."

సరే, చెప్పేదేదో చెప్పాను. నీ ఇష్టం. యింత ప్రేమ నాన్నగారు మరణించినపుడు ఏమయిందో? ఆ మహానుభావుడు ఎవరితో చెప్పుకోలేదు గాని వీరికై యెంత తపించిపోయారో! ఒక్కసారి రాలేదేం!" అని నిల దీసింది.

"అది వాడిష్టం" విసురుగా చెప్పి వెళ్ళిపోయింది. ప్రేమ దాదాను వెంటబెట్టుకుని వచ్చింది.

"ఏం దాదా అందరూ బావున్నారా?" ప్రసన్న వదనతో యెదురు వెళ్ళింది

"అంతా బావున్నారమ్మా. బాబుగారు కోర్టులో కేసు గెలిచారు. ఈ పళ్ళు మిఠాయి యిచ్చి మిమ్మల్ని చూచిరమ్మని సుశీలమ్మ పంపింది" పళ్ళున్నబుట్ట మిఠాయి పొట్లాలు తెచ్చి పెట్టాడు. "అన్నీ పంపుతుంది తనెందుకురాదు?" అని అడిగింది ప్రసన్న.

"మీకు తెలియనిదేముందమ్మా. ఒక్కనాడు చెప్పలేదు" దుర్గమ్మ అసహనంగా చూచింది. ఆమెను లెక్కచెయ్యనట్టే దాదాను గౌరవించి పంపివేసింది ప్రసన్న.

# 10

"మొండితనం చెయ్యకు శశీ! నీ కూతురు జీవితం నాశన మవుతుంది. శంకర్ హెచ్చరించాడు" శశి అసహ్యముగా చూచింది అతనివైపు. "ఇది బజారు అయింది. ఏ మయితే అయిందని నాల్గు అంటించేవాడాన్ని. సిగ్గులేదూ? నా దగ్గర చిల్లిగవ్వకూడా లేదు చెప్పుకో. పో" అన్నది.

"ఏమిటి అంత ధీమా! నాల్గురోజులు గడువిస్తున్నాను."

"ఒక్క క్షణంకూడా వద్దు చెప్పుకో పో. రోజూ నీతో చచ్చేకన్నా ఒక్కనాడు ఆయనతో నిజంచెప్పి చస్తాను. వెళ్ళు నా కళ్ళముందునుండి" శశి గర్జింపులువిని వెళ్ళిపోయాడు శంకర్. కొట్టు విడిచి, వచ్చి కారులో కూర్చుంది. ఆ యింట్లో ఆమెపట్ల సానుభూతి చూపేవాడు ఆమె మారుటి కుమారుడే. అతనికే నిజంచెప్పదలచింది. ఆ రోజు కోడలు స్నేహితురాండ్రతో సినిమాకువెళ్ళింది. కూతురు యెవరినో కలవాలంటూ వెళ్ళిపోయింది. ముసలాయన ఇవాళ మంచంలోనుండి లేవటంలేదు. కాఫీ తీసుకుని అతని గదిలోకి వెళ్ళింది.

"మీరుతెచ్చినా రేమిటిపిన్నీ? వంటావిడ రాలేదేమో?" అన్నాడు.

"పరవాలేదు. అబ్బాయిగారూ! మీతో కొంచెం మాట్లాడాలి" అన్నది సందేహిస్తూ.

"చెప్పు పిన్నీ! యెటనా వెళ్ళాలా? డబ్బు కావాలా?"



"అదేం కాదు. నా విషయం. మీకు తీరికగా ఉందా?" ఉందని తలూపినాడు శశి అతని యెదురుగా కూర్చుని దాపరికం లేకుండా తన కథనుంతా చెప్పింది. అప్పటికే కన్నీటితో ఆమెబుగ్గలు తడిసిపోయాయి. అతను చలనం లేనట్టే కూర్చున్నాడు.

"తెలిసీ-తెలియని వయస్సులో కళ్ళు మూసుకుని ప్రవర్తించిన దానికి ఫలితం జీవితాంతం వెంటాడుతుందని అనుకోలేదు. మీరు దయతో పాప కిచ్చింది ఉంచితే సరే సరి—లేదా, దానిని ఏ అనాథాశ్రమంలోనో చేర్పిస్తాను. వాడిబాధ పడలేను. మీరు సహృదయులని గ్రహించి మీకే చెప్పుకొని, గుండెలపై కుంపటి దించుకోవాలనిపించింది."

ఆమె హృదయం దూది పింజలా అయింది. అతను తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు ముడిపడిన అతని కనుబొమ్మలే చెప్తున్నాయి.

"పిన్నీ పూర్తిగా ఊహించకపోయినా బంధుజనం గుస-గుసలు, పాప పుట్టుక అనుమానాలకు గురిచేసింది. పాప నాన్నకు జన్మించినది కాదని తెలుసు. కాని ఒక్క విషయంలో మిమ్ము అభినందిస్తున్నాను నిజాన్ని నిర్భయంగా చెప్పారు. అస్తులు-ఆడంబరాలు శాశ్వతం కావు. అందుకు మీ కుటుంబమే నిదర్శనం. నాకున్నది చాలు. పాపది ఏ పరిస్థితులలోను ఎవరూ తీసుకోలేరు. శంకర్ వస్తే నేను మాట్లాడుతాను. మీజీవితం యిలా ఐనందుకు చాలా బాధగా ఉంది." అన్నాడు పచార్లుచేస్తూ.

"స్వయంకృతాపరాధం అబ్బాయిగారూ! ఎవరూ ఏమీ చెయ్యలేరు. మీరు ఈ మాత్రం అభిమానం చూపితేచాలు." అన్నది కళ్ళు తుడుచుకుంటూ.

"ఆ విషయంలో నా సానుభూతి ఉంది, కాని సహాయం చెయ్యలేను. నిశ్చింతగా ఉండు. శంకర్ వస్తే చక్కగా బుద్ధిచెప్పి పంపుతాను."

కృతజ్ఞతతో ఆమె కళ్ళు మెరిశాయి. అతని పాదాలు అంటబోయింది.

"ఛ. అదేం పని.... లేవండి ప్లీజ్!" అతను ఆమెను లేవనెత్తాడు.

ఆ క్షణంలో కోడలి గర్జింపు వినబడింది. "ఎన్నాళ్ళనుండి సాగుతోంది నాటకం? అందుకేనా.... అతి పెద్దమనిషి తరహాగా నేను ఎక్కడికి వెళ్తానన్నా వద్దనరు. అంత ప్రేమున్నవారు దానితోనే ఉండొద్దా! ఛీ-ఛీ!" అంటోంది.

ఇద్దరూ అదిరిపడ్డారు. శశి తలపై పిడుగుపడింది. ఒక భారం దించుకోగానే రెండవభారం నెత్తిన కూలింది.

"మాట్లాడరేం? మంచి సమయంలో పట్టు పడినామనా!...." హుంకరించింది కోడలు.

"నోరు ముయ్యి. మంచి చెడూ ఏమీ లేదా? ఎవరూ ఏ దొంగతనం చెయ్యలేదు. నీకు పట్టుపడనూ లేదు. మానవత్వంమరిచిపోయి మాట్లాడకు" అతను హూంకరించాడు.

శశి కోడలి చేతులు పట్టుకుంది "చూడమ్మా! నేను నీలాంటి స్త్రీనే .... అంతదారుణమైన నింద వేయవద్దు. నా బాధలు, నావారి కష్టాలు అబ్బాయిగారితో చెప్పాను. అంతకంటే మరేం లేదు. పాపపైన ఒట్టు" అని వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళిన దిక్కే అసహ్యంగా చూసింది. భర్త వంకకు తిరిగింది. "ఆమె భుజాలు ప్రేమతో పట్టుకోవటం దారుణం కాదా? ఎంత ...ంగనాచిలా ఒట్టు వేస్తోంది. మీరు యింత నీచానికి దిగుతారా?..." అన్నది ఏడుపు గొంతుతో.

"ఎవరూ నీచానికి దిగలేదు! నీవే నీచంగా ఊహించుకుంటున్నావు. ... భాగ్యలేదు తన కష్టాలు చెప్పుకుంది. సానుభూతి చూపాను. ఆమాత్రం సానుభూతి కూడా ఎవరి వద్దా లభించలేదేమో! నా పాదాలు అంటబోయింది. వారించాను. అనుమానాలు ఎన్నో అనర్థాలకు దారి తీస్తాయి." అని అతను వెళ్ళిపోయాడు!



ఆమె తనకోపం అంతా చెప్పుమీద చూపించుతూ, వాటిని దూరంగా విసిరికొట్టింది.

శశికి కొత్త సమస్య ఎదురయింది. కోడలు సూటి-పోటి మాటలతో అవకాశం దొరికినప్పుడల్లా దెప్పుతోంది. మాటకు మాటని లాభం లేదని ఊరుకుంటోంది. కోడలు మరీ రెచ్చిపోతోంది. తప్పు లేనివారు ఎవరూ నోరుమూసుకోరని ఆమె భావన. ఆరోజు ఆదివారం. ప్రొద్దుటే కాఫీ త్రాగి పేపరు తిరగేస్తూ కూర్చున్నాడు అతను.

"అబ్బాయిగారూ! ఎవరో వచ్చారు. మిమ్మునైనా, నాన్నగారిని గాని చూడాలంటున్నాడు." డ్రైవరు వచ్చి చెప్పాడు.

"నాన్నగారు లేవటం లేదు. నేను మాట్లాడుతాను. రమ్మను."

డ్రైవరు వెళ్ళి అతన్ని వెంట బెట్టుకొని వచ్చాడు.

"కూర్చోండి." అబ్బాయిగారు సోఫా చూపించాడు.

అతను కూర్చున్నాడు.

"నన్ను శంకర్ అంటారండి. మీతో కొన్ని విషయాలు మాట్లాడుదామని వచ్చాను."

"అట్లాగా .... అయితే ఒక్క అయిదు నిమిషాలు ఆగండి" అబ్బాయిగారు ప్రక్కగదిలోకి వెళ్ళి మళ్ళీ వచ్చాడు. "రండి గదిలోకి వెళ్దాము." ఇరువురూ గదిలోకి వెళ్ళారు. "కూర్చోండి. ఇప్పుడు చెప్పండి." అన్నాడు.

అతను కాలరు సవరించుకొన్నా, "మీ కుటుంబం చాలా సాంప్రదాయమైనది. మీరు పెద్ద ఉద్యోగం చేస్తున్నారని విన్నాను. మీ చెల్లాయిని లండన్ పంపించారట. ఇవన్నీ విన్నాక. మీ దగ్గరకు వచ్చి నిజం చెప్పవలెనని తలచాను."

"ఏ విషయంలోనండీ?" ఏమీ తెలియనట్టు అడిగారు.

"మీ పిన్ని విషయంలో'....అదే మీ నాన్నగారు మళ్ళీ పెళ్ళి చేసుకున్నారే....ఆ అమ్మాయి మంచిది కాదు. పెళ్ళికి ముందే ఓ యువకుడితో తిరిగి, అతన్ని మోసం చేసి, గర్భవతి కాగానే మీనాన్నగారిని చేసుకుంది. ఆ పాప మీ పాప కాదు." అన్నాడు.

"ఈ విషయాలన్నీ మీకెలా తెలుసునండీ?" యింకా అమాయకంగా ప్రశ్నించాడు.

"నాకా....తెలిశాయి. వారి కుటుంబమంతా నాకు తెలుసు. వీళ్ళక్కా పెళ్ళి యింకా కాలేదు."

"ఆమె పెళ్ళి గురించి మీకు బాధ దేనికి? మీరు చెప్పే విషయాలు ఆధారంగా లేనివి."

"మీరు అలా అంటే నేను ఏం చెప్పగలను? ఆ అమ్మాయి ప్రేమించిన యువకుడు నా స్నేహితుడండి వాడే యివన్నీ చెప్పాడు. వాడికి పుట్టిన అమ్మాయిట పాప."

"మరి అయితే యిన్నాళ్ళు ఎందుకు ఊరుకున్నాడు? పాప తన కూతురని చెప్పి తీసుకెళ్ళి పోవచ్చుగా?"

"అవును—పెద్ద కుటుంబాన్ని బజారున పెట్టడం దేనికని ఊరుకున్నాడు."

"ఇప్పుడు మా కుటుంబం చిన్నదయినదా? ఇప్పుడు చెప్పడం దేనికి?

"ఇన్నాళ్ళు నా స్నేహితుడికి డబ్బుయిచ్చి చెప్పవద్దని బ్రతిమాలిందట మీ పిన్ని."

"ఇప్పుడు డబ్బు లేదన్నదా?"

"అంతే అయి ఉంటుంది."

"చూడు మిస్టర్! మావి గౌరవ ప్రదమైన కుటుంబాలు. ఇలాంటివి



సహించలేము. మా పిన్నిని వెళ్ళగొట్టలేము. మీ స్నేహితుడిని పిలుచుకు రండి. ఒకేసారి పాతికవేలు యిస్తాం.

"నిజంగా?" అతని ముఖం విప్పారింది. "చూడండి. మీ పేరు నాకు తెలియదుగాని, మీరు ఉదారులు. మా స్నేహితుడు ఎవరూ లేడండి. నేనే పాప తండ్రిని. మీలాంటి పెద్దలసంగతి తెలుసు. మర్యాద కొరకై ఏమయినా చేస్తారు. పాతిక వేలు యిస్తే మళ్ళీ ఈ ఛాయలకు రాను. ఇప్పుడే ఇస్తారా" అబ్బాయిలేచి టెలిఫోను దిక్కు నడిచాడు.

"ఫోను యెవరికండీ?" అర్థం కానట్టు చూచాడు.

"పోలీసులకు శంకర్ గారూ. బ్లాక్ మెయిల్ నేరం క్రింద నిన్ను అరెస్టు చేయిస్తాను. అదిగో ఆ మూల నున్న టేప్ రికార్డర్, దానిలో మన సంభాషణంతా రికార్డు అయింది. మీరే అన్నారు శంకర్ మా మర్యాద కాపాడుకోవడానికి ఏమైనా చేస్తామని. అదే చేస్తాను. వంద రూపాయలు పారేస్తే నిన్ను పులుసులోకి ముక్కలే లేకుండా చేసేయోధులున్నారు. అమాయకులయిన అమ్మాయిలను మోసం చేస్తావా? హెచ్చరిక చేస్తున్నాను. మళ్ళీ పిచ్చివేషాలు వేస్తే నీ ఉద్యోగం ఊడగొట్టి, పేకాట ఆడేప్పుడు పోలీసులకు పట్టించి, అత్తవారింటికి పంపుతాను జాగ్రత్త!" శంకర్ తిరిగి చూడకుండా వడివడిగా వెళ్ళిపోయాడు.

"ఏమండీ! శేషు సుశీల యింట్లో అక్కయ్య పెండ్లి వెళ్దామా?" శశి చలపతిని అడిగినది. అతను విసుగ్గా చూచాడు.

"నువ్వు రోజూ తిరుగుతున్నావుగా! వెళ్ళు నాకేం చాతగాదు." అన్నాడు.

"అవునే నీకు అబ్బాయితో మంతనాలేమిటే? కోడలు ఒక్కటే ఏడుస్తోంది ఒళ్ళు జాగ్రత్త!" వణుకుతూ హెచ్చరించాడు. మేడదిగి వచ్చింది. కోడలికి స్వయంగా చెప్పకపోతే ఏమనుకుంటుందో! నెమ్మదిగా ఆమె గదిలోకి వెళ్ళింది.

"మీ అబ్బాయిగారు లేరు." అన్నది కోడలు.

"అబ్బాయికోసం కాదు. రేపు అక్కయ్య వివాహము మీరురావాలి" అన్నది.

"నే నెందుకు? ఆప్తులు వస్తారులే." అన్నది. ఆమెకు నచ్చచెప్పి వాదించటం కష్టమని వెళ్ళిపోయింది.

ప్రసన్న వివాహానికి యెక్కువమంది బంధువులు లేరు. దుర్గమ్మ తనకు పట్టనట్టే ఓమూల ముఖం మాడ్చుకొని కూర్చుంది. సంపత్ కుమార్ భార్యతో విచ్చేసినాడు. అతనివైపు బంధువులు కూడా యెక్కువ రాలేదు. శశి. ఆమె మారుటి కుమారుడు వచ్చారు. ప్రసన్నను పెళ్ళికూతురిని చేశారు.

"నువ్వు అదృష్టవంతురాలివే అక్కయ్యా! కన్యాదానం చెయ్యటానికి అన్నయ్య ఉన్నాడు. రెండో సంబంధమని మనము చెప్పితేగాని ఎవరూ తెలుసుకోలేరు. చిన్నవాడు అందగాడు" అక్కకుతిలకం పెడుతూ అన్నది శశి. సుశీల పళ్ళబుట్టల్తో వచ్చింది.

"బరువు మనిషివి. యెవరిచేతన్నా పట్టించుకురాకుడదే" శశి మందలించింది.

పెళ్ళిమండపంలోకే వచ్చాడు పెళ్ళి కొడుకు. అతని బంధువులు రెండుకార్లలో దిగినారు. శశి వారికి మర్యాదలు చేస్తోంది. సుధీర్ పెళ్ళికుమారునికి ఎదురేగినాడు.

"ఏరా! ప్రయాణం సుఖంగా జరిగిందా?" ఆప్యాయంగా పెళ్ళికొడుకు చేతులు పట్టుకున్నాడు.

"బహు దూరభారం! ఏ ప్రసన్నా నువ్వేనా! ఒరేయ్ సుధీర్! పెళ్ళివారంతా అంతే మీ వైపువారు నన్నుచూచి దిమ్మెపోతారు చూడు" అన్నాడు నవ్వుతూ.



"యెందుకురా! శశి చూచిందిగా? సంపత్ చూచాడు. వాళ్ళు దిమ్మకాలేదు."

"వాళ్ళు కాలేదు కాని...." అంటూ అతనే దిమ్మెపోయాడు. అతని వాలకం అర్థంకాక సుధీర్ అతను చూపిన దిక్కు చూచాడు. అక్కడేం విచిత్రంలేదు. సుశీల రాజాను యెత్తుకొని వస్తోంది.

"అందరిని దిమ్మచేస్తానంటూ నువ్వే దిమ్మెపోతా వేమిటిరా?"

"ఆ వచ్చే ఆమెను చేపట్టిన అదృష్టవంతుడెవరో?" సుశీలను చూపాడు.

"నీ హాస్యం మండిపోను. మా ఆవిడరా....సుశీ! యితను నా బి. ఏ. క్లాసుమేట్" సుశీల నమస్కరించినది.

"మిమ్మల్ని యెక్కడో చూచినట్టుందండీ" అన్నది ఆమె.

"మీరు నన్ను మరిచిపోయినా, మీ దీనమైన చూపులను నేనెప్పుడూ మరిచి పోలేనండీ. ఉమాపతిగారింటికి పెళ్ళి కొడుకునై వచ్చినాను గుర్తున్నదా!"

"ఏమండి....భలే చిత్రము. ప్రసన్న వదినను చూచింది. వీరేనండి" ఈ సారి సుధీర్ తెల్లబోయినాడు. సంపత్ ఆత్రంగా వచ్చినాడు. "రండి! ముహూర్తపు వేళ కొచ్చికూడా ముచ్చట్లు పెడితే ఎలా?" అందరూ పందిట్లోకి వెళ్ళినారు. వివాహ భోజనాలు ముగిసినాయి. మొగపెళ్ళివారి వైపునుండి వచ్చిన వారందరూ వెళ్ళిపోయారు. పెళ్ళికుమారుని తల్లి దుర్గమ్మ దగ్గరకు వచ్చింది. "ప్రాప్తం ఉంది. తప్పించుకోలేక పోయాము. ఎలా ఉండే దానిని యెలా అయిపోయావు వదినా?" దుర్గమ్మ కంట తడిపెట్టింది.

"బావగారు భలేవారే. నాకు చెప్పలేదు. అప్పుడు నేను చూడలేదు కదూ?" శశి వచ్చింది. పనిఉందని సంపత్ కుమార్ కూడా వెళ్ళిపోయాడు.

ప్రసన్న గంభీరంగా ఉంది. ఆమె యెందు కంత ముభావంగా

ఉందో ఎవరికీ అర్థంకాలేదు. "వదినా! యెందుకమ్మా ముఖం అలా పెట్టావు అన్నయ్య హడలిపోతారు" సుశీల హాస్యమాడినా ప్రసన్న మాట్లాడలేదు.

గదిలో అడుగు పెట్టినవధువును చిరునవ్వుతో స్వాగతం పలికాడు వరుడు అనంత్. ఆమె ఏమీ మాట్లాడలేదు తలెత్తి చూడనయినా లేదు కిటికీ దగ్గరకు వెళ్ళి నిల్చుంది అతను ఆమె వెనుకాలే వెళ్ళి భుజాలపై చేతులు వేసి "పేరు ప్రసన్న అయినా, ముఖం అప్రసన్నముగా నున్నది ఏలకో?" పరిహాసంగా అన్నాడు.

ఆమె కొంచెం దూరం జరిగి, అతని వంక నిదానంగా చూచింది.

"మీరు పదిమందిలో తాళిగట్టి తెచ్చుకున్నారు. నేను యెక్కడికి వెళ్ళిపోను గాని ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పండి" అన్నది నిలవేసినట్టే. అతను వెళ్ళి మంచం చివర కూర్చున్నాడు

"వంద ప్రశ్నలకు జవాబు చెప్తాను నిలబడే ఓపిక మాత్రంలేదు. నువ్వూ ఇలా వచ్చి కూర్చుంటే సంతోషిస్తాను" అన్నాడు. తన ప్రక్కన చోటుచూపుతూ వచ్చికూర్చోమని.

"ఏ మడుగుతావో అడుగు" అన్నాడు దిండుకు చేరబడుతూ.

"మొదట నచ్చని నేను యిప్పు డెలా నచ్చాను? నాపై జాలి కల [illegible]?" సూటిగా ఉంది ప్రశ్న.

"ప్రసన్నా! మొదట నువ్వు నచ్చలేదని యెవరన్నారు? గుడ్డివాడు అంటాడా మాట...."

"పొగడ్తలు అక్కరలెదు. అప్పుడు తిరస్కరించటంలోని అర్థం?"

"అప్పుడు నువ్వు నచ్చావు. నువ్వు సూటిగా అడిగినావు కాబట్టి సూటిగా జవాబు చెప్పుతున్నాను. నీ ప్రవర్తన. మీ ఇంటితీరు నచ్చలేదు. స్వయాన తమ్మునికూతురివి దిక్కులేదని చెప్పే మీ అమ్మగారి మాటతీరు నచ్చలేదు. నా కెప్పుడు క్లబ్బులూ, సొసైటీలు, వాటిని ఆరాధించే స్త్రీలంటే పెద్ద అభిప్రాయములేదు. అనాడు మీయింటివారి మాటల తీరునుబట్టి నువ్వు



ఆ రకానికి చెందిన స్త్రీవని అనుకున్నాను. అదీగాక అతి దీనముగా చూచే సుశీల కళ్ళు నన్ను ఆకటుకున్నాయి. ఆమెను చేసుకోవాలనుకున్నాను. మీ వాళ్ళు అంగీకరించలేదు. అమ్మ ఆత్రమువలన యింకో యువతిని పెళ్ళాడాను. ఆమెఆరోగ్యం అప్పటికే దిగజారింది. కొన్నిమధురక్షణాలకు ఫలితంగా యిద్దరుపాపలు పుట్టారు. ఆమె మరణించింది. జీవితంపై ఒక రకమైన వైరాగ్యం కలిగింది. అమ్మ, బంధువులు పోరుతున్నా ఊరుకున్నాను. ఒక స్నేహితునితో వ్యాపారంగురించి చర్చించటానికి వచ్చాను. అతను స్కూలులో పనిఉందని మీ స్కూలుకు వచ్చాము అక్కడ పరిపూర్ణముగా స్త్రీత్వము నింపుకుని నువ్వు దర్శనమిచ్చావు. ఆడంబరం, అతిశయం లేని సాదా దుస్తులతో కనిపించావు. "యెవరు? యెక్కడో చూచినట్టుంది." అని మీ హెడ్ మిస్ట్రెస్‌ను అడిగినాను. మీ విషయాలు అన్నీ చెప్పింది. నిన్ను గురించి చాలా పొగిడింది. యెలాగైనా నిన్ను నాదానిగా చేసుకోవాలని తలచాను. నేరుగా మీ యింటికి వస్తే మీ అమ్మగారు అంగీకరించరు. ఆలోచిస్తుండగా, ఒక రోజు సుధీర ....మీ సుశీల భర్త, ఆమె భర్తని తెలియదు. అతనువచ్చి, మాటవరుసలో వివాహ ప్రస్తావన యెత్తినాడు. తనకు తెలిసినో అమ్మాయి ఉందని మీ వివరాలు చెప్పాడు. ఇంకేం వెతుకబోయిన తీగె కాలికితగిలినట్టు అయింది అంతే" అని దమ్ముతీసుకున్నాడు.

"శశితో మీరు పూర్తివివరాలు యెందుకు చెప్పలేదు."

"అందులో పెద్ద విశేషం ఏమీలేదు. ఊర్కెనే అందరిని ఆశ్చర్య పరచాలని" యిరువురూ కొన్ని క్షణాలు మాట్లాడలేదు. "ఇంకా కోపము పోలేదా!" ఆమె చెయ్యి పట్టుకొని అడిగాడు.

"కోపము దేనికి? ఉన్నమాట చెప్పారు" అన్నది తలవంచుకొని అతనామె చుబుకంపట్టి యెత్తినాడు. "అలా పొడిగా జవాబు యివ్వవద్దు ప్రసన్నా. నన్ను చూడకుండా యెలా ఒప్పుకున్నావు?" అని దగ్గరగా తీసుకున్నాడు. అతని భుజంమీద తలఆన్చి నెమ్మదిగా చెప్పింది.

"...మిమ్మల్ని మొదటిసారి చూడగానే నావారుకావాలనుకున్నాను. మిమ్మల్ని తప్ప మరొకరిని చేసుకోవద్దని అనుకున్నాను. వారం రోజుల య్యాక అమ్మ నిజంచెప్పక. మీకు ఏదో ఒకవంక పెట్టేది. నేనుచాలాబాధపడే దాన్ని. మరొక సంబంధం చూస్తానంటే యెదురు చెప్ప లేక ఏడ్చేదాన్ని. మా పరిస్థితులు తారుమారు అయ్యాయి. పెళ్ళిప్రసక్తి వాయిదా పడింది. నలుగురు నానారకాలుగా విమర్శిస్తుంటే హృదయం శూన్యమై పోయింది. యెవరో ఒకరు ఈ విమర్శలకు దూరంచేస్తే బావుండునని అనుకునేదాన్ని. అప్పుడే శశి చెప్పితే ఒప్పుకున్నాను...."

"పోనీ. ఇప్పుడు యిష్టమేనా?" ముఖంతనవైపుకు తిప్పుకున్నాడు. ఆమె తల చేతులలో దాచుకుంది.

"ఛ....ఏం ప్రశ్న?" అంది. అతను నవ్వుతూ ఆమెచేతులు విడదీశాడు.

"బావుంది. ఒక్క ప్రశ్న అంటూ విలదీసి అడగొచ్చుగాని నేను అడిగితే జవాబుచెప్పవా? ప్రసన్నా ఒక విషయం నేను యెప్పుడూ తిరుగుతూ ఉంటాను, ఇక మనము నీది, నాది అని భేదముంచరాదు. పిల్లలు నీ పిల్లలుగానే పెంచు" అన్నాడు.

"ప్రయత్నిస్తాను. మీరు నాపై నమ్మకముంచితే చాలు" అన్నది.

"నమ్మకమేమిటి? యికనుండి అన్నీ నువ్వే చూచుకోవాలి" అతని ఒడిలో తలపెట్టి అతను చెప్పేది విన్నది.

సుశీలకు కూతురు పుట్టిన సంతోషం లేకుండా పోయింది. సుధీర్ అరెస్టు అయినట్టు వార్త అందింది. అలాంటి సమయము యెప్పుడో వస్తుందని ఆశించిన వారు కాబట్టి యెక్కువగా దుఃఖించలేదు. పెద్ద అక్షరాలతో పేపరులో వేశారు. "అంతా అబద్ధం నా బాబు అలాంటివాడు కాదు." అని దాదా పేపరు నేలకేసి కొట్టాడు. అనంద్. ప్రసన్నలు వచ్చి సుశీలను ఓదార్చారు. అనంద్ మంచి ప్లీడర్ని మాట్లాడాడు. భోరున



ఏడ్చే భార్యను ఓదార్చాడు కోర్టులో కలుసుకున్నప్పుడు సుధీర్. అతను నిశ్చింతగా. నిర్విచారంగా వున్నాడు. నారాయణ చెప్పేదానిని బట్టి సుధీర్ నిర్దోషిత్వము నిరూపించబడుతుందని ప్లీడరు చెప్పాడు. దీని కంతకు కారణము సుధీర్ బాబాయేనని తెలిసినది. "ఏమంటా రన్నయ్యా! నారాయణ నిజం ఒప్పుకుంటాడంటారా?" బేలగా చూచినది సుశీల.

"ఏమవుతుందో చూద్దాము అన్నింటికీ ఆ భగవంతుడే ఉన్నాడు. మన ప్రయత్నము మనము చేద్దాము." ఓదార్చాడు ఆనంద్.

కనకదుర్గమ్మ పనిగట్టుకుని ప్రసన్నని చూడటానికి వచ్చింది. "మీ యింటికి వెళ్ళితే సువ్విక్కడున్నావని తెలిసింది. మీ కోసము అర్థమైన కొంపలన్నీ తిరుగవలసి వస్తుందే తల్లి" అన్నది కూర్చుంటూ. "పరాయి వారెవరమ్మా." ప్రసన్న అడ్డుపడింది. సుశీల హృదయం చివుక్కు మన్నది. వినన్నట్టే ఊరుకుంది. ఓ యబ్బదో! నంబడం! యంతున్నది అంతున్నది, జమీందార్లు అంటే యేమో అనుకున్నాను. దొంగనోట్ల వ్యాపారమా? పైకి యెంత ఘరానా మనిషిలాగున్నాడే తల్లీ!"

"అమ్మా? సుశీల వింటుంది దానికోనమైనా ఊరుకోవే."

వింటే విననీ నా కోసం అదేం చేసిందని దాని కోసం నేనూరుకుంటానే?" కనకదుర్గమ్మ గొంతు హెచ్చుతుందేగాని తగ్గటం లేదు. ప్రసన్న దారి గానక సంభాషణ వేరొక దిక్కు మళ్ళించినది. "అమ్మా! సంపత్ భార్యను తీసుకుని వేరు పోయాడట నిజమేనా?" అని తమ్ముడు యింటి విషయాలు అడిగింది.

"ఏం చేస్తాడు. వంగనాచి నాతల్లి. మాట పలకనట్లే, నోరువిప్ప నట్టే ఉంటుంది అది చేసింది."

"మనవాడు మంచి వాడయితే అదేం చేసిందే? మందిని అనటం దేనికి?"

"బుద్ధి తక్కువై అన్నానే. పీడు చీలికలు పెట్టాడు. వాడు తన పంటూ వచ్చిన మూడో భాగం కోమటి రంగనాథానికి తాకట్టు పెట్టినాడు. యెంత చెడి అమ్ముకున్నా యెకరం మూడువేలు చేస్తుంది. పది యెకరాల పొలం వెయ్యిరూపాయలకు పెట్టినాడు." ఉస్సురన్నది.

"మరి నేను అనాడే చెప్పలేదుటే. వాళ్ళు చెప్పగానే తబ్బిబ్బిబ్బయిపోతావు. వాడు పాడుగావటమేగాక ఆస్తిని పాడుజేస్తున్నాడు. నువ్విచ్చిన అలుపేనే అమ్మా."

"ఇప్పే యిచ్చాను లెద్దూ. వాడిట వాడు తాకట్టు పెట్టుకున్నాడు. మీ ముల్లె యెవరిదన్నానా?"

"మాటాడితే అలా వారిని వెనుకేసు కొస్తావు. మొన్న వారికి సినిమాలో యెవరో క్రిష్టియను అమ్మాయితో కలిశాడట. నాకాబోయే భార్య అంటూ పరిచయం చేశాడట."

"చేస్తాడు. వాడిష్టమే, ఈ కాలములో అడముండలే బరి తెగించి పోతున్నారు. దారిలో కలిసినవాడు దొంగయినా ఖూని కోరయినా ఎర్రగా బుర్రగా సూటు, బూటు వేసుకుంటే చాలు. వెంటబడిపోయి చేసుకొంగా లేనిది మొగ మహారాజు వాడికేమిటే?" అన్నది.

"మన ఏడుపు మన మేడువక. మంది గురించి నీకెందుకు?" ప్రసన్న కోపంగా అన్నది.

"నీ చిర్రు బుర్రు లెందుకే! కడుపు తీపి చూచి పోదామని ఈ కొంపకొచ్చాను. ఈ దొంగల కొంపలో నాకేం పనే. పిల్లదాని పరీక్ష కూడాను" కొందరి స్వభావము విచిత్రము. యెదుటివారు నోరు మూసుకుంటే మరీ రెచ్చిపోతారు. మరి కొందరు ప్రత్యుత్తరము లభించకపోగానే మాట్లాడం ఆపి వేస్తారు. దుర్గమ్మ మొదటి రకానికి చెందిన మనిషి. సుశీలను నానామాటలని చిన్న బుచ్చాలనే ఆమె తాపత్రయము. ఒక్క విషయము మరిచి పోయినది. సుశీల మూందటి వ్య



ప్రాణమిచ్చే భర్తా. ప్రేమించే పిల్లలూ. సంఘములో గౌరవము సంపాదించి పెట్టే డబ్బు ఉన్న వ్యక్తి. దుర్గమ్మ వెటకారాలు భరించే ఓపిక లేదు. సుశీల చిర్రున వారున్నచోటికి వచ్చినది. 'అత్తయ్యా! యెదుటి వ్యక్తిని దూషించే ముందు మన అర్హతలు కూడా కొంత తెలుసుకుంటే మంచిది. మేముదొంగలము, దోపిడి దార్లము. చాలునా! ఒక్క విషయము మరిచి పోతున్నావు. దొంగతనము చేసిన నీ కుమారునికి శిక్ష పడకుండా రక్షించినది మా వారు. మరోసారి పేకాట వద్ద తన్నుకుని పోలీసుల పరమైతే విడిపించినది మావారు. అయనది పెద్దబుద్ధి. ఒక్కమాటయినా చెప్పలేదు. ఒకరోజు నీ కుమారుడు బయట కనిపించి మా వారికికృతజ్ఞత చెప్పుతుంటే తెల్సింది. మేము మంచివారము కాము మీరు రావద్దు. మాట్లాడితే మనుషుల్ని చులకన చేయడము మనసుల్ని బాధ పెట్టడం అంతకంటే మరేందాదు. నీ యింటి కొచ్చినవాడు యిష్ట మొచ్చినన్ని మాటలనా?...."

"యెంత దానవయ్యావే? నీ యింటి కొచ్చాననేగా నీ దెప్పుడు పెద్దదాన్ని. పెంచినదాన్ని అనే గౌరవమయినా ఉన్నదా? అందుకేకాలం యిలా మండి పోతుందమ్మా!"

"పెద్దదానవు. పెద్దరికము ఏనాడయినా నిలబెట్టుకున్నావు? అంటే కోపంగాని అత్తయ్యా నన్ను నీవు పెంచావా? నా తల్లిదండ్రుల ఆస్తి పెట్టి దర్జాగా నీ పిల్లల్ని పోషించుకున్నావు. దిక్కులేని పక్షికన్నా అధ్వాన్నంగా చూచావు. ఎవరులేక మాయింట్లో ఉన్న దాదాను మావారు గౌరవిస్తారు. దాసీజనంకన్నా అన్యాయముగా చూచిన నీవు పెంచినావని యెలా అనగలుగుతున్నావు? అమ్మాయి నిస్తేనేచాలు. కానీ కట్నం వద్దని చెప్పించినాడు. దయదలచి పెండ్లి చేశావుకదా? పాపం! మేనత్తవుగా నన్నో బొమ్మను చేసి ఆడించావు. నీ మాటలతో, నీచేష్టలతో అలసిపోయి, వారి నీడన స్వాతంత్ర్యం పొందాను. వారిని ఒక్కమాటన్నా

సహించలేను గుర్తుంచుకోండి" ప్రసన్నకు ఈ మాటలు వినడానికి కష్టముగా ఉన్నాయి. తల్లి తత్వము తెలిసితను సహించగలదు. సుశీలకేంపని!

"ప్రసూ! నీకు చెవులు వినిపించటములేదే? అది మెడబట్టి గెంటే వరకు ఉంటావే? కులగోత్రములేదని ఉచితంగా పెట్టా పెడతారు. దెప్పాదెప్పుతారు. నా ఖర్మకాని నీవెళ్ళి ఈ కొంపలో అయింది. పట్టుకుంటే పోలీసులు నా పిల్లాడినే పట్టుకున్నారు. దీని మొగుడిని యెవడు విడి పించమన్నాడో!"

"అమ్మా? ఏమిటే గొడవ ఒకరింటికి వచ్చి మాటలు అనటం ఏంబావుండదు" దుర్గమ్మ యింతెత్తున లేచింది చేతులు జాడిస్తూ "కూటికి లేక వచ్చానాగుడ్డకు లేకా? నీకు సిగ్గులేకుంటే నాకులేదా. కుంటిదో గుడ్డిదో నాబిడ్డ నాకుంది" నంచిపట్టుకుని బయలుదేరింది. అటువంటి తరుణములో వాదించి లాభములేదని తల్లి వెనుక రోడ్డువరకు వెళ్ళి రిక్షామాట్లాడి పంపి వేసినది ప్రసన్న. సుశీల ముందు పిల్లల్ని పెట్టుకుని ఏడుస్తున్నది.

"ఏమిటె సుశీ! అమ్మగుణము తెలియనిదా? క్రొత్తగా విన్నట్టు బాధపడతావేం?"

"బాధపడత? కొన్నాళ్ళు కోపంఉన్నా. కొన్నాళ్ళకు మారిపోతారు. నేనేం అపకారంచేశాను?నన్ను చూడగానే అలా మారిపోతుంది. అత్తయ్య" ఏంజవాబు చెప్తుంది ప్రసన్న? సాయంత్రం కోర్టునుంచి ఆనందు వచ్చాడు. "ఈరోజు విశేషము ఏమీ లేదమ్మా నారాయణ జీవితమే చర్చించబడినది. యింకా కేసు అసలు పాయింటుకు రాలేదు"

"నిజమే గాని జామీనుపై వారిని విడి పించేందుకు వీలు లేదా అన్నయ్యా?"

"ఇప్పుడు లాభంలేదమ్మా. మొదటే విడిపించాలంటే సుధీర్ ఒప్పుకోలేదు. నేను వెళ్తాను. అమ్మకు జ్వరంగా ఉంది." ఆనంద్ లేచాడు.



ఫరవాలేదు. వదిన్ని తీసుకెళ్ళండి పిల్లలు ఆమె యెలా ఉంటారు."

"వద్దమ్మా నువ్వు ఒంటరిగా యెలా ఉంటావు?" ఆనంద్ వెళ్ళబోయాడు.

"వదినను తీసుకెళ్ళండి. నాకేం ఫరవాలేదు. పిల్లలను పనిమనిషి చూస్తుంది. పెద్దదిక్కు దాదా ఉండనే ఉన్నాడు. ఇంకే అవసరము వచ్చినా. చేయూత నిచ్చే వారు చాలా మంది ఉన్నారు. వారికి ప్రాణాలు కూడా యిస్తారు." అన్నది. తల్లి మాటలవల్ల గాయపడ్డ సుశీల మనసు వంటిగా వారిని కారువరకూ సాగనంపి వచ్చి దిండులో తల దూర్చింది. చల్లని స్పర్శకు తల యెత్తినది. దాదా పిలుచినాడు "ఊరుకో తల్లీ! నీ వలా ఏడుస్తుంటే రాజాబాబు దిక్కు మొహం వేశాడు. బాబుగారికేం ఫరవాలేదు. వారు నేను యెరిగినంత వరకు యితరులకు సహాయం చేశారు తప్ప అన్యాయం చెయ్యలేదు." అతని చేతులుపట్టుని "నిజమా దాదా?" అన్నది ఆశగా. నిజమే తల్లీ నా బాబుగుణం నాకు తెలియదూ?' ఊరటకలిగింది. లోకం చూచిన వృద్ధుని మాటలు నిజమని నమ్మినది.

శశికి అన్నీ ఉన్నాయి. మనశ్శాంతే లేదు. యెప్పుడూ 'ఏయ్! యెక్కడున్నావే' అనే చలపతి పిలుపులతో విసిగిపోతుంది. అతను నిదుర పోయాక విశ్రాంతికని యివతలికివస్తే కోడలి సూటీ పోటీ మాటలు ఆమె యింట్లోవాళ్ళ రేపు క్లబ్బులన్నీ మామకుని భర్తకు కాపలా కాస్తోంది. ఆ రోజు లేస్తుండగానే చలపతి అరుపులు వినిపించినాయి శశి కళ్ళు నులుపుకుంటూ వెళ్ళింది. "అంత మొద్దు నిదురపోతపోతే మొగుడున్నాడనే జ్ఞానం ఉందటే నీకు? రాత్రి కూరలు రుచిగా తగులబడి రెండు ముద్దలు యెక్కువతిన్నాను..ఒకటే యెదలో రోద. వాంతులవుతున్నాయి. అలా గుడ్లప్పగించి చూడకపోతే .... బేసిన్ పట్రారాదు." బేసిన్ తెచ్చింది. తిన్నదంతా వాంతి చేసుకున్నాడు. అది పని మనిషిచేత

తీయించింది. ప్రక్కబట్టలన్నీ పాడయినాయి. ఆతన్ని పనిమనిషి సాయంతో కుర్చీలో కూర్చుండబెట్టింది బట్టలు తీసి వేరే బట్టలు వరుస్తుండగా, కనకదుర్గమ్మ గదిలోకి వచ్చింది. "ఒంట్లో బావుండలేదా మామయ్యా?" అడిగి కుర్చీ లాక్కుని కూర్చున్నది.

"ఏం బాగోనే! నా మెడలువంచి పెళ్ళిచేశావు. మహా సుఖపడిపోతున్నాను...."

"చాల్లే! సిగ్గులేకుంటే సరి. కాటికి కాళ్ళుచాపి కల్యాణ మంటపము యెక్కింది చాలక పైగా మాటలు! నీతో నేను సుఖపడిపోయినట్టు? యే జన్మరుణమో తీర్చుకుంటున్నాను. ఒక్క పనిమనిషి పట్టుమని పదిరోజులుండదు? యే హాస్పిటల్లోనో చేర్పిస్తే పీడపోతుంది." శశినుండి వచ్చింది ఈ జవాబు. మునలతనికి మండిపోయింది. లక్షాధికారి తను ఆస్పత్రిలో చేరుతాడా? కేకలు మొదలు పెట్టాడు. "వేషాలు యెక్కువయినాయి. నేను ఆస్పత్రిలో ఉంటే హాయిగా కొడుకుతో కులుకుదామని నీ ఉద్దేశ్యం. పాపిష్టిదానా! సిగ్గులేదూ? వాడంటే మొగుడే! నువ్వు అడముండవు...."

"ఊఁ అంటే నోరు వేసుకుంటావు. బుద్ధి సిగ్గు నీ కుండాలి. నా గొంతు కోశావు."

"ఇప్పటికయినా పోవే నీ వుండి యెవడిని ఉద్ధరిస్తున్నావు...." దుర్గమ్మ అడ్డుకుని కూతురినే మందలించింది." "ఏమిటే! పెద్దవాడు అంటే నువ్వు అరిగిపోయావా? ఈ కాలపు పిల్లలే అంత మామయ్యా పిచ్చిపిల్ల బయట నరదాగా తిరిగే వాళ్ళను చూస్తే బాధకదూ?"

"యెంత నంగనాచిలా చెప్తున్నావే. నేను నీ యింటికి నీ బిడ్డను యివ్వమని వచ్చానుటే? దిక్కులేనిది పిల్ల ఉంది. పెళ్ళి పేరుతో యింట్లో పెట్టుకుని సేవచేయించుకో అన్నావు. ఈ రంగసానిని అంటగట్టావు. యెప్పుడన్నా మంచిగా పలుకరిస్తుందా?"

"మన సంబరానికి సరసము ఒక్కటే తక్కువయింది. ముద్దుగా



పలుకరించాలిట. వయసుకు తగ్గ పనులా? రాత్రి చెప్తూనే ఉన్నాను. అరగదండి అని. తినడం యిప్పుడిలా నానామాటలు అనడము." విసుక్కుంటూ పడక దగ్గరకు తీసుకెళ్ళింది శశి. అతను అసహాయుడయి పడుకున్నాడు. "ఈ పూటయినా కాస్తంత నిమ్మరసం తీసుకుంటే ఉద్ధరించినట్టే.' శశి క్రిందకు వచ్చింది. బట్టలు పిండుతూ పనిమనిషి ఒకటే తిట్టుకుంటోంది.... "పాడుపని....వెధవకంపు డబ్బుకు గడ్డితింటామా! పడుచు పెళ్ళాం ఉరికితే పోలా? ఖర్మ?...." శశికి తెలుసు. తనేమన్నా అంటే రెండవ రోజే పని మానేస్తుంది అందరి ఫలహారాలు అయినాయి. పాలలో నిమ్మరసము వేసి, విరిగిన పాలను వడగట్టి, ఆ నీళ్ళు తీసుకుని పైకి వెళ్ళింది శశి. "త్రాగండి." అతను దానివంక అసహ్యంగా చూచినాడు. గ్లాసు అందుకోనే లేదు "ఏమే? కట్‌లెట్ చేశారట కదా? యెక్కువ వద్దు రెండు పట్టుకురా" అన్నాడు మెల్లగా. "అవి మీకు జీర్ణముకావు. రెండు రోజులు పోయాక చేసి పెడతానులే" అన్నది. అతను నానా తిట్లూ తిడుతూ ఆ పూట అభోజనంగా ఉన్నాడు. ఆరోగ్యానికి మంచిదని ఊరుకున్నాడు.

మధ్యాహ్నము కొడుకు భోజనానికి వచ్చాడు. కోడలు వంటచేసి వెళ్ళిపోయిందని విసుక్కుంటూ కూర, చారు అన్నం బల్లమీద పెట్టి వడ్డించ సాగింది. శశి చిప్స్, పచ్చడి తెచ్చి పెట్టి వెళ్ళిపోయింది. పైనుండి ముసలాయన అరుపులు వినిపిస్తున్నాయి.

"ఏమిటి పిన్ని నాన్నగారు భోజనం చెయ్యలేదా?"

"రాత్రే యెక్కువ తీసుకోమంటే తిడుతున్నారు" జవాబు చెప్పి వనేట యింట్లోకి వెళ్ళింది.

"పెద్ద వయసులో జిహ్వాచాపల్యము యెక్కువ అవుతుందిలా వుంది పాపం. ఊరికే అవిడను విసిగిస్తాడు." సానుభూతి చూపినాడా యువకుడు.

"పాపం! మీకే బాధగా ఉన్నట్టున్నదే. పనులు మాని తండ్రిగారి సేవ చెయ్యరాదుటండి."

"ఆ రోజు వస్తుందిలే. పాప కనిపించదేం? అన్నం తిన్నదా?"

"అన్నం యెందుకు తినదు? అందరి ముందే మేస్తుంది. అమ్మమ్మ దగ్గర పడుకుందేమో!"

"నెయ్యి లేదేం? వంటమనిషి త్వరగా పోయిందేమిటి?" కోడలు లేచి నెయ్యి తీసుకు వచ్చింది.

"మీకు వడ్డించాలని మీ పిన్నికి ఉంటుంది కాబోలు. అందుకేమూడు రోజులకోసారి వంటమనిషిని త్వరగా పంపించివేస్తుంది. అవిడను మొదట మీకే యివ్వాలనుకున్నారట కదా!" "అప్పుడప్పు నీకు లేని పోనివి యెలా తోస్తాయి? పిచ్చిమాటలు యెవన్నారుట నాకిస్తామని? నీ ఊహాగానాలకో నమస్కారం. భోజనం చెయ్యనియ్యి" విసుక్కున్నాడు.

"నామాటంటే విసుగుదేనికి! నేను ఊహించలేదు. ఊర్కే అనటం లేదు. మిపిన్ని అమ్మగారేస్వయంగా చెప్పినారు. మాటిమాటికి మిమ్మల్ని చూచి ఆవిడ నిట్టూరుస్తున్నది అడిగాను" శశి అన్నీ వింటోంది. పట్టలేని కోపముతో తల్లిగదిలోకి వెళ్ళింది. అప్పటికే దుర్గమ్మ నిదుర పోయింది. అస్తావిస్తం పడుకున్న కూతుర్ని ప్రక్కకు జరిపి పడుకోబెట్టి తను నడుమువాల్చింది. "అమ్మా అయ్యగారు రమ్మంటున్నారు" పనిమనిషి వార్త మోసుకొచ్చింది. లేచి పైకి వెళ్ళింది. "నన్ను చంపాలని ఉంటే యింత విషమివ్వరాదే. కడుపు మాడ్చి యెందుకు చంపుతావు?" మరేమీ మాట్లాడక ఒక వెండి గిన్నెలో మజ్జిగ అన్నం తీసుకు పోయింది. అబగా తిని పడుకున్నాడు.

శశి తిరిగి వచ్చింది. దుర్గమ్మ ఆవలిస్తూ కళ్ళువిప్పింది.

"యింకా పని తెవల్లేదేం" అని అడిగింది.



"అమ్మా పని తెమిలిందిగాని నీకు యింకా యెవరితో యెలా మాట్లాడాలో తెలియలేదే!"

"నేనేంచేశాను? ఏదో ముసలాయన తృప్తి పడతాడని విన్ను మంచలించినట్టు అన్నానుగాని నువ్వంటే నాకు పగటే పిచ్చిపిల్లా!" అన్నది లేచికూర్చుని జుట్టు ముడివేసుకుంటూ.

ఆసంగతి కాదమ్మా. నన్ను మా అబ్బాయిగారికే యివ్వాలని అనుకున్నాం. అని అన్నావుటగా? ఆవిడసలే అనుమానపు మనిషి. ఏమేమో ఊహించుకున్నది."

"ఏనమ్మా అంటూ ఆవిడకు చెప్పానులే. మనసుండబట్టలేక నాలో నేను అనుకున్నాను."

"కొన్నిమాటలు జాగ్రత్తగా మాట్లాడాలమ్మా. చిన్నప్పుడు యెంత స్వతంత్రముగా హాయిగా తిరిగానో యిప్పుడంత బానిసగా మారిపోయాను. అను క్షణము అందరికి భయపడి తిరగాలి. నా బ్రతుకిలా అవుతుందని ఏనాడూ అనుకోలేదు." శశి కంట తడిబెట్టింది.

అంటే ఏడుస్తావుగాని శశీ ఉపాయంగా పనులు చేసుకోవటం తెలియదు. చేసేపనులు గుట్టుగా చేయాలి. అందరికీ తెలిసేలా చేస్తారా?" దుర్గమ్మ గుసగుసలాడింది.

"అమ్మా ఏమిటి నువ్వంటున్నది. ఆ ముసలాడి మాటలునమ్మి అనుమానిస్తున్నావా?"

"యెందుకే అంత వులికిపాటు! నిప్పులేనిదే పొగరాజదు. దుర్గమ్మ అంటే నిప్పులాంటి మనిషి అని పేరుగాంచినది. నా కడుపున చిచ్చుబెట్టినావు. నా పేరు మంటకలిపినావు. ఏమీ వినట్టు ఊరుకున్నాను. నువ్వూ తప్పు కారం తింటున్న మనిషివే. ప్రపంచంలో యెందరులేరు."

"అమ్మా నేను చెడ్డదాన్నే కావచ్చు. నీ వనుకున్నంత మాత్రం

కాదు, నా కిప్పుడే ఆశలు లేవు. పుణ్య ఫలమో, పాపఫలమో నాకు ఒక పాప వుంది. అదే మొగపిల్లవాడయితే బాధ లేకపోను. నాలుగిళ్ళు దోచినా తనపొట్ట తాను పోషించుకునేవాడే. అది ఆడపిల్ల. ఈవిషయంలో విధాత ఏదో చిన్నచూపు చూచినది నన్ను. దానికోసం నలుగురిలో తిరుగుతూ బ్రతుకుతున్నాను." ఈ సారి [illegible]ంగా ఏడ్చింది.

దుర్గమ్మ కూతుర్ని నమ్మలేకపోయింది. అదికాక మారుటి తల్లికి పుట్టిన పిల్లలంటేనే అసహ్యించుకోవడం చూసింది. అబ్బాయిగారు పాపను చాలా ప్రేమగా యెత్తుకుంటాడు. ఆ పిల్లతో కబుర్లుచెబుతాడు. అదంతా ఆ పిల్లమీద ప్రేమనే అంటే ఎవరూ నమ్మరు. శశిగుణము తెల్సిన తా నెలా నమ్ముతుంది? అతను రాకుంటే భోజనం పంపాలని భార్య మరిచిపోయినా, శశి మరిచిపోదు? దాని కర్థం ఏమిటి? ప్రపంచమును ఒక వైపునుండే చూచే దుర్గమ్మ అభిమానాలకు అర్థంచేసుకోదు. తన గతి జీవితము విని అసహ్యించుకోక సానుభూతితో అర్థ చేసుకుని. ఆదరించిన యువకుడంటే భక్తి భావమని ఆమెకెలా తెలుస్తుంది? పాపను చూడగానే ఆమె జన్మగుర్తుకు తెచ్చుకుని, జాలిప ప్రేమయానంలో ప్రదర్శిస్తున్నాడని ఎలా అర్థం అవుతుంది? మనషులు మలినపరుచుకొని. మమతలను మత్యపెట్టి, ముసుగతో సాగించడమే మన లక్ష్యము అయినప్పుడు సత్యము అసత్యముగా నిజము నటనగా కనిపిస్తుంది. అది దుర్గమ్మ తప్పుకూడా కాదు. అనాదిగా వస్తున్నఆచారం, ఒకసారి తప్పుచేసిన వ్యక్తి ఒప్పుగా ఏదిచేసినా అది తప్పుగానే కనుపిస్తుంది. పశ్చాత్తాపం. క్షమ అనే పదాలకు అర్థం తెలిసిననాడే మానవుడు మానవోత్తముడగును కాని. క్షమను బలహీనతగా. పశ్చాత్తాపాన్ని నటనగా తీసుకునే మానవుడు దానవుడై కొదలుస్తున్నాడు. నిజమైన మానవుడిని అనుకుంటున్నాడు.

దుర్గమ్మ ఆ కోవకు చెందినదే. క్షమఅంటే ఆమెదృష్టిలో అతి చులకన. కన్న కూతురినే నమ్మలేకపోయింది. ఆమె యెవరినీనమ్మదు. తన యందు తనకే నమ్మకం లేని మనిషి.



చలపతికి మూత్రవ్యాధి క్రొత్తగా ప్రారంభమయింది అరగంటకో దుప్పటి మార్చడం శశికి ప్రాణసంకటమయింది. డాక్టరువచ్చి ఆస్పత్రిలో చేర్పించమని చెప్పాడు. అతనిగదిలో భరించరాని దుర్వాసన మొదలయినది. అబ్బాయిగారు వచ్చిచూచి ఆస్పత్రిలో చేర్పించినారు. దినమంతా శశి దగ్గరుంచి రాత్రి ఇంటికి వచ్చేది. ఆస్పత్రిలో ఉండటము కూడా దుర్భరంగా తయారయింది. ఉదయమే పాలఫ్లాస్కుతో వార్డులో అడుగు పెట్టింది ఒక ఆయా యెదురువచ్చినది.

"ఏమ్మా, మీ నాన్నా. తాతా ఏమవుతాడోగాని ఒకటేగోల పెట్టాడు. డాక్టరొచ్చి నిద్రమాత్రలు యిస్తే నిదరపోయినాడు" అని వార్త అందించినది

శశి హృదయం చివుక్కుమన్నది. భారముగా అడుగులేస్తూ మంచము చేరినది "ఇంటిదగ్గర ఏంమూంచుకుపోయే పనులున్నాయే? రాత్రిళ్ళు గొంతు ఎండుకు పోయినా మంచినీళ్ళు పోసేదిక్కులేదు." చలపతి ఏడుచుకుపడాడు.

"యెంత ఓపికగల కోడలవమ్మా. పెట్టిపుట్టినాడు మహానుభావుడు కొడుకుని చూచానుగా శాంతమూర్తి" ప్రక్క మంచంలో ఉన్న మరో వృద్ధుడు సంబరముగా శశివంక చూచాడు.

అబ్బాయిగారిని. శశిని భార్యా. భర్తలు అనుకున్నాడల్లే ఉంది.

"కోడలా కొరివా? దీనికి మామ, అత్త ఉంటే కాసరం చేస్తుందా? మా [illegible]ంటావిడ బాబూ!"

ప్రక్క బెడ్డుమీద ఉన్నాయన గడగడా నీళ్ళు తాగాడు. శశి వంచిన శిరస్సు పైకి లేవలేక పోయినది. అతనికి ముఖం కడిగించి పాలు తాగించింది. నర్సులు వచ్చి ప్రక్క దులిపి వెళ్ళారు.

పదకొండు గంటలప్పుడు ఓ పెద్ద గుంపు వచ్చింది. వాళ్ళంతా "[illegible] సర్జనులని". అర్థం చేసుకుంది శశి.

"ఏమి తాతా ఈ పూట ఎలావుంది?" వకతను ప్రశ్నించాడు.

"అవకాయతో అన్నం తినాలని ఉందా?" యింకొకతను అడిగాడు.

"ఏమిటా హాస్యం?" ఒకమ్మాయి యిద్దరినీ కొరకొర చూచి ముందుకు వచ్చింది. "ఎలా ఉంది? నిద్ర పట్టకపోతే ఈ టాబ్లెట్లు తెప్పించుకోండి" చీటీ తీసి యిచ్చినది. చలపతి అందరినీ మింగేటట్లు చూచాడు.

"అదిగో అక్కడ మా అవిడుంది యిచ్చెయ్యి" అన్నాడు శశిని చూపుతూ.

ఒకమ్మాయి గుడ్లు వెళ్ళబెట్టి "ఎవరికీ? మీ అమ్మాయికా?" అని అడిగినది.

"కాదు మా ఆవిడకు మీకేం చెవుడా?" కంయ్‌మని లేచాడు.

ఈ లోపల శశి వచ్చి చీటీ అందుకుంది. పదహారు కళ్ళు తనను వింతగా చూడటం భరించలేక తల వంచుకొన్నది. ఆమె వాలకాన్ని చూచి విద్యావతి అని ఎవరూ అనుకోరు. "థర్డుఫారమ్ చదివినా, ఎక్కడో పని చేసి పొటపోషించుకుంటోంది." వారి మాటలు సూదుల్లా గ్రుచ్చుకున్నాయి.

"తల్లి తండ్రులు ఎంత కఠినాత్ములో?" ఇంగ్లీషులో జరుగుతోంది సంభాషణ.

"లేకుండొచ్చు. తల్లి తండ్రులుంటే, ఈ కాటికి కాళ్ళుచాపినా ముసలాడికి ఎలా యిచ్చి చేస్తారు?" యింకొకరు అంటున్నారు.

"ఉన్నా. యివ్వాళ రేపు కట్నాలబాధ భరించలేక యెవడికో యిచ్చి చేతులు కడులుపుకుంటున్నారు. అలాంటి వివాహమే అయి ఉండవచ్చు" యింకొకరి అభిప్రాయం.

"ఈ అమ్మాయి ఏం చిన్నదా చితకదా? వారించవద్దూ. కూలిచేసి అయినా బ్రతుకొచ్చు."

"చెప్పడం తేలికే. చదువుకున్నదో లేదో, అదీగాక చిన్నప్పుడే పెళ్ళి అయిందేమో?"



"ఏమయినా ఇంత అందాల స్త్రీకి ఈ వృద్ధుడా భర్త?" వారు దూరమయి పోయారు. వేరొక మంచమువద్ద ఆగినారు. ప్రక్క మంచముపై నున్నయన తేలికగా ఊపిరి పీల్చాడు.

"పీళ్ళ అమ్మకడుపు చల్లగా ఉండని. యిటు రాలేదు. లేకుంటే ఒకరు నోరు అంటే, రెండో మనిషి ఊపిరిపీల్చు అంటాడాయె. మరొకరు పొట్టనొక్కితే, వేరొకరు కండ్లు తీసిచూస్తారు...." అంత బాధలోను నవ్వుకుంది శశి. మధ్యాహ్నము అబ్బాయిగారు వచ్చి టిఫిన్ యిచ్చాడు. తండ్రిని పలుకరించి మందుల చీటీ తీసుకొని వెళ్ళాడు వెనుకాలే శశి వెళ్ళింది? అతను తిరిగిచూచి ఆగిపోయాడు.

"ఏం పిన్నీ? ఏమన్నా చెబుతావా? పాప బావుంది. వస్తానని గోలచేసింది."

"నాకు అన్నం యే పనిమనిషిచేతితోనో పంపండి. మీరు రావటం దేనికి...." ఇంకెలా చెప్పాలో తెలియలేదు అతను తేలికగా నవ్వాడు.

"నాకేం కష్టంలేదు పిన్నీ. దారియిదేకదా. అన్నం యిచ్చినట్లు ఉంటుంది నాన్నను చూచినట్లూ ఉంటుంది" అన్నాడు.

శశికి నిజం చెప్పక తప్పలేదు. రోజూ అతనే వస్తాడు. అందుకే రెండుముక్కల్లో చెప్పింది.

"చూడండి అబ్బాయిగారూ! మీరు అమృతహృదయులు. అందరినీ అలాగే భావిస్తారు. మీ సానుభూతిని అపార్థం చేసుకుంటోంది లోకం."

"ఓ! ఐసీ! మంచిది పిన్నీ. నా కీవిషయము తోచలేదు" అని త్వరగా వెళ్ళిపోయి. ప్యూన్‌చేత మందులు పంపాడు. ఆమెకు యెంతో బాధగా ఉంది. అన్నము సహించటంలేదు. సాయంత్రం వరకు చలపతి అధి[illegible]పులు బెదిరింపులు విని. చీకటి పడ్డాక ఇల్లు చేరుకుంది. టిఫిన్ క్యా[illegible]ర్ పంపుదగ్గరం పడవేసి. చల్లనీళ్ళతో ముఖం కడుక్కొని, పాపను దగ్గ[illegible] తీసుకొని అన్నీ మరచిపోయింది. పాపచెప్పే కబుర్లు వింటున్న అ[illegible] శశి గొంతు కంచులా వినిపిస్తోంది

"....ఇంట్లో యజమానుల దగ్గరనుండి. పనివారివరకు సానుభూతి చూపేవారే. తేరగా తిని కబుర్లు చెపుతారు...."

నేనేం అన్నానమ్మా! శశమ్మ అన్నమే ముట్టనట్టుంది అన్నాను. ప్రొద్దున కాఫీ తాగి వెళ్ళింది."

"ఆమెకు అన్నం యెందుకు? ఇంటినుండి అన్నం మోసుకు పోయినవారు బజారునుండి చిరుతిండ్లు కొనుక్కుపోరా?"

కుదురుకుంటున్న మనసులో మరో దెబ్బ పడింది. అక్కడుండలేక తనగదిలోకి వెళ్ళింది. దుర్గమ్మ ముఖం మాడ్చుకుని కూర్చుంది.

"ఏమోనే తల్లీ! అగమ్యపక్షిలా ప్రొద్దుట వెళతావుకదా? పిల్లను యెవరుచూస్తారని ఉన్నాను. నాకేం లేకనా? పిల్లదాని పరీక్షలుకూడా దగ్గరికొస్తున్నాయి. మీ కోసలు గతిలేక పడివున్నట్లు ఈ పడిన్నుందేం మనుష్యులను? నువ్వు మరీ మెత్తన అందుకే ఆమె ఆగడం సాగుతోంది..."

"అమ్మా! నా రాతే బావుండలేదు యెవరిని అని యేం లాభం? ఆస్తి ఉన్నవాడు అంటాడు మాటకు మాటని బజారునపడనా!" అసహనంగా అరిచింది శశి.

"మాటకు ఘాటుగా సమాధానము చెప్పడము బజారునేపడటమెలా అవుతుంది? నీలో ఏదో తప్పుంది అందుకే నోరుమూసుకుని పడివుంటున్నావు" కూతుర్ని రెచ్చగొట్టాలని చూచింది.

"అవునమ్మా. నాలో అన్నీ లోపాలే. అందుకే నోరు మూసుకుంటాను సరా?" ఏడుస్తూ వెళ్ళి మంచంపై పడుకుంది.

"అమ్మా! ఏడ్వకమ్మా. నాకు భయమేస్తుంది." పాప తల్లి [illegible] త్తింది. పాపపై కూడా చిరాకు కలిగిందది. దీని మూలాననే క[illegible] తన జీవితమిలా అయింది? దాని జన్మే తనను నరకంలోకి త్రోసింది.

"పో అవతలకి. భయంతో చావుపో." చేతులు విదిలించి[illegible] పాప ఏడుస్తూ బయటికి వెళ్ళిపోయింది. అరగంట గడవగానే శశి [illegible]



ప్రవహించింది. కామముతో కళ్ళు కప్పుకుపోయి తను ప్రవర్తిస్తే దానికి అదెలా బాధ్యురాలవుతుంది? తన కన్నీరు తుడిచే ఓపిక పసిదానికున్నది. కాని, దానికోర్కె తీర్చే ఓపిక తనకు లేదు. లేచి బయటకు వచ్చింది. అన్నాయిగారు పాపనెత్తుకొని వస్తున్నారు.

"....అమ్మ తిడితే అలా గేటుదగ్గర నిలబడి ఏడుస్తారా? పదిన గదిలోకి వెళ్ళొద్దా?" అని బుజ్జగిస్తున్నారు. ఆ క్షణంలో కోడలి చూపులు యెలా వుంటాయో తెలుసు. గదిలోనే ఉండిపోయినది.

చలపతి కోలుకుని యింటికి వచ్చే సరికి. శశి నీరసముగా, నల్లగా కట్టెలా తయారయింది. అతను యింటికి వచ్చిన సంతోషములో సత్యనారాయణ వ్రతము చేసి బంధువులందరినీ పిలిచినారు. సంవత్ వ్రతము ముగియగానే తన భార్యను తీసుకుని వెళ్ళిపోయాడు. సుశీల వెళ్తానని లేచింది. "ఏం తొందర? రేపు వెళుదువుగానిలే." శశి వారించింది.

"నా కసలు రావాలనే లేదు శశీ. ఆయన అలా కేసులో చిక్కుకున్నారు. ఒక విధంగా నేను నేరస్థురాలిని కాకూడదని వచ్చినాను." అన్నది.

"యెంతవరకు వచ్చింది కేసు? నారాయణ ఏమని చెప్పాడా?"

"పాపం ఆయన తన చేతయినంత వరకూ వారికి అనుకూలముగానే సాక్ష్యంయిచ్చినాడు. తప్పంతా తనదేనని అంటున్నాడు ప్రభుత్వము తరపున పనిచేసే ప్లీడరు ఆమోదించటం లేదు. వారిని కాపాడటానికే అలా చెప్తున్నాడని అంటున్నాడు. పదకొండవ తారీఖున మళ్ళా ఉంది. ఆ రోజు ఏమవుతుందో? అన్నందన్నయ్య తన వ్యాపారమంతా వదిలి తిరుగు[illegible]న్నారు." అన్నది బాధ పడుతూ.

[illegible]లేవే. గతంనా [illegible] అందరము ఒకరికొకరము [illegible] సుశీల అన్నది.

[illegible] కొంతంత బల[illegible] కాదులే. అంతకు [illegible] చందిరన్నయ్య వను[illegible]

"ఏమిటే వసూలు అంటున్నావు?" ప్రసన్న వచ్చినది. శశి సంగతులు చెప్పింది. ప్రసన్న నవ్వుతూ సుశీల కూతుర్ని యెత్తుకుని ముద్దు పెట్టుకుంది. "వసూలేమిటే దీన్ని మా అబ్బాయికి చేసుకుని నగం వాటా తీసుకుంటాము." అన్నది.

"ఇది మరీ బావుందే అక్కయ్యా! నగం వాటా అంటావేం? దానికి యింకి పిల్లలు పుట్టరా?" "ఈ కాలంలో యిద్దరి కంటే యెక్కువ భరించే శక్తి యెవడికుందే? అందంలో మన సుశీ మరీ నాజూకుబొమ్మ." అన్నది ప్రసన్న.

"నన్నంటావు కాని వదినా! మీ చెల్లాయే నాజూకు బొమ్మ అవుతోంది. యెంత చిక్కి నల్లబడిందో చూడు." అన్నది సుశీల చేతులు పట్టుకొని.

"ఒకటే చాకిరి. యిప్పుడు కోలుకుంటుందిలే." ప్రసన్న కూడా చెల్లెలి వంక చూచింది.

"కోలువాలని కోరుకుంటున్నావా అక్కా? యిలాగే పెద్ద జబ్బు చేసి చచ్చిపోతే బావుండుననిపిస్తోంది" నిజం వేదాంతిలా మాట్లాడినది శశి.

"యెందుకమ్మా అంత కోర్కె! తిని తిరుగలేకనా! నాల్గు అంటిస్తే చస్తుందిట చస్తుంది."

"నీకు తెలియదు సుశీ. నా బాధ యెవరికీ తెలియదు. నా [illegible] పెద్ద జంగళాప్పుడి. అంతకంటే పెద్ద భర్త ఉన్నాడు. ఎక్కతిరగడానికి కార్లున్నాయి. తీరువాల నిండా చీరెలున్నాయి. మోయలేనన్ని నగ లున్నాయి సుఖపడటానికింతకన్నా" యేం కావాలి? కాని...." నాలో ప్రాణములేదు సుశీ! జీవచ్ఛవాన్ని." అన్నది బొంగురు గొంతు [illegible]

"దానికి మధ్య అటాంటి [illegible] కలిగిచదివాగా అలవాటు "[illegible] మీ అన్నయ్య వదలి 'పెదు' చాని [illegible] తనను [illegible]ల అందరి [illegible] తీసు కొని వెళ్ళిపోయిందిటకి. భయంతో చావుపో, [illegible]

[illegible] అరగ[illegible]



"అమ్మాయి ప్రసన్నా? దీని మొగుడి విషయము ఏమయిందే?" దుర్గమ్మ అడిగింది.

"ఏం కాలేదమ్మా. ఇంకా కేసు నడుస్తూనే ఉంది" ప్రసన్న జవాబు చెప్పింది. ఆ జవాబు ఆమెకు తృప్తిగా లేదు. విలకీసి అడిగే ధైర్యము లేదు.

"అవునే....నిజంగా దాని కూతురిని మీ అబ్బాయికి చేసుకుంటారుటే?" కళ్ళు పెద్దవిచేసి ప్రశ్నించింది.

ప్రసన్న ఫక్కున నవ్వింది. "బావుందమ్మా నీ అనుమానం. అది మూడు నెలల పిల్ల. వాడు మూడు సంవత్సరాల పసివాడు. సరదాకు అనుకుంటాం గాని. నిజమవుతాయా? అనుకున్నవన్నీ అయి తీరుతాయా? కాలం మారుతోంది. ఇంకా యిరవై ఏళ్ళ మాట. అప్పటివరకు ఎన్ని మార్పులో....మనపిల్లలు మనమాట. వింటారుటే? సరదాకు అనుకున్నాం గాని...."

"ఏం సరదానో! మీయాయన దాన్ని చేసుకుంటానని మనసు పెట్టిన మనిషి. ఎవరికి తెలుసు? రాత్రింబవళ్ళు వెళ్తాడు. జాగ్రత్తగా ఉండమ్మా!" కూతుర్ని హెచ్చరించింది.

"నీ అనుమానాలు బావున్నాయమ్మా! అంది యిద్దరు బిడ్డల తల్లి. ఇంకా...."

ప్రసన్న మాటలను మధ్యలోనే త్రుంచి వేసింది దుర్గమ్మ. "పిల్లలదేం ఉందే సింగినాదం! మన వెంకటోతో లేచి వచ్చిన దానికి [illegible] పిల్లలున్నారట." గొంతు తగ్గించి చెప్పింది.

[illegible] "ఆ బజారు దాని!, మన సుశీలకు పోలిక తెస్తావెందుకమ్మా?" [illegible] వచ్చింది.

"అవునే అది మీ సుశీల అయింది. తోడబుట్టినవాళ్ళు పరాయి

పాటయినాయి. కాలమే తల్లీ కాలం. ఒసేయి ప్రసూ! ఇది పిలువటానికి వచ్చి చిన్నాడిని పిలిచింది. ఆ ప్రక్కనే పాకలో ఉంటున్నాడు కదా. పెద్దవాడిని పిలిచిందా? పిల్ల కూనలా బిడ్డడు వచ్చి "శశి వచ్చి వెళ్ళిందా అమ్మా?" అని అడిగినాడే నా కడుపు తరుక్కుపోయింది!" అన్నది. దీర్ఘాలు తీస్తూ.

"పిలిచి అవమానం పొందేకన్నా పిలువకపోవటమే మంచిదమ్మా! ఆయనకు అన్నయ్య పేరు ఎత్తితే మంట. ఏం చెయ్యమంటావు?" శశి తన అసహాయతను వెల్లడించింది.

"అంతా దీనివాడ స్తమే. మీ నాన్నగారు పోయినప్పుడు వచ్చి పీకాడ లేదా? ఇరవైనాల్గు గంటలు చలపతి మామా వెంకట్ ఒకే చోట ఉన్నారు" అన్నది బుగ్గలు నొక్కుకుంటూ.

"ఇంకా నీకు మనుష్యుల మనస్తత్వాలు తెలియవమ్మా! అక్కడ అయినకు పొద్దు పోక అన్నయ్యతో పేక ఆడినాడు. ఈ ఇంటికి వస్తే అలాగే ఆడుతాడనుకోవడం కల్ల. నాకు అన్నయ్య అంటే పగా అమ్మా!"

"ప్రాణం.... పంచ ప్రాణం!.... ఐనా బంధువులు, మంచి చెడూ అన్నీ పోయాయి. డబ్బుతో మాశే తల్లి —దాని మొగుడు దోచో, కొంపలు కూల్చి ఇంత డబ్బు కూడేసినాడు. మీరు 'ఒహో' 'ఆహా' అంటున్నారు. నా పిల్లలు ఎప్పటికీ ఒక్కతీరే ఉంటారా?" అన్నది మెటికలు విరుస్తూ.

చలపతి పిలుస్తున్నాడని పిలుపురాగానే బట్టలు దులుపుకుని వెళ్ళింది దుర్గమ్మ.

"అక్కా? అమ్మ యిక మారనే మారదా? ఇన్ని అఘాయిత్యాలు జరిగినా అన్నయ్యనే వెనకేసుకొస్తుంది. నువ్వు చూడలేదు. దాపరిది సిల్కు తీసుకుని వెళ్తుంది. అన్నయ్య కంటే మూరెడు పొడవు. అది మీ రంలా ఉంటుంది.... పగలు చూస్తే రాత్రి కలలోకి వస్తుందక్కా!" శశి

"మీ బావ చెప్పినారు శశీ! ఆయన ఒకటే బాధపడ్డారు."



"అంతేనా? అది అన్నయ్యకంటే ఎంత లేదన్నా పదేళ్ళు పెద్ద అయుంటుంది. అదిమాట్లాడితే చిన్నపిల్లలు జడుసుకుంటారు. అన్నయ్యకెంత నచ్చిందో.... దాని మొగుడువచ్చి ఒకటే గోలట. పిల్లలున్నారట. కావల్సివస్తే పిల్లలను తెస్తాడట దాన్ని విడువడట."

"అందుకే ప్రేమగుడ్డిది అన్నారు. చూచి సిబ్బార్చడం తప్ప ఏమీ చెయ్యలేము."

అంతే! బావను ప్రయత్నించి ప్రేమకు ఎక్కడన్నా చూచి ముడి పెట్టమనక్కా! అమ్మ మారదు. దాని ప్రతుకు పప్పుల పాలు కావద్దు సూక్కులు వాళ్ళు ఎల్లోరా, అజంతా వెళ్తున్నారు. నేనూ వెళ్తానని మారాం చేస్తే నానుతాడు తాకట్టుపెట్టి, డబ్బుతెచ్చి యిచ్చిందట. వెళ్ళొద్దని అనటం లేదు. మరీ పరిస్థితులు గమనించకుండానా? అదిప్పుడే ఎదుగుతోంది. '....మీ రంతా అనుభవించి నాకు నీతులు చెప్తారా?' అంటుంది. వేణు గాడిని మెచ్చుకోవాలి. నాన్న పోలిక ఏదీ అడగడు. ఉన్నది తిని తన చదువేదో చదువుకుంటాడు." అన్నది.

ప్రసన్న మౌనంగా విన్నది. వచ్చిన బంధువులను సాగనంపి మంచం పట్టింది శశి. రోజూ జ్వరం రావటం, తగ్గటం, మందు తీసుకోవటం లేదు. వారంరోజులు గడిచాక పాప ద్వారా కబురు పెట్టి డాక్టరును పిలిపించాడు అబ్బాయి. జబ్బుచేసి బాగయినప్పటినుండి శశికి తానే పశ్చాత్తాప పడ్డాడు చలపతి. అతనావయసులో ఎందుకు పెళ్ళి చేసుకున్నాడో అతనికే అర్థంకాలేదు. కళ్ళకు కప్పడిన పొరలు చీల్చుకొని చూచినా అంతా అయోమయంగా కనిపించింది. తన కూతురు కన్న చిన్నదాన్ని నా అమ్మాయిని చేసుకున్నాడు. ఎందుకూ దుర్గమ్మతో మాట వర... "ఈ పనివారితో విసుగు పుడుతోందే! ఎక్కడన్నా దక్కు... లేదిబాప్పి ఉ చకోవడమో. పెళ్ళి చేసుకుంటేనో పోతుంది... ...మా...

అంటే, మెడలు వంచి ఈ పెళ్ళి చేసినారు. ఫలితం—యిప్పుడిప్పుడే విచ్చుకుంటున్న మొగ్గలాంటి శశి జీవితం నలిగి పోయింది. ఇంత ధైర్యంగా మాట్లాడేపిల్ల ఈ పెళ్ళికి ఎలా ఒప్పుకుంది? అతని ముందు ఆ ప్రశ్న నిలిచిపోయింది. నెమ్మదిగా శశి గదిలోకి వెళ్ళినాడు. "ఎలా ఉంది?"

"ఈ పూట నయమే! జ్వరం రాలేదు. నీరసంగా ఉంది," అన్నది

ఆమె ప్రక్కన కూర్చున్న పాపను పిలిచాడు. "పాపా రాతల్లీ! అమ్మను విసిగించకూడదు." పిలుచుకున్నాడు.

"నాన్నగారూ! అమ్మకు పళ్ళు కావాలండీ!" అతని చేతులు పట్టుకుని మంచం దిగింది.

శశి ముఖం ప్రిప్పుకుంది. అతను ఆమె వీపు నిమురుతూ. "మీ అమ్మకు కబురు చెయ్యనా?"

"వద్దు....ఇప్పుడేం మునిగిపోయింది?"

"చూడు. నీ తల ఎంత రేగిపోయిందో?" నీకు వంట్లో సత్తువ ఉంది. నాకు సేవ చేశావు. నీకు నేను ఏం చెయ్యలేను. పనవ్వాతో తల దువ్వించుకో!" అన్నాడు.

"అలాగే." అంది కళ్ళు మూసుకుంటూ అతని తిట్లూ, దీవెనలు, విదిలింపులూ, భరించ కలిగినంత సులువుగా అతని అభిమానమూ, ఆదరమూ, జీర్ణించుకోలేక పోతున్నది. అందరి శ్రద్ధవలన రెండు మూడు రోజులలో కోలుకుంది.

ఆ దినం సుధీర్ కేసు పూర్తి ఐనది. ఆఫీసుకు సెలవు పెట్టి ద్దుకు వెళ్ళిన అబ్బాయిగారు ఆదుర్దాగా పరిగెత్తుకు వచ్చారు. "పిసి... న్నా" అంటూ. అతను ఆమె గదిలోకి వెళ్ళేసరికి, ఆమె అదు... ది కూర్చుంది.

"నీరసంగా ఉంటే పడుకో. సుధీర్ కేసు ఈ రోజు పూర్తి ... ధీర్ నిర్దోషిగా నిరూపించబడినాడు...."



"ఆమె నిటారుగా కూర్చున్నది. సంతోషం పట్టలేక పోయింది.

"నిజమా!....అబ్బాయిగారూ! ఎంత మంచివార్త తెచ్చినారు...."

"పూర్తిగా వినండి దోషులని తెలిసి నారాయణ బృందాన్ని పట్టి ఇవ్వనందుకు చట్టం ప్రకారం నేరస్తుడుగా పరిగణింప బడినాడు. అతనికి ఒక సంవత్సరం జైలు శిక్ష వేశారు. అది కూడా అతని నాన్నాయి పట్టు బట్టి వేయించాడని తెలుస్తోంది....అతని ఆర్భాటం చూసిన వారెవరూ, సుధీర్‌కు విముక్తి లభిస్తుందని అనుకోలేదు" అన్నాడు.

"అవును. సుశీల రాత్రింబవళ్ళు అదే ధ్యానతో చిక్కి శల్యమయి పోయింది. దానిని చూచి రావాలి. అతని ఆస్తి అతనికివ్వడానికి ఎంత నాటకం ఆడించినాడు."

"మీ నాటకమేమిటో నేను తెల్సుకోవచ్చునా? ... మామగారూ" చూచారుగా—ఆఫీసునుండి నేరుగా ఆవిడ గదిలోకే వచ్చారు."

శశి. అతను ఉలిక్కిపడి చూచారు. ద్వారాని కిరువైపులా చలపతి, కోడలు నిల్చుని ఉన్నారు.

"అబ్బాయ్! నీ కిక్కడేం పనిరా?" లేని బలం తెచ్చుకుని అడిగి నాడు చలపతి.

అతను లేచి నిల్చున్నాడు. "నాన్నా!" తండ్రికూడా తనను తప్పుగా అర్థం చేసుకోవడమా?

"చాలించరా నటన! ఈ రోజులలో స్వంత తల్లులనే చూడటం లేదు.... చెల్లి అంటే పవిత్రమైన భావన అంటావు....అంతేనా?"

"నాన్నగారూ! ఏమిటీ పిచ్చి...పిన్ని అంటే పవిత్రమైన భావన ఉందో ... దా అపవిత్రమైన మనస్సులు—మీ కెలా తెలుస్తుంది? సుధీర్ కేసువిష ... ం చెప్పాలని వచ్చినాను. మనుష్యులు ముందంత ... స్తున్నా మని, ... గర్వపడతాను వేషం వెయ్యటంలోనే. ఛీ—ఛీ." అన ... ంగా ... చూచాడు అతను.

"అవును. కట్టుకున్న పెళ్ళామెప్పుడూ అసహ్యంగానే కనిపిస్తుంది. అది.... ఆ పగలాడి అందంగా ఉందికదూ? దాంతోనే ఉండండి....' విసురుగా ఉంది భార్య వాలకం.

"చదువు–సంస్కారం నేర్పుతుందనుకోవడం అబద్ధం! అవసరమైతే ఆధునిక యువతీ యువకులు అధమాధములకంటే అసహ్యంగా మాటలు అనగలరు. ఆమె పగలాడికాదు. విధి బలీయమువలన ఈ యింటికి వచ్చింది. ఆమెవద్ద చాకచక్యమే ఉంటే ఈ యింటితాళాలు కొంగున ముడివేసుకుని. మనకు చిప్ప చేతికిచ్చేది పిచ్చి...."

బొమ్మలా నిలబడి ఉన్న శశివైపు చూచినాడు. "పిన్నీ! ఎవరెన్ని అన్నా మీరు పట్టించుకోవద్దు నాలుక తిప్పటానికేం ఖర్చు ఉంది? ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారు. ఉమా! నువ్విలారా!" భార్యను పిలుచుకొని అతను వెళ్ళి పోయినాడు.

శశి తలఎత్తి చలపతి వంక చూచింది. అతనుదిగులుగా చూస్తున్నాడు.

"అంతా నాతప్పు ఈ వయసులో వివాహం చేసుకుని యింటి మర్యాద మంటగలిపినాను. ఎవరిని అని ఏం లాభం? వచ్చిన బంధువులు యిదివరకే చెప్పినారు. నీ నడవడిక మంచిదికాదని.... పాప విషయంకూడా అనుమానమే!" తలాడిస్తూ అతను వెళ్ళిపోయినాడు.

శశి నెమ్మదిగా బయటికి వచ్చింది. కోడలి గొంతు వినిపిస్తోంది. అప్రయత్నంగా కాళ్ళు అటు దారితీసినాయి.

"మీరు లక్ష చెప్పండి. ఈ యింట్లో ఉండలేను. కోటికోర్కెలతో, అంతులేని ఆశయాలతో ఈ యింట్లో అడుగు పెట్టినాను. అన్నీ కల్లలే అయ్యాయి....నాకంటే ముందే శనిదేవత ఈ యింట్లో ప్రవేశించింది." అన్నది ఆమెగొంతు దుఃఖంచే వణుకుతోంది.

"ఉమా! భర్తను కీలుబొమ్మలా ఆడించడమే ఆశయమైతే నేనేం చెయ్యలేను. మనిషి, మమత, సానుభూతి లేక ఆపదార్థంలా ప్ర[illegible]



నీ కోర్కె అయితే నేను సహాయం చెయ్యలేను. ఆమెతో వివాహం కాక మునుపు పరిచయం లేదు. వగలుబోతు పినతల్లి దుర్గమ్మ వాగిన మాటలు నిజమని నమ్మి, లేని అనుమానాలు పెంచుకుంటున్నావు. మాకు 'పెళ్ళి' అని పెళ్ళి అయిన మర్నాడు తెలిసింది. మేము నాల్గు సంవత్సరాలు అలహాబాద్‌లో ఉన్నాం. మాకి పెళ్ళి యిష్టంకూడా లేదు. పాప విషయంలో కూడా అంతే! మనిషి అన్న వారెవరూ చిన్నపిల్లలను దూరం కొట్టరు. పాప చెప్పే మాటలంటే నా కిష్టం. ఇదివరకు నువ్వు తనతో ఆడేదానివిగా?" అతని గొంతు మృదువుగానే వుంది.

"మీరెన్ని చెప్పినా నేను ప్రత్యక్షంగా చూచిన దానికంటే ఎక్కువ కాదు. నేను కొన్నాళ్ళు మా యింటికి వెళ్ళిపోతాను.... నా మనస్సుకు నచ్చ చెప్పుకుని. భర్త పరాయి స్త్రీల వెంబడి తిరిగేవాడయినా భరించే శక్తి తెచ్చుకుని మరీ వస్తాను" ఈసారి హేళనగా వచ్చాయి మాటలు.

"అది నీ యిష్టం, నేను చెప్పవల్సినది చెప్పాను అర్థం చేసుకోక అనుమానాలు పెంచుకుంటే ఎవరూ ఏం చెయ్యలేరు" అతను నిదానంగా చెప్పినాడు.

"అంతేగాని ఆమెను మాత్రం ఇంట్లోనుండి పంపించి వెయ్యనన్న మాట."

"అది అసాధ్యం. వీలా ఆమె ఈ యింటి కోడలు. నేను అన్నం గుడ్డ యిచ్చి వేరే ఉంచితే ఎవరు ఎన్ని అనుకుంటారు? అభం శుభం ఎరగని పసిది. దాని జీవితం నాశనం కాదూ?"

"మన జీవితాలు నాశనం అయినా పరవాలేదన్నమాట! యెంతటి వాడు ఆ ముసలాడు చావగానే హాయిగా ఇరువురూ కాపురము చెయ్యండి" అన్నది విసిగా.

"నా సహనానికి పరీక్ష పెట్టవద్దు. నేను చెప్పవలసినది చెప్పాను" [illegible] వినలేకపోయింది. గదిలోకి వచ్చింది. ఏడ్చటానికీ కన్నీరు [illegible] లేదు. ఆలోచిస్తూ పడుకుంది, ఆ యింట్లోనుండి బయటపడాలి.

లేకపోతే ఆ ఇంట్లో వాళ్ళ జీవితాలు నాశనమవుతాయి. యెక్కడికి పోగలదు? పుట్టినింటిలో తల్లికే తిండానికి లేక నానా అవస్థలు పడుతోంది. ఇద్దరి కొడుకులది చెరొకదారి. మూడోవాడు పసివాడు. అక్కడగ్గర ఆశ్రయం లభిస్తుంది. కాని లోకం ఊరుకుంటుందా? తనకు వచ్చిన చదువుతో ఒంటరిగా ఉండి పొట్ట పోషించుకోగలదా? పాప భవిష్యత్ ఏమవుతుంది?

"అమ్మా? అన్నం తిందాం రామా." పాప చెయ్యిపట్టి లాగింది.

"వద్దు పాప. ఈ పూట ఆకలి లేదు. అన్నతో పెట్టించుకొని నువ్వు తిను" అన్నది.

"నేను నాన్నగారు. అన్నయ్యా తినేశాం. ఒదిన, నువ్వే తినాలి రా అమ్మా మళ్లా జ్వరం వస్తుంది." పాపను హృదయానికి హత్తుకుని ముద్దు పెట్టుకుంది.

"అమ్మా! ఒదినను తిట్టావా?" అమాయకంగా తల్లి కండ్లలోకి చూచింది.

"లేదమ్మా. నేనెందుకు తిడతాను?" అన్నది.

"అన్నము తిందాము రమ్మంటే తిట్టిందమ్మా. "మీ అమ్మ నువ్వు" ఏమో అన్నది అన్నయ్య తిట్టాడులే. నాకు తెలుసు. అట్లాగే బాగా తిట్టాలి. నా జట్టు పచ్చిట" శశి తల తిరిగిపోసాగింది. పాప పెద్దదవుతోంది. మంచి చెడులు తెలుస్తున్నాయి. యింకా కొన్నాళ్ళు పోతే, దానికి మంచి చెడు అర్థమవుతుంది. అమ్మను అసహ్యించుకుంటే? "పాపా! అమ్మ చాలా చెడ్డదికదూ!"

"పో అమ్మా నువ్వు చాలా మంచి దానివి. అన్నయ్య చెప్పేలా! నాన్నకు వదినకు ఏం తెలియదు" అన్నది చేతులు తిప్పుతూ. అంటే ఒదిన నాన్న తనను తిడుతున్నారని తెలుసు పాపకు అనుకుంది శశి.

"ఏం నేను చచ్చిపోతే ఉండగలవా పాపా?"



"ఉహు! నువ్వేం చచ్చిపోవు. ముసలాడు నాన్నే చచ్చిపోతాడు." పాపను చూస్తూ కూర్చుంది. వంటమనిషి వచ్చి పిలిచింది. ఆకలి లేదని చెప్పి పంపివేసింది.

కాలం ఎవరికోసం ఆగదు. అందరూ భారంగా లేచారు. ఉమలేచి తన సామానులు సర్దుకుంటోంది. ఆమె పుట్టింటికి వెళ్ళడానికే నిశ్చయించుకుంది. అబ్బాయిగారు మౌనంగా చూస్తున్నాడు. పాప పరిగెత్తుకొచ్చింది.

"అన్నయ్యా! అమ్మకు చాలా జ్వరం. పిలిస్తే పల్కటం లేదు. నువ్వు రా" అతని చెయ్యిపట్టి లాగింది. అతను అయోమయంగా చూడసాగేడు.

"విజం వదినా యెంత పిలిచినా పలకటం లేదు. నువ్వు చూద్దువు గాని రా." ఎవరూ పలక్కపోయేసరికి ఏడువసాగింది.

పాప ఏడుపుకు శృతిగా పని మనిషి ఏడ్పువిని వచ్చింది.

"ఎంతపని చేశావు శశమ్మా! నీ పిల్లను యెవరికి అప్పగించావు తల్లీ! పెద్ద కొంపలు పాడుగాను బిడ్డా!...." అదిరిపడి అబ్బాయిగారు. ఉమా పరుగెత్తుకు వెళ్ళారు. బంగారురంగు శశి శరీరము నీలివర్ణము దాల్చినది. అచేతనముగా మంచంలో పడివుంది. ఆమెను అటు యిటు కుదుపుతూ పనిమనిషి ఏడుస్తోంది.

"ఏమయింది?" ఉమ అదుర్దాగా చూచింది.

"ఏమవుతుంది? మీ రందరూ అనే మాటలకు ఆ తల్లి ప్రాణాలు తీసుకుంది. ఆ మారిచేతులు పడిపోను, ఆ ఎండ్రిన్ సీసా ఎదురునా పెట్టొద్దురా అవి చెప్పితే వాడిచెవుల్లో రాళ్ళు పడ్డాయి. పసిపిల్ల తిరుగుతున్నదిరా అన్నాను. నా తల్లి ప్రాణాలు తీసుకుంది."

అబ్బాయిగారు అసమ్మతంగా దగ్గరకు వెళ్ళి ముక్కుదగ్గర, గు...

లలో మొండితనం పనికిరాదు. అమ్మాయి బెంగపెట్టుకుని పిచ్చిది అవ గలదు" అని నచ్చచెప్పాడు. ఎవరిదారిన వారు వెళ్ళారు.

స్నానాదికార్యాలు ముగించి ప్రక్కపై చేరాడు. వంటమనిషి వంట ప్రయత్నములో ఉన్నది. రాత్రి పదకొండు కావస్తున్నది. పాపచే పాలు త్రాగించాడు. ఆ పిల్ల అడిగే ప్రశ్నలకు జవాబు చెప్పలేక పోతు న్నాడు. పాలు కడుపులో పడగానే నిదురపోయింది. అతనికి తెచ్చిన కాఫీ చల్లారిపోయింది. మరో కప్పు తెచ్చింది పనిమనిషి. "బాబు తీసుకోండి. పోయినవారు పుణ్యాత్ములు." ఏవేవో వేదాంతపుమాటలు పలికినది. గబ గబా కాఫీ త్రాగి కప్పుయిచ్చాడు." పిన్ని బయటికెళ్ళి సీసా తేవడం చూడ లేదా అవ్వా" అని అడిగినాడు.

"కాసింత చప్పుడయినా మెలుకువ వస్తుంది బాబూ! రాత్రి ఉడుకు కోందని పెరట్లో పడుకున్నాను." ఖాళీ కప్పుతో వెళ్ళిపోయింది. ఉమకు దగ్గరకు వెళ్ళే ఓపిక లేదు. ధైర్యము అంతకంటే లేదు. హాల్లో సోఫాలో చేరబడింది. ముసలాయన గడ్డంక్రింద కర్ర పెట్టుకుని కూర్చు న్నాడు. అతనికి అంతా శూన్యంగా కనిపిస్తూంది.

అబ్బాయిగారు మనశ్శాంతికై రస్సెల్ వ్రాసిన గ్రంథము తీసి చదవడం మొదలుపెట్టాడు. దాంట్లోనుండి ఉత్తరం క్రిందపడింది. అటు ఇటు త్రిప్పాడు "అబ్బాయిగారికి" అని ఉంది విప్పాడు. అతని చేతులు వణకసాగేయి.

శ్రీ అబ్బాయిగారికి.

శిరసు నమస్కరించి వ్రాయునది.

మీకు, నాకు ఈలోకం సంబంధము అంటగట్టారు. అది త్రెంచ డము నాచేతనవలేదు. నా ఉనికి మీ సంసార జీవితంలో కల్లోలాలు లేవడం సహించలేను. ఈ ఇల్లువిడిచి యెటూ వెళ్ళలేనుకూడా. ఆలోచించినా మృత్యువు తప్ప వేరే మార్గము కనుపించ



ఒంటరిగా మరణించాలని నా అభిమతంకాదు. నాతోపాటు పాపకు విషమివ్వా లని రెండుగంటలు ప్రయత్నం చేశాను. అదీ ఆడపిల్లే. రేపు పెరిగి పెద్ద దయినా ఇలాంటి బాధలు తప్పవు. ఎంతో మనసు గట్టిపరచి ఎండ్రిన్ గ్లాసు యెత్తి పట్టుకున్నాను. మాతృత్వపు మమకారమే జయించింది. ఈ చేతులతో దాన్ని చంపలేకపోయాను. ఆ ప్రయత్నము విఫలమయ్యాకే ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. నా గతమంతా మీ కవగతమే. పాపను ఏ అనాథఆశ్రమంలోనో చేర్పించండి. ఒక్క విషయములో నా మాట మన్నించాలి ఉమ స్త్రీ. ఆమెకు అనుభూతులు, అనుమానాలు ఉంటాయి. మీ జాలిని నా కన్నతల్లే అపార్థం చేసుకుంది. అలాంటప్పుడు యితరులు చేసుకోరా! నేను మిమ్మల్ని కోరేదల్లా ఒక్కటే. అప్పుడప్పుడు పాప క్షేమసమాచారాలు కనుక్కొంటూ నావారతస్వము రాకుండా చూడండి. దానికి పదమూడేళ్ళు దాటగానే మీ చేతిక్రింద అనేకులుంటారు. వారిలో ఒకరికిచ్చి పెళ్ళి చేసేయండి అంతకంటే పెద్ద కోరికలు లేవు. [torn]రు. యంలో తొందరపడ్డానమకుంటే క్షమించండి. పాపకు యిప్ప[torn] ప్రపంచం అర్థమవుతూంది. దాని ముందు కులటలా జీవించలేను మెట్టుకు తిరగలేను నా జీవితంలోని మొదటి మలుపులోనే తప్పు వేశా[torn] మిగిలిన అడుగులు నేను లయబద్ధముగా వేసినప్పటికీ తప్పు భావిం[torn]రు. దానికెవ్వరూ ఏమీ చెయ్యలేరు.

ఇట్లు,

అంతిమ నమస్కారములతో పిన్ని.

"నన్ను అర్థం చేసుకోలేదా పిన్నీ! పాప నేనుండగా [torn] కాలేదు. స్త్రీవి కాబట్టి నిన్ను జయించినది లోకం. నన్నేమ్మ [torn] చెయ్యలేరు" జుట్టు పీక్కున్నాడు. పనిమనిషి పదిసార్లు పిలువగా [torn]రికి లేచివచ్చాడు. పాప [torn]న పడుకున్నాడు.

"ఛ. నే నా ఉద్దేశంతో అనలేదండి. అయినా మా పేరు. మా అమ్మమ్మ పేర్లేనా! కొత్తపేరు పెడదాము. ఇదేమిటండి. అంతా విడుదల అవుతారనే అన్నారు."

"ఇప్పుడేమయింది? ఒక సంవత్సరము యెంతలో గడుస్తుంది? నీకు తెలుసో లేదో ఈ మధ్య ఓ డాక్టరు స్నేహితుడు కలసి ఒరేయి నీవు రెండు మూడు నెలలు పూర్తిగా విశ్రాంతి తీసుకోకుంటే ఎందుకు పనికిరావు అని అన్నాడు. దేవుడు యేదిచేసినా మనలుమేకే అనే కదా మరి.

చూశావా హాయిగా విశ్రాంతి తీసుకుంటాను."

"పోదురూ! నా గుండెలు అతుక్కుపోతుంటే. మీకు నవ్వు వస్తోంది. కతలు గుర్తుకు వస్తున్నాయి."

"ఇప్పుడెంత హాయిగా వుందో నీకు తెలియదు. నా గుండెలో ... లేవి బరువుతో తిరిగినాను. నా నీడను చూచి నేనే ఉలికి పడిన ...న్నాయి. నా కున్నదల్లా నీ చింతనే. నీవు దిగులు పెట్టుకోకుండా ... ఒక సంవత్సరము ఎంతలో గడుస్తుంది!.....నీకు చెప్పాను.

"యెంత బాధప యిదివరకే ఒక సంవత్సరం శిక్ష అనుభవించినాను, ...గా దానికి నాదృష్టిలో ప్రజల దృష్టిలో నేరముగా పరిగణింప ...ంది. అది మాదా నవ్వునటువంటిది. శిక్ష అనుభవించినా తప్పేమీ ... జీవితము ఏమ...

"మనందరి ... వంతలో, వెయ్యో పాలే స్త్రీ యింత శిక్షకూడా ...దేది ...ఉందో!" ...ప్ర... వెనకాడినారో తెలియుటకు లేదు. మన పరువుకుంటే ...డికి వెళ్ళ... ...టీర్ అమె బుగ్గపై చిటిక వేశాడు. "పరువు డబ్బుతో ...మతకు కావల్సినంత డబ్బున్నది. నువ్వేం దిగులు పెట్టు... ...డబ్బు ఉండేది ... పరువు తీసే పనులు చేసినవారు. గాంధీ టోపీల క్రింద ముగ్గురు కూతు... ...యోగులనిపించుకున్నారు. నిజాము ప్రభుత్వముం... అలక్షయం...



శర్వానీలు తొడిగి ఫున్నీక్యాప్‌లు పెట్టి, యింట్లో ముస్లిమ్ పద్ధతులు నవలంబించి. ఉర్దూ మాట్లాడుతేనే తప్ప బ్రతుకలేమని నటించినవారే కాంగ్రెస్ ప్రభుత్వములో సాటిలేని నాయకులు. దొంగ వ్యాపారముచేసి, పట్టుబడి, జైలు కెళ్ళి వచ్చినవారే. పచ్చగా వేదికపైన ఉపన్యాసాలు యిస్తున్నారు. నా పరువు ఈ శిక్ష వలన హెచ్చుతుందేగాని తగ్గదు. ఇదివర కయితే నేను విడుదలయి వచ్చినాక, నా ముఖం చూడటానికే ఏవగించు కున్న పెద్దలు వచ్చేయేడు జైలు గేటు దగ్గర పూల మాలలతో ప్రత్యక్ష మవుతారు."

"మీతో మాట్లాడి గెలిచిందెప్పుడు బాబూ. దాదా! మీ బాబుగారితో మాట్లాడు తానంటూ మౌనంగా కూర్చున్నావేమిటి?" దాదా వైపు చూచింది. పై బట్టతో కళ్ళు ఒత్తుకున్నాడు దాదా. భలే వాడివి దాదా! అమ్మగారికి అండగా ఉంటానంటే నువ్వే దిగులు పెట్టుకుంటే ఎలా?'

"లేదు బాబుగారూ! రాజా బాబున్నాడుగా! నాకేం దిగులు లే... నవ్వడానికి ప్రయత్నించుతూ.

"నుశీ! మనవ్యవహారాలన్నీ లాయరుగారు అన... నీ ఖ...ర్చులకు కావలసినంత బ్యాంకినుంచి తెచ్చుకో. ...కట్ట, పెన్ను తెచ్చి యివ్వు."

...నీవన్నా నవల వ్రాస్తారా? విశ్రాంతి తీసుకు... ...దినమంతా విశ్రాంతియేనా? నవల ... ...పెట్టినా అది పూర్తికాలేదు. ఈ ... ...పిగించవుకదూ?" కొడుకును ...నాన్నా?" వాడు తండ్రిని గట్టిగా

...ారు.
...హార సమేతముగా
...చ ప్రార్థన.
...ులు
...మతి అప్పల నర్సమ్మ
...ంచిలి.
...త్రుల ...
...రం రాత్రి 7-30 గం.లకు
కళాచిత్ర ప్రింటర్స్, ...

"లేదమ్మా! మీరే యిక్కడికి అప్పుడప్పుడు రావాలి. ఏం సుశీ! పిల్లలు జాగ్రత్త. నిన్ను సంతోషముగా చూస్తేనే నాకు ఏం దిగులూ ఉండదు." అమెను ఓదార్చాడు. సుశీలకెన్నో మాట్లాడాలని వుంది. సమయము అయిపోవడంతో పిల్లలను తీసుకొని లేచింది. కొద్దిదూరం భార్యా పిల్లలతో నడిచి ఆగిపోయాడు సుధీర్. భర్త కనిపించునంతరకూ చూస్తూ, పిల్లవాడి చేయి ఊపించుతూ కారుదగ్గరకు పోయింది సుశీల. వారెక్కగానే దుమ్ము రేపుతూ కారు కదిలింది. కారు కదలగానే కన్నీరు ఒత్తుకొని వెనుదిరిగాడు సుధీర్.